సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 252

మంగళవారం 3-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'



విషం కాటేసినా ఆటై మెరిశారు

భోపాల్ దుర్ఘటన జరిగి 40 ఏళ్లు నిండిన సందర్భంగా ప్రత్యేక కథనం -13లో



నేడు బ్రాడ్‌మన్ క్యాప్ వేలం

ఆస్ట్రేలియా దిగ్గజం క్యాప్‌నకు 2.6 లక్షల డాలర్లు పలకవచ్చని అంచనా -14లో



అబ్జర్వర్లుగా సీతారామన్, రూపానీ

బీజేపీ మహారాష్ట్ర శాసనసభాపక్ష పార్టీ భేటీకి పరిశీలకులుగా నిర్మలా సీతారామన్, విజయ్ రూపానీలను పార్టీ ఎంపికచేసింది.

వివరాలు 6లో ▸



కుమారుడికి క్షమాభిక్ష

అమెరికా అధ్యక్షుడు బైడెన్ పదవీ విరమణకు కొద్ది రోజుల ముందు తన కుమారుడు హంటర్‌కు క్షమాభిక్ష ప్రసాదించుకున్నారు!

వివరాలు 6లో ▸



ప్రతిష్టంభనకు తెర!

రాజ్యాంగ దిన వజ్రోత్సవాల సందర్భంగా ఉభయ సభల్లోనూ రాజ్యాంగంపై చర్చకు ఇరుపక్షాల మధ్య అంగీకారం కుదిరింది.

వివరాలు 6లో ▸

26 ఫైటర్ జెట్లు, 3 సబ్‌మెరీన్లు..

రఫేల్-ఎం యుద్ధ విమానాలు, స్కార్పీన్ జలాంతర్గాముల కొనుగోలుకు ఒప్పందం కుదరనుందని నేవీ చీఫ్ తెలిపారు. - 6లో






22న సింధు పెళ్లి

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు త్వరలో పెళ్లికూతురు కానుంది. ఈ నెల 22న ఉదయ్‌పూర్ (రాజస్తాన్)లో అంగరంగ వైభవంగా సింధు వివాహం జరగనుంది. హైదరాబాద్‌కు చెందిన వెంకట దత్తసాయితో సింధు ఏడడుగులు నడిచేందుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వరుడు వెంకట దత్తసాయి 'పొసిడెక్స్ టెక్నాలజీస్' సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది పెద్దలు కుదిర్చిన వివాహం. పెళ్లి వార్తను సింధు తండ్రి పీవీ రమణ ధ్రువీకరించారు. ఈనెల 22న రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో పెళ్లి జరుగుతుందని.. ఈనెల 24న హైదరాబాద్‌లో రిసెప్షన్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు.

- వివరాలు 14లో



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు దుబాసి సాయికృష్ణ (27). రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం కేసీఆర్ నగర్‌లో ఉండేవారు. ఆయన భార్య రజిత పేరిట మైక్రో ఫైనాన్స్‌లో రుణం తీసుకున్నారు. ఆ వాయిదాలు చెల్లించలేకపోవడంతో వేధింపులు ఎదురయ్యాయి. దాంతో నూతి అనిల్ అనే వడ్డీ వ్యాపారి వద్ద రూ.20వేలు అప్పు చేసి.. ఆ వాయిదాలు కట్టారు. కానీ ఈ అప్పు సకాలంలో చెల్లించకపోవడంతో సాయికృష్ణను నిలదీసిన అనిల్.. అతడి సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లాడు. సాయికృష్ణ ఈ అవమానం భరించలేక ఉరేసుకుని ప్రాణాలు వదిలాడు. ఈ కేసులో అప్పు ఇచ్చి వేధించిన నూతి అనిల్ జైలుకు వెళ్లాడు. కానీ మైక్రో ఫైనాన్స్ నిర్వాహకులు బలవంతపు వసూళ్లు చేస్తున్నా చర్యలు లేవు.



నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆవాల భారతి భర్త పదేళ్ల కిందే మరణించాడు. ఆమె గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ గాజులు, బొమ్మలు, దండలు అమ్ముతూ.. కొడుకు, కూతురును పోషించుకుంటోంది. ఇటీవల వ్యాపారం కోసం మైక్రో ఫైనాన్స్‌లో రూ.50 వేలు రుణం తీసుకుని వారానికి రూ.5 వేలు చెల్లిస్తోంది. గిరాకీ సరిగా లేక ఇబ్బంది ఎదురైనా రుణం వాయిదా చెల్లించాల్సి వస్తోందని.. లేకుంటే జమానత్ దారుపై ఒత్తిడి తెచ్చి వసూలు చేసుకుంటున్నారని వాపోతోంది. ఈ వాయిదాలు చెల్లించడం కోసం మరో ఫైనాన్స్‌లో రుణం తీసుకుని కడుతున్నానని... సంపాదించే కాస్త కూడా వడ్డీలకే పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తోంది.



మళ్లీ 'మైక్రో' పడగ!

రాష్ట్రంలో విస్తరిస్తున్న సూక్ష్మ రుణ సంస్థలు • మహిళలే టార్గెట్.. వారిని గ్రూపులుగా చేసి రుణాలు

- వారానికి ఒక వాయిదా చెల్లించేలా నిబంధనలు
- వాయిదా చెల్లించకపోతే అడ్డగోలుగా అదనపు వసూళ్లు
- 'మైక్రో' రుణాలపై 36 శాతం వరకు వడ్డీ భారం
- వాయిదా మీరితే రోజుకు రూ.100–200 ఫైన్
- వసూళ్ల పేరిట వేధింపులు, ఆగడాలు.. ఇప్పటికే పలువురి ఆత్మహత్య
- క్రమంగా వెలుగులోకి వస్తున్న దారుణాలు

గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణ జిల్లాల్లో మైక్రో ఫైనాన్స్ సంస్థలు మళ్లీ పడగ విప్పుతున్నాయి. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసి, అధిక వడ్డీకి రుణాలు ఇస్తున్నాయి. పెద్ద నగరాలు, పట్టణాలు, సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున బ్రాంచీలు తెరిచాయి. పేదలు, మధ్య తరగతి వారి ఆర్థిక అవసరాలు, బలహీనతలను ఆసరాగా తీసుకుని వ్యాపారం చేస్తున్నాయి. మహిళలే టార్గెట్‌గా, వారిని గ్రూపులుగా చేసి అప్పులు ఇస్తున్నాయి. ఒకరు కట్టకుంటే మిగతా వారంతా కలసి కట్టాలనే నిబంధనలు పెడుతూ.. బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాయి. ఒకవేళ వాయిదాలు కట్టలేకపోతే... 'చస్తే చావండి.. డబ్బులు మాత్రం కట్టండి' అంటూ తీవ్రంగా మిగతా 2వ పేజీలో ▶



108 వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో భట్టి, రాజనర్సింహ, పొన్నం, కేకే, షబ్బీర్ అలీ, దానం నాగేందర్

టీజీపీఎస్సీని భ్రష్టుపట్టించారు

గత ప్రభుత్వంలో టీజీపీఎస్సీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు

ప్రజాపాలన ఆరోగ్య ఉత్సవాల్లో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

- ఆర్‌ఎంపీ డాక్టర్, డిప్యూటీ తహసీల్దార్‌ను కమిషన్ సభ్యులుగా నియమించారు
- మేం ఉన్నత చదువులు చదివిన, ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నవారిని నియమించాం
- ఒక్క ఏడాదిలో వైద్యారోగ్యశాఖలో 14 వేల ఉద్యోగాలిచ్చాం
- మీరెన్నుకున్న ప్రభుత్వాన్ని మీరే కాపాడుకోవాలి.. విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు
- అసిస్టెంట్ సివిల్ సర్జన్లు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేత

సాక్షి, హైదరాబాద్: గత పాలకులు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)ను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చి భ్రష్టుపట్టించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. అదే తాము ఉన్నత చదువులు చదివిన వారిని, ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న వారిని టీజీపీఎస్సీలో నియమించామని చెప్పారు. ఏడాది ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్‌ఎండీఏ మైదానంలో ఆరోగ్య ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో... సీఎం చేతుల మీదుగా 422 మంది మిగతా 3వ పేజీలో ▶

పెట్టుబడులకు స్వర్గధామం తెలంగాణ: సీఎం రేవంత్

- వివరాలు 3లో

సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఎస్సై ఆత్మహత్య



ములుగు జిల్లా వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ (29) సోమవారం సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రిసార్ట్‌లోని ఓ గదిలో ఎస్సై మృతదేహం బెడ్‌పై రక్తపు మడుగులో పడి ఉండగా.. ఆయన మెడకు చున్నీ చుట్టి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు.

- వివరాలు 5లో▶

తొలి ప్రైవేట్ ఉపగ్రహం

- నిర్మాణం నుంచి నిర్వహణ దాకా
- హైదరాబాద్‌కు చెందిన అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఘనత



- వివరాలు 6లో

ఇదంతేనా?



నిజంగానే హ్యాక్ చేస్తాడేమోనని అలా చేశాం సార్!

ప్రభుత్వ వైఫల్యాలపై 7న చార్జిషీట్



సీఎం రేవంత్ నిజ స్వరూపాన్ని ప్రజల ముందుంచుతాం: హరీశ్‌రావు

- ప్రజలను వంచించడం, మోసగించడమే ఆయన నైజం
- ఏడాదిగా ఫిరాయింపులు, దబాయింపులు, బుకాయింపులే తప్ప చేసిందేమీ లేదు
- రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని మండిపాటు
- 'రేవంత్ ఆణిముత్యాలు' అంటూ వీడియో క్లిప్పింగులు విడుదల

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి రెండు నాలుకల మనిషి అని, అలాంటి వ్యక్తిత్వం కలిగిన వారు ప్రజలను నిలువునా ముంచేస్తారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. పూటకో రకంగా మాట్లాడే విద్యలో రేవంత్ పీహెచ్‌డీ చేశాడని ఎద్దేవా చేశారు. రేవంత్ నిజ స్వరూపాన్ని ప్రజల ముందు పెట్టాలన్నదే తన ప్రయత్నమని చెప్పారు. కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఈ నెల 7న ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ సవివర చార్జిషీట్ విడుదల చేస్తామని ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు మహమూద్ అలీ, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మిగతా 2వ పేజీలో ▶

తేలని 'విభజన' చర్చలు!

- తెలంగాణ, ఏపీ సీఎస్‌ల ఆధ్వర్యంలోని కమిటీ భేటీ
- 15 అంశాలపై విస్తృతంగా చర్చించినా అపరిష్కృతంగానే సమస్యలు
- ఎటువంటి నిర్ణయాలు తీసుకోకుండానే ముగిసిన సమావేశం
- వచ్చే సమావేశం నాటికి నిర్దిష్ట ప్రతిపాదనలతో రావాలని తీర్మానం

12లో



సోమవారం ఏపీలోని మంగళగిరిలో జరిగిన సమావేశంలో తెలంగాణ, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు శాంతికుమారి, నీరబ్‌కుమార్, ఇతర అధికారులు

కారుతో ఢీకొట్టి.. వేట కొడవలితో నరికి

రంగారెడ్డి జిల్లా రాయపోల్‌లో పరువు హత్య

- సొంత అక్కను అతి కిరాతకంగా చంపిన తమ్ముడు
- హయత్‌నగర్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగమణి
- కులాంతర వివాహం, ఆస్తి తగాదాలే హత్యకు కారణమని భావిస్తున్నామన్న పోలీసులు





నిందితుడు పరమేశ్

ఇబ్రహీంపట్నం: కులాంతర వివాహం చేసుకుని తమ పరువు తీసిందని, అక్కపై కక్ష పెంచుకున్న తమ్ముడు ఆమెను అతి కిరాతకంగా హతమార్చాడు. స్కూటీపై వెళుతున్న ఆమెను కారుతో ఢీకొట్టాడు. కిందపడిపోయిన ఆమె మెడ, చెంప భాగంలో వేట కొడవలితో దాడి చేశాడు. రక్తపు మడుగులో విలవిల్లాడిన ఆ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామ సమీపంలో సోమవారం ఉదయం ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా.. రాయపోల్‌కు చెందిన కొంగర నాగమణి (27) హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఏడేళ్ల క్రితమే ఈమెకు వివాహం జరగగా, కొద్దిరోజులకే భర్త నుంచి విడాకులు తీసుకుంది. అనంతరం ఇదే గ్రామానికి చెందిన బండారి శ్రీకాంత్‌ను ప్రేమించి గత నెల 10న యాదగిరిగుట్టలో కులాంతర వివాహం చేసుకుంది. ముందుజాగ్రత్తగా తమకు రక్షణ కల్పించాలని మిగతా 5వ పేజీలో ▶



'మేడిగడ్డ' ఎప్పుడు దెబ్బతింది?

- కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లను డ్యామ్‌లుగా ఏ ప్రాతిపదికన పరిగణించారు..
- రాష్ట్ర డ్యామ్‌ల భద్రత సంస్థ మాజీ ఎస్‌ఈ మురళీకృష్ణకు పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నలు

- వివరాలు 12లో

వారి మృతదేహాలు భద్రపర్చండి

ఎన్‌కౌంటర్ మృతులను చూసేందుకు కుటుంబసభ్యులను అనుమతించండి

ఏటూరునాగారం పోలీసులకు హైకోర్టు ఆదేశం • తదుపరి విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాలను చూసేందుకు వారి కుటుంబసభ్యులకు అనుమతి ఇవ్వాలని స్థానిక పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకు మృతదేహాలను ఫ్రీజర్‌లో భద్రపర్చాలని సూచించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివారం ఉదయం ములుగు జిల్లా ఏటూరునాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఈ ఎన్‌కౌంటర్ బూటకమని, మత్తు పదార్థం/విషమిచ్చి పట్టుకుని కాల్చి చంపారని, తన భర్త మల్లయ్య మృతదేహాన్ని చూసేందుకు పోలీసులు అనుమతించడం లేదని పేర్కొంటూ.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన కాలవల ఐలమ్మ (మీనా) సోమవారం హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు.

ఆగమేఘాలపై పోస్టుమార్టం: పిటిషనర్

పిటిషనర్ తరఫు న్యాయవాది సురేశ్ వాదనలు వినిపిస్తూ.. 'భోజనంలో మత్తు పదార్థాలు కలిపి మావోయిస్టులను మిగతా 5వ పేజీలో ▶

విష ప్రయోగం దుష్ప్రచారమే

పౌర హక్కుల సంఘం ఆరోపణలను ఖండించిన డీజీపీ

ఐదుగురు మావోల కోసం జల్లెడ

- వివరాలు 5లో

చెట్టును ఢీకొట్టిన లారీ



దూసుకొచ్చిన మృత్యువు

అదుపుతప్పి రోడ్డు పక్కన కూరగాయల విక్రేతలపైకి దూసుకెళ్లిన లారీ

- నలుగురు దుర్మరణం.. మరో ఐదుగురికి తీవ్ర గాయాలు
- రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో ఘోర ప్రమాదం
- చెట్టును ఢీకొనడంతో లారీ ముందుభాగం నుజ్జునుజ్జు
- ప్రమాద సమయంలో అక్కడే 30 మంది.. చెట్టు వల్లే వారి ప్రాణాలు నిలిచాయన్న ప్రత్యక్ష సాక్షులు
- ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి.. క్షతగాత్రులకు మెరుగైన సాయం అందించాలని ఆదేశం

2లో

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిస్పెన్సరీలు



రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు, రిటైరైన సిబ్బంది ఇకపై ఉచిత చికిత్సల కోసం తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రి వరకు రావాల్సిన బాధ తప్పనుంది. ఆర్టీసీ ఆసుపత్రికి అనుబంధంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్పెన్సరీలను ఆసుపత్రులుగా మారుస్తుండటమే అందుకు కారణం.

16లో

ఎడతెగని ఎదురుచూపు



- ఎటూ తేలని జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి దరఖాస్తులు
- కోర్సులు ముగుస్తున్నా విడుదల కాని అర్హుల జాబితా.. ఏడాదిన్నరగా పెండింగ్‌లోనే.. 6 వేల మంది ఎదురుచూపు
- అప్పులు చేసి విదేశాలకు విద్యార్థులు.. ఆందోళనలో తల్లిదండ్రులు
- ఆరు నెలలుగా సీఎం కార్యాలయంలోనే ఫైల్

3లో

క్లుప్తంగా...

బీజేపీది అంబానీ, అదానీ రుణమాఫీ

కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ చార్జిషీట్ విడుదల చేసిందని సీనియర్ కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. తమది రైతు రుణమాఫీ గురించి ఆలోచించే ప్రభుత్వం అయితే, కేంద్రంలో ఉన్న బీజేపీది అంబానీ, అదానీ రుణాలను మాఫీ గురించి ఆలోచించే ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. సోమవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నాయా? అని ప్రశ్నించారు. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించలేని బీజేపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. ఎన్నికల సమయంలో కేంద్ర బీజేపీ నేతలు హామీ ఇచ్చిన ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయో తెలంగాణ బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

వైఫల్యాలు ఎత్తి చూపితే ప్రభుత్వానికి భయం పట్టుకుంది

బీజేపీ నేతలు కాసం వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌రెడ్డి, ఎన్వీ సుభాష్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను తమ పార్టీ.. ప్రజల్లోకి తీసుకెళ్తుంటే సీఎం రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధుల గురించి అమరవీరుల స్థూపం వద్ద లేదా మరెక్కడైనా చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా అని సవాల్ విసిరారు. సోమవారం పార్టీనేతలు డా.ఎస్.ప్రకాశ్‌రెడ్డి, ఎన్వీ సుభాష్‌లతో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కారణంగా రాష్ట్ర రాజకీయాలు విపరీత పోకడలకు దారి తీస్తున్నాయన్నారు. సీఎంతో పాటు పీసీసీ చీఫ్, మంత్రులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఏడాది పాలనలో ప్రజలకు ఏమీ చేయలేదనే అసహనం వారిలో బయటపడుతోందని అన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చకుండానే ప్రజా ధనంతో కాంగ్రెస్ ప్రభుత్వం సంబురాలు చేసుకుంటోందని ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. మోదీ పదేళ్ల పాలనపై చర్చించాలని రేవంత్‌రెడ్డి అంటున్నారని, దీనిపై ఎక్కడైనా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తామన్నారు. ఖాళీపాత్రలు ఎక్కువ శబ్దం చేస్తాయనే సామెతకు సరిగ్గా సరిపోయేలా రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి ఉందని ఎన్వీ సుభాష్ ఎద్దేవాచేశారు.

బీఆర్ఎస్ సినిమా అయిపోయింది.. కాంగ్రెస్‌ది నడుస్తోంది

హరీశ్ కాంగ్రెస్‌లో చేరుతానన్నది వాస్తవం కాదా?: విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు మార్ఫింగ్ సినిమాలు చూపిస్తున్నాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. అయినా బీఆర్ఎస్ సినిమా అయిపోయిందని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎపిసోడ్ నడుస్తోందని పేర్కొన్నారు. అన్నీ తెలిసినా పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్న హరీశ్‌రావు ఇప్పటికైనా నిజాలు మాట్లాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని బీఆర్ఎస్ నేతలు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడే అర్హత హరీశ్‌రావుకు లేదన్నారు. హరీశ్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేసింది వాస్తవం కాదా?, అది తెలిసి ఆయన్ను కేసీఆర్ దూరం పెట్టింది నిజం కాదా?, కేసీఆర్ చెప్పిన కారణంగానే హరీశ్‌రావు వార్తలు పత్రికల్లో కూడా రానిది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో రైతు రుణమాఫీ కింద రూ.80 వేల కోట్లు ఇచ్చామని హరీశ్‌రావు అబద్ధాలు చెప్తున్నాడన్నారు. రైతు రుణమాఫీ పేటెంట్ కాంగ్రెస్ పార్టీది అయితే కొండలు, కోనలు, గుట్టలకు రైతుబంధు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీదని శ్రీనివాస్ ఎద్దేవా చేశారు.

'7న ఆటో బంద్‌కు మేం వ్యతిరేకం'

సాక్షి, హైదరాబాద్: ఈనెల 7న వామపక్ష, బీఆర్ఎస్ ఆటోబంద్‌ను భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధ ఆటో సంఘం, నాన్ పొలిటికల్ జేఏసీలోని ఇతర ఐకాస ఆటో సంఘాలు వ్యతిరేకిస్తూ తీర్మానించాయి. ఈ మేరకు సోమవారం రవాణాశాఖ కమిషనర్‌కు ఆ సంఘం నేతలు వినతిపత్రం అందించారు. ఆటో, ప్రైవేటు రవాణా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని, గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మళ్లీ 'మైక్రో' పడగ!

▶ మొదటి పేజీ తరువాయి

వేధింపులకు దిగుతున్నాయి. ఈ మైక్రో ఫైనాన్స్‌ల వలలో చిక్కి వేలాది కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. సంపాదించే కాసింత కూడా వడ్డీలకే సరిపోవడం లేదంటూ.. కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితి నెలకొంది.

మహిళా గ్రూపులను లక్ష్యంగా చేసుకొని..

మైక్రో ఫైనాన్స్ సంస్థలు పది నుంచి ఇరవై మంది వరకు మహిళలను గ్రూపుగా చేసి.. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్స్‌లు తీసుకుని రుణాలు ఇస్తున్నాయి. రిజర్వు బ్యాంకు నిబంధనల మేరకు బ్యాంకులుగా రిజిస్టర్ చేయించుకుని చట్టబద్ధంగానే వ్యాపారం నిర్వహిస్తున్నట్లుగా రికార్డుల్లో చూపుతున్నాయి. వివిధ పేర్లతో ముందుగానే కోతలు పెడుతున్నాయి. అడ్డగోలు వడ్డీలు వసూలు చేస్తున్నాయి. ఉదాహరణకు గ్రూపులో ఒక్కో మహిళకు రూ.30వేల చొప్పున అప్పుగా ఇస్తారు. ఇందులోనూ బీమా, ప్రాసెసింగ్ ఫీజు పేరిట రూ.2 వేలు ముందే కోతపెట్టి.. రూ.28 వేలు మాత్రమే మహిళల చేతికి ఇస్తారు. ఈ అసలు, వడ్డీ కలిపి వారానికి రూ.800 చొప్పున ఏడాది పాటు చెల్లించాలి. అంటే రూ.28 వేలకుగాను.. మొత్తంగా రూ.44,800 కట్టాల్సి ఉంటుంది. అంతేకాదు ఏ వారమైనా వాయిదా సమయానికి చెల్లించకుంటే.. అదనంగా రూ.100 జరిమానా కింద వసూలు చేస్తారు.

అసలు లక్ష్యం పక్కదారి పట్టి..

స్పందన, కీర్తన, ఫిన్‌కేర్, ఒరిగో, సౌత్ ఇండియా, అన్నపూర్ణ, యాక్సిస్, పిరమిల్, ఐ రిఫ్, క్రిస్, బంధన్, ఎపాక్, హోమ్ లోన్స్ ఫైనాన్స్, వెరిటాస్ మైక్రో ఫైనాన్స్, ఫ్యూజియన్ బ్యాంకు, ఆశీర్వాద్ బ్యాంకు, ఎఫ్ఎఫ్ఎల్, ఫెడరల్ బ్యాంకు వంటి సంస్థలు మైక్రో ఫైనాన్స్ చేస్తున్నాయి. వాస్తవానికి పేదలకు తక్కువ మొత్తంలో రుణాలు సులువుగా అందించడం, ఆర్థిక చేయూత ద్వారా పేదరికాన్ని తగ్గించడం లక్ష్యంగా మైక్రో ఫైనాన్స్ వ్యవస్థల లక్ష్యం. సూక్ష్మరుణాల ద్వారా వ్యక్తులు కొత్త వ్యాపారాలను ప్రారంభించడానికి, విస్తరించడానికి తోడ్పడాలి. కానీ ఇక్కడ అందుకు పూర్తి భిన్నంగా జరుగుతోంది.

పోటాపోటీగా పాగా.. అడ్డగోలు వడ్డీ

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో విస్తరించిన టాప్ మైక్రో ఫైనాన్స్ సంస్థలు తెలంగాణలోనూ పాగా వేశాయి. అవి రూ.8 వేల నుంచి రూ.50 వేల వరకు మహిళలకు రుణాలు ఇస్తున్నాయి. రుణాలు ఇచ్చే సమయంలోనే కాల పరిమితిని బట్టి 36 శాతం వరకు వడ్డీ పడుతుందని ఒప్పంద పత్రంలోనే పేర్కొంటున్నాయి. ఒక్కో సంస్థ ఒక్కోరకంగా డాక్యుమెంట్, ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ, బీమా వంటివాటి పేరిట రూ.2,500 నుంచి రూ.4 వేల వరకు రుణంలో ముందే కోతపెడుతున్నాయి. అన్నీ లెక్కేస్తే.. పేరుకు 36 శాతం అయినా, 50శాతం దాకా వడ్డీ పడుతున్న పరిస్థితి. పేదలు ఈ వడ్డీల భారం భరించలేక ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్నారు. ఆవేదనతో ప్రాణాలు తీసుకోవడానికీ ప్రయత్నిస్తున్నారు.

వేధింపులతో ఉరేసుకుని.. చావు నుంచి బయటపడి..



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం కేసీఆర్ కాలనీ వాసి గాజుల వేణు (45) సంసారంలో మైక్రో ఫైనాన్స్ చిచ్చుపెట్టింది. ఆయన భార్య వైష్ణవి పేరు మీద ఆరు మైక్రో ఫైనాన్స్ కంపెనీల నుంచి విడతల వారీగా రూ.3 లక్షల వరకు అప్పు తీసుకున్నారు. అందులో ఒకదానికి వారానికి రూ.800, మరో మూడింటికి ప్రతి 15 రోజులకు రూ.1,600 చొప్పున.. మరో రెండింటికి నెలకు రూ.3,200 చొప్పున చెల్లిస్తున్నారు. కొంత కాలం కిందటి వరకు వస్త్రోత్పత్తి రంగం బాగుండటంతో వాయిదాలు బాగానే చెల్లించారు. ఇటీవల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో పడటంతో.. వాయిదాలు కట్టలేకపోతున్నారు. మైక్రో ఫైనాన్స్ వేధింపులు భరించలేక బైక్ అమ్మేసి రూ.30 వేలు కట్టారు. అయినా వేధింపులు తప్పకపోవడంతో ఆవేదనతో ఉరి వేసుకున్నారు. కానీ కుటుంబ సభ్యులు గమనించి కాపాడటంతో చావు నుంచి బయటపడ్డారు.

ఆర్‌బీఐ నిబంధనల మేరకే అంటూ..

2008లోనూ ఇలాగే మైక్రో ఫైనాన్స్ వేధింపులు పెరిగిపోవడంతో.. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కఠిన చర్యలు చేపట్టారు. మైక్రో ఫైనాన్స్ వసూళ్లపై కొంతకాలం మారటోరియం విధించారు. ఈ సమస్య పరిష్కారం కోసం 2010 అక్టోబర్ 14న ఒక ఆర్డినెన్స్ తెచ్చేందుకు నాటి ఉమ్మడి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వేధింపులకు పాల్పడే మైక్రో ఫైనాన్స్ నిర్వాహకులకు కనీసం మూడేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించాలని.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని తీర్మానించింది. అయితే ఇప్పుడు రూటు మార్చిన మైక్రో ఫైనాన్స్ సంస్థలు బ్యాంకుల పేరిట ఆర్‌బీఐ నిబంధనలంటూ దందాకు శ్రీకారం చుట్టాయి.

సంపాదన.. అప్పు, వడ్డీ కిందకే పోతోంది



చిన్న వ్యాపారానికి పెట్టుబడి కోసం మైక్రో ఫైనాన్స్‌లో రూ.85 వేల రుణం తీసుకున్నాం. వారానికి రూ.1,400 చొప్పున 90 వారాలు చెల్లించాలి. రోజూ గిన్నెలు విక్రయించగా వచ్చే మొత్తంలో కొంత ఇంటి అవసరాలకుపోగా మిగతా అంతా ఫైనాన్స్‌కు చెల్లిస్తున్నా. ఒక్కోసారి వ్యాపారం సాగకపోయినా వాయిదా మాత్రం చెల్లించాల్సి వస్తోంది. ఏ మాత్రం ఆలస్యమైనా జమానత్ ఉన్నవారిపై ఒత్తిడి తెస్తున్నారు. 20 ఏళ్ల నుంచి చేస్తున్న ఈ చిన్నపాటి వ్యాపారంతో సంపాదించిందంతా అప్పు, వడ్డీకే పోతోంది.

– బానాల శంకర్, కమ్మర్‌పల్లి, నిజామాబాద్ జిల్లా

అటువంటి రుణాలతో మోసపోవద్దు



మైక్రో ఫైనాన్స్ సంస్థలు మహిళలను గ్రూపులుగా ఏర్పాటు చేసి అధిక వడ్డీతో రుణాలు ఇస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఎవరైనా భద్రత, సెక్యూరిటీ లేని సంస్థల నుంచి రుణాలు పొందేటపుడు జాగ్రత్తగా ఉండాలి. ఇటువంటి లోన్లతో మోసపోవద్దు. సభ్యులను బ్యాంకు సిబ్బంది లేదా తోటి సభ్యులు ఇబ్బంది పెడితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– పి.సంపత్‌రావు, డీఎస్పీ, భూపాలపల్లి

దూసుకొచ్చిన మృత్యువు

అదుపుతప్పి రోడ్డు పక్కన కూరగాయల విక్రేతలపైకి దూసుకెళ్లిన లారీ

- నలుగురు దుర్మరణం.. మరో ఐదుగురికి తీవ్ర గాయాలు
- రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు బస్ స్టేజీ వద్ద ఘోర ప్రమాదం
- చెట్టును ఢీకొని లారీ ఆగడంతో ముందుభాగం నుజ్జునుజ్జు
- విరిగిన డ్రైవర్ కాలు.. క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయిన వైనం



ప్రమాద తీవ్రతతో క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్



ప్రమాద స్థలంలో సుజాత మృతదేహం

చేవెళ్ల: రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నచిరువ్యాపారులను దూసుకొచ్చిన మృత్యువు కబళించింది. లారీ రూపంలో వచ్చి వారిని చిదిమేసింది. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో నలుగురు మృతిచెందగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

ఆగి ఉన్న బస్సును దాటి వెళ్తూ..: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని ఆలూరు, నాంచేరి, ఖానాపూర్ గ్రామాలకు చెందిన సుమారు 20 కుటుంబాల వారు నిత్యం ఆలూరు బస్ స్టేజీ వద్ద, రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే సోమవారం కూడా కూరగాయలు విక్రయిస్తుండగా చేవెళ్ల నుంచి వికారాబాద్ వైపు అతివేగంగా వెళ్తున్న ఓ లారీ ఆలూరు స్టేజీ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును దాటి వెళ్లే క్రమంలో అదుపుతప్పి టీస్టాల్ స్టాండ్‌ను ఢీకొడుతూ రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న వారిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆలూరుకు చెందిన నక్కలపల్లి రాములు (48), దామరగిద్ద కృష్ణ (19), నాంచేరికి చెందిన శ్యామల సుజాత (42) అక్కడిక్కడే మృతిచెందారు. అలాగే కూరగాయలు కొనేందుకు అక్కడకు వచ్చిన జమీల్ (25), బాలమణి, చల్ల మాల్యాద్రి, కూరగాయల విక్రేతలు ఆకుల పద్మమ్మ, నక్కలపల్లి రేణకతో పాటు లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్‌లలో చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ జమీల్ మృతిచెందాడు. అతను ఆలూరులోని ఓ ఫాంహౌస్‌లో పనిచేస్తున్నాడు. మిగతా క్షతగాత్రులను వారివారి బంధువులు మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లారు.

షాక్‌లో డ్రైవర్..: ఈ ఘటనలో లారీ చివరకు రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొని ఆగిపోయింది. లారీ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అవగా డ్రైవర్ కాలు విరిగి క్యాబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని జేసీబీల సాయంతో అతన్ని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో షాక్‌లో ఉన్న డ్రైవర్ తన వివరాలు చెప్పలేకపోయాడు. ప్రమాద తీవ్రతకు చెట్టు విరిగిపడటంతో చెట్టు కింద, లారీ ముందు భాగంలో ఎవరైనా ఇరుక్కుపోయారా? అనే విషయం వెంటనే తెలియరాక మృతుల సంఖ్య ఎక్కువగా ఉండొచ్చని పోలీసులు తొలుత భావించారు. చివరకు చెట్టును తొలగించాక దాని కింద ఎవరూ లేరని నిర్ధారణ అయింది. ఆ చెట్టు అడ్డుగా లేకపోయి ఉంటే అక్కడే కూరగాయలు విక్రయిస్తున్న, కొనుగోలు చేస్తున్న మరో 30 మంది ప్రమాదం బారిన పడేవారని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు.

సీఎం రేవంత్ దిగ్భ్రాంతి..: ఈ దుర్ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలపై 7న చార్జిషీట్



మీడియా సమావేశంలో ప్రకటనల వీడియో క్లిప్పింగులను చూపిస్తున్న హరీశ్‌రావు

▶ మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, చిరుమర్తి లింగయ్య తదితరులతో కలసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'గత ఏడాది పాలనలో సీఎం ద్వంద్వ ప్రమాణాలకు అద్దం పట్టే ఆణిముత్యాలు' అంటూ వివిధ అంశాలపై రేవంత్ చేసిన ప్రకటనల వీడియో క్లిప్పింగులను హరీశ్‌రావు విడుదల చేశారు.

ఏడాది పాలనలో ఎడతెగని వంచన

తెలంగాణ ప్రజలను మోసగించడం, వంచించడం రేవంత్ నైజమని హరీశ్ విమర్శించారు. ఏడాది నుంచి ఫిరాయింపులు, దబాయింపులు, బుకాయింపులతో పాలన సాగుతోందని.. సీఎం అపరిచితుడిలా పొంతన లేని వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. మూడో పంటకు రైతు బంధు ఇవ్వాలని... కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామని ప్రకటించిన రేవంత్ ప్రస్తుతం మాట మార్చారని ఆరోపించారు. ''బతుకమ్మ చీరల పథకం, ఎల్ఆర్ఎస్, పోటీ పరీక్షల వాయిదా, కుల సర్వే, ఆక్రమణల కూల్చివేతలు వంటి అంశాలపై రేవంత్ మాటలు మారుస్తున్నారు. ఏక్ పోలీసు విధానం, మద్యం, కాళేశ్వరం ప్రాజెక్టు తదితర అంశాలపై రేవంత్ మాటలు మార్చారు. పచ్చ పార్టీలో ఉన్నప్పుడు సోనియాను బలిదేవత అన్నారు.. ఇప్పుడు అమ్మ అంటున్నారు. రేవంత్ అవసరమొస్తే కాళ్లు పట్టగలడు, అవసరం తీరిన తర్వాత కాళ్లు లాగగలడు..'' అని హరీశ్ వ్యాఖ్యానించారు.

నిర్బంధాలు, అణచివేతలే..

కాంగ్రెస్ ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని చెప్పిందని... గత ఏడాది పాలనలో నిర్బంధాలు, అణచివేతలు, లాఠీచార్జీలు, కంచెలు, ఆంక్షలు నిత్యకృత్యం అయ్యాయని హరీశ్ ఆరోపించారు. న్యాయం కావాలని రోడ్డెక్కిన నిరుద్యోగులపై కేసులు, లగచర్ల గిరిజనులపై దాడులు ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ పేరిట ప్రజాస్వామ్య హననానికి పాల్పడుతున్నారని.. రాజ్యాంగం ద్వారా వచ్చిన హక్కులను కాలరాసి, రాక్షస పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. విపక్ష నేతగా నక్సలైట్లపై మొసలి కన్నీరు కార్చిన రేవంత్.. బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు.

5న ఇందిరమ్మ ఇళ్ల యాప్ ప్రారంభం

- నాలుగేళ్లలో ఇళ్లు లేని వారు ఉండరు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నేలకొండపల్లి: రానున్న నాలుగేళ్లలో రాష్ట్రంలో ఎక్కడ కూడా ఇళ్లు లేని వారు ఉండరని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆయన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే కొందరికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, దీనికోసం ఈనెల 5వ తేదీన యాప్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. యాప్ వివరాలు, పనితీరును త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. గ్రామాల్లోకి అధికారుల బృందాలు వచ్చి అర్హులను గుర్తిస్తాయని వెల్లడించారు. ప్రజల దీవెనలతో తాను మంత్రిని అయ్యాయని పేర్కొన్నారు. ఎన్నికల వరకే రాజకీయం అని, ఆ తర్వాత అభివృద్ధిపైనే దృష్టి సారించామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే వారు నమ్మరని తెలుసునని, అందుకే హామీల అమలులో భాగంగా దాదాపు రూ. 2,800 కోట్ల మేర నాలుగో విడత రైతుల రుణాలు మాఫీ చేయగా సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా నిధులు కూడా విడుదల చేస్తామన్నారు. పదేళ్ల పాలించిన ప్రభుత్వం.. ప్రజలను మభ్యపెడితే తాము మాత్రం ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్నామని పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు పాల్గొన్నారు.

ఖమ్మంలో సీపీఐ శత జయంతి విజయోత్సవాలు

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా



సాక్షి, న్యూఢిల్లీ: సీపీఐ వందేళ్ల ముగింపు ఉత్సవాలను శతజయంతి విజయోత్సవాల పేరుతో ఖమ్మంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. వచ్చే ఏడాది డిసెంబర్ 26న ఖమ్మంలో భారీ ర్యాలీతో పాటు భారీ బహిరంగ సభను నిర్వహించి ఈ ఉత్సవాలను ఘనంగా జరపనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని అజోయ్ భవన్‌లో రాజా మీడియాతో మాట్లాడారు. గత నెల 28, 29, 30 తేదీల్లో జరిగిన పార్టీ నేషనల్ కౌన్సిల్ మీటింగ్‌లో తీసుకున్న తీర్మానాలను వివరించారు. పార్టీ వందేళ్ల ఉత్సవాలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ విజయోత్సవాలను యూపీలోని కాన్పూర్‌లో ఈనెల 26న ప్రారంభించనున్నట్లు చెప్పారు. డిసెంబర్ 10న అదానీ ముడుపుల వ్యవహారంపై పార్లమెంట్ జాయింట్ కమిటీ (జేపీసీ) వేయాలని దేశ వ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని రాజా తెలిపారు. మణిపూర్ అల్లర్లపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరిపి, వెంటనే అక్కడ మోహరించిన బలగాలను వెనక్కి తీసుకోవాలన్నారు. అల్లర్లకు బాధ్యత వహిస్తూ అక్కడి ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో కాలుష్యం కారణంగా ఉపాధి కోల్పోయిన కార్మికులకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని తీర్మానాలు చేసినట్లు రాజా తెలిపారు.

సుప్రీంకోర్టు చెప్పినట్లు ఎస్సీ వర్గీకరణ పూర్తి చేస్తాం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరిగేటట్టు చూస్తామని, సుప్రీంకోర్టు చెప్పిన విధంగా ఎస్సీ వర్గీకరణ పూర్తి చేస్తామని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సోమవారం సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపు రైతులకు రుణమాఫీ కింద రూ.22 వేల కోట్లు మాఫీ చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో కేవలం వడ్డీ కట్టిందని, దీని వల్ల రైతుల మీద రూ.8,800 కోట్ల అదనపు భారం పడిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 153 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండిందని, సన్నరకాలకు రూ.500 బోనస్‌తో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఉత్తమ్ చెప్పారు. అర్హులైన పేదలందరికీ ఈనెల నుంచి ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రైతు భరోసాపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి సంక్రాంతి పండుగ తర్వాత రైతు భరోసా ఇస్తామని మంత్రి తెలిపారు.

కేసీఆర్ మొక్క కాదు.. వేగు చుక్క

మోదీ ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ విధించడం దుర్మార్గం: కవిత



సాక్షి, హైదరాబాద్: 'పీకేయడానికి కేసీఆర్ మొక్క కాదు, వేగు చుక్క. రేవంత్‌రెడ్డి గురువులకే చుక్కలు చూపించి తెలంగాణ సాధించిన శక్తి కేసీఆర్' అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో నిధులు పారితే రేవంత్ పాలనలో తిట్లు పారుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు పోటీపడి తిట్ల దండకం చదువుతున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం తన నివాసంలో కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలతో కవిత భేటీ అయ్యారు. 'బీఆర్ఎస్ కార్యకర్తలపై ప్రభుత్వం కేసులు పెడుతోంది. ఉద్యమ కాలంనుంచి అనేక కష్టాలను తట్టుకుని కార్యకర్తల బలంతో బీఆర్ఎస్ నిలబడింది. కష్ట కాలంలో పార్టీ కోసం పనిచేసే వారే నిజమైన కార్యకర్తలు. ప్రభుత్వ వైఫల్యాలు, హామీలు అమలు చేయని తీరును ప్రజల్లో ఎండగట్టాలి' అని కవిత దిశానిర్దేశం చేశారు. మోదీ ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ విధించడం దుర్మార్గమని అన్నారు. అఖిల భారత పద్మశాలి సంఘం నాయకులు కవితను కలిసి కులగణనపై బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు నివేదిక ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

రేపటి నుంచి జాగృతి సమీక్షలు...

ఉమ్మడి జిల్లాల వారీగా ఈనెల 4 నుంచి తెలంగాణ జాగృతి సమావేశాలు నిర్వహించాలని ఎమ్మెల్సీ కవిత నిర్ణయించారు. 4న వరంగల్, నిజామాబాద్, 5న కరీంనగర్, నల్లగొండ, 6న రంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లా సమావేశాలు ఉంటాయి. 7న హైదరాబాద్, ఖమ్మం, 8న మెదక్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల తెలంగాణ జాగృతి ముఖ్య నేతలతో కవిత సమావేశమవుతారు.

సరూర్‌నగర్ సభకు జేపీ నడ్డా?

- 7న ఇండోర్ స్టేడియంలో బీజేపీ బహిరంగ సభ
- కేంద్ర కేబినెట్ భేటీ కారణంగా 6 నుంచి 7కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 7న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న బీజేపీ బహిరంగ సభకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా హాజరయ్యే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా...ఈ ఏడాదిలో పాలనా వైఫల్యాలను ఎండగడుతూ ఈ నెల 1 నుంచి మొదలుపెట్టి 5వ తేదీదాకా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలను బీజేపీ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాలకు ముగింపుగా 6న హైదరాబాద్‌లో బహిరంగ సభ జరపాలని తొలుత నిర్ణయించారు. అయితే 6న కేంద్ర కేబినెట్ భేటీ ఉండడంతో నడ్డాతో పాటు రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కూడా ఈ సభకు హాజరయ్యే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఈ సభను 7వ తేదీకి వాయిదా వేశారు. ఇలావుండగా ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఏడాది పాలనలో కాంగ్రెస్ సర్కార్ అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజలకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డా.ఎస్.ప్రకాశ్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను ఎవరూ ఆపలేరు

మూడు నాలుగు పార్టీలు మారినవారు ఎస్సీ వర్గీకరణపై కుట్ర చేస్తున్నారు: మంద కృష్ణ మాదిగ



సాక్షి, హైదరాబాద్: ఎవరు అడ్డు వచ్చినా, వారి తాత ముత్తాతలు దిగొచ్చినా ఎస్సీ వర్గీకరణను ఆపలేరని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి అంతా ఎస్సీ వర్గీకరణకు అనుకూలమేనని మంద కృష్ణ చెప్పారు. కానీ మూడు, నాలుగు పార్టీలు మారినవారు ఎస్సీ వర్గీకరణను అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. తాను 30ఏళ్లుగా ఒకే నినాదంతో, ఒకే కండువా కప్పుకొని పోరాడుతున్నానని.. అయినా కొందరు లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌లో ఉండి పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న వారిపై అగ్ర నాయకత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాలలు మనువాదులైతే.. మాదిగలు నిజమైన అంబేడ్కర్ వాదులు అయ్యారని పేర్కొన్నారు. వర్గీకరణను అడ్డుకునే వారిని ఎప్పుడూ శత్రువులుగానే చూస్తామని వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా...

మే 18న జేఈఈ అడ్వాన్స్‌డ్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ఇంజనీరింగ్ సీట్ల భర్తీ కోసం మే 18న జేఈఈ అడ్వాన్స్‌డ్ నిర్వహిస్తున్నారు. ఐఐటీ కాన్పూర్ ఈసారి ఈ పరీక్షను నిర్వహిస్తోంది. మూడు గంటల వ్యవధితో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1 ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ, పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ ఉంటుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జేఈఈ మెయిన్స్‌ను ఇప్పటికే ప్రకటించింది. జనవరి 22 నుంచి 31 వరకూ ఒక సెషన్, ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకూ రెండో సెషన్ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారిలో మెరిట్ ప్రకారం 2.5 లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారు. దేశవ్యాప్తంగా 23 ఐఐటీలుండగా, వీటిల్లో 17,740 సీట్లున్నాయి.

అంబేడ్కర్ వర్సిటీ బీఎడ్ నోటిఫికేషన్ విడుదల

ఈనెల 21 దరఖాస్తుకు చివరి తేదీ.. 31న ఎంట్రన్స్

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఎడ్ (జనరల్), బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) అర్హత పరీక్ష 2024-25కు నోటిఫికేషన్ విడుదలైంది. ఆన్‌లైన్‌లో ఈనెల 21 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి భోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు విశ్వవిద్యాలయ పోర్టల్ www.braouonline.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంట్రన్స్ ఫీజు రూ.1,000, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు రూ.750 మాత్రమేనన్నారు. ఆన్‌లైన్‌లో డెబిట్ లేదా క్రెడిట్ కార్డు ద్వారా లేదా టీఎస్ ఆన్‌లైన్ ఫ్రాంఛైజీ కేంద్రాల్లో చెల్లించాలని తెలిపారు. డిసెంబర్ 31న తెలంగాణలోని పరీక్షా కేంద్రాల్లో బీఎడ్ (జనరల్) ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, అదే రోజు బీఎడ్ (స్పెషల్ ఎడ్యుకేషన్) మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తారని శ్రీనివాస్ వెల్లడించారు. విద్యార్థులు పరీక్షా తేదీకి రెండు రోజుల ముందు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 040-23680333/444/555లో లేదా విశ్వవిద్యాలయ వెబ్ పోర్టల్‌ని సందర్శించవచ్చని తెలిపారు.

'హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్' ఆఫీసర్ కమాండింగ్‌గా వికాశీల్‌సింగ్



సాక్షి, హైదరాబాద్: హకీంపేట్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్‌గా ఎయిర్ కమడోర్ వికాశీల్‌సింగ్ సైనీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో ఎయిర్ కమడోర్ పంకజ్ జైన్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఎయిర్ కమడోర్ వికాశీల్ సింగ్ సైనీ జూన్ 20, 1998న భారత వాయుసేనలో ఫైటర్ స్ట్రీమ్‌లో చేరారు. పలు ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్‌లను 2,100 గంటలకు పైగా నడిపిన అనుభవం ఆయనకు ఉంది. వాయుసేనలోనూ పలు విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

వ్యవసాయ వర్సిటీలో ఎస్‌బీఐ ఏఐ ల్యాబ్

ఎస్‌బీఐ చైర్మన్‌ను కలిసిన వర్సిటీ వీసీ జానయ్య



సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఎస్‌బీఐ నేతృత్వంలో అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ల్యాబ్ ఏర్పాటు కానుంది. సీఎస్ఆర్ నిధులతో ల్యాబ్ ఏర్పాటుకు ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి సానుకూలత వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థి అయిన శ్రీనివాసులు శెట్టిని సోమవారం ముంబైలోని ఎస్‌బీఐ కేంద్ర కార్యాలయంలో యూనివర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య కలిశారు. డిసెంబర్ 20, 21 తేదీల్లో జరిగే వర్సిటీ వజ్రోత్సవంలో పాల్గొనాల్సిందిగా శెట్టిని ఆహ్వానించారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకటి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రారంభమైన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యా య సంఘం రాష్ట్ర మహాసభలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కొంగల వెంకటి, ప్రధాన కార్యదర్శిగా చవాన్ సుభాన్‌సింగ్, అసోసియేట్ అధ్యక్షులుగా హన్మంతు, చంద్రశేఖర్, కాన్షీరాం, పరంధాములు, బసప్ప, బదావత్ చంద్రశేఖర్, యాదయ్య, లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా కాకయ్య, కిష్టప్ప, మల్లేశం, నరేశ్, హీరాలాల్, రాజన్న, విజయలక్ష్మి, పాండురంగం, విజయ్ కుమార్, బాలయ్య, కార్యదర్శులుగా నారా యణ, ముఖేశ్, అమృత, రాజన్న, గణేశ్, సాయన్న, కృష్ణయ్య, సురేందర్, మహిళా కార్యదర్శులుగా ఉమారాణి, మీనాకుమారి, సంయుక్త కార్యదర్శులుగా సాయప్ప, గట్టయ్య, లింగన్న ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎడతెగని ఎదురుచూపు



- ఎటూ తేలని జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి దరఖాస్తులు
- కోర్సులు ముగుస్తున్నా విడుదల కాని అర్హుల జాబితా
- ఏడాదిన్నరగా పెండింగ్‌లోనే.. 6 వేల మంది ఎదురుచూపు
- కోటా పెంపు పేరిట అధికారుల కాలయాపన
- అప్పులు చేసి విదేశాలకు విద్యార్థులు.. ఆందోళనలో తల్లిదండ్రులు
- ఆరు నెలలుగా సీఎం కార్యాలయం వద్దే ఫైల్

రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన సంగీత గతేడాది బీటెక్ పూర్తి చేసింది. ఉన్నత విద్య కోసం అమెరికాలోని ప్రఖ్యాత వర్సిటీలో దరఖాస్తు చేయగా.. 2023 ఆగస్టులో ఆమెకు అడ్మిషన్ లభించింది. దీంతో ఆమె రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకుంది. దరఖాస్తు పరిశీలన పూర్తి చేసుకుని పీజీ కోర్సులో చేరిపోయింది. స్కాలర్‌షిప్ వస్తుందన్న ఆశతో అప్పు చేసి అమెరికా వెళ్లింది. ప్రస్తుతం ఎమ్మెస్ మొదటి సంవత్సరం పూర్తయ్యింది. వచ్చే ఏడాది మార్చిలో రెండో సంవత్సరం కూడా పూర్తవుతుంది. కానీ విద్యానిధి పథకానికి ఆమె అర్హత సాధించిందా? లేదా? అనే అంశంపై ఇప్పటికీ స్పష్టత లేదు. సంగీత తండ్రి మాసాబ్‌ట్యాంక్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించగా.. అర్హుల జాబితా ఇంకా సిద్ధంకాలేదని అధికారులు చెబుతున్నారు. దాదాపు ఆరు నెలలుగా ఆయనకు అధికారుల నుంచి ఇదే సమాధానం వస్తోంది. ఇది ఒకరిద్దరి ఆవేదన కాదు.. దాదాపు ఆరువేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఎదురు చూపులివి.

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద అర్హుల ఎంపిక ఏడాదిన్నరగా నిలిచిపోయింది. 2023- 24 విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం కింద దరఖాస్తుల స్వీకరణే తప్ప అర్హులను తేల్చటం లేదు. దీంతో ఈ స్కాలర్‌షిప్ వస్తుందన్న ఆశతో అప్పులు చేసి విదేశాలకు వెళ్లిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకొన్న చాలామంది విద్యార్థులు ఇప్పటికే సగం కోర్సు కూడా పూర్తిచేశారు. కానీ తమ దరఖాస్తుల పరిస్థితి ఏమిటనేది ఇప్పటికీ తేలలేదు. దాదాపు రెండు సీజన్లలో వచ్చిన దరఖాస్తుల విషయం ఎటూ తేల్చకుండానే.. ఇప్పుడు మరోమారు దరఖాస్తుల స్వీకరణ సైతం చేపట్టారు. బీసీ సంక్షేమ శాఖ నాన్చుడు ధోరణి వల్ల దాదాపు ఆరువేల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిభావంతులైన బీసీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య చదివేందుకు ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలు కూడా ఆయా సామాజిక వర్గాల విద్యార్థులకు విదేశీ విద్యానిధి పథకాన్ని అందిస్తున్నాయి. ఆ శాఖలు దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి స్కాలర్‌షిప్‌లు అందిస్తుండగా, బీసీ సంక్షేమ శాఖలో మాత్రం ఏడాదిన్నరగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నది.

డిమాండ్ ఎక్కువ.. కోటా తక్కువ

పూలే విదేశీ విద్యానిధి పథకానికి విపరీతమైన డిమాండ్ ఉంది. ఇతర శాఖలతో పోలిస్తే బీసీ సంక్షేమ శాఖలో వేలల్లో దరఖాస్తులు వస్తున్నాయి. ఈ పథకం కింద ఏటా రెండు దఫాలుగా విద్యార్థుల ఎంపిక జరుగుతుంది. విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్ల ప్రక్రియ స్ప్రింగ్ సీజన్, ఫాల్ సీజన్ అని ఏటా రెండుసార్లు ఉంటుంది. సెప్టెంబర్ వరకు మొదటి దఫా, జనవరిలో రెండో దఫా దరఖాస్తులను సంక్షేమ శాఖలు స్వీకరిస్తాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించిన తర్వాత... విద్యార్థుల డిగ్రీ మార్కులతోపాటు జీఆర్ఈ/జీమ్యాట్‌లో మార్కులు, ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ మార్కుల ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తారు. ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టేందుకు శాఖలవారీగా ప్రత్యేక కమిటీలుంటాయి. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల్లో పోటీ తక్కువగా ఉండడంతో అర్హుల ఎంపిక ఆలస్యం లేకుండా సాగిపోతున్నది. బీసీ సంక్షేమ శాఖలోవిపరీతమైన పోటీ ఉండడంతో ఉప కులాలవారీగా కోటాను విభజిస్తూ అర్హులను ఎంపిక చేస్తున్నారు. బీసీ-ఏ, బీసీ-బీ, బీసీ-సీ, బీసీ-డీ, బీసీ-ఈ కేటగిరీలవారీగా అర్హులను ఎంపిక చేస్తారు. ఏటా (రెండు సీజన్లు కలిపి) 300 మందికి స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. ఒక్కో సీజన్‌కు సగటున 3 వేల దరఖాస్తులు వస్తున్నాయి. ఈ లెక్కన గత రెండు సీజన్లలో 6 వేలకు పైబడి దరఖాస్తులు వచ్చాయి. కానీ ఇప్పటివరకు అర్హులను ఎంపిక చేయలేదు.

కోటా పెంపు కోసమేనట!

➤ పూలే ఓవర్సీస్ విద్యానిధి పథకానికి డిమాండ్ అధికంగా ఉండటంతో ప్రస్తుతం 300 యూనిట్లుగా ఉన్న కోటాను కనీసం వెయ్యికి పెంచాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై పలు సమీక్షలు నిర్వహించిన తర్వాత బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి కోటా పెంపు ప్రతిపాదనలు పంపింది. ఏటా కనీసం 800 మంది విద్యార్థులకైనా ఈ పథకం కింద స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని సీఎం కార్యాలయానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ ఫైలు సీఎం వద్దకు చేరి దాదాపు ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటికీ మోక్షం కలగలేదు. కోటా పెంపు తర్వాతే అర్హుల ఎంపిక చేపట్టాలని బీసీ సంక్షేమ శాఖ నిర్ణయించడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి ప్రస్తుత పరిస్థితి	
	2023-24 విద్యా సంవత్సరంలో వచ్చిన దరఖాస్తులు 6 వేలకుపైగా
	ఈ పథకం కింద ఒక్కో విద్యార్థికి ఇచ్చే స్కాలర్‌షిప్ రూ.20 లక్షలు
	సంవత్సరానికి ఇచ్చే మొత్తం స్కాలర్‌షిప్‌లు 300

టీజీపీఎస్సీని భ్రష్టుపట్టించారు



నియామకపత్రం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొన్నం, రాజనర్సింహ, భట్టి విక్రమార్క



ట్రాన్స్ క్లినిక్‌లను ప్రారంభిస్తున్న సీఎం

▶ మొదటి పేజీ తరువాయి

అసిస్టెంట్ సివిల్ సర్జన్లకు, 24 మంది ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేశారు. 16 నర్సింగ్ కళాశాలలను, 32ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం జరిగినసభలో మాట్లాడారు.ఆయనేమన్నారంటే..

''గతంలో ఆర్‌ఎంపీ డాక్టర్‌ను, డిప్యూటీ తహసీల్దార్‌ను పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులుగా నియమించారు. ఒక కలెక్టర్‌ను సెక్షన్ ఆఫీసర్, అటెండర్ నిర్ణయించలేరు కదా. అందుకే ఉన్నత చదువులు చదివిన వారిని, ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న వారిని టీజీపీఎస్సీలో నియమించాం. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలతో 563 మంది గ్రూప్-1 అధికారులు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కాబోతున్నారు. టీజీపీఎస్సీ పనితీరుకు ఇది గీటురాయి. మహేందర్‌రెడ్డి పదవీ విరమణ చేస్తుంటే మూడున్నరేళ్ల సర్వీస్ ఉన్నప్పటికీ సర్వేల్‌లో చదివిన సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశంను కమిషన్ చైర్మన్‌గా నియమించాం.

రికార్డు స్థాయిలో నియామకాలు చేశాం

ఏడాదిలోనే 14 వేల మందిని వైద్యారోగ్య శాఖలో నియమించడం దేశంలోనే రికార్డు. బీఆర్ఎస్ ప్రభుత్వం 8 మెడికల్ కాలేజీలు ఇచ్చి ఎలాంటి వసతులూ కల్పించలేదు. కానీ మేం దేశంలోనే అత్యధిక డాక్టర్లను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. కొత్తగా 6,500 మందిని వైద్యారోగ్యశాఖలో నియమించాలని నిర్ణయించాం. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారత చరిత్రలో ఏ రాష్ట్రం కూడా ఒకే ఏడాది 50 వేల ఉద్యోగాలు ఇవ్వలేదు. ఈ విషయంలో తెలంగాణ చరిత్ర సృష్టించింది. కేసీఆర్ ఇంట్లో వాళ్లను ఉద్యోగాల నుంచి తొలగిస్తేనే తెలంగాణ యువతకు ఉద్యోగాలు వచ్చాయి. గత ప్రభుత్వంలో నోటిఫికేషన్లు ఇస్తే ప్రశ్నపత్రాలను జిరాక్స్ సెంటర్లలో అమ్ముకునేవాళ్లు. డీఎస్సీ వాయిదా వేయాలని రాజకీయ ప్రేరేపిత ఆందోళన చేశారు. ఎవరు అడ్డుపడినా డీఎస్సీ పరీక్షలు నిర్వహించి 55 రోజుల్లో నియామక పత్రాలు అందించాం. యువతపట్ల మా చిత్తశుద్ధికి ఇది నిదర్శనం.

ఆరోగ్యశ్రీని నిర్లక్ష్యం చేశారు

2005లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చి పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందించి ఆదుకున్నారు. అలాంటి ఆరోగ్యశ్రీని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. మా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచింది. గతేడాది కాలంలో సీఎం సహాయనిధి కింద రూ. 835 కోట్లను ప్రజలకు ఇచ్చి ఆదుకున్నాం. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఇప్పటివరకు కోటీ 15 లక్షల సార్లు ఉచితంగా ప్రయాణం చేశారు. మేం 50లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఏడాదిలోనే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. సంక్రాంతి తర్వాత రైతు భరోసా కచ్చితంగా ఇచ్చి తీరుతాం. మేం రుణమాఫీ పూర్తి చేయడంతో కొందరి గుండెల్లో పిడుగులు పడుతున్నాయి. కొందరు ఫాంహౌస్‌లలో పడుకుని బాధపడుతున్నారు. మేం సన్నవడ్లకు ఇస్తున్న బోనస్‌తో కౌలు రైతులు కూడా సంతోషంగా ఉన్నారు. వచ్చే పదేళ్లు మా ప్రభుత్వమే ఉంటుంది. బోనస్ కొనసాగిస్తుంది. సన్నాలు పండించండి. బోనస్ తీసుకోండి.

ప్రభుత్వాన్ని మీరే కాపాడుకోండి

సంక్రాంతి పండుగకు వచ్చే గంగిరెద్దులు, బసవన్నల్లా కొందరు ఇప్పుడే వస్తున్నారు. వాళ్లు ఎన్ని సన్నాయిలు ఊదినా.. అది సర్పంచి ఎన్నికల కోసమే. ఢిల్లీలో 11 ఏళ్ల అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మాపై విమర్శలు చేస్తున్నాయి. ఈ 10 నెలల్లో అద్భుతాలు జరుగుతాయా? ప్రభుత్వాన్ని బదనాం చేసేవారికి కర్రు కాల్చి వాత పెట్టాలి. మీరు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత మీదే. ప్రభుత్వంపై జరుగుతున్న విషప్రచారాన్ని తిప్పికొట్టాలి'' అని ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రజారోగ్యంపై మా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది: భట్టి

రాష్ట్రంలో పేదల ఆరోగ్యం కోసం చిత్తశుద్ధితో కృషి చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క అన్నారు. ఆరోగ్య ఉత్సవంలో ఆయన మాట్లాడారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసిందని.. ఆరోగ్యశ్రీని, ప్రభుత్వ ఆస్పత్రులను పట్టించుకోలేదని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో పేదల వైద్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారు. ఇక మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత వైద్య పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని.. అదనంగా రూ.487.29 కోట్లు నిధులు కేటాయించామని చెప్పారు. ట్రాన్స్‌జెండర్ల కోసం దేశంలోనే తొలిసారిగా మైత్రి క్లినిక్‌లను ఏర్పాటు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, షబ్బీర్ అలీ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ @ 12,403

ఈ ఏడాదిలో ప్రకటించిన పోస్టులు 13,121..భర్తీ చేసినవి 94.52 శాతం

వార్షిక పురోగతి నివేదికను విడుదల చేసిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ ఏడాదికాలంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో 12,403 ఉద్యోగాలను భర్తీ చేసింది. వివిధ నోటిఫికేషన్ల ద్వారా 13,121 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీచేసిన కమిషన్..అర్హత పరీక్షలు నిర్వహించి.. తుది జాబితాల ప్రకటన పూర్తి చేసింది. నోటిఫికేషన్లలో ప్రకటించిన ఉద్యోగాల్లో 94.52 % పోస్టులు భర్తీ చేసింది. అభ్యర్థులు లేని కారణంగా 718 ఉద్యోగాలు భర్తీ కాలేదు. దీంతో ఆ పోస్టులన్నీ క్యారీఫార్వర్డ్ కానున్నాయి. తాజాగా తుది ఫలితాలు ప్రకటించిన కేటగిరీలో అత్యధికంగా గ్రూప్-4 ఉద్యోగాలున్నాయి. మొత్తం 8,180 ఉద్యోగాలకుగాను 8,143 మంది అర్హులను ఎంపిక చేసిన కమిషన్... తుది జాబితాను సంబంధిత ప్రభుత్వ శాఖలకు పంపింది. అతిత్వరలో గ్రూప్-4 అర్హులకు నియామకపత్రాలు అందనున్నాయి. ఆ తర్వాతి స్థానంలో ఇంజనీరింగ్, లెక్చరర్ ఉద్యోగాలున్నాయి. ఈ మేరకు వార్షిక పురోగతిపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నివేదిక విడుదల చేసింది..

ఆ వివరాలు సాక్షి ప్లస్(ఈ-పేపర్)లో..

గురుకులాల్లో ఘటనలపై ఎన్‌సీఎస్సీ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గురుకుల విద్యా సంస్థల్లో జరుగుతున్న వరుస ఘటనలపై జాతీయ ఎస్సీ కమిషన్ (ఎన్‌సీఎస్సీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గత కొంత కాలంగా సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలు, కొన్నిచోట్ల విద్యార్థుల ఆత్మహత్యలు, పాముకాటుకు గురి కావడం, ఇతర అనారోగ్య సమస్యల నేపథ్యంలో విద్యార్థులు మృత్యువాత పడుతున్నారు. ఈ అంశంపై కొందరు విద్యార్థులు జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించారు. ప్రాథమిక వివరాలతో కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో స్పందించిన కమిషన్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థలకు లేఖ రాసింది. ఇప్పటివరకు గురుకుల విద్యా సంస్థల్లో జరిగిన ఘటనలు, బాధి తులు, నిందితులు.. తదితర పూర్తి వివరాలను 15 రోజుల్లోగా పంపాలని కమిషన్ ఆదేశించింది. అదేవిధంగా ఈ ఘటనలపై గురుకుల సొసైటీలు తీసుకున్న చర్యలు (యాక్షన్ టేకెన్ రిపోర్టు) కూడా సమర్పించాలని సూచించింది. ఈ మేరకు ప్రత్యేకంగా ఎనిమిది కాలమ్స్‌తో కూడిన నమూనాను గురుకుల సొసైటీలకు పంపింది. గురుకులాలు సమర్పించే వివరాలకు అనుగుణంగా జాతీయ ఎస్సీ కమిషన్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు స్పష్టం చేసింది. నిర్దేశించిన గడువులోగా వివరాలను సమర్పించకుంటే.. కమిషన్ ముందు వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుందని ఎస్సీ కమిషన్ గురుకుల విద్యా సంస్థలను హెచ్చరించింది.

పెట్టుబడులకు స్వర్గధామం తెలంగాణ



కోకాకోలా కంపెనీలో ఉత్పత్తులను పరిశీలిస్తున్న రేవంత్ రెడ్డి, శ్రీధర్‌బాబు

- సిద్దిపేట జిల్లాలో కోకాకోలా ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్
- వ్యాపార వృద్ధికి అనుకూల చర్యలు చేపడుతున్నామని వెల్లడి
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, కొండా సురేఖ

సాక్షి, సిద్దిపేట: తెలంగాణ రాష్ట్రం ప్రపంచ పారిశ్రామిక పెట్టుబడులకు స్వర్గధామంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. వ్యాపార వృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండ తిమ్మాపూర్‌లో హిందూస్థాన్ కోకాకోలా బెవరేజెస్ (హెచ్‌సీసీబీ) అత్యాధునిక గ్రీన్ ఫీల్డ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ సోమవారం ప్రారంభించారు. పరిశ్రమలో కలియతిరిగి పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. పరిశ్రమ ద్వారా వచ్చే ఉద్యోగాలతోపాటు పరోక్ష ఉపాధితో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

పారిశ్రామిక వృద్ధి దిశగా చర్యలు

హెచ్‌సీసీబీ పెట్టుబడులు ఈ ప్రాంతంలో పారిశ్రామిక వృద్ధి, పర్యావరణ పరిరక్షణ కలిసి సాగుతాయనే దానికి ఉదాహరణ అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధి కల్పన ద్వారా రాష్ట్రంలో అన్ని వర్గాల సమ్మిళిత వృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. పర్యావరణ అనుకూల పారిశ్రామిక వృద్ధికి ఈ గ్రీన్ ఫీల్డ్ ఫ్యాక్టరీ ఉదాహరణ అని చెప్పారు. కగా.. హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ సీఈవో జువాన్ పాబ్లో రోడ్రిగ్జ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని నీటి పైప్‌లైన్‌ను త్వరగా పూర్తి చేసిందని, తెలంగాణ పట్ల తమ నిబద్ధతను చాటుకుంటామని చెప్పారు. హెచ్‌సీసీబీ తెలంగాణలో రూ.3,798 కోట్ల పెట్టుబడితో వెయ్యి మందికిపైగా ఉపాధి అవకాశాలను కల్పించిందని పేర్కొన్నారు.

విద్యార్థులందరికీ ఒకే తరహాలో నాణ్యమైన భోజనం

రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



జిల్లచెరువు పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న విద్యా కమిషన్ చైర్మన్ మురళి

కూసుమంచి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు ఒకే రకమైన నాణ్యమైన భోజనం అందించాల్సిన అవసరముందని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అభిప్రాయపడ్డారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, ఖమ్మం అర్బన్ మండలాల్లో సోమవారం పర్యటించిన ఆయన పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, కోడిగుడ్లు, ఇతరుల సరుకులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యత, ఏజెన్సీ బాధ్యుల సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి బోధన, భోజనం అమలుపై ఉపాధ్యాయుల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం మురళి మాట్లాడుతూ ఇటీవల పలు ప్రభుత్వ వసతిగృహాలు, పాఠశాలల్లో ఘటనలు జరిగిన నేపథ్యంలో వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు 33 జిల్లాల్లో పర్యటిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి కేంద్రం 60 శాతం నిధులను ఇస్తుండటంతో రాష్ట్రం మెనూ చార్జీలను సవరించే అవకాశం లేకుండా పోతోందని, నిధులు అరకొరగా రావడంతో భోజనం నాణ్యతగా ఉండటం లేదని మురళి చెప్పారు. పాఠశాలల విద్యపై ఇటీవల మలేసియా వెళ్లి అధ్యయనం చేసిన నేపథ్యంలో ఈనెల 12లోగా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుతున్న వర్సిటీ

- తెలుగు వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు
- శాంతా బయోటెక్ వరప్రసాద్‌రెడ్డికి విశిష్ట పురస్కారం అందజేత
- వర్సిటీకి రూ. కోటి చెక్కును విరాళంగా అందజేసిన వరప్రసాద్‌రెడ్డి



పురస్కారాన్ని వరప్రసాద్‌రెడ్డికి అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

నిజాంపేట్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తోందని.. తెలుగు భాష, సాహిత్యం, లలితకళల ఔన్నత్యాన్ని చాటుతోందంటూ మంత్రి శ్రీధర్‌బాబు అభినందించారు. సోమవారం మేడ్చల్ జిల్లా బాచుపల్లిలోని విశ్వవిద్యాలయ 39వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంటున్న వేళ ప్రజావిజయోత్సవాల్లో భాగంగా ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు యూనివర్సిటీ విద్యార్థులు తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరిన విషయాన్ని మంత్రి ప్రస్తావిస్తూ.. ఇక్కడి విద్యార్థులకు ఎలాంటి అవకాశాలు అవసరమో, వర్సిటీ పెద్దలు ఆలోచించి ప్రభుత్వానికి సూచిస్తే తప్పకుండా వాటిని అమల్లోకి తీసుకొస్తామన్నారు. వర్సిటీకి అవసరమైన నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. 2023 సంవత్సరానికిగాను యూనివర్సిటీ ఇచ్చే విశిష్ట పురస్కారాన్ని శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ కె.ఐ. వరప్రసాద్‌రెడ్డికి మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా అందజేశారు. వరప్రసాద్‌రెడ్డి వైద్యరంగంలో అసమాన కీర్తి పొందిన శక్తిగా నిలిచారని, పురస్కారానికే ప్రత్యేక గౌరవం తెచ్చారని ప్రశంసించారు. విశిష్ట పురస్కార నగదుతోపాటు మరో రూ. కోటి చెక్కును వర్సిటీకి విరాళంగా వరప్రసాద్‌రెడ్డి మంత్రి చేతులమీదుగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్కృతే తెలుగు వారికి బలం, అస్తిత్వమని, వాటిని కాపాడుకోవడానికి, అవి పరిఢవిల్లడానికి తెలుగు విశ్వవిద్యాలయం అవసరమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు, ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, మేడ్చల్ కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్ రాధిక, మేయర్ కొలను నీలాగోపాల్‌రెడ్డి, కమిషనర్ సాబేర్ అలీ పాల్గొన్నారు.

వారిని విశ్వబ్రాహ్మణులుగా పరిగణించాలి

సమగ్ర కుటుంబ సర్వేపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులగణన (సమగ్ర కుటుంబ) సర్వేలో కంసాలి, వడ్ల, కంచరి, కమ్మరి, శిల్పిలను విశ్వబ్రాహ్మణ కులంగా పరిగణించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు చర్యలు చేపడతామని ప్రభుత్వ న్యాయవాది ద్వారా అధికారులిచ్చిన హామీని నమోదు చేస్తూ, పిటిషన్ విచారణ ముగించింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులగణన సర్వేలో విశ్వబ్రాహ్మణులను ఒకటిగా కాకుండా ఉపకులాల పేరుతో వేర్వేరు కోడ్‌లు ఇవ్వడం చట్టవిరుద్ధమని, ఒకే కులంగా పరిగణించాలని హైకో ర్టులో విశ్వబ్రాహ్మణ న్యాయవాదుల సంక్షేమ సంఘం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది శ్రీనివాసులు వాదనలు వినిపిస్తూ.. వేర్వేరు కులాలుగా పేర్కొంటే విశ్వబ్రాహ్మణుల సంఖ్య తగ్గి భవిష్యత్‌లో ప్రభుత్వ పథ కా ల్లో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఒకే కులంగా పేర్కొనాలంటూ జిల్లా కలెక్టర్లకు, బీసీ కమిషన్‌కు, బీసీ సంక్షేమ శాఖమంత్రికి సంఘం తరఫున వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అయినా సర్వే ఫారాలలో సరిచే యక పోవడంతో తప్పక కోర్టును ఆశ్రయించినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. అధికారుల నుంచి సూచనలు పొందిన జీపీ.. వివిధ ఉపకులాల నుంచి సేక రించిన వివరాలను విశ్వబ్రాహ్మణ కులంగా పేర్కొనేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పు లు చేయాలని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)కి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. హైకోర్టు ఉత్తర్వులపై విశ్వబ్రాహ్మణ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

రాష్ట్రంలో పోలీసు పాలన నడుస్తోంది: జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పోలీసు పాలన నడుస్తోందని, ఏడాదిలోనే రేవంత్ సత్తా ఏమిటో ప్రజలకు తెలిసిపోయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి విమర్శించారు. గురుకుల విద్యాసంస్థల్లో పరిస్థితుల అధ్యయనానికి వెళ్తున్న బీఆర్ఎస్ కమిటీని ప్రభుత్వం అడ్డుకుంటోందని, గురుకులాల్లో వసతులు ఉన్నప్పుడు కమిటీని ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి సోమవారం జగదీశ్‌రెడ్డి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.



అన్యాయం అనేది
ఎప్పటికీ పాలిస్తూనే ఉండదు.
– సెనెకా

సాక్షి
మంగళవారం, 3 డిసెంబర్ 2024

సుంకాల బెదిరింపు

పదవీ బాధ్యతలు పూర్తిగా చేపట్టక ముందే అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దూకుడు పెంచారు. 'అమెరికాకే ప్రథమ ప్రాధాన్యం' (అమెరికా ఫస్ట్) మంత్రాన్ని పదే పదే వల్లె వేస్తున్న ఆయన పదవీ బాధ్యతలు చేపడుతూనే చైనా పైనే కాక ఇతర దేశాలపైనా సుంకాలు విధిస్తానని ఇప్పటికే ప్రకటించారు. పొరుగుదేశాలైన కెనడా, మెక్సికోలూ ఆంక్షల పాలయ్యే జాబితాలో ఉన్నాయి. అమెరికా వాణిజ్య, విదేశాంగ విధానంలో రానున్న పెనుమార్పుకు ఇది ఓ సూచన అనీ, రానున్న ట్రంప్ పదవీకాలంలో ఈ జాబితా మరింత పెరగడం ఖాయమనీ విశ్లేషణ. దానిపై చర్చోపచర్చలతో వారమైనా గడవక ముందే కాబోయే అగ్రరాజ్యాధినేత మరో బాంబు పేల్చారు. 'బ్రిక్స్' దేశాలు గనక అమెరికా డాలర్‌కు ప్రత్యర్థిగా మరో కరెన్సీని సృష్టించే ప్రయత్నం చేస్తే ఆ దేశాలపై 100 శాతం సుంకాలు వేస్తామంటూ హెచ్చరించారు. ఆయన తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'పై చేసిన ఈ తాజా ప్రకటన ప్రకంపనలు సృష్టిస్తోంది. అమెరికాకూ, వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకూ మధ్య నెలకొన్న ఘర్షణాత్మక వాతావరణానికి ఇది ప్రతీక. అంతేకాదు... ఈ హెచ్చరికే గనక అమలు అయితే, ప్రపంచ వాణిజ్యం రూపురేఖలనే మార్చివేసే అనూహ్య పరిణామం అవుతుంది.

బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, సౌతాఫ్రికాలతో కూడిన కూటమిగా ముందు బ్రిక్స్ ఏర్పాటైంది. ఆపైన ఈజిప్ట్, యూఏఈ, ఇథియోపియా, ఇరాన్‌లు సైతం ఆ బృందంలో చేరాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికా డాలర్ సాగిస్తున్న గుత్తాధిపత్యానికి ముకుతాడు వేయాలనేది కొంతకాలంగా బ్రిక్స్ దేశాల్లో కొన్నిటి అభిప్రాయం. డాలర్‌ను రాజకీయ అస్త్రంగా వాడకుండా నిరోధించగల ప్రత్యామ్నాయ అంతర్జాతీయ చెల్లింపుల విధానం అవసరమని రష్యా అధ్యక్షుడు పుతిన్ అక్టోబర్‌లో ప్రస్తావించడం గమనార్హం. బ్రిక్స్ దేశాలు డాలర్ స్థానంలో మరో కరెన్సీకి గనక మద్దతునిస్తే మొత్తం కథ మారిపోతుంది. అయితే, డాలర్ నుంచి పక్కకు జరగడం వల్ల అమెరికాతో, ఇతర పాశ్చాత్య దేశాలతో సంబంధాలు దెబ్బతిని దారుణ పర్యవసానాలుంటాయని మరికొన్ని బ్రిక్స్ దేశాల భయం. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తాజా హెచ్చరిక వెలువడింది. ప్రతీకారంగా అమెరికా 100 శాతం సుంకం వేస్తే, సరుకుల ధరలు పెరిగిపోతాయి. ప్రపంచ వాణిజ్య ప్రవాహాలు అతలాకుతలమవుతాయి.

నిజానికి, విదేశీ దిగుమతులపై కఠినంగా సుంకాలు విధించి, అమెరికా ఉత్పత్తులకు కాపు కాస్తానని వాగ్దానం చేయడం కూడా తాజా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయానికి దోహదపడిందని విస్మరించలేం. 'అమెరికా ఫస్ట్' ఆర్థిక విధానానికి అనుగుణంగానే ట్రంప్ తాజా కఠిన వైఖరి ప్రదర్శిస్తున్నారు. తద్వారా ప్రపంచ వాణిజ్యంలో మార్పులతో అమెరికా ఆర్థిక సార్వభౌమాధికారం పునఃప్రతిష్ఠితమవుతుందనేది ఆయన వ్యూహం. ఇప్పుడీ సుంకాల పర్వం మొదలైతే, అది చివరకు ప్రపంచ వాణిజ్య యుద్ధంగా పరిణమిస్తుంది. ఈ సుంకాలన్నీ అమెరికా ప్రయోజనాల్ని కాపాడేందుకు సాహసోపేత నిర్ణయంగా కనిపించవచ్చు కానీ, వాటి తక్షణ ప్రభావం పడేది అమెరికా వినియోగదారులు, వ్యాపారాల మీదనే. ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్, వ్యావసాయిక ఉత్పత్తులు సహా రోజు వారీ అవసరాలైన అనేక సరుకుల ధరలు పెరుగుతాయి. ఇతర దేశాల విడిభాగాలపై ఆధారపడినందు వల్ల అమెరికా వ్యాపార సంస్థలు చేసుకొనే దిగుమతులపై భారం పడుతుంది. ఆ సంస్థల లాభాలు తగ్గుతాయి. అమెరికా ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్‌లో పోటీపడలేకపోతాయి.

అమెరికాను అప్పుల నుంచి బయటపడేసేందుకు ట్రంప్ మాత్రం మిత్రదేశాలతోనూ కఠినంగా వ్యవహరించడానికి వెనుకాడకపోవచ్చు. వర్ధమాన ఆర్థిక వ్యవస్థలు తమ ఆదాయానికి అమెరికాపై అతిగా ఆధారపడుతుంటాయి. ఇక, ఎగుమతులపై ఎక్కువగా నడిచే బ్రెజిల్, సౌతాఫ్రికా ఆర్థిక వ్యవస్థలూ మందగిస్తాయి. కొత్త సుంకాల బాధిత దేశాలు గనక ప్రతిచర్యలకు ఉపక్రమిస్తే పరిస్థితి దిగజారుతుంది. గతంలో ఈ తరహా వాణిజ్య వివాదాలు తెలిసినవే. వాటిని నివారించడానికే అమెరికా సైతం అనేక అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలకు అంగీకరించింది. ఇప్పుడీ సుంకాలతో వాటికి అర్థం లేకుండా పోతుంది. దౌత్య పర్యవసానాలూ తప్పవు. అక్రమ వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణా లాంటివి అరికట్టడానికి పొరుగు దేశాలపై సుంకాలు పనికొస్తాయని ట్రంప్ టీమ్ చెబుతున్నా, ఆశించిన ఫలితాలు దేవుడెరుగు... ఉద్రిక్తతలు పెరిగి, దేశాలతో సంబంధాలు, దీర్ఘకాలిక సహకారం దెబ్బ తింటాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఈ వాణిజ్య యుద్ధంతో మరింత అనిశ్చితిలో పడుతుంది.

ఈ ప్రతిపాదిత సుంకాలను బూచిగా చూపి, బ్రిక్స్ సహా ఇతర దేశాలనూ చర్చలకు రప్పించడమే అమెరికా ధ్యేయమైతే ఫరవా లేదు. అలా కాని పక్షంలో అనేక దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయ అన్వేషణను ముమ్మరం చేయవచ్చు. ట్రంప్ కఠిన వైఖరితో వర్ధమాన దేశాలు, అలాగే బ్రిక్ సభ్యదేశాలు మరింత దగ్గరవుతాయి. అది చివరకు అగ్రరాజ్యానికే నష్టం. అయితే, ప్రపంచమంతా వ్యతిరేకించినా సరే తాను అనుకున్నదే చేయడం ట్రంప్ నైజం. పర్యావరణం, వాణిజ్యం, సైనిక దండయాత్రలపై గతంలో ఆయన చేసిందదే. తాత్కాలికంగా ఎన్నికల్లో ఒక వర్గం ఓట్ల కోసం పెద్ద పెద్ద మాటలు చెప్పడం బాగుంటుంది. వాటిని ఆచరణలో పెట్టాలన్నప్పుడు దీర్ఘకాలిక పర్యవసానాల్ని ఆలోచించకపోతే కష్టమే. అమెరికా కొత్త ప్రెసిడెంట్ అది గ్రహించి, ఆచితూచి వ్యవహరించాలి. కానీ, ఆకస్మిక, అనూహ్య నిర్ణయాలకే పేరుబడ్డ ట్రంప్ నుంచి అంతటి ఆలోచన ఆశించగలమా అన్నది ప్రశ్న. అనాలోచితంగా వ్యవహరిస్తే, అది అమెరికాకే కాదు... యావత్ ప్రపంచానికీ తంటా!

ఒక అపరిచితుడి దయ

విశ్లేషణ



కరణ్ థాపర్

ఒక మనిషి సాటి మనిషికి సాయానికి రాదని అనుకుంటాం. కానీ కొన్ని సందర్భాల్లో ముక్కూ ముఖం తెలియని మనుషులు చేయందిస్తారు. అడక్కుండానే మనల్ని సమస్య నుంచి గట్టెక్కిస్తారు. అది ఎంత చిన్నదైనా సరే, ఆ సమయానికి పెద్ద సాయమే అవుతుంది. అయితే, అలాంటి మనుషులను మనం ఎంత నమ్ముతాం? చాలాసార్లు మనుషుల రూపాలను చూసి వాళ్ల గుణాలను అంచనా వేస్తుంటాం. కానీ మనుషులను చూపులతో అంచనా వేయలేం. అలాంటి సందర్భాలు మనకు చాలాసార్లు ఎదురవుతూనే ఉంటాయి. ఎవరో అపరిచితులు అనూహ్యంగా ఇతరులకు సాయపడటం, ఆ తరువాత మన జీవితాల్లోంచి వారు మాయమైపోవడం... ఓహ్! మరచిపోలేం. చేదు అనుభవాలు ఎదురైనా అవి గుర్తుంచుకోవాల్సినవి కావు.

అధికారికంగా దాని పేరు 'లండన్ అండర్ గ్రౌండ్'. కానీ అందరూ పిలిచేది 'ట్యూబ్' అని! అది నిజంగానే గొట్టం ఆకారంలోనే ఉంటుంది మరి! కానీ, సొరంగం నుంచి రైలు ప్లాట్‌ఫామ్‌పైకి వస్తుండటాన్ని చూసినప్పుడు మాత్రం దాన్ని టూత్‌పేస్ట్‌తో పోల్చడం మేలని నాకు అనిపిస్తుంది. పదహారేళ్ల వయసులో మొట్టమొదటిసారి ట్యూబ్‌ను చూసినప్పుడు నాకు వచ్చిన ఆలోచన కూడా ఇదే. విక్టోరియా స్టేషన్‌లో ఉన్నాను అప్పుడు నేను. అప్పుడే ఎయిర్‌పోర్ట్ వాహనం నుంచి కిందకు దిగాను. రెండు చేతుల్లో భారీ ట్రంకు పెట్టెలు. మీరు నమ్మినా నమ్మకపోయినా... ఆరోజు ఎయిరిండియా విమానం రెండు గంటలు ముందుగానే ల్యాండ్ అయ్యింది. నేను ఉండటానికి వెళ్తున్న నా సోదరి కిరణ్ కూడా దానికి ఆశ్చర్యపోయింది.

తమ్ముడు సెలవుల కోసం అనుకోకుండా ప్రత్యక్షమవుతున్నాడన్న ఆనందం, షాక్ నుంచి కోలుకుంటూ "హీత్రూ నుంచి బస్సు పట్టుకో... బాండ్ స్ట్రీట్‌లో ట్యూబ్" అంటూ కిరణ్ తన ఇంటికి దారి చెప్పింది. "నేను ఆ పక్కన ఉంటా" అని ముగించింది.

బాండ్ స్ట్రీట్ స్టేషన్ కిరణ్ ఆఫీసుకు దగ్గరలోనే ఉంటుంది. నాకైతే అప్పటికి లండన్ కొత్త. ఒకపక్క ఉత్సాహంగా ఉంది. ఇంకోపక్క కొంచెం ఉద్వేగంగానూ అనిపిస్తోంది. బాండ్ స్ట్రీట్ అన్నది మోనోపలి గేమ్‌లో కనిపించే పేరు. అక్కడున్న జనాలను చూస్తే మాత్రం అమ్మో ఇంతమందా? అనిపించక తప్పదు. అందరూ ఎవరి హడావుడిలో వారున్నారు. చాలామంది వ్యాపారాలు చేసుకునేవాళ్లనుకుంటా. ఒకరిద్దరు మాత్రం అక్కడక్కడా తచ్చాడుతూ కనిపించారు. బెల్‌బాటమ్ ప్యాంట్లు, పొడుచుకువచ్చినట్లు ఉన్న జుత్తుతో ఉన్న వాళ్లకు బూడిద రంగు ఫ్లానెల్స్, సరిగ్గా అమరని స్కూల్ బ్లేజర్‌తో ఉన్న నేను పరాయివాడినన్న విషయం ఇట్టే తెలిసిపోయేలానే ఉంది.

వాతావరణం ఇలా ఉన్న సందర్భంలోనే... సొరంగం నుంచి ట్యూబ్ బయటకొస్తూ కనిపించింది. సొరంగంలో ఉండగానే వచ్చిన రణగొణ ధ్వని ట్యూబ్ వస్తున్న విషయాన్ని అందరికీ ఎలుగెత్తి చెప్పింది. శబ్దం వింటూనే చాలామంది ట్యూబ్ రాకను గుర్తించారు. సామన్లు సర్దుకుంటూ రైలెక్కేందుకు సిద్ధమవుతున్నారు. నాకైతే అంతా కొత్త. పరిసరాలతో పరిచయమూ తక్కువే. ఏం చేయాలో తెలియకుండా అలా... చూస్తూనే ఉండిపోయా కొంత సమయం!

ఎవరో గట్టిగా అరిచారు. "మిత్రమా... రా" అని! అప్పటికే రైలు తలుపులు తెరుచుకుని ఉన్నాయి. జనాలు లోపలికి చొరబడుతున్నారు. నేను మాత్రం నా రెండు ట్రంకు పెట్టెలతో ముందుకెళ్లేందుకు తంటాలు పడుతున్నాను. రెండింటినీ ఒక్కో చేత్తో పట్టుకున్నానా... హ్యాండ్‌బ్యాగ్ పట్టుకునేందుకు ఇంకో చేయి లేకుండా పోయింది. సర్దదామనుకుంటే పెట్టెలు ఎత్తలేనంత బరువైపోతున్నాయి. ఈ లోపు పక్క నుంచి ఏదో గొంతు వినిపించింది... "ఒంటిచేత్తోనే చేయగలవు." అంటూ. "రెండు, మూడు కావాలేమో" అని కూడా అనేసిందా గొంతు!



యాభై ఏళ్ల పైబడ్డ వ్యక్తి మాటలు కావచ్చు అవి. చిందరవందర బట్టలేసుకుని ఉన్నాడు. తలపై టోపీ ఒకటి. గడ్డం కూడా సరిగ్గా గీసుకోలేదు. బహుశా కంపు కూడా కొడుతున్నాడేమో. మామూలుగానైతే ఆ వ్యక్తితో మాట్లాడేవాడిని కాదేమో. భవిష్యత్తులోనైతే అలాంటి వాళ్లకు దూరంగా జరిగిపోయేవాడినేమో. దిమ్మరి అనుకుని వారిని దూరం నుంచే కొనచూపుతో చూస్తూ ఉండేవాడిని. ఎందుకంటే అలాంటివాళ్లపై నాకున్న అయిష్టం ఇట్టే తెలిసిపోతుంది మరి.

అయితే ఆ రోజు నేను ట్యూబ్ ఎక్కేనాటి పరిస్థితి వేరు. కుర్రాడిని. సాయం అవసరం ఉంది. పొగరు ఇంకా తలకెక్కి లేదు. మరీ ముఖ్యంగా... ఆ మనిషి నా ట్రంకు పెట్టెలతోపాటు హ్యాండ్ లగేజీ కూడా లాక్కున్నాడు. ట్యూబ్‌లోకి చేర్చాడు. ఆ వెంటనే రైలు తలుపులు మూసుకున్నాయి. ఆ వ్యక్తి నా వైపు చూసి చిరునవ్వు నవ్వాడు. నోట్లో కొన్ని పండ్లు ఊడిపోయి ఉంటే... ఉన్నవి కూడా గారమరకలతో కనిపించాయి. "హమ్మయ్యా... ఎక్కేశాం" అన్నాడా వ్యక్తి! సమాధానం ఏం చెప్పాలో తెలియలేదు నాకు. ఓ నీరసపు నవ్వు నవ్వి ఊరుకున్నాను.

"చిటికెలో రైలు తప్పిపోయేది తెలుసా?" అన్నాడు. నాకేమో కొత్తవాళ్లతో మాట్లాడటమంటే భయం. అతడేమో ఒకట్రెండు మాటలతో సరిపెట్టేలా లేడు. మొత్తమ్మీద ఇద్దరి మధ్య కాసేపు మౌనమే రాజ్యమేలింది. రెండు స్టేషన్లు దాటిన తరువాత ఆ వ్యక్తి నా వైపు చూసి, "ఎక్కడికి మిత్రమా?" అన్నాడు. తలూపుతూ నా సమాధానం విన్నాడు. కిటికీల్లోంచి బయటకు చూడటం మొదలుపెట్టాడు. సొరంగం నల్లటి గోడలు తప్ప ఇంకేమీ కనిపించడం లేదు బయట! ఆ వ్యక్తి ఆ నల్లగోడలనే కళ్లప్పగించి మరీ చూస్తూ ఉండిపోయాడు.

ఈ ప్రయాణం ఎప్పుడు ముగుస్తుందా? అని నేను ఆత్రంగా ఎదురు చూస్తున్నాను. లగేజీ ఎలా దింపుకోవాలన్న ఆలోచన మెదడును తొలిచేస్తోంది. ఇంతలో బాండ్‌స్ట్రీట్ రానేవచ్చింది. పెట్టెలు సర్దుకుందామని అనుకునే లోపే ఆ వ్యక్తి వాటిని తన చేతుల్లోకి తీసేసుకున్నాడు. "చిన్న లగేజీలు నువ్వు తీసుకో" అన్నాడు. "నీ సైజుకు తగ్గవి" అని చతుర్లాడాడు కూడా. ప్లాట్‌ఫామ్ చివరి వరకూ నాకు తోడుగా వచ్చాడు. "వచ్చేశాం" అన్నాడు. "గుడ్ లక్" చెప్పాడు. వచ్చినంత వేగంగా వెనక్కు వెళ్లిపోయాడు. మేమొచ్చిన వైపే వెళ్లాల్సిన ట్యూబ్ కోసం వేచి చూడటం మొదలుపెట్టాడు.

ఈ సంఘటన తరువాత నేను ఆ వ్యక్తిని ఎప్పుడూ కలవలేదు. అతడు చేసిన సాయానికి థ్యాంక్స్ అయినా సరిగ్గా చెప్పానో లేదో గుర్తు లేదు. కానీ లండన్ అండర్‌గ్రౌండ్‌లో నాకు ఎదురైనా మధురమైన అనుభూతుల్లో ఇదీ ఒకటిగా నిలిచిపోయింది. ఎవరో అపరిచితులు అనూహ్యంగా ఇలా ఇతరులకు సాయపడటం ఆ తరువాత మన జీవితాల్లోంచి వారు మాయమైపోవడం... ఓహ్! మరచిపోలేం. చేదు అనుభవాలూ ఎదురవుతూంటాయి కానీ, వాటిని నేను గుర్తుంచుకోను.

ఢిల్లీలోనూ మెట్రో భూగర్భ మార్గం పడుతున్న నేపథ్యంలో మనకూ ఇలాంటి అనుభవాలు బోలెడన్ని ఎదురయ్యే అవకాశం ఉంది. ఇలాంటి ఘటనలు చూసిన వెంటనే మనకు కలిగే ఇంప్రెషన్ తప్పు కావచ్చు అని చెప్పేందుకు ఉపయోగపడుతూంటాయి. చూపులతోనే మనిషిని అంచనా వేయలేమని చెబుతూంటాయి!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

గ్రహింపు ఉందా?



డియర్ లిబరల్స్, పాశ్చాత్య దేశాల్లోని ఉదారవాద ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ముప్పు ఇస్లామిక్ అతివాదం. మధ్య ప్రాచ్యంలో ఉదారవాద ప్రజాస్వామ్యం లేకపోవడానికి కారణమే ఇస్లామిక్ అతివాదం. మీరు ఇది కూడా చర్చించాల్సిన విషయం అంటున్నారంటే, మీకు స్పష్టంగా ఇస్లామిక్ అతివాదం అర్థం కాలేదన్నమాట!

– లుయిూ అహ్మద్, స్వీడన్ కాలమిస్ట్

అందరూ ఒకటే!



షేక్ హసీనా తనపై ఉన్న కేసులన్నీ కొట్టేయించుకున్నారు. మహమ్మద్ యూనస్ తనపై ఉన్న కేసులన్నీ కొట్టేయించుకున్నారు. ఖలీదా జియా తనపై ఉన్న కేసులన్నీ కొట్టేయించుకున్నారు. తారీఖ్ రెహమాన్ తనపై ఉన్న కేసులన్నీ కొట్టేయించుకున్నారు. షేక్ హసీనా, మహమ్మద్ యూనస్, ఖలీదా జియా, తారీఖ్ రెహమాన్ మధ్య ఎటువంటి ప్రాథమిక వ్యత్యాసమూ లేదు. బంగ్లాదేశ్‌లోని హింస, ప్రతీకార రాజకీయాలలో రాజకీయ నాయకులందరూ ఒకేలా ఉంటారు.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

అది అనైతికం



మీరు ఒకవేళ ఇండియాలో అదే చేస్తున్నప్పటికీ, బంగ్లాదేశ్‌లోని మైనారిటీలపై దాడిని విమర్శించండి. కానీ బంగ్లాదేశ్‌లోని రోగులకు చికిత్స చేయడానికి వైద్యులు నిరాకరించడం మాత్రం అమానుషం, అనైతికం.

– అపూర్వానంద్, హిందీ బోధకుడు

కాలుష్య అలెర్జీ



నేను భారత్‌లో ఉన్న ప్రతిసారీ, నా కళ్లలో నీరు ఎక్కువ వస్తుంది. ముక్కును ఎక్కువ చీదాల్సి వస్తుంది. మా అమ్మా నాన్న ఎప్పుడూ ఇవి 'అలర్జీలు' అని చెబుతుంటారు. కానీ అదే వాళ్లు నన్ను చూడటానికి అమెరికా వచ్చినప్పుడు, ఇవి అద్భుతంగా అదృశ్యమైపోతాయి. మనం భారీ ఆరోగ్య సంక్షోభాన్ని నిరాకరిస్తూ బతుకుతున్నాం.

– దేబర్ష్య దాస్, వెంచర్ క్యాపిటలిస్ట్

గేటెడ్ ప్రభుత్వాలు



ముంబైలోని బిల్డింగ్ సొసైటీలు తామే ఒక సొంత ప్రభుత్వంలా ఎందుకు వ్యవహరిస్తున్నాయి? మీ ఫ్లాట్‌లో ఏదైనా పని మొదలుపెట్టాలంటే, మీరు వారి నుండి అనుమతులు పొందాలి. అంతేకాదు, సెక్యూరిటీ డిపాజిట్ పెట్టాలి. పన్నెండు వేల పనికి ముప్పై వేల సెక్యూరిటీ డిపాజిట్. అసంబద్ధం.

– అభిజిత్ గంగూలీ, కమెడియన్

ఇన్ బాక్స్

చట్టాలను అమలు చేయాలి

2011 జనాభా లెక్కల ప్రకారం, దేశ జనాభాలో 22. 4%; తెలంగాణ రాష్ట్ర జనాభాలో దాదాపు 11 లక్షలు దివ్యాంగులు ఉన్నారు. దివ్యాంగుల అభ్యున్నతి కోసం పార్లమెంటు దివ్యాంగుల హక్కుల చట్టం – 2016 ను తీసుకువచ్చింది. దివ్యాంగులకు అనేక సదుపాయలను, అవకాశాలను, హక్కులను ఈ చట్టంలో పొందుపరిచారు. వీరికి ఉద్యోగాలలో 4%, విద్యా సంస్థలు, వివిధ పేదరిక నిర్మూలన పథకాలలో 5% రిజర్వేషన్లు, వైకల్యాలను 7 నుండి 21 వరకు పెంచడం, ప్రత్యేక కోర్టులు, ప్రత్యేక కమిషనర్, రాష్ట్ర ప్రత్యేక నిధి, ప్రత్యేక సలహా సంఘం తదితర అవకాశాలను పొందుపరిచినారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ప్రత్యేక తీర్మానం (1981) ప్రకారం ప్రతి ఏటా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాల మాదిరిగా... తెలంగాణ రాష్ట్రం కూడా వికలాంగుల సాధికారత కోసం స్వయం ప్రతిపత్తిగల ప్రత్యేక శాఖను కొనసాగించాలి. ఇందుకై 33 జిల్లాలలో ఉన్న కార్యాలయాలలో సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలి. సామాజికంగా ఎంతో వెనుకబడిన దివ్యాంగులకు ఎస్సీ, ఎస్టీల మాదిరిగా అన్ని పథకాలలో, కార్యక్రమాలలో మినహాయింపులు, ప్రోత్సాహకాలు వర్తింపచేయాలి. వీరి జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌ను కేటాయించాలి. వికలాంగుల హక్కుల చట్టం–2016 ప్రకారం ప్రత్యేక శాఖను, ప్రత్యేక కమీషనర్‌ను ఏర్పాటు చేయాలి. అర్హులైన నిరుద్యోగులైన వికలాంగులకు నిరుద్యోగ భృతిని చెల్లించాలి.

వివిధ శాఖలలో దివ్యాంగులు చేయగలిగే ఉద్యోగాలను వెంటనే గుర్తించాలి. ఆన్లైన్ విధానంలో దివ్యాంగులకు ఆయా శాఖల్లో గుర్తించబడిన ఖాళీల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించి భర్తీ చేయాలి. సమాజంలో ఆత్మగౌరవంతో జీవించే అవకాశాలను, సమ్మిళిత అభివృద్ధికై పరిస్థితులను ప్రభుత్వాలు, పౌరసమాజం కల్పించాలి. వీరి చట్టాలను చిత్తశుద్ధితో అమలుపరచాలి. అప్పుడే వీరికి తగిన న్యాయం జరుగుతుంది

– డా॥ నారా నాగేశ్వర్ రావు
తెలంగాణ రాష్ట్ర సలహా మండలి సభ్యులు (వైకల్యం)
(నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం)

ఈ చర్య మతసామరస్యానికి శరాఘాతం!

అభిప్రాయం




జహారా బేగం

అజ్మీర్ దర్గాకు సంబంధించిన వార్తలు ముస్లింలకు మాత్రమే బాధ కలిగిస్తాయనుకుంటే పొరపాటు. తరతరాలుగా హిందువులు ఆ దర్గాలో ఆరాధనలు జరుపుతున్నారు. 'చాదర్' సమర్పిస్తున్నారు. భక్తులు ఎంతో పవిత్రంగా 'గరీబ్ నవాజ్' అని పిలుచుకునే ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ ఎదుట మొక్కులు తీర్చుకుంటున్నారు. భారత దేశంలోని ముస్లింలు, హిందువులకు అత్యంత పవిత్రంగా భావించే ఈ క్షేత్రాన్ని ప్రతి రోజూ 1.5 లక్షల మంది భక్తులు సందర్శిస్తారు. భారతీయ ముస్లింలలో అత్యధికులు అజ్మీర్ దర్గాను జీవితంలో ఒక్కసారైనా దర్శించుకోవాలి అనుకుంటారు. అజ్మీర్ దర్గా భారతదేశంలోని ముస్లింలకు మక్కా లాంటిదని పలువురు భావిస్తారు. అజ్మీర్ ఖ్వాజాను 'హిందూస్తాన్ కే వలీ' లేదా 'హింద్ వలీ' అని పిలుస్తారు.

కాని ఇటువంటి ఈ సామరస్య కేంద్రం ఇప్పుడు వార్తల్లో అనవసర కారణాలతో నిలవడం బాధాకరం. భారతదేశంలో బాబ్రీ తర్వాత సాగుతున్న హైందవ సంస్కృతి ఆనవాళ్ల వెతుకులాట మసీదుల చుట్టూ ఇంతకాలం ఉండగా... ఇప్పుడు దర్గాలకు చేరడం, అదీ కోట్లాది మంది సెంటిమెంట్‌గా భావించే అజ్మీర్ దర్గాకు చేరడం ఆందోళన కలిగించే అంశం. చినికి చినికి గాలివాన అయినట్టుగా ఇది ఎక్కడకు చేరబోతున్నదో పాలకులకూ, ఈ వివాదాన్ని రేపుతున్నవారికీ అంచనా ఉందా? ఈ వివాదాన్ని లేపేవారు భారతీయ హిందూ– ముస్లింల మధ్య ఎడతెగని అనిశ్చితి, ఘర్షణ, విభజన, ద్వేషం ఆశిస్తున్నారా? ఒక దేశంలో కలిసిమెలిసి ఉండవలసిన రెండు ప్రధాన మతాలు నిత్యం ఘర్షణల్లో ఉంటే ఆ దేశ ప్రగతి ఏ రీతిలో కొనసాగుతుందనేది మనలో ప్రతి ఒక్కరం ప్రశ్నించుకోవాలి.

అయోధ్యలో ప్రార్థనా స్థలంపై జరిగినట్లుగా అజ్మీర్‌లో దీర్ఘకాలంగా పోరాటం లేదు. ఇది మసీదు వంటి బహిరంగ ప్రదేశం కాదు. ఇది సూఫీ సాధువు ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ సమాధి. అజ్మీర్ దర్గాపై ఎటువంటి న్యాయపోరాటం లేనప్పుడు, 800 ఏళ్ల సూఫీ సాధువు సమాధి వద్ద యంత్రాలు, గునపాలు చేరడం చట్ట విరుద్ధం. హిందూ సేన కోర్టు సహాయంతో అజ్మీర్ ఖ్వాజా దర్గాను సర్వే చేయాలనుకుంటోంది. ఈ సర్వేను నిలిపివేయాలని ఈ దేశంలో బాధ్యతగల పౌరులెవరైనా ఆశిస్తారు. తాజ్‌మహల్, కుతుబ్‌మినార్‌ల విషయంలో చేసినట్లుగా అజ్మీర్ దర్గా సర్వేను తిరస్కరించాలి. వివాదాలు లేని చోట వివాదాలు సృష్టించవలసిన అవసరం ఏమిటని గౌరవనీయమైన పెద్దలు ముందుకు రావాలి. హిందూ ముస్లింలకు ఇది దర్గా అని తెలుసు. ఇది రెండు మతాలకు చెందినది కాబట్టి వారు దానిని ఒకే దృష్టితో చూశారు. భక్తులు అక్కడ సంతోషంగా ప్రార్థనలు చేస్తున్నప్పుడు వారిని భంగపరచి దేశవ్యాప్తంగా ఎందుకు హింసను ప్రేరేపించాలి?



అజ్మీర్ దర్గా

శివలింగం ఉందా... లేదా ఉందని వెలికితీయడానికీ, లేదా లేకపోయినా ఉందని వాదించడానికీ పవిత్రమైన 800 సంవత్సరాల నాటి సూఫీ సాధు సమాధిని అన్వేషించడం 140 కోట్ల జనాల మనోభావాలను దెబ్బతీసినట్లే. దర్గా హిందువులు– ముస్లింల మధ్య వారధిగా నిలుస్తుంది. ఈ వంతెనను దెబ్బతీస్తే, హిందువులు – ముస్లింల మధ్య సంబంధాన్ని విచ్ఛిన్నం చేసినట్లే. ఇలా చేసి చివరికి ఏమి సాధించబోతున్నారు?

గత పాఠాలు బోధించడం, అవగాహన పెంపొందించడంలో చరిత్రకు దాని విలువ ఉంది. ప్రజలను విభజించడానికి లేదా శాంతికి భంగం కలిగించడానికి చరిత్రను ఆయుధంగా వాడకూడదు.

చరిత్రను తవ్వకూడదు. చరిత్రకు దానిదైన విలువ ఉంటుంది. చరిత్ర గతిలో గడిచిపోయిన విషయాలను కొన్నింటిని వర్తమానంలోకి తెచ్చినప్పుడు అవి మనం కోరే వ్యాఖ్యానాలు, ఫలితాలు మాత్రమే ఇవ్వవు. తేనెతుట్టెను కదిల్చి తేనెటీగలను ఒక వరుస క్రమంలో ఎగిరి వెళ్లమని కోరడం లాంటిది ఇది. సమాజంలో అన్ని మతాలకూ, వారి పవిత్ర స్థలాలకూ గౌరవం అవసరం. సామరస్యాన్ని కాపాడుకోవాలంటే విశ్వాసం విభజితం కాకుండా ఏకం కావాలని గుర్తించాలి. ఈ మతాతీత ప్రదేశాలు గౌరవం, ఐక్యతలకు సంబంధించిన స్థలాలుగా ఉండాలి.


గత రెండు సంవత్సరాలుగా ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ 'మేము కొన్ని పరిస్థితుల్లో ప్రకృతికి విరుద్ధంగా బాబ్రీ మసీదు సమస్యను లేవనెత్తాము. ఇప్పుడు ఆ సమస్య సమసిపోయింది. ఇప్పుడు మరలా ప్రతిరోజూ మసీద్–మందిర్ గొడవలు దేనికని? ఎందుకు అనవసర గొడవలు సృష్టిస్తున్నారు? ప్రతీ మసీదులో శివలింగం ఉందని వాదించడం సరైనది కాదు. విధానం వేరైనప్పటికి మసీదుల్లో ముస్లింలు చేస్తున్నది కూడా దైవ ఆరాధనే. వారు మనవాళ్ళే, బయట నుండి ఏమి రాలేదు. ఇది అందరూ అర్థం చేసుకోండి' అని చెబుతూనే వస్తున్నారు. కానీ, జరుగుతున్నది వేరు.

సూఫీ సాధువు సమాధి కింద శివలింగం ఉందనడానికి ఎటువంటి ఆధారాలూ లేవు. హింసను ప్రేరేపించడానికి అలాంటి కల్పనలను వదిలివేయాలి. భాగవత్ మాటలను గౌరవించమని హిందూ సోదరులకు విజ్ఞప్తి. అలాగే ముస్లిం సోదరులు కూడా సంయమనం పాటించాలి. ప్రపంచం అల్లకల్లోలంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో మనం చాలా జాగ్రత్తగా కలిసి మెలిసి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందరూ కలిసి నడుద్దాం. భారతదేశ జెండాను ప్రపంచంలో ఉన్నత శిఖరాల్లోకి ఎగరవేద్దాం. మేరా భారత్ మహాన్ హై! జై హింద్!!

వ్యాసకర్త సామాజిక కార్యకర్త
(ఇండియా/యు.ఎస్.ఎ)

ఆయనే దిక్కు

కోపిష్ఠి అయిన దుర్వాసుడు అభిమానంతో ఇచ్చిన మందార మాలను యథాలాపంగా చెంతనున్న ఐరావతం కుంభానికి చుట్టుకునేలా విసిరేశాడు ఇంద్రుడు. ఆ పూల మాల వింత సౌరభానికి కలతచెందిన ఐరావతం, ఆ మాలను తొండంతో తీసి విసిరి కొట్టి, వింతను చూస్తున్న అందరి ముందర, చిందరవందర చేసి నవ్వులపాల్జేసింది. 'ఇంద్రుడికి తాను అభిమానంతో ఇచ్చిన బహుమానంపై ఇంత చులకనతనమా' అని ఉగ్రుడై ఇంద్రుడి సంపదంతా సముద్రం పాలయ్యేలా శపించాడు. స్వర్గలోక భోగాలన్నీ సముద్రంలో కలిసిపోయాయి. దేవేంద్రుడి పాలనలోని ముల్లోకాలలోను దరిద్రం తాండవించసాగింది. చేసేది లేక బ్రహ్మదేవుడి వద్దకు పరుగెత్తాడు ఇంద్రుడు. జరిగినదంతా చెప్పి కాపాడమని వేడుకున్నాడు. ఇంద్రుడి మాటలను విన్న బ్రహ్మ 'సంపదేగా! పోతేపోయింది, ఏదో ఉపాయం ఆలోచించి మళ్ళీ సంపాదించుకోవచ్చు. పెద్ద గండం తప్పింది. ప్రాణంతో బయటపడ్డావు సంతోషించు. దుర్వాసుడి కోపం తగిలి ప్రాణంతో బయటపడడమంటే పులి నాకి విడవడంతో సమానం! అతడి అలుకకు నేను కూడా గుండె ధైర్యం చేసుకుని నిలబడడానికి తంటాలు పడుతుంటాను సుమా!' అని ఊరడించాడు. వెన్నెలకంటి సూరన తన 'ఆంధ్ర శ్రీవిష్ణుపురాణం'లో సముద్రం పాలైన సంపదనంతా తిరిగి పొందే తరుణోపాయంగా ఇంద్రుడితో ఇలా పలికించాడు.



జ్యోతిర్మయం

ఉ. ఆపదలెల్ల మాన్పి సుఖమైన పదంబుల బూన్చి యాత్మ సం/ తాపములెల్ల బుచ్చి విదితంబగు సంపదలిచ్చి భక్తులం/ దేపయుబోలె దుఃఖజలధిం బడకుండగ దేల్చి ప్రోవ ల/ క్ష్మీపతి యున్నవాడు మది జింత దొఱంగుము పాకశాసనా!

'వచ్చిన ఆపదలనన్నిటినీ పోగొట్టి, పరిస్థితులను మళ్ళీ సుఖమైన మార్గంలో పెట్టి, బాధలన్నింటినీ తీర్చి, అనుభవించి ఆనందించడానికి సందేహించాల్సిన అవసరంలేని సంపదలను పుష్కలంగా సమకూర్చి, దుఃఖసముద్రంలో దిక్కుతోచక కొట్టుకుంటున్న తన భక్తులను, అందులో పడి మునిగిపోకుండా, నావ వలె తేల్చి కాపాడడానికి శ్రీమహావిష్ణువు ఉన్నాడు. కనుక బెంగపడడం మాని, కుదుటపడు పాకశాసనా!' అని చెప్పాడు బ్రహ్మదేవుడు.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిరమాసం, **తిథి:** శు.విదియ ప.12.30 వరకు, తదుపరి తదియ **నక్షత్రం:** మూల సా.4.51 వరకు, తదుపరి పూర్వాషాఢ **వర్జ్యం:** ప.3.14 నుండి 4.50 వరకు, తదుపరి రా.2.38 నుండి 4.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.32 నుండి 9.20 వరకు, తదుపరి రా.10.35 నుండి 11.23 వరకు, **అమృతఘడియలు:** ఉ10.05 నుండి 11.34 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.18, **సూర్యాస్తమయం:** 5.20.

ఐదుగురు మావోల కోసం జల్లెడ

- చెల్పాకలో 12 మంది ఉన్నట్లు గుర్తించిన పోలీసులు
- ఏడుగురు మరణించగా, పరారైన వారి కోసం గాలింపు
- మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి.. ఫ్రీజర్లలో భద్రం


పోస్టుమార్టం గదివద్ద పహారా కాస్తున్న పోలీసులు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చెల్పాక అటవీ ప్రాంతంలో ఆదివారం జరిగిన పోలీసులు ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళ సహా ఏడుగురు మావోయిస్టులు మృతి చెందగా.. పరారైన మిగతా ఐదుగురి కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతం వాజేడు, వెంకటాపురం(కె)తో పాటు ఇటు మహారాష్ట్ర సరిహద్దు కాళేశ్వరం, మంథని మహాదేవ్‌పూర్ అటవీ ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ, గ్రేహౌండ్స్ దళాలు గాలిస్తున్నా యి. తప్పించుకున్న మావోయిస్టులకు గాయాలై ఉంటాయని, సమీప అటవీ ప్రాంతంలో తలదాచుకుని ఉంటారని భావిస్తున్న పోలీసులు సోమవారం చెల్పాక అడవుల్లో కూంబింగ్ ముమ్మరం చేసినట్లు సమాచారం. ఒక వైపు పాలకమ్మ వాగు, మరోవైపు దట్టమైన అటవీప్రాంతం ఉండటంతో పోలీసులు నలుమూలలా నిఘా వేసినట్లు తెలుస్తోంది.

సామాజిక ఆస్పత్రి వద్ద భారీ బందోబస్తు

ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలకు స్థానిక సామాజిక ఆస్పత్రిలో సోమవారం పోమార్టం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ చోటు చేసుకోగా, ఎస్పీ శబరీష్ మృతదేహాలను పరిశీలించిన తర్వాత భారీ బందోబస్తు మధ్య ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించాలని భావించారు. కానీ వర్షం, భద్రత కారణాల దృష్ట్యా ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదిలో భద్ర పర్చారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బయ్యారం ప్రత్యేక పర్యవేక్షణ అధికారి, డీఎస్పీ రవీందర్‌రెడ్డి నేతృత్వంలో కాకతీయ మెడికల్ కళాశాలలోని ఫోరెన్సిక్ నిపుణుల బృందం ఇక్కడ ఆస్పత్రికి చేరుకుంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, డీఎస్పీ రవీందర్‌రెడ్డితో చర్చించిన తర్వాత.. కాకతీయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ లక్ష్మణ్ రావు, ప్రొఫెసర్ ఖాజామొహినొద్దీన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సురేందర్, నవీన్, పీజీ వైద్యులు నవీన్, మాధురి, మౌనిక, జితేందర్, ప్రియాంక, ఫరేక, లావణ్య, తరుణ్, ప్రశాంత్‌లతో కూడిన బృందం ఏడు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించింది. మధ్యాహ్నం 12.47 నిమిషాలకు ప్రారంభమైన ఈ ప్రక్రియ సాయంత్రం 6.33 వరకు కొనసాగింది. అనంతరం హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మావోయిస్టుల మృతదేహాలను ఫ్రీజర్లలో భద్రపర్చారు. వైద్యులతో మీడియా మాట్లాడే ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు అనుమతించలేదు. పోస్టుమార్టం గది వద్ద ఉండేందుకు కూడా వీల్లేకుండా కట్టుదిట్టం చేశారు. ఏటూరునాగారం ఐటీడీఏ నుంచి ఆస్పత్రి వరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనదారులను అడ్డగించి ఆరా తీశారు.

విషం పెట్టారు.. హింసించి చంపారు

- శరీరం మొత్తం తుక్కు తుక్కు చేశారు
- మావోయిస్టు మల్లయ్య భార్య మీనా ఆరోపణ



ఏటూరునాగారం: 'ఇది ఎన్‌కౌంటర్ కాదు.. అన్నంలో విషం పెట్టి బేహోష్ (అపస్మారకస్థితిలో)లో ఉన్నప్పుడు నా భర్తను పట్టుకున్న పోలీసులు చిత్రహింసలు పెట్టి చంపారు..' అని పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన ఏగోళపు మల్లయ్య అలియాస్ మధు భార్య మీనా ఆరోపించారు. ములుగు ఎన్‌కౌంటర్‌లో మరణించిన తన భర్త మృతదేహాన్ని చూడటానికి మీనా, సోదరుడు రాజయ్య ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా మీనా విలేకరులతో మాట్లాడారు. 'ముఖంపై చర్మం తప్ప శరీరంలో ఎక్కడా బొక్కలు కనబడటం లేదు.. మొత్తం తుక్కుతుక్కు చేసి హింసించి హింసించి చంపారు. తల నుజ్జునుజ్జుగా అయింది. దగ్గరినుంచే కాల్చి చంపినట్లు తెలుస్తోంది. హింసించి విషమిచ్చి చంపారా? లేక మత్తుమందు ఇచ్చి అతిక్రూరంగా చంపారా? అనేది అర్థం కావటం లేదు. మరణించిన మహిళా మావోయిస్టును చూస్తే.. మొత్తం బట్టలు చింపేసి గొంతు కోసినట్లుగా ఉంది.. ఒక భుజం మొత్తానికే వెనక్కి తిరిగి ఉంది. ఎంత క్రూరంగా హింసించి చంపారో దీన్నిబట్టి అర్థమవుతుంది..' అని పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రి సీతక్క గతంలో నక్సల్స్ పార్టీలో పని చేశారు కదా.. ఇలాంటి బూటకపు ఎన్‌కౌంటర్లకు ఎలా మద్దతు తెలుపుతున్నారని మీనా ప్రశ్నించారు. కనీసం ఫొటో తీసుకోవడానికి కూడా అవకాశం ఇవ్వలేదంటేనే ఎంత క్రూరంగా హింసించి చంపారో తెలుస్తోందంటూ విలపించారు. ఇది ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటరేనని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గొప్పోడి అంజమ్మ డిమాండ్ చేశారు.

రెడ్ కారిడార్‌కు చెక్ పడినట్టే?
సాక్షి ప్లస్ (ఈ-పేపర్)లో


సోమవారం టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఆయనను సన్మానిస్తున్న కమిషన్ సభ్యులు

క్లుప్తంగా...

పెళ్లి విషయంలో పట్టింపు..

- పురుగులమందు తాగి తండ్రి, కూతురు ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి (సిరిసిల్ల): క్షణికావేశంలో తండ్రి, కూతురు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన సోమవారం రాత్రి రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుషాపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన మల్లవేని నారాయణ తన కూతురు మల్లవేని శిరీషకు పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. తాను ఇప్పుడే పెళ్లి చేసుకోనని కొంతకాలం సమయం ఇవ్వాలని శిరీష తండ్రికి చెప్పింది. ఈ విషయంలో తండ్రి, కూతురు తరుచూ గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం మాటామాటా పెరిగి పెళ్లి చేసుకోమంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ క్షణికావేశానికి గురైన శిరీష ఇంట్లో ఉన్న పురుగులమందు తాగింది. దీంతో నారాయణ తాను కూడా చస్తానంటూ శిరీష చేతిలో నుంచి పురుగులమందు డబ్బా లాక్కొని తాగాడు. ఇరువురిని కుటుంబసభ్యులు 108లో సిరిసిల్ల ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శిరీష ప్రాణాపాయం నుంచి బయటపడగా.. నారాయణ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో ఆకస్మిక బదిలీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖలో ఆకస్మిక బదిలీలు చోటుచేసుకున్నాయి. పనితీరు సంతృప్తికరంగా లేని ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ విభాగం అదనపు కమిషనర్లను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ చేశారు. వీరితో పాటు మరికొందరు జాయింట్ కమిషనర్లకు కూడా ప్రభుత్వం స్థానచలనం కల్పించింది. క్షేత్రస్థాయిలో డివిజన్ కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరిని రాష్ట్ర కార్యాలయానికి బదిలీ చేసింది. ప్రధానంగా జీఎస్టీ రాబడుల విషయంలో సదరు అధికారులపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ప్రభుత్వం.. ఈమేరకు బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే ఈ బదిలీలకు సంబంధించి ఇంకా అధికారికంగా ఉత్తర్వులు వెలువడలేదు.

వారి మృతదేహాలు భద్రపర్చండి

▶ మొదటి పేజీ తరువాయి

అడవులోకి తీసుకుని చిత్రహింసలు పెట్టారు. ఆ తర్వాత ఎన్‌కౌంటర్‌గా సృష్టించడం కోసం కాల్పులు జరిపారు. మృతదేహాలపై తీవ్ర గాయాలున్నాయి. తన భర్త మృతదేహాన్ని చూసేందుకు అనుమతించాలని కోరుతూ ఐలమ్మ ఆదివారమే జిల్లా ఎస్పీకి, ఉన్నతాధికారులకు ఈ మెయిల్ పంపారు. అయినా ఆమెను, కుటుంబసభ్యులను పోలీసులు అనుమతించలేదు. బూటకపు ఎన్‌కౌంటర్ కానప్పుడు మృతదేహాన్ని చూపించడానికి అభ్యంతరం ఏంటీ?..'అని ప్రశ్నించారు. అయితే అప్పటికే పోస్టుమార్టం ముగిసిపోయిందని జీపీ చెప్పడంతో.. కుటుంబసభ్యులు చూడకముందే ఆగమేఘాల మీద పోస్టుమార్టం ఎందుకు చేశారో పోలీసులు చెప్పాలని సురేశ్ డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు.

నిపుణుల బృందం పోస్టుమార్టం

పోలీసుల తరఫున హోంశాఖ జీపీ మహేశ్‌రాజ్ వాదనలు వినిపిస్తూ.. 'అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అకస్మాత్తుగా కాల్పులు జరపడంతో పోలీసులు ప్రతిస్పందించారు. ఎదురుకాల్పుల్లో మరణించిన వారిని భద్రతాపరమైన ఇబ్బందుల దృష్ట్యా సమీప ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాకతీయ మెడికల్ కాలేజీకి చెందిన ఫోరెన్సిక్ నిపుణుల బృందం అక్కడే పోస్టుమార్టం పూర్తి చేసింది. ఈ ప్రక్రియ అంతా వీడియో తీశారు. మృతదేహాలను అక్కడే ఫ్రీజర్‌లో భద్రపరుస్తారు. కుటుంబసభ్యులు చూడటానికి ఎలాంటి అభ్యంతరం లేదు..'అని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తన భర్త మృతదేహాన్ని చూసేందుకు పిటిషనర్‌ను అనుమతించాలని ఏటూరునాగారం ఎస్‌హెచ్‌ఓను ఆదేశించారు. పోస్టుమార్టంలో పాల్గొన్న నిపుణులు, వైద్యుల పూర్తి వివరాలు తమ ముందుంచాలని చెబుతూ, తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా వేశారు.

కారుతో ఢీకొట్టి.. వేట కొడవలితో నరికి

▶ మొదటి పేజీ తరువాయి

ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించింది. దీంతో వారు ఇరు కుటుంబాలను పిలిపించి నచ్చజెప్పారు. అనంతరం దంపతులు మన్సూరాబాద్‌లో కాపురం పెట్టారు. అయితే తక్కువ కులానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుని, ఊరిలో తమ కుటుంబ పరువు తీసిందని నాగమణిపై కక్ష పెంచుకున్న ఆమె తమ్ముడు పరమేశ్ అవకాశం కోసం ఎదురు చూడటం ప్రారంభించాడు.

విధులకు వెళ్తుండగా..

తన తల్లిదండ్రులు హంసమ్మ, సత్తయ్యను చూసేందుకు శ్రీకాంత్ రెండురోజుల క్రితం భార్య నాగమణితో కలిసి రాయపోల్ వచ్చాడు. సోమవారం ఉదయం హయత్‌నగర్ పీఎస్‌లో విధులకు హాజరయ్యేందుకు నాగమణి ఒక్కరే స్కూటీపై బయలుదేరారు. ఊరు దాటగానే అప్పటికే దారి కాచిన పరమేశ్ కారులో వెంబడించాడు. మన్నెగూడ సబ్ స్టేషన్ జంక్షన్ వద్ద స్కూటీని కారుతో వేగంగా ఢీకొట్టి, కింద పడిన ఆమెపై దాడి చేసి చంపేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న సీఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

పరమేశ్ వెంటాడుతున్నాడని చెప్పింది

నాగమణి, తాను ఎనిమిదేళ్లుగా ప్రేమించుకుంటున్నామని, ఆమెకు తల్లిదండ్రులు లేకపోవడంతో నాలుగేళ్లు హాస్టల్‌లో ఉండి చదువుకుందని, ఆ సమయంలో అన్నీ తానై చూసుకున్నానని శ్రీకాంత్ తెలిపారు. యాదగిరిగుట్టలో తమ వివాహం జరిగిందని, నాగమణి పేరున ఉన్న ఎకరా భూమి తమకు వద్దని చెప్పామని కన్నీటి పర్యంతమయ్యారు. అయినా కనికరం లేకుండా అక్కను చంపాడని రోదించారు. పరమేశ్ తనను వెంటాడుతున్నాడని నాగమణి ఫోన్ చేసి చెప్పిందని, వెంటనే తన సోదరుడిని పంపించినా అప్పటికే దారుణం జరిగిపోయిందని వాపోయారు.


నాగమణి మృతదేహం

మా కుమారుడికి ప్రాణహాని ఉంది

సొంత అక్కనే చంపిన పరమేశ్‌తో తమ కుమారుడు శ్రీకాంత్‌కు ప్రాణహాని ఉందని హంసమ్మ, సత్తయ్య ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీకాంత్‌ను కూడా పరమేశ్ చంపేస్తాడంటూ రోదించారు. అతనికి ఉరి శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువులతో కలిసి ఆందోళన నిర్వహించారు. సీపీఎం నేతలు వీరికి మద్దతు తెలిపారు. కాగా పరారీలో ఉన్న పరమేశ్‌ను పట్టుకునేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు. స్కూటీని ఢీ కొట్టినప్పుడు కారు నంబర్ ప్లేట్ ఘటనా స్థలంలో పడిపోయిందని, హత్యకు వాడిన కత్తి (వేట కొడవలి)తో పాటు నంబర్ ప్లేట్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కులాంతర వివాహం, ఆస్తి వ్యవహారాలే హత్యకు ప్రధాన కారణాలుగా భావిస్తున్నామని సీఐ స్పష్టం చేశారు. అయితే నాగమణిని హత్య చేసిన తర్వాత పరమేశ్ నేరుగా వచ్చి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోంది. పోలీసులు మాత్రం పరారీలో ఉన్నాడని చెబుతుండటం గమనార్హం.

విష ప్రయోగం దుష్ప్రచారమే

- పౌర హక్కుల సంఘం ఆరోపణలను ఖండించిన డీజీపీ



సాక్షి, హైదరాబాద్: ములుగు జిల్లా పరిధిలో ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టులపై విష పదార్థాలు ప్రయోగించి వారు స్పృహ కోల్పోయిన తర్వాత కాల్పులు జరిపారని తెలంగాణ రాష్ట్ర పౌర హక్కుల సంఘం చేస్తున్న ఆరోపణలను డీజీపీ డాక్టర్ జితేందర్ ఖండించారు. ఇది పూర్తిగా దుష్ప్రచారం అని స్పష్టం చేశారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎదురుకాల్పులకు కొద్ది రోజుల ముందు ఇన్ఫార్మర్ల నెపంతో ఇద్దరు ఆదివాసీలైన ఉయిక రమేశ్, ఉయిక అర్జున్‌లను మావోయిస్టులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారని తెలిపారు. ఇటువంటి సంఘటనలను అడ్డుకునేందుకు పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై మావోయిస్టులు అత్యాధునిక ఆయుధాలతో కాల్పులు జరిపారని డీజీపీ తెలిపారు. పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు సాయుధ మావోయిస్టులు మరణించారన్నారు. అదేవిధంగా, మృతదేహాల శవపరీక్షలు హైకోర్టు, జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్సీ) సూచనల మేరకు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు అధికారిగా వేరే జిల్లా డీఎస్పీని నియమించామని డీజీపీ వెల్లడించారు.

కలెక్టరేట్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

- భూ సమస్య పరిష్కరించడం లేదని ఆవేదన


చికిత్స పొందుతున్న సాయిరెడ్డి

వనపర్తి: అనువంశికంగా తనకు రావాల్సిన భూమి పంపకాల్లో తేడాలున్నాయని.. పరిశీలించి న్యాయం చేయాలని కొంతకాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మనోవేదనకు గురైన ఓ రైతు.. సోమవారం వనపర్తి కలెక్టరేట్‌లో పురుగు మందు తాగాడు. అక్కడ గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గమనించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అతడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉంది. గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామానికి చెందిన సాయిరెడ్డి వృత్తి రీత్యా వ్యాపారి. తనకు అనువంశికంగా వచ్చిన భూమి పంపకాల విషయంలో అన్నదమ్ముళ్లు అన్యాయం చేశారని ఆరోపిస్తూ.. అధికారులకు ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. కనీసం తమ భూమి మొత్తాన్ని సర్వే చేసి వాటాల వారీగా హద్దులు ఏర్పాటు చేయాలని కోరినా.. అధికారులు స్పందించడం లేదని, అందుకే ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు సాయిరెడ్డి తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయిరెడ్డిని అధికారులతో పాటు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ పరామర్శించారు. పొలం విషయంలో అధికార పార్టీకి చెందిన నాయకులు జోక్యం చేసుకుని భయభ్రాంతులకు గురిచేస్తున్న కారణంగానే సాయిరెడ్డి ఆత్మహత్యకు యత్నించినట్లు నిరంజన్‌రెడ్డి మీడియాతో వెల్లడించారు.

సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఎస్సై ఆత్మహత్య

- తలలో కాల్చుకున్న ములుగు జిల్లా వాజేడు ఎస్సై హరీశ్
- వ్యక్తిగత కారణాలతోనే బలవన్మరణానికి పాల్పడినట్టు ఎస్పీ ప్రకటన
- పూసూరు పెరియాడో రిసార్ట్‌లో ఘటన
- ప్రేమ వ్యవహారమే కారణం కావొచ్చనే ప్రచారం


ఎస్సై హరీశ్ మృతదేహం


రోదిస్తున్న హరీశ్ తల్లిదండ్రులు మల్లికాంబ, రామయ్య

వాజేడు: ములుగు జిల్లా వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ (29) సోమవారం సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. వాజేడు మండలం పూసూరు సమీపంలో గోదావరి బ్రిడ్జి వద్ద ఉన్న పెరియాడో రిసార్ట్‌లో సోమవారం ఉదయం ఈ ఘటన జరిగింది. రిసార్ట్‌లోని ఓ గదిలో ఎస్సై మృతదేహం బెడ్‌పై రక్తపు మడుగులో పడి ఉండగా.. ఆయన మెడకు చున్నీ చుట్టి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వెంకటాపురం(కె), పేరూరు ఎస్సైలు తిరుపతిరావు, కృష్ణ ప్రసాద్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించింది.

గొంతునుంచి తలలోకి వెళ్లిన బుల్లెట్

ఘటనా స్థలంలో బెడ్‌పై పడి ఉన్న ఎస్సై హరీశ్‌కు గొంతు కింది నుంచి తలపై భాగం మీదుగా బుల్లెట్ దూసుకెళ్లినట్టుగా ఆనవాళ్లు ఉన్నాయి. ఓ పన్ను (దంతం) ఊడిపోయి ఉంది. ఆయన మెడకు చున్నీ చుట్టి ఉంది. ఆయన కాల్చుకున్న తర్వాత రక్తస్రావం ఆపేందుకు మెడకు చున్నీ చుట్టారా? ఏం జరిగిందనే చర్చ జరుగుతోంది. ఇక ఎస్సై హరీశ్ ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో ఆ గదిలో ఓ యువతి కూడా ఉంది. ఆమె హరీశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న వీడియోలు బయటికి వచ్చాయి. అయితే హరీశ్‌కు ఈ నెల 14న వివాహ నిశ్చితార్థం జరగాల్సి ఉంది. ఫిబ్రవరిలో పెళ్లికి ముహూర్తం కూడా నిర్ణయించినట్టు సమాచారం. అలాంటిది ఆయన ఆత్మహత్యకు పాల్పడటం, ఆ సమయంలో వేరే యువతి అక్కడ ఉండటంతో.. ప్రేమ వ్యవహారమే కారణం కావచ్చనే ప్రచారం జరుగుతోంది. ఇద్దరూ మాట్లాడుకునే క్రమంలో ఏదైనా గొడవ జరిగి క్షణికావేశంతో హరీశ్ ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని అంటున్నారు.

బోరున విలపించిన తల్లిదండ్రులు

భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన హరీశ్ 2020-21 బ్యాచ్‌లో ఎస్సైగా శిక్షణ తీసుకున్నారు. ఈ ఏడాది జూన్ 17న వాజేడు ఎస్సైగా విధుల్లో చేరారు. పేద కుటుంబం నుంచి మంచి స్థాయికి ఎదుగుతున్నాడన్న సమయంలో తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడటంపై హరీశ్ తల్లిదండ్రులు మల్లికాంబ, రామయ్య తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రామయ్య, మల్లికాంబ దంపతుల రెండో కుమారుడు హరీశ్. వారి పెద్ద కొడుకు కుమారస్వామి సీఆర్పీఎఫ్ సీఐగా అస్సాంలో పనిచేస్తున్నారు.

వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య: ఎస్పీ

ములుగు ఎస్పీ శబరీశ్ కూడా ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇతర పోలీసులు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. దీనికి సంబంధించి సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యక్తిగత కారణాలతోనే ఎస్సై రుద్రారపు హరీశ్ ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. హరీశ్ వాజేడు పోలీస్‌స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా 2024 జూన్‌లో విధుల్లో చేరారని తెలిపారు. రోజువారీ విధుల్లో భాగంగా ఆదివారం ఉదయం ఏడు గంటలకు సిబ్బందితో కలిసి బయటకు వెళ్లిన హరీశ్.. కొంగాల సమీపంలో వాహనాల తనిఖీ చేశారని వివరించారు. మధ్యాహ్నం 12 గంటలకు స్టేషన్‌కు వచ్చి పలువురు ఫిర్యాదుదారులతో మాట్లాడి పంపించారని తెలిపారు. అయితే ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సిబ్బందికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఒక్కరే తన క్వార్టర్ నుంచి బయటికి వెళ్లారని.. సోమవారం ఉదయం సుమారు 7.40 గంటల సమయంలో రిసార్ట్‌లో సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని వెల్లడించారు. క్లూస్ టీం అన్ని ఆధారాలను సేకరించిందని, సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

దళిత మహిళలపై అక్రమ కేసులు

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: దళితబంధు ఇవ్వమని అడుగుతున్న దళిత మహిళలపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటామని ప్రకటించిన రాకేశ్ అనే యువకుడిని కొట్టి అక్రమ కేసులు నమోదు చేశారన్నారు. దళితులకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో కౌశిక్‌రెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడు తూ, దళితులపై కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. దళితబంధు అకౌంట్లను ఫ్రీజ్ చేయడంపై దళిత మేధావులు స్పందించాలన్నారు. ఈ పథకాన్ని ఆపినట్లు కొందరు తనపై దుష్ప్రచారం చేస్తూ తన నివాసం వద్ద ధర్నాకు ఉసిగొల్పుతున్నారన్నారు. ఈ పథకం నిధులు విడుదల చేయాలంటూ లబ్ధిదారులు ఇప్పటికే 8 సార్లు కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చారన్నారు.

కుమారుడికి క్షమాభిక్ష

దిగిపోయేముందు బైడెన్ సంచలన నిర్ణయం ● అధికార దుర్వినియోగమంటూ ట్రంప్ ధ్వజం


బైడెన్‌తో కుమారుడు హంటర్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన కుమారుడు హంటర్ బైడెన్‌కు క్షమాభిక్ష ప్రసాదించుకున్నారు! పదవీ విరమణకు కొద్ది రోజుల ముందు ఈ మేరకు సంచలన నిర్ణయం తీసుకున్నారు. అక్రమంగా ఆయుధాన్ని కలిగి ఉండటంతో పాటు రెండు క్రిమినల్ కేసుల్లో హంటర్‌కు పూర్తిగా బేషరతు క్షమాభిక్ష ప్రసాదిస్తున్నట్టు ఆదివారం ప్రకటించారు. ''నా కుమారుడు హంటర్‌కు క్షమాభిక్షపై ఈ రోజు సంతకం చేశాను'' అని ఒక ప్రకటనలో తెలిపారు. హంటర్‌పై జరుగుతున్న విచారణ ప్రక్రియలో జోక్యం చేసుకోబోనని ఇటీవలి దాకా బైడెన్ పదేపదే చెబుతూ వచ్చారు. క్షమాభిక్ష, శిక్ష తగ్గింపు వంటి నిర్ణయాలు తీసుకోబోనని అధ్యక్ష ఎన్నికల ప్రచారం సందర్భంగా కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయన అనూహ్య నిర్ణయం కలకలానికీ, రాజకీయ వివాదానికీ దారితీసింది. అయితే తన నిర్ణయాన్ని బైడెన్ పూర్తిగా సమర్థించుకున్నారు. హంటర్‌ను కావాలనే అన్యాయంగా ప్రాసిక్యూట్ చేశారని తాజా ప్రకటనలో ఆయన ఆరోపించారు. ''కేవలం హంటర్ నా కుమారుడు కాబట్టే ప్రాసిక్యూట్ చేశారు. రాజకీయ ప్రత్యర్థులు నాపై దాడికి, నా ఎన్నికను వ్యతిరేకించడానికి మాత్రమే హంటర్‌పై ఆరోపణలు చేశారు. నేను న్యాయ వ్యవస్థను నమ్మి ఎంతగా పోరాడినా, ఆ ప్రక్రియను రాజకీయాలు ప్రభావితం చేశాయి'' అని పేర్కొన్నారు. ''అందుకే క్షమాభిక్ష నిర్ణయం తీసుకున్నా. ఒక తండ్రిగా, అధ్యక్షుడిగా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నానో అమెరికన్లు అర్థం చేసుకుంటారు'' అని చెప్పుకొచ్చారు. ఇది పూర్తి బేషరతు క్షమాభిక్ష కావడంతో కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా దీన్ని రద్దు చేయలేరు. దీనిపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. బైడెన్‌ది పూర్తి అధికార దుర్వినియోగమంటూ దుయ్యబట్టారు.

ఆరేళ్ల కథకు ముగింపు

మాదకద్రవ్యాల వాడకంతో పాటు అక్రమంగా తుపాకీ ఉన్న అభియోగాల్లో హంటర్‌ను జ్యూరీ గత జూన్‌లో దోషిగా తేల్చింది. ఆయన 14 లక్షల డాలర్ల పన్నులు చెల్లించకపోవడమే గాక తొమ్మిది పన్నుల ఎగవేతకు పాల్పడ్డారని పేర్కొంది. యూఎస్ అటార్నీగా ట్రంప్ నియమించిన ప్రత్యేక న్యాయవాది డేవిడ్ వీస్ 2018లో హంటర్‌పై దర్యాప్తు ప్రారంభించారు. ఆయనపై 2023లో మరో రెండు అభియోగాలు దాఖలు చేశారు. అక్రమాయుధం కేసులో డిసెంబర్ 12న, పన్ను కేసులో డిసెంబర్ 16న విచారణ జరగాల్సి ఉంది. క్షమాభిక్ష నేపథ్యంలో ఆ కేసులను న్యాయమూర్తులు రద్దు చేస్తారు. హంటర్ 2014 జనవరి 1 నుంచి 2024 డిసెంబర్ 1 వరకు హంటర్ ఎలాంటి నేరాలకు పాల్పడి ఉన్నా వాటన్నింటికీ క్షమాభిక్ష వర్తిస్తుంది!

ట్రంప్ ప్రతీకారానికి భయపడే!

అధికార పత్రాల లీకేజీ కేసులో ట్రంప్‌పై దర్యాప్తు సందర్భంగా న్యాయ శాఖ దూకుడుగా వ్యవహరించడం తెలిసిందే. ఆయన నివాసాల్లో పదేపదే తనిఖీలు జరిగాయి. ట్రంప్ భార్య మెలానియా వార్డ్ రోబ్‌లను కూడా వదలకుండా గాలించారు. బైడెన్ ఆదేశాల మేరకే అధికారులు ఇలా చేశారని ట్రంప్ పలుమార్లు ఆరోపించారు. ''ఇవన్నీ మనసులో పెట్టుకుని ట్రంప్ పగ్గాలు చేపట్టాక తన కుటుంబంపై కక్షసాధింపుకు పాల్పడతారని బైడెన్ ఆందోళన చెందారు. ముఖ్యంగా హంటర్‌పై కేసుల దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారని భయపడ్డారు. ప్రస్తుత కేసుల నుంచి బయటపడేసినా ఇంకేమైనా అభియోగాలు మోపవచ్చని భావించారు. అందుకే కుమారునికి క్షమాభిక్ష ఏకంగా పదేళ్ల కాలానికి వర్తించేలా జాగ్రత్త పడ్డారు'' అని పరిశీలకులు అంటున్నారు. ''అధ్యక్ష ఎన్నికల్లో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ గెలిస్తే బైడెన్ బహుశా ఇలా క్షమాభిక్ష నిర్ణయం తీసుకునేవారు కాదు. ట్రంప్ గెలవడంతో తన కుటుంబంపై కచ్చితంగా ప్రతీకార చర్యలకు దిగుతారని భావించారు'' అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యాయవ్యవస్థ దుర్వినియోగం: డొనాల్డ్ ట్రంప్

క్షమాభిక్ష నిర్ణయాన్ని ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు. సొంత కుమారుని కోసం అధ్యక్ష అధికారాలను బైడెన్ పూర్తిగా దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. ఇది న్యాయ వ్యవస్థను అపహాస్యం చేయడమేనని సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. 2021లో యూఎస్ క్యాపిటల్ హిల్ భవనంపై దాడి కేసులో తన మద్దతుదారులకు క్షమాభిక్ష ఎందుకు ప్రసాదించలేదని బైడెన్‌ను ట్రంప్ ప్రశ్నించారు.

తప్పులు దిద్దుకుంటా: హంటర్

తనకు లభించిన క్షమాభిక్ష తప్పులను దిద్దుకోవడానికి, జీవితాన్ని పునర్నిర్మించుకోవడానికి అవకాశంగా హంటర్ అభివర్ణించారు. ''క్షమాభిక్షను తేలికగా తీసుకోను. బాధల్లో ఉన్నవారికి సాయపడేందుకు నా జీవితాన్ని అంకితం చేస్తా'' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేసుల విషయంలో కాంగ్రెస్, రిపబ్లికన్ల ఒత్తిడికి తలొగ్గి ట్రంప్ తనను లక్ష్యంగా చేసుకున్నారని హంటర్ మొదటి నుంచీ వాదిస్తున్నారు. ''వ్యసనాల బారిన పడిన చీకటి రోజుల్లో చేసిన తప్పులను నేను అంగీకరించా. వాటికి బాధ్యత తీసుకున్నా. అయినా నన్ను రాజకీయంగా బలి చేయడానికి, నా కుటుంబాన్ని అవమానించడానికి నాపై కేసులను వాడుకున్నారు'' అని ఆరోపించారు.

వియ్యంకునికి ట్రంప్ క్షమాభిక్ష

అమెరికాలో అధ్యక్షులు ఇలా కుటుంబీకుల కోసం పదవీ విరమణకు ముందు క్షమాభిక్ష అధికారాన్ని వాడటం ఇది తొలిసారేమీ కాదు. బిల్ క్లింటన్ కూడా అధ్యక్ష పదవి నుంచి వైదొలగడానికి ముందు తన సోదరునికి క్షమాభిక్ష పెట్టారు. ట్రంప్ కూడా తన అల్లుడు జరేద్ కుష్నర్ తండ్రికి క్షమాభిక్ష పెట్టారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఇలా కుటుంబీకులకు క్షమాభిక్ష పెట్టడం కచ్చితంగా అధికార దుర్వినియోగమేనని అమెరికన్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జెఫ్రీ క్రౌచ్ అన్నారు. దేశాధ్యక్షులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం స్నేహితులు, కుటుంబీకులు, మిత్రపక్షాలకు సాయం చేయడానికి ఇలా తమ అధికారాన్ని ఉపయోగించకూడదని స్పష్టం చేశారు.


సోమవారం లోక్‌సభలో ఆందోళనకు దిగిన విపక్షాలు

ప్రతిష్టంభనకు తెర!

- స్పీకర్ చొరవ, విపక్షాలతో చర్చలు
- రాజ్యాంగంపై ఉభయసభల్లో చర్చకు ఇరుపక్షాల అంగీకారం
- లోక్‌సభలో 13, 14న చర్చ రాజ్యసభలో 16, 17 తేదీల్లో
- నేటినుంచి సజావుగా పార్లమెంటు

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చొరవ ఫలించింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలపై వారం రోజులుగా నెలకొన్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. రాజ్యాంగ దిన వజ్రోత్సవాల సందర్భంగా ఉభయ సభల్లోనూ రాజ్యాంగంపై చర్చ చేపట్టేందుకు ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు మధ్య అంగీకారం కుదిరింది. ఆ మేరకు డిసెంబర్ 13, 14 తేదీల్లో లోక్‌సభలో, 16, 17ల్లో రాజ్యసభలో చర్చ జరగనుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ప్రకటించారు. సోమవారం అన్ని పార్టీల పార్లమెంటరీ పక్ష నేతలతో స్పీకర్ భేటీ అనంతరం ఆయన మీడియాకు ఈ మేరకు తెలిపారు. మంగళవారం నుంచి ఉభయ సభల సమావేశాలూ సజావుగా జరిగేలా సహకరించేందుకు అన్ని పక్షాలూ అంగీకరించాయన్నారు. దీన్ని భేటీలో పాల్గొన్న విపక్షాల నేతలు కూడా ధ్రువీకరించారు. విపక్షాలు చర్చకు పట్టుబడుతున్న సంభాల్ హింస, మణిపూర్ కల్లోలం తదితరాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించగా నిబంధనలకు లోబడి ఏ అంశాన్నైనా సభల్లో లేవనెత్తవచ్చని రిజిజు బదులిచ్చారు. అదానీ, మణిపూర్ కల్లోలం తదితర అంశాలపై చర్చకు విపక్షాలు పట్టుబడుతుండటంతో నవంబర్ 25న పార్లమెంటు శీతాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచీ ఉభయ సభల్లో రోజూ వాయిదాల పర్వం సాగుతుండటం తెలిసిందే. దీనికి తెర దించేలా విపక్షాలను ఒప్పించేందుకు ఓం బిర్లా కొద్ది రోజులుగా ప్రయత్నిస్తున్నారు. వాటికి కొనసాగింపుగా ఆయన సోమవారం అఖిలపక్ష భేటీ నిర్వహించారు. కాంగ్రెస్ నుంచి గౌరవ్ గొగొయ్, డీఎంకే నుంచి టీఆర్ బాలు, తృణమూల్ కాంగ్రెస్ నుంచి కల్యాణ్ బెనర్జీ తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుదిరిన సమన్వయ ఒప్పందం ప్రకారం సమాజ్‌వాదీ పార్టీ సంభాల్ అంశాన్ని, తృణమూల్ బంగ్లాదేశ్ సమస్యను లేవనెత్తేందుకు అనుమతించనున్నట్టు సమాచారం. తాము డిమాండ్ చేస్తున్న మేరకు రాజ్యాంగంపై రెండు రోజుల ప్రత్యేక చర్చకు మోదీ సర్కారు ఎట్టకేలకు అంగీకరించిందని కాంగ్రెస్ పేర్కొంది. అదానీ, సంభాల్ తదితర అంశాలపై పార్లమెంటులో చర్చకు భయపడి తప్పించుకుంటోందని దుయ్యబట్టింది. ఆ పార్టీ గట్టిగా పట్టుబడుతున్న అదానీ అంశంపై చర్చకు అధికార పక్షం అంగీకరిస్తుందా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. ఈ విషయంలో ఇతర విపక్షాలేవీ కాంగ్రెస్‌కు దన్నుగా నిలవడం లేదు. ప్రతి సమావేశాల్లోనూ పార్లమెంటును అధికార బీజేపీ హత్య చేస్తూ వస్తోందని టీఎంసీ ఎంపీ డెరిక్ ఓబ్రియాన్ దుయ్యబట్టారు.

అవే ఆందోళనలు.. ఉభయసభలూ నేటికి వాయిదా

అదానీ, సంభాల్, అజ్మీర్ దర్గా సహా పలు అంశాలపై సోమవరం పార్లమెంటు అట్టుడికింది. వాటిపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో సోమవారం కూడా ఉభయ సభలూ కార్యకలాపాలేవీ జరపకుండానే వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమవగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు చేపట్టగా విపక్షాలు అడ్డుకున్నాయి. అదానీపై చర్చించాలంటూ నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగడంతో సభ తొలుత మధ్యాహ్నం దాకా వాయిదా పడింది. తర్వాత కూడా విపక్షాల ఆందోళనలు కొనసాగడంతో మంగళవారానికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇదే తంతు కొనసాగింది. అదానీ సహా పలు అంశాలపై విపక్షాలిచ్చిన 20 వాయిదా తీర్మానాలను చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. ఆందోళనల నడుమ సభ తొలుత మధ్యాహ్నానికి, తర్వాత మంగళవారానికి వాయిదా పడింది.

ఒక్కో ఈవీఎంలో 1,500 ఓట్లా?

వాటికంత సామర్థ్యముందా: సుప్రీం

- 3 వారాల్లో స్పందించాలని ఈసీకి నిర్దేశం
- ఒక్క ఓటర్‌నూ విస్మరించొద్దన్న ధర్మాసనం
- ఒక్కో ఈవీఎంలో గంటకు సగటున 45 ఓట్లే
- రోజంతా కలిపి 600కు మించవు: పిటిషనర్



న్యూఢిల్లీ: ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో పోలయ్యే గరిష్ట ఓట్ల సంఖ్యను 1,200 నుంచి 1,500కు పెంచుతూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంలో హేతుబద్ధతపై సుప్రీంకోర్టు అనుమానాలు లేవనెత్తింది. ''ఒక్క ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం) పోలింగ్ గడువులోగా అన్ని ఓట్లను నమోదు చేయగలదా? దానికి అంత సామర్థ్యముందా? 1,500 కంటే ఎక్కువ మంది ఓటర్లు నమోదయ్యే పోలింగ్ స్టేషన్ల విషయంలో ఏం చేస్తారు? ఒక్కో ఈవీఎం ద్వారా గంటకు సగటున 45కు ఓట్లకు మించి పోల్ కావన్న పిటిషనర్ వాదన నిజమైతే హెచ్చు పోలింగ్ శాతం నమోదయ్యే సందర్భాల్లో ఓటర్ల తాకిడిని తట్టుకోవడం ఎలా సాధ్యం? నిర్దేశిత గడువులోపు అందరూ ఓటు హక్కు వినియోగించుకోలేని పరిస్థితి తలెత్తదా?'' అంటూ ఈసీకి ప్రశ్నలు వేసింది. ఇందుప్రకాశ్ సింగ్ అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌కుమార్ ధర్మాసనం సోమవారం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. పిటిషనర్ లేవనెత్తిన పలు అంశాలపై తాము ఆందోళన చెందుతున్నట్టు స్పష్టం చేసింది. ఏ కారణంతోనైనా సరే, ఒక్క ఓటర్ కూడా ఓటింగ్‌కు దూరంగా ఉండే పరిస్థితి రాకూడదని పేర్కొంది. ఈవీఎంల సంఖ్యాపరమైన సామర్థ్యంతో పాటు తాము లేవనెత్తిన సందేహాలన్నింటికీ సమగ్రంగా వివరణ ఇస్తూ ఈసీ మూడు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొంది.

1,200కు తగ్గించాలి: పిటిషనర్

ఒక్కో పోలింగ్ స్టేషన్ సామర్థ్యాన్ని 1957 నుంచి 2016 దాకా అమల్లో ఉన్న మేరకు 1,200 ఓటర్లకు తగ్గించాలని పిటిషనర్ తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ డిమాండ్ చేశారు. ''పోలింగ్ స్టేషన్ సామర్థ్యాన్ని 1,500 మంది ఓటర్లకు పెంచడం వారిని తీవ్ర అసౌకర్యానికి గురి చేయడమే. దీనివల్ల బూత్‌ల వద్ద రద్దీ పెరిగి ఓటేసేందుకు చాలా సమయం పడుతుంది. అంతసేపు వేచి చూడలేక ఓటర్లు ఓటేయకుండానే వెనుదిరిగే ప్రమాదముంది. ఎందుకంటే సగటున 11 గంటలపాటు పోలింగ్ జరుగుతుంది. ఈవీఎంల ద్వారా ఒక్కో ఓటు వేసేందుకు 60 నుంచి 90 సెకన్ల దాకా పడుతుంది. ఆ లెక్కన రోజంతా కలిపినా ఒక్కో ఈవీఎంలో 490 నుంచి 660 ఓట్ల కంటే పోలయ్యే అవకాశం లేదు'' అన్నారు. ఈ వాదనను ఈసీ తరఫు న్యాయవాది మణీందర్‌సింగ్ తోసిపుచ్చారు. ''ఈవీఎంల సామర్థ్యంపై అనుమానాలే అవసరం లేదు. ఒక్కో పోలింగ్ స్టేషన్లలో గరిష్ఠంగా 1,200కు బదులు 1,500 ఓట్లు పోలయ్యే విధానం 2019 నుంచీ అమల్లో ఉంది. పార్టీలన్నింటికీ ముందుగా వివరించాకే ఈసీ నిర్ణయం తీసుకుంది. దీనిపై ఇప్పటిదాకా ఎలాంటి ఫిర్యాదులూ రాలేదు. పైగా పోలింగ్ నాడు సాధారణంగా ఉదయపు వేళల్లో పెద్దగా రద్దీ ఉండదు. ఓటర్లంతా ఒకేసారి ఓటేసేందుకు వస్తే మధ్యాహ్నం తర్వాత కాస్త క్యూలు పెరుగుతాయేమో. అలాంటివారు పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా ఓటేసేందుకు ఈసీ అనుమతిస్తూనే ఉంది. అవసరమైన చోట్ల పోలింగ్ బూత్‌ల సంఖ్యను పెంచడం వంటి చర్యలూ ఉంటాయి'' అన్నారు. ఈవీఎంలపై ఏదో రకమైన ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయని, అది ధర్మాసనానికీ తెలుసని వ్యాఖ్యానించారు. ఓటింగ్ శాతం పెరగాలని, తద్వారా ఎన్నికల ప్రక్రియలో ప్రజలు వీలైనంత ఎక్కువగా పాల్గొనాలని ధర్మాసనం అభిప్రాయపడింది. బ్యాలెట్ పేపర్‌కు బదులు ఈవీఎంలు తేవడంలో ఉద్దేశమూ అదేనని గుర్తు చేసింది. ఇరు వర్గాల వాదనల అనంతరం విచారణను జనవరి 25కు వాయిదా వేసింది.

వచ్చే ఏడాది భారత్‌కు పుతిన్

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌లో పర్యటించనున్నారు. భారత్– రష్యా ద్వైపాక్షిక భేటీలను కొనసాగిస్తూ.. ఈసారి పుతిన్ భారత్‌కు వెళతారని క్రెమ్లిన్ వర్గాలు సోమవారం తెలిపాయి. భారత పర్యటనకు రావాల్సిందిగా ప్రధాని మోదీ నుంచి పుతిన్‌కు ఆహ్వానం అందిందని వెల్లడించాయి.

సబర్మతి రిపోర్ట్ సినిమా వీక్షించిన ప్రధాని

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం పార్లమెంటు లైబ్రరీలోని బాలయోగి ఆడిటోరియంలో 'ది సబర్మతి రిపోర్ట్' సినిమాను చూశారు. కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, జితిన్‌రామ్ మాంఝీలు కూడా మోదీతో కలిసి ఈ చిత్రాన్ని వీక్షించారు. సీనియర్ నటుడు జితేంద్ర, చిత్రంలో కీలకపాత్ర పోషించిన రష్మికా కన్నా కూడా చిత్రాన్ని తిలకించారు. అయోధ్య నుంచి తిరిగివస్తున్న 59 మంది భక్తులు గోద్రా వద్ద సబర్మతి ఎక్స్‌ప్రెస్ దగ్ధమైన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటన వెనకున్న వాస్తవాలను తాము తెరకెక్కించినట్లు చిత్ర బృందం చెబుతోంది.

డ్యూటీలో జాయినయ్యేందుకు వెళ్తూ
యువ ఐపీఎస్ మృత్యువాత



హాసన్: పేరు హర్ష బర్దన్. వయస్సు 26. తొలి ప్రయత్నంలోనే సివిల్స్‌లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. నాలుగు వారాల చిట్టచివరి శిక్షణను తాజాగా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో పూర్తి చేసుకున్నారు. ప్రొబెషనరీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా అధికారులు తొలి పోస్టింగ్ ఇచ్చారు. జాయినయ్యేందుకు ఎంతో ఉత్సాహంతో బయలుదేరారు. అయితే, విధి వేరేలా ఉంది. మార్గమధ్యంలో ఆయన ప్రయాణిస్తున్న పోలీస్ వాహనం టైరు పేలి ప్రమాదానికి గురైంది. తీవ్రంగా గాయపడిన హర్ష బర్దన్ ఆస్పత్రిలో కన్నుమూశారు. ఓ యువ ఐపీఎస్, ఆయన కుటుంబం కన్న కలలు ఇలా చెదిరిపోయాయి..! ఈ ఘటన కర్ణాటకలోని హస్సన్ వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది.

బిహార్‌లోని సహర్సాకు చెందిన అఖిలేశ్ సింగ్ మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలి జిల్లా దేవ్‌సర్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్(ఎస్‌డీఎం)గా పనిచేస్తున్నారు. అఖిలేశ్ కుమారుడు హర్ష బర్దన్ సివిల్ ఇంజినీరింగ్ డిగ్రీ చేసి 2023లో మొట్టమొదటి ప్రయత్నంలోనే ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. కర్ణాటక కేడర్‌కు చెందిన ఈయన హసన్ జిల్లాలో ఆరునెలలపాటు క్షేత్రస్థాయి శిక్షణ అందుకున్నారు. చిట్టచివరి నాలుగు వారాల శిక్షణను ఇటీవలే మైసూరులోని పోలీస్ ట్రెయినింగ్ సెంటర్‌లో పూర్తి చేసుకున్నారు. అధికారులు హర్ష బర్దన్‌కు హొళెనరసిపూర్‌లో ప్రొబెషనరీ ఏఎస్పీగా తొలి పోస్టింగ్ ఇచ్చారు. హసన్‌లో అధికారులకు రిపోర్ట్ చేసేందుకు ఆదివారం పోలీస్ వాహనంలో బయలుదేరారు. హసన్ కేవలం మరో 10 కిలోమీటర్ల దూరం ఉందనగా సాయంత్రం 4.20 గంటల సమయంలో మైసూరు– హసన్ హైవేపై ఉన్న కిట్టనె సమీపంలో వాహనం టైరు పేలింది. అదుపు తప్పి రోడ్డు పక్కనున్న ఇంటిని, ఆపైన ఓ చెట్టును ఢీకొట్టింది. ఘటనలో హర్ష బర్దన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనం డ్రైవర్, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ మంజెగౌడ స్వల్పంగా గాయపడ్డారు. ఇద్దరినీ వెంటనే హసన్‌లోని జనప్రియ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగానే హర్ష బర్దన్ పరిస్థితి విషమించిందని, బెంగళూరుకు తరలించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో తుదిశ్వాస విడిచారని అధికారులు తెలిపారు. మంజెగౌడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. హర్ష బర్దన్ మృతిపట్ల కర్ణాటక సీఎం సిద్ధ రామయ్య, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. యువ ఐపీఎస్‌ను కోల్పోవడం దేశానికి తీరని నష్టమన్నారు. కాగా, హర్ష బర్దన్ మృతదేహాన్ని బిహార్‌లోని తమ సొంతూరు సహర్సాకు తీసుకెళ్తున్నామని, తమ కుటుంబసభ్యుల కోరిక మేరకు అక్కడే అంత్యక్రియలు జరుపుతామని తండ్రి అఖిలేశ్ సింగ్ చెప్పారు.

వాష్‌రూమ్‌లు శుభ్రం చేయండి

సుఖ్బీర్‌సింగ్ బాదల్‌కు శిక్ష

చండీగఢ్: పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ పార్టీ చీఫ్ సుఖ్బీర్ సింగ్ బాదల్‌ను సిక్కుల అత్యున్నత మతసంబంధ క్రమశిక్షణా నిర్ణాయక పీఠం 'అకల్ తఖ్త్' శిక్ష విధించింది. తమ ప్రభుత్వ హయాంలో శిరోమణి అకాలీ దళ్ పార్టీ, సుఖ్బీర్ చేసిన తప్పులకుగాను సుఖ్బీర్‌కు అకల్ తఖ్త్ మతపర శిక్ష వేసింది. పంజాబ్‌లోని అమృతసర్‌లో ఉన్న స్వర్ణ దేవాలయంలో సేవాదార్‌గా పనిచేస్తూ వాష్‌రూమ్‌లు శుభ్రం చేయాలని, వంటపాత్రలు తోమాలని, షూలను తుడవాలని ఆదేశించింది. అకల్ తఖ్త్ జథేదార్(గురు పీఠాధిపతి) జ్ఞానీ రఘ్బీర్ సింగ్ సోమవారం గురుపీఠం వేదిక నుంచి ఈ శిక్షలను బహిరంగంగా ప్రకటించారు. సుఖ్బీర్ తండ్రి, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత ప్రకాశ్‌సింగ్ బాదల్‌కు 2011లో ఇచ్చిన ' ఫఖ్ర్-ఇ-ఖావమ్' బిరుదునూ ఉపసంహరించుకుంది. 2007–17 కాలంలో అకాలీదళ్ కేబినెట్‌లో మంత్రులుగా పనిచేసిన కొందరు నేతలకూ మతపర శిక్షలు పడ్డాయి. అకాలీదళ్ హయాంలో 2007లో దైవదూషణకు తెగించిన డేరా సచ్చా సౌధా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను క్షమించిన నేరానికీ సుఖ్బీర్‌కు శిక్ష పడింది. గుర్మీత్‌ను క్షమించడం సబబేనంటూ వార్తాపత్రికల్లో ఇచ్చిన ప్రకటనల కోసం ఖర్చుచేసిన శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీకి చెందిన రూ.90 లక్షల నిధులను సుఖ్బీర్ తదితరుల నుంచి వడ్డీతోసహా వసూలుచేయాలని సూచించింది.

26 ఫైటర్ జెట్లు, 3 సబ్‌మెరీన్లు

- వచ్చే నెలలో కొనుగోలు ఒప్పందం
- నేవీ చీఫ్ అడ్మిరల్ డీకే త్రిపాఠీ వెల్లడి

న్యూఢిల్లీ: అత్యాధునిక నేవీ వేరియెంట్ రఫేల్–ఎం యుద్ధ విమానాలు, స్కార్పీన్ జలాంతర్గాముల కొనుగోలుకు త్వరలోనే ఒప్పందం కుదరనుందని నావికా దళ చీఫ్ అడ్మిరల్ డీకే త్రిపాఠీ తెలిపారు. ''ఫ్రాన్సు నుంచి 26 రఫేల్–ఎం ఫైటర్ జెట్లు, మూడు స్కార్పీన్ సబ్‌మెరీన్ల కొనుగోలుకు జనవరిలో ఒప్పందాలు కుదరనున్నాయి. ఒప్పందం చివరి దశలో ఉంది. రక్షణ శాఖపై ఏర్పాటైన కేబినెట్ దీనిపై ఆమోదముద్ర వేయనుంది. రానున్న జెట్ విమానాలను ఐఎన్ఎస్ విక్రాంత్‌పై మోహరిస్తాం''అని చెప్పారు. రెండు అణు జలాంతర్గాములను దేశీయంగా నిర్మించేందుకు కేంద్రం అంగీకారం తెలిపిందన్నారు. మొదటిది 2037 నాటికి, రెండోది 2039 నాటికి సిద్ధమవుతాయని త్రిపాఠీ వెల్లడించారు. ప్రాజెక్ట్–75 ఫ్రాన్స్ సాయంతో చేపట్టిన ఆరు స్కార్పీన్ సబ్‌మెరీన్ల నిర్మాణం మజ్‌గావ్‌లో పూర్తయ్యిందని వివరించారు. ప్రస్తుతం మరో 62 యుద్ధ నౌకలు, ఒక జలాంతర్గామి నౌకా నిర్మాణ కేంద్రాల్లో వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వచ్చే పదేళ్లలో మొత్తం 95 వరకు యుద్ధ నౌకలను సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 60 హెలికాప్టర్ల కొనుగోలుకూ కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు.

బీజేపీ 'మహా' పరిశీలకులుగా నిర్మల, రూపానీ

న్యూఢిల్లీ/థానే: మహారాష్ట్రలో బుధవారం జరిగే బీజేపీ కీలక శాసనసభాపక్ష భేటీకి పార్టీ పరిశీలకులుగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ హాజరు కానున్నారు. కొత్త సీఎం డిసెంబర్ ఐదో 5న ప్రమాణస్వీకారం చేస్తారని మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బావంకులే వెల్లడించడం తెలిసిందే. సీఎం ఎవరనేది ప్రకటించకున్నా దేవేంద్ర ఫడ్నవిస్‌కే అవకాశం దక్కుతుందంటున్నారు. కొత్త సీఎం ఎవరో 4న భేటీలోనే వెల్లడిస్తామని బీజేపీ సీనియర్ నేత ఒకరు సోమవారం తెలిపారు. ''కొత్త ఎమ్మెల్యేలతో సీతారామన్, రూపానీ చర్చిస్తారు. పార్టీ అగ్రనేతల ఆమోదంతో శాసనసభాపక్ష నేతను ప్రకటిస్తారు. ఆయనే సీఎం అవుతారు'' అన్నారు.

డిప్యూటీ సీఎం రేసులో లేను: శ్రీకాంత్

డిప్యూటీ సీఎం రేసులో తాను లేనని శివసేన చీఫ్, ఆపద్ధర్మ సీఎం ఏక్‌నాథ్ షిండే తనయుడు, ఎంపీ శ్రీకాంత్ స్పష్టంచేశారు. సీఎంగా చేసిన షిండే డిప్యూటీ సీఎంగా కొనసాగడం ఇష్టంలేక కుమారుడికి పదవి అప్పగిస్తారన్న వార్తలు రావడం తెలిసిందే. జ్వరం, గొంతు నొప్పితో శుక్రవారం సొంతూరికి వెళ్లిన ఏక్‌నాథ్ షిండే ఆదివారం సాయంత్రం ముంబైకి రాకుండా థానే వెళ్లారు. శాఖల కేటాయింపుపై మహాయుతి భేటీని రద్దు చేసుకున్నారు. బహుశా కొత్త ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండటం షిండేకు ఇష్టం లేదని ఆయన సన్నిహితులు అన్నారు. ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ బీజేపీ అగ్రనేతలను కలిసేందుకు సోమవారం ఢిల్లీకి వచ్చారు.

తొలి ప్రైవేట్ ఉపగ్రహం

- నిర్మాణం నుంచి నిర్వహణ దాకా
- హైదరాబాద్ కంపెనీ ఘనత

న్యూఢిల్లీ: అంతరిక్ష రంగంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. సమాచార ఉపగ్రహ నిర్మాణం నుంచి ప్రయోగం, నిర్వహణ దాకా అన్ని బాధ్యతలనూ తొలిసారిగా ఓ ప్రైవేట్ కంపెనీ చేపట్టనుంది. ఈ మేరకు భారత అంతరిక్ష రంగ నియంత్రణ సంస్థ ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ సెంటర్ (ఇన్‌స్పేస్) కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు హైదరాబాద్‌కు చెందిన అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఏటీఎల్)ను ఎంపిక చేసినట్టు సోమవారం ప్రకటించింది. ఇందుకు సంబంధించి కీలకమైన కక్ష్యపరమైన, ఇతరత్రా వనరులు వాడుకునేందుకు ఆ కంపెనీకి అనుమతులు జారీ చేసింది. ఒప్పందంలో భాగంగా హెచ్చు సామర్థ్యంతో కూడిన మల్టీ బీమ్ కేఏ బ్యాండ్ సమాచార ఉపగ్రహాన్ని ఏటీఎల్ అభివృద్ధి చేయనుంది. దాన్ని ప్రయోగించడంతో పాటు నిర్వహణ బాధ్యతలను కూడా సంస్థే చూసుకోనుందని ఇన్‌స్పేస్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ఉపగ్రహానికి సంబంధించి ఆపరేటర్లతో ఫ్రీక్వెన్సీ సమన్వయం తదితరాలన్నీ కూడా ఏటీఎల్ బాధ్యతేనని వివరించింది. దీన్ని భారత అంతరిక్ష రంగంలో నిర్ణయాత్మక ముందడుగుగా ఇన్‌స్పేస్ చైర్మన్ పవన్‌కుమార్ గోయంకా అభివర్ణించారు.

బెయిలివ్వగానే మంత్రిగా ప్రమాణమా?

డీఎంకే నేత సెంథిల్ బాలాజీ విషయంలో సుప్రీంకోర్టు విస్మయం



న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో బెయిల్ పొందిన వెంటనే నిందితుడు వి. సెంథిల్ బాలాజీ తమిళనాడు కేబినెట్ మంత్రిగా ప్రమాణంచేయడంపై సర్వోన్నత న్యాయస్థానం విస్మయం వ్యక్తంచేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎంకే నేత అత్యున్నత హోదాలో ఉంటే సాక్షులు ఒత్తిడికి గురయ్యే ప్రమాదముందన్న వాదనలను పరిశీలించేందుకు కోర్టు అంగీకారం తెలిపింది. సెంథిల్‌కు మంజూరుచేసిన బెయిల్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలంటూ కె.విద్యాకుమార్ దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌ల ధర్మాసనం సోమవారం విచారించింది. '' బెయిల్ ఇస్తూ సెప్టెంబర్ 26న జారీ అయిన సుప్రీంకోర్టు తీర్పు విషయంలో మళ్లీ మేం కలగజేసుకోం. ఆయనకు బెయిల్ న్యాయబద్ధంగానే వచ్చింది. అయితే సెంథిల్ మంత్రిగా ఉండటం వల్ల కేసులో సాక్షులపై ఒత్తిడి ఉంటుందా ఉండదా? అనే అంశాన్ని మాత్రం మేం పరిశీలిస్తాం' అని బెంచ్ పేర్కొంది. '' నిందితుడికి బెయిల్ వచ్చిన నాలుగు రోజులకే కేబినెట్ మంత్రి పదవి కట్టబెట్టడం ఏంటి? అసలేం జరుగుతోంది?' అని సెంథిల్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, న్యాయ వాది రాంశంకర్‌లపై ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది.

బెయిల్ దశలోనే నేర నిర్ధారణ వద్దు

హైకోర్టులకు సుప్రీం హితవు

న్యూఢిల్లీ: క్రిమినల్ కేసుల్లో బెయిల్ దశలోనే సాక్ష్యాధారాల పరిశీలన, నేర నిర్ధారణ వంటివి కూడదని హైకోర్టులకు సర్వోన్నత న్యాయస్థానం హితవు పలికింది. నిందితుడు దోషేనా, కాదా అన్నదానిపై బెయిల్ దశలోనే నిర్ణయానికి రాకూడదని పేర్కొంది. ఇటీవల ఓ బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం సోమవారం కొట్టేసింది. ''ఈ ఉత్తర్వులను ఒక్క రోజు కూడా అనుమతించలేం. అలా అనుమతిస్తే హైకోర్టులు ఇకపై నిందితులను బెయిల్ దశలోనే దోషులుగా తేల్చడమో, నిర్దోషులంటూ వదిలేయడమో చేస్తాయి'' అంటూ కీలక వ్యాఖ్యలు చేసింది. కేసు మంచి చెడులపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయకుండా బెయిల్ పిటిషన్‌ను పునర్విచారణకు స్వీకరించాలని ఈ సందర్భంగా హైకోర్టును ఆదేశించింది.



సెల్ఫ్ డ్రైవ్ పేరిట...

సెల్ఫ్ డ్రైవ్ పేరుతో కార్లు అద్దెకు తీసుకుని మరొకరి వద్ద కుదువ పెట్టిన మహిళ ఆటకట్టించారు రాయదుర్గం పోలీసులు. ఆమెతో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. -8లో



కేక పుట్టించే టేస్ట్

కేక్స్..నగరవాసుల వేగవంతమైన డైలీ రొటీన్ లైఫ్‌లో భాగం అయిపోయాయి. విభిన్న రుచులు..రకాలైన కేకులు ఇప్పుడు ట్రెండీగా మారాయి. డిసెంబర్ మాసమంతా ఇక కేకుల సందడే. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
28.0/22.0

వాతావరణం

నగరంలో మంగళవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు బాగా కురుస్తుంది. చలి బాగా పెరుగుతుంది. రాత్రి వేళ చల్లని గాలులు వీస్తాయి.

ట్రాఫిక్ విధుల్లో మంత్రి శ్రీధర్ బాబు



ట్రాఫిక్ క్లియర్ చేసే పనిలో మంత్రి శ్రీధర్‌బాబు

బంజారాహిల్స్: రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ట్రాఫిక్ పోలీసు అవతారమెత్తారు. ఓ కారు రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా అదే రూట్‌లో వెళ్తున్న మంత్రి కారు దిగి స్వయంగా ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. వివరాల్లోకి వెళితే..ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ట్యాంక్‌బండ్ వైపు నుంచి వస్తున్న ఓ కారు అంబేడ్కర్ కూడలి వైపు అదుపుతప్పి ఫుట్‌పాత్‌పైకి దూసుకువెళ్లింది. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో ఆదర్శ నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి యూటర్న్ తీసుకుని సెక్రటేరియట్ వైపు వెళ్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తన వాహనం ఆపి కిందికి దిగి ట్రాఫిక్‌ను చక్కదిద్దే పనిలో పడ్డారు. ఆయనకు సెక్యూరిటీ సిబ్బంది కూడా సహకరించి ప్రమాదానికి గురైన కారును అక్కడి నుంచి పక్కకు జరిపారు. ఈ లోగా మంత్రి వ్యక్తిగత సహాయకులు ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. దాదాపు 10 నిమిషాల పాటు శ్రీధర్‌బాబు అక్కడే ఉండి ట్రాఫిక్‌కు అవాంతరం లేకుండా చూసి అక్కడి నుంచి వెళ్లారు.

శిశువిహార్ చిన్నారులకు అన్ని ధ్రువీకరణ పత్రాలు

కలెక్టర్ అనుదీప్



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న కలెక్టర్

వెంగళరావునగర్: జిల్లాలోని అన్ని ఎన్‌జీవో, శిశువిహార్ సంరక్షణ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు వారంరోజుల్లో అన్ని ధ్రువీకరణ పత్రాలను అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లోని మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రాంగణంలోని శిశువిహార్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిశువిహార్‌లో ఏర్పాటు చేసిన రెవెన్యూ, మీ–సేవ, జీహెచ్‌ఎంసీ ప్రత్యేక కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన స్టేట్‌హోం అధికారులతో వివిధ అంశాలపై చర్చించారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం వైద్యాధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి చిన్నారికి జనన, కుల, ఆదాయ, ఇతర ధ్రువపత్రాలను వారంలోగా ఇవ్వడం పూర్తి చేయాలని అన్నారు. ఆయాశాఖల సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలుత ఆయన 8 నెలల బాలికకు జనన ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర రావు, ఆర్‌డీఓ సాయిరాం, డీసీపీఓ శ్రీనివాస్, తహశీల్దార్ నయీముద్దీన్, సీడీపీఓ, ఐసీడీఎస్, బాలరక్ష భవన్ కో ఆర్డినేటర్ సుమలత, యూనిసెఫ్ స్టేట్ కో ఆర్డినేటర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ వద్ద సంపును పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

రోడ్లపై నీటి నిల్వలుండొద్దు

వచ్చే వర్షాకాలానికి ట్రాఫిక్ చిక్కులు తొలగిపోవాలి

అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి

- రెయిన్ వాటర్ సంప్‌ల పరిశీలన
- పకడ్బందీగా నిర్మించాలని సూచన

సాక్షి, సిటీబ్యూరో: రోడ్లపై నిలిచే వర్షం నీటిని మళ్లిస్తే నగరంలో ట్రాఫిక్ చిక్కులను నివారించవచ్చని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ వద్ద వరద నివారణ కోసం నిర్మిస్తున్న రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్ (రెయిన్ వాటర్ సంప్) పనుల్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, వరద నివారణ చర్యలపై పలు సూచనలు చేశారు. వచ్చే వర్షాకాలం నాటికి నగరంలో నీటి నిల్వలు, ట్రాఫిక్ చిక్కులున్న ప్రాంతాలుగా గుర్తించిన 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద రెయిన్‌వాటర్ సంప్‌ల పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కొన్నిచోట్ల రెయిన్‌వాటర్ సంప్‌ల డిజైన్‌ను మార్చాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హై..‘హైసిటీ’!

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్న సీఎం
- హైసిటీ పనులకు నేడు శ్రీకారం

పలు ఫ్లైఓవర్లు, రహదారుల విస్తరణ, జంక్షన్ల సుందరీకరణ



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ‘హై సిటీ’ పనులకు మంగళవారం శ్రీకారం చుడుతున్నారు. దాదాపు రూ.3667 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ నగరానికి సంబంధించి ‘హై సిటీ’ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పనులు చేపడుతున్నారు. తొలుత ఇంకా ఎక్కువ పనులు చేపట్టాలనుకున్నా క్షేత్రస్థాయి పరిస్థితులు, ట్రాఫిక్ మళ్లింపులు, నిధులు, ఇతరత్రా అంశాలను పరిగణనలోకి తీసుకొని వీటిని ఖరారు చేశారు. వీటిల్లో జీహెచ్‌ఎంసీకి సంబంధించి రూ. దాదాపు రూ.3500 కోట్ల ఖర్చయ్యే ఫ్లై ఓవర్లు, రహదారుల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. వీటితోపాటు జంక్షన్ల సుందరీకరణ తదితర పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అన్నింటినీ కలిపి ఐమాక్స్ సమీపంలో ఒకే వేదిక నుంచి చేయనున్నారు.

కేబీఆర్ పార్కుచుట్టూ..

కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు జంక్షన్ల వద్ద ట్రాఫిక్ జంజాటాలు తప్పించేందుకు అవసరమైన ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. వీటితో పాటు ఐటీ కారిడార్‌లో కొన్ని పనులున్నాయి. ఇంకా ఆయా ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల పనులు కూడా ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిటీకి సంబంధించిన వివిధ పనుల్ని హై సిటీ ప్రాజెక్ట్ కింద చేస్తున్నారు. హైసిటీ ఫేజ్–1 కింద దిగువ పేర్కొన్న పనులకు శంకుస్థాపన చేయనున్నారు.



కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు..

- రూ.580 కోట్లతో కేబీఆర్ ఎంట్రెన్స్ జంక్షన్, జూబ్లీ చెక్‌పోస్ట్ జంక్షన్, రోడ్‌నెంబర్–45 జంక్షన్‌ల వద్ద పనులు చేపడతారు.
- రూ.510 కోట్లతో ఫిల్మ్‌నగర్, అగ్రసేన్, క్యాన్సర్‌హాస్పిటల్ జంక్షన్ల వద్ద, రూ.398 కోట్లతో రేతిబౌలి, నానల్‌నగర్ జంక్షన్ల వద్ద పనులు చేపడతారు.

ఫ్లై ఓవర్లు..

- ఖాజాగూడ జంక్షన్: రూ.220 కోట్లు
- ఐఐఐటీ జంక్షన్ : 459 కోట్లు
- విప్రో జంక్షన్: 158 కోట్లు.
- మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్‌రోడ్, కాటేదాన్ జంక్షన్: రూ.200 కోట్లు

రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులు..

- ఎన్‌హెచ్ 65–అమీన్‌పూర్: రూ.45 కోట్లు
- సైబరాబాద్ సీపీ ఆఫీస్–గచ్చిబౌలి జంక్షన్: రూ.39 కోట్లు
- అంజయ్యనగర్–రాంకీ టవర్ రోడ్: రూ.31 కోట్లు
- అజీమ్ హోటల్–చర్చిగేట్: రూ.11 కోట్లు.
- చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్స్–బార్కాస్:రూ.9 కోట్లు
- లక్కీస్టార్ హోటల్– హఫీజ్‌బాబానగర్: రూ.57 కోట్లు.

ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలు..

- ఆర్‌కే పురం ఆర్‌ఓబీ : రూ.210 కోట్లు
- ఆర్‌కేపురం ఆర్‌యూబీ: రూ.35 కోట్లు
- చిలకలగూడ ఆర్‌యూబీ: రూ.30 కోట్లు
- ఆరాంఘర్ జంక్షన్: రూ.59 కోట్లు

ఇతర పనులు..

- ఫాక్స్‌సాగర్ పైప్‌లైన్‌పై స్టీల్ బ్రిడ్జి:రూ.56 కోట్లు.
- ఒవైసీ ఫ్లై ఓవర్ డౌన్‌ర్యాంప్: రూ.339 కోట్లు.

ఇంకా..

- రూ.150 కోట్లతో జంక్షన్లు, రహదారులు, తదితర ప్రాంతాల్లో 283 సుందరీకరణ పనులు, రూ.16.50 కోట్లతో రెయిన్‌వాటర్ హోల్డింగ్స్ స్ట్రక్చర్స్ పనుల్లో పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు.
- పురపాలక శాఖకు చెందిన కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో 2కే రన్‌లు నిర్వహించనున్నారు. కొన్ని సర్కిళ్లలో ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లు ప్రారంభించనున్నారు. పలు ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆరు ఎస్టీపీలు..12 రిజర్వాయర్లు



- మహానగరంలో వంద శాతం మురుగుశుద్ధిలో భాగంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ఆరు మురుగుశుద్ధి కేంద్రాలు(ఎస్టీపీలు), 12 మంచినీటి రిజర్వాయర్లు మంగళవారం ప్రారంభమవనున్నాయి.
- ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి హెచ్‌ఎండీఏ గ్రౌండ్ నుంచి నాగోల్, ఫతేనగర్, మీరాలం, ఖాజాకుంట, మియాపూర్, సఫిల్‌గూడ ఎస్టీపీలను లాంఛనంగా ప్రారంభిస్తారు. అదేవిధంగా 12 మంచి నీటి రిజర్వాయర్లను సైతం ప్రారంభించనున్నారు.

రైళ్లలో ‘బెర్త్‌ల’ దందా!



ఏసీ బెర్త్‌కు రూ.1000.. నాన్ ఏసీకి రూ.500

- రైళ్లలో కొందరు టీసీల చేతివాటం
- వెయిటింగ్‌లిస్ట్ ప్రయాణికులకు బెర్త్‌ల విక్రయాలు
- ప్రయాణికుల డిమాండ్ ఉన్న రైళ్లలో వసూళ్లు

సాక్షి, సిటీబ్యూరో: ఏసీ బెర్త్‌కు రూ.1000..నాన్ ఏసీ బెర్త్‌కు రూ.500. ఇవి టికెట్ చార్జీలు కాదు. వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులు బెర్తులు కావాలంటే టికెట్ కలెక్టర్లకు (టీసీలకు) సమర్పించుకోవలసిన ఆమ్యామ్యాలు. ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉన్న రైళ్లు, కొన్ని ప్రత్యేక రైళ్లలో ఈ తరహా బేరాలు జోరుగా సాగుతున్నాయి. టీసీలే స్వయంగా డబ్బులు తీసుకొని బెర్తులు కట్టబెట్టడంతో వెయిటింగ్‌లిస్ట్‌లో ఉన్న వారు నిశ్చింతంగా ప్రయాణం చేస్తున్నారు. నిజానికి టికెట్ నిర్ధారణ అయితే తప్ప ట్రైన్‌లో ప్రయాణం చేసేందుకు అవకాశం లేదు. ప్రతి ట్రైన్ బయలుదేరడానికి 4 గంటల ముందు ప్రయాణికుల జాబితా విడుదల అవుతుంది. ఆ జాబితాలో ఉన్న వాళ్లు మాత్రమే రిజర్వేషన్ లభించిన ప్రయాణికులు. కానీ ప్రతి ట్రైన్‌కు వందల సంఖ్యలో వెయిటింగ్‌లిస్ట్ ప్రయాణికులు ఉంటారు. చార్ట్ (జాబితా) సిద్ధమైన తరువాత వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులు తమ టికెట్‌లను రద్దు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారికి టికెట్ డబ్బులు వారి ఖాతాలోకి ఆటోమేటిక్‌గా రీఫండ్ అవుతాయి. కానీ కొందరు ప్రయాణికులు వెయిటింగ్ లిస్ట్ టికెట్‌లపైనే ప్రయాణం చేస్తారు. ఏదో ఒకవిధంగా వెళ్లిపోవాలనే ఉద్దేశంతో టికెట్‌లను రద్దు చేసుకోకుండా ప్రయాణాన్ని కొనసాగిస్తారు. డిమాండ్, రద్దీ ఎక్కువగా ఉన్న రైళ్లలో ఈ తాకిడి మరింత తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులపైనే కొందరు టీసీలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. నాన్ ఏసీ స్లీపర్ బోగీల్లో బెర్తులకు రూ.500, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ వంటి బోగీల్లో బెర్తులకు రూ.1000 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

శబరి రైళ్లకు డిమాండ్ ఫుల్...

ప్రస్తుతం హైదరాబాద్ నుంచి అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున శబరిమలకు తరలివెళ్తున్నారు. కొంత మంది సాధారణ భక్తులు సైతం దర్శనానికి వెళ్తున్నారు. దీంతో ప్రతిరోజు రాకపోకలు సాగించే శబరి ఎక్స్‌ప్రెస్‌తో పాటు ప్రత్యేక రైళ్లకు సైతం డిమాండ్ బాగా ఉంది. రోడ్డు మార్గంలో వెళ్లాలన్నా, ఫ్లైట్‌లో వెళ్లాలన్నా పెద్దమొత్తంలో వెచ్చించవలసి ఉంటుంది. చార్జీల భారం దృష్ట్యా ఏదోఒకవిధంగా రైళ్లలో వెళ్లడమే మంచిదని భావించే వెయిటింగ్‌లిస్ట్ ప్రయాణికుల అవసరాన్ని కొందరు టీసీలు సొమ్ము చేసుకుంటున్నారు. నగరంలోని వనస్థలిపురం, నాగోల్ ప్రాంతాలకు చెందిన నలుగురు స్నేహితులు నవంబర్ 27వ తేదీన 12 గంటలకు శబరి ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెంబర్ 17230)లో సికింద్రాబాద్ నుంచి శబరికి బయలుదేరారు. వాళ్ల ప్రయాణానికి ఇంచుమించు నెల రోజుల క్రితమే సెకండ్ ఏసీ రిజర్వేషన్ కోసం టికెట్‌లు కొనుగోలు చేశారు. కానీ ప్రయాణ తేదీ నాటికి కూడా టికెట్‌లు నిర్ధారణ కాలేదు. రిజర్వేషన్ లభించలేదు. చార్ట్ (ప్రయాణికుల జాబితా) సిద్ధమైన తరువాత కూడా ఆ ప్రయాణికులు వెయిటింగ్ జాబితా (5 నుంచి 8 వరకు)లోనే ఉండిపోయారు. అయినప్పటికీ టికెట్‌లను రద్దు చేసుకోకుండా అదే ట్రైన్‌లో బయలుదేరారు. రైలు ప్రారంభమైన కొద్దిసేపటికి వెళ్లి టీసీని సంప్రదించారు. ‘మొదట్లో ఎలాంటి గ్యారంటీ ఇవ్వకపోయినప్పటికీ ట్రైన్ తిరుపతికి చేరుకున్న తరువాత ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.1000 చొప్పున మొత్తం రూ.4000 తీసుకొని నాలుగు బెర్తులు కేటాయించాడు. సెకండ్ ఏసీలోనే ఆ సదుపాయం లభించడంతో ప్రయాణం నిశ్చింతగా సాగింది.’ అని ఆ ప్రయాణికులు చెప్పారు. తమతో పాటు మరి కొందరికి కూడా రూ.1000 చొప్పున తీసుకొని ఏసీ బోగీల్లో, రూ.500 చొప్పున తీసుకొని స్లీపర్‌లో బెర్తులు ఇచ్చినట్లు వారు చెప్పారు.

ఎలా సాధ్యం...

- రిజర్వేషన్లు నిర్ధారణ అయిన ప్రయాణికులు ఆకస్మికంగా తమ ప్రయాణాలను రద్దు చేసుకో వచ్చు. అలాంటి వాళ్ల సంఖ్య తక్కువగానే ఉంటుంది. ట్రైన్‌లో విధులు నిర్వహించే టికెట్ ఎగ్జామినర్, టికెట్ కలెక్టర్, తదితర సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రయాణికుల వివరాలను తమ వద్ద ఉండే హ్యాండ్ హెల్డ్ మిషన్‌లలో నమోదు చేయాలి.
- ఈ క్రమంలోనే కొందరు టీసీలు ఇలాంటి ప్రయాణికుల వివరాలను నమోదు చేయడంలోనే తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్నారు.
- సదరు ప్రయాణికుల పేరు వద్ద ‘క్యాన్సిల్’ అని కాకుండా ‘జాయిన్’ అని నమోదు చేసి ఆ బెర్తులను వెయిటింగ్ లిస్ట్ వాళ్లకు కేటాయిస్తున్నారు. అయితే ఆన్‌లైన్ టికెట్‌లపైన ఇది సాధ్యం కాదు. రిజర్వేషన్ కేంద్రాల్లో కొనుగోలు చేసిన వెయిటింగ్ లిస్ట్ టికెట్‌లపైనే టీసీలు ఈ తరహా ప్రయోగాలు చేస్తున్నట్లు సమాచారం.

‘పాస్‌పోర్ట్స్’ కేసు సీసీఎస్‌కు బదిలీ



సాక్షి, సిటీబ్యూరో : నకిలీ ఓటర్ ఐడీ కార్డులు తయారు చేసి..వాటిని ఆధారంగా చూపిస్తూ విదేశీయులకు ఆధార్‌కార్డులు, పాస్‌పోర్టులు ఇప్పించిన సికింద్రాబాద్ కళాసిగూడకు చెందిన రాజ్‌కుమార్ ఆర్‌ఎస్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌పై నమోదైన కేసును సీసీఎస్ అధీనంలోని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) దర్యాప్తు చేపట్టింది. ఈ మేరకు మహంకాళీ పోలీస్ స్టేషన్ నుంచి ఈ కేసు బదిలీ కావడంతో సీసీఎస్‌లో తాజాగా కేసు నమోదు చేసి దానిని సిట్‌కు బదిలీ చేశారు. యెల్లం రాజ్‌కుమార్ సికింద్రాబాద్‌లో ఆర్‌ఎస్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. అతడికి సర్వశిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేసే ఎల్బీ నగర్‌కు చెందిన ఎండీ మహబూబ్ సహకరించాడు. మహబూబ్‌కు స్కూళ్లలో ఆధార్ కార్డుల్లో చేర్పులు మార్పులు చేసేందుకు ఆధార్ నుంచి అనుమతి ఉంది. ఈ అవకాశాన్ని వాడుకుని రాజ్‌కుమార్ సెంటర్‌లో ఇష్టానుసారంగా నకిలీ ఆధార్‌కార్డులు తయారు చేశారు. అలాగే రాచమల్ల విజయ లక్ష్మి, కురపాటి పల్లవి ఈ సర్వీస్ సెంటర్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ డెస్క్‌టాప్ అప్లికేషన్ మ్యాజికల్/యూనివర్సల్ యాప్‌లను ఉపయోగించి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేయడం, నకిలీ సంతకాలు చేయడం చేసేవారు. పాస్‌పోర్ట్ ఏజెంట్‌గా పనిచేస్తున్న బండి శంకర్, జీహెచ్‌ఎంసీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే గిరిరాజ్ అనిల్‌కుమార్‌తో ముఠాగా ఏర్పడిన వీరు అసలైన ఆధార్, ఓటర్ కార్డులు, పాస్‌పోర్టులు ఇప్పించడంతో పాటు అవసరమైన వారికి నకిలీ బర్త్ సర్టిఫికేట్లు, ఓటర్ ఐడీ, ఆధార్, పాస్‌పోర్టులు ఇతరత్రా సర్టిఫికెట్లు తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. ఈ సెంటర్ నుంచి పదేళ్లలో 50 వేల ఓటర్ కార్డులు జారీ కాగా అందులో వెయ్యికి పైగా నకిలీ ఓటర్, 750 నకిలీ బర్త్, 1500 నకిలీ ఆధార్‌కార్డులు జారీ అయ్యాయి. వీటి ఆధారంగా నేపాల్‌కు చెందిన వారు 50 మంది పాస్‌పోర్టులను కూడా పొందినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. మహంకాళీ ఠాణాలో నమోదైన కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. అయితే నకిలీ పాసుపోర్టులు కూడా విదేశీయులు పొందడంతో దేశ భద్రతకు సంబంధించిన అంశం ముడిపడి ఉండడంతో ఈ కేసును సిట్‌కు అప్పగించి లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

వెంటాడిన మృత్యువు!

ఆ కుటుంబాన్ని ‘చుట్టుముట్టిన’ రోడ్డు ప్రమాదాలు

- 2022 అక్టోబర్‌లోనూ యాక్సిడెంట్ బారిన దినేష్ గిరి
- అప్పట్లో తీవ్రగాయాలతో బతికి బయటపడిన వైనం
- ‘లంగర్‌హౌస్ దుర్ఘటన’లో భార్యతో సహా మృతి
- మోన కుటుంబంలోనూ విషాద ఘటనలు

సాక్షి, సిటీబ్యూరో/లంగర్‌హౌస్: మద్యం మత్తులో కారు నడుపుతూ వచ్చిన వ్యక్తి శనివారం రాత్రి లంగర్‌హౌస్‌లోని మిలటరీ వాటర్ ట్యాంక్ వద్ద చేసిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన భార్యాభర్తలు మోన ఠాకూర్, దినేష్ గిరిలను యాక్సిడెంట్స్ వెంటాడాయి. మోన కుటుంబంలో ఇద్దరు ప్రమాదాల బారినపడి మృతి చెందగా..దినేష్‌ను రెండేళ్ల క్రితం ఓ ‘నిషా’చరుడు ఢీ కొట్టాడు. అప్పట్లో తీవ్రగాయాలతో బయటపడినా..ఇప్పుడు మరో మందుబాబు డ్రైవింగ్‌కు భార్యతో సహా అశువులుబాశారు. మోన ప్రస్తుతం నాలుగు నెలల గర్భవతి కావడంతో కుటుంబీకులు, తల్లిని కోల్పోవడంతో ఇద్దరు చిన్నారులు తల్లడిల్లిపోతున్నారు.

అప్పుడు బతికిపోయినా ఇప్పుడు...

బంజారాహిల్స్‌కు చెందిన దినేష్ గిరికి, ఇద్దరు పిల్లలు పుట్టాక భర్త నుంచి విడిపోయిన లంగర్‌హౌస్‌కు చెందిన మోన ఠాకూర్‌కు 2022లో వివాహం నిశ్చయమైంది. ఆ ఏడాది అక్టోబర్ 6న దినేష్ తన ద్విచక్ర వాహనంపై ట్యాంక్‌బండ్ నుంచి ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. లక్డీకాపూల్ ప్రాంతంలో మద్యం మత్తులో కారు నడుపుతూ వచ్చిన పవన్ రెండు ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టాడు. వాటిలో ఓ వాహనంపై ఉన్న దినేష్‌కు ముఖం, తల, ఛాతి భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. దాదాపు నెల రోజులు ఆస్పత్రిలో చికిత్స పొంది బయటపడ్డారు. అప్పటికీ వివిధ సర్జరీల కారణంగా పూర్తిగా కోలుకోవడానికి ఏడు నెలలు పట్టింది. దీంతో మోనతో జరగాల్సిన పెళ్లి ఆలస్యమై... 2023 మే 25న ఒక్కటయ్యారు.

ఆమె కుటుంబంలోనూ విషాదాలెన్నో...

లంగర్‌హౌస్ పెన్షన్‌పురకు చెందిన మోన ఠాకూర్ కుటుంబంలోనూ విషాదాలు ఎన్నో ఉన్నాయి. ఈమె తండ్రి భగవాన్ సింగ్ మొదటి భార్య ఇందిర రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రెండో భార్య రత్నభాయికి పుట్టిన సంతానమే మోన. మొదటి భార్య కుమారుడు బచ్చన్ (మోన సవతి సోదరుడు) వెల్డింగ్ పనులు చేస్తూ జీవించే వారు. 2007 మేలో తన సమీప బంధువుతో ద్విచక్ర వాహనంపై వెళ్తూ శంషాబాద్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. శనివారం రాత్రి లంగర్‌హౌస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్తతో సహా మోన కన్నుమూసింది. ఆ సమయానికి ఆమె నాలుగు నెలల గర్భవతి కావడంతో కుటుంబీకులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.



అనాథలైన చిన్నారులు

సొంత తండ్రి వద్ద దొరకని ప్రేమ దినేష్ వద్ద...

మోనకు మొదటి భర్త ద్వారా ఇద్దరు కుమార్తెలు కలిగారు. ప్రేరణ శ్రీ (12) తొమ్మిదో తరగతి, ధ్రితి శ్రీ (9) ఐదో తరగతి చదువుతున్నారు. ఒకేసారి రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో వీళ్లు అనాథలుగా మారారు. తమ సొంత తండ్రి నిత్యం గొడవలు పడేవాడని, తమను వేధించేవాడని ఈ చిన్నారులు చెబుతున్నారు. దినేష్ గిరి సవతి తండ్రి అయినప్పటికీ..సొంత బిడ్డల్లా ప్రేమగా చూసుకునే వాడని చెప్తూ కన్నీరుమున్నీరవుతున్నారు. తాము తల్లిదండ్రులతో కలిసి గడిచిన 18 నెలల్లో ఎన్నో సందర్శనీయ ప్రాంతాలకు వెళ్లి సరదాగా గడిపి వచ్చామని జ్ఞాపకం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు ఎక్కడకు వెళ్లినా తమను తీసుకునే వెళ్లేవారని, అయితే పరీక్షల కారణంగా ఇటీవల గోవా వెళ్లలేకపోయామని చెప్తున్నారు. దీంతో గోవా నుంచి వచ్చిన రోజే తాము కోరడంతో ఆహారం తేవడానికి వెళ్లి కన్నుమూశారని బాధగా చెప్తున్నారు.

ప్రణయ్‌ను పోలీసు కస్టడీకి కోరాం

లంగర్‌హౌస్ రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడు ప్రణయ్‌ను అరెస్టు చేశాం. ఆదివారం రాత్రి కోర్టులో ప్రవేశపెట్టే సమయానికి మత్తు నుంచి బయటపడ్డాడు. ప్రమాదం జరిగిన విషయం కూడా తనకు తెలియదని, మద్యం మత్తులో ఏమి చేశానో తెలియదని చెబుతున్నాడు. స్నేహితులతో కాకుండా తాను ఒక్కడినే మద్యం తాగానని చెబుతున్నాడు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు రాబట్టడానికి నిందితుడిని పోలీసు కస్టడీకి అప్పగించాలని కోర్టును కోరాం.

– కె.రఘుకుమార్, లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్

అదుపు తప్పి పిల్లర్‌ను ఢీకొట్టిన కారు

భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు



ధ్వంసమైన కారు

గచ్చిబౌలి: వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పిన పిల్లర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న దంపతుల్లో భర్త అక్కడికక్కడే మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శశిపాల్ రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో నివాసం ఉండే షేక్ హనీఫ్(48), షేక్ నూర్జహాన్ దంపతులు ఆదివారం రాత్రి కారులో నానక్‌రాం గూడ వైపు వెళుతుండగా వట్టినాగులపల్లిలోని ముపీ టవర్స్ సమీపంలో ఔటర్ సర్వీస్ రోడ్డులో కారు అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న పిల్లర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో హనీఫ్ అక్కడికక్కడే మృతి చెందగా నూర్జహాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. నూర్జాహాన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమోషన్ ప్లీజ్!

1990 బ్యాచ్ హెడ్-కానిస్టేబుళ్లకు మధ్యలో బ్రేక్

- ఇంకా పదోన్నతి రావాల్సిన వారు 92 మంది
- ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో హెచ్‌సీగానే రిటైర్
- అర్హత ఉన్నా పొందలేకపోతున్న పలువురు సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: ఎస్పీగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఐపీఎస్ అధికారి రిటైర్ అయ్యే లోపు కనిష్ఠంగా నాలుగు పదోన్నతులు పొందుతారు... డీఎస్పీగా పోలీసు విభాగంలో చేరిన రాష్ట్ర సర్వీసు అధికారి పదవీ విరమణ పొందే లోపు గరిష్ఠంగా ఐదు పదోన్నతులు పొందే అవకాశం ఉంది... కానీ, కానిస్టేబుల్‌గా ఏళ్లు సేవలు అందించినా రెండో పదోన్నతికి కూడా గ్యారెంటీ లేదు. సంఖ్యతో పాటు పరిపాలనా పరమైన కారణాల వల్ల ఈ స్థాయిలో పదోన్నతులు తక్కువ. అయితే ప్రస్తుతం ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్ల అవకాశం ఉన్నా కొందరు హెడ్-కానిస్టేబుళ్లు (హెచ్‌సీ) ప్రమోషన్ లేకుండానే పదవీ విరమణ చేస్తున్నారు.

కింది స్థాయిలో పెద్ద సంఖ్యలో...

కొన్ని ఇతర విభాగాల మాదిరిగానే పోలీసు విభాగంలోనూ పై స్థాయి పోస్టులు తక్కువ సంఖ్యలో, కింది స్థాయివి భారీగా ఉంటాయి. కానిస్టేబుళ్లు వేల సంఖ్యలో ఉంటే... ఐపీఎస్‌లు రెండు వందల లోపే ఉంటారు. పోస్టులు సైతం అదే సంఖ్యలో ఉండటంతోనే ఉన్నతాధికారులకు వచ్చినంత వేగంగా కింది స్థాయి వారికి పదోన్నతుల రావు. ఈ విషయంలో కానిస్టేబుళ్ల పరిస్థితి మరీ ఘోరం. మూడు దశాబ్దాలకు పైగా సర్వీసు చేసినా రెండు పదోన్నతులు గగనం అవుతుంది. ఈ నేపథ్యంలోనే వీరు తమకు వచ్చిన అవకాశాన్ని ఏ మాత్రం వదులుకోవాలని భావించరు. సర్వీసు రికార్డు పాడయితే పదోన్నతి అడ్డంకిగా మారుతుందనే భయంతో గడుపుతూ ఉంటారు.

34 ఏళ్లకు రెండో ప్రమోషన్ అవకాశం...

పోలీసు విభాగంలోకి 1990లో కానిస్టేబుల్‌గా చేరిన వారికి 2016లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి వచ్చింది. జోనల్ వ్యవస్థలో సిబ్బంది పునర్విభజనకు సంబంధించిన 317 జీఓ నగరంలో పని చేస్తున్న కానిస్టేబుళ్లు, హెడ్-కానిస్టేబుళ్లకు ఇబ్బందికరంగా మారింది. ఇతర ప్రాంతాలకు చెందిన జూనియర్లు వీరిని మరింత వెనక్కి నెడుతూ పదోన్నతులు పొందుతున్నారు. దీనిని గమనించిన ఉన్నతాధికారులు ప్రతినెలా పదోన్నతులు చేపడుతున్నారు. ఏ నెలకు ఆ నెల రిటైర్ అయిన ఏఎస్సై పోస్టులను హెడ్-కానిస్టేబుళ్లకు పదోన్నతి ఇవ్వడం ద్వారా భర్తీ చేస్తున్నారు. అయితే కొన్నాళ్లుగా ఈ పదోన్నతులు ఆగిపోవడంతో 34 ఏళ్ల సర్వీసు చేసిన వారికీ రెండో పదోన్నతి కష్టసాధ్యమైంది.

అర్హత ఉన్నప్పటికీ..

ప్రస్తుతం 92 మంది హెచ్‌సీలు ఏఎస్సైలుగా పదోన్నతి పొందాల్సి ఉంది. సైబరాబాద్‌లో వీరి కంటే జూనియర్లు పదోన్నతులు పొందారు. కొత్త జోనల్ వ్యవస్థ వచ్చాక చార్మినార్ జోన్‌లో హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి కలిపారు. ఇలా కామన్ సీనియారిటీ తీయడంతో హైదరాబాద్‌లో పని చేసే కానిస్టేబుళ్లు, హెడ్-కానిస్టేబుళ్లు నష్టపోయారు, దీనికి తోడు అక్టోబర్, నవంబర్ నెలల్లో హెచ్‌సీ నుంచి ఏఎస్సై పదోన్నతులు ఇవ్వలేదు. దీంతో సుదీర్ఘ సర్వీసు చేసి, పదోన్నతి పొందే అవకాశం ఉన్న ఐదుగురు హెచ్‌సీగానే రిటైర్ అయ్యారు. మిగిలిన వారి పరిస్థితి కూడా ఇలా కాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బంది వాపోతున్నారు.

సెల్ఫ్ డ్రైవ్ పేరిట ఘరానా మోసం



స్వాధీనం చేసుకున్న కార్లతో మాదాపూర్ డీసీపీ వినీత్ తదితరులు

- అద్దెకు తీసుకున్న కార్లను తనఖాపెట్టిన మహిళ
- నలుగురు నిందితుల అరెస్ట్
- 21 కార్లు స్వాధీనం

గచ్చిబౌలి: సెల్ఫ్ డ్రైవ్ పేరుతో కార్లు అద్దెకు తీసుకుని మరొకరి వద్ద కుదవపెట్టిన మహిళతో పాటు మరో ముగ్గురిని రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ డాక్టర్ వినీత్ వివరాలు వెల్లడించారు. గచ్చిబౌలి టెలికాంనగర్‌లో నివాసం ఉంటున్న జుపూడి ఉషా సెల్ఫ్ డ్రైవ్ కోసం కార్లు అద్దెకు ఇస్తే రోజుకు రూ.2 నుంచి రూ.5 వేల వరకు అద్దె చెల్లిస్తానని ప్రచారం చేసుకుంది. దీంతో పలువురి నుంచి కార్లు తీసుకున్న ఆమె డ్రైవర్ తుడుముల మల్లేష్‌తో కలిసి వాటిని బీదర్‌కు చెందిన సాగర్ పాటిల్, అనీల్ జమానే వద్ద తనఖా పెట్టి రూ.50 లక్షలు తీసుకుంది. అవే కార్లను సాగర్, అనీల్ బీదర్, బల్కీ జిల్లాల్లో ఇతర వ్యక్తుల వద్ద కుదువపెట్టి ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకున్నారు. మూడు నెలలైనా అద్దె డబ్బులు ఇవ్వక పోవడంతో కార్ల యజమానులు ఉషాను నిలదీయగా ఇప్పుడు, అప్పుడు అంటూ కాలయాపన చేస్తుంది. అద్దె ఇవ్వక పోవడం, కార్ల ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళనకు గురైన బాధితులు రాయదుర్గం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు జియో ట్యాగ్‌ను తొలగించి కార్లను కర్నాటకలోని బీదర్, బల్కీ జిల్లాలకు తరలించినట్లు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా వివరాలు వెల్లడించారు.దీంతో నిందితులు ఉషా, మల్లేష్, సాగర్, అనిల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు వారి నుంచి రూ.2.5 కోట్ల విలువైన 21 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 4 మహీంద్రా థార్, 10 ఎర్టిగా, ఒక ఇన్నోవా క్రిస్టా, 3 స్విఫ్ట్ కార్లు, పది ఐ-10 , ఒక ఐ-20, ఒక వెన్యూ కార్లు ఉన్నాయి. సమావేశంలో మాదాపూర్ ఏడీసీపీ జయరాం, ఏసీపీ శ్రీకాంత్, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న, డీఐ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-1 AT HYDERABAD
PRESENT SHRI S.S.V.S. HARI KRISHNA, RECOVERY OFFICER
DATED THIS THE 14TH NOVEMBER, 2024

R.P.No.140/2005
IN
O.A.No.623/1999

Between
M/s. Asset Reconstruction Company (India) Ltd. (ARCIL), 10th Floor, The Ruby, Senapati Bapat Marg, Dadar (West), Mumbai - 400 028 .... Certificate Holder
And
M/s. Kera Sinter Ltd. & Others ...Certificate Debtors
To,
1. M/s. Kera Sinter Limited (in liquidation rep. by Official Liquidator) Kendriya Sadan, Sultan Bazar, Hyderabad ....Certificate Debtor No.1
2. Sri K.S. Reddy, S/o. Sri K.Sesha Reddy, Occ: Business, R/o. H.No.28, Jayaya Vihar, Near Kukatpally Housing Board Colony, Kukatpally, Hyderabad-500072 ...Certificate Debtor No.2
3. Sri P. Lakshmaiah, Occ. Business, R/o.Flat No.402, Srinivasa Towers, Begumpet, Hyderabad-500016 ...Certificate Debtor No.3

NOTICE

Whereas a Recovery Certificate bearing No. 140/2005 was issued by the Hon'ble Presiding Officer for recovery of an amount of Rs. 32,46,53,705/- (Thirty Two Crores Forty Six Lakhs Fifty Three Thousands Seven Hundred and Five Only) along with costs and future interest thereon from the Certificate Debtors in accordance with the same, the Recovery Officer initiated recovery proceedings under Section 29(4A) of Recovery of Debts & Bankruptcy Act, 1993.

"The Recovery Officer may, by order at any stage of the execution of the Certificate of Recovery, require any person, and in case of a company, any of its officers against whom or which the certificate of recovery is issued, to declare on affidavit the particulars of his or its assets"

In view of the above, you the Certificate Debtor No.3 is hereby directed to declare on an affidavit his personal properties / assets i.e. movables, immovables, shares, Mutual Funds, Investments and Bank account details or any other investments on oath along with Income Tax Returns for the last three years to the undersigned on 20.12.2024 at 10.30 AM for taking further action in the matter.

Given under my hand and seal of this Tribunal on this the 14th November, 2024.

Sd/- (S.S.V.S. Hari Krishna)
Recovery Officer

శోభిత మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

- ఆత్మహత్యగా నిర్ధారించిన పోలీసులు
- బెంగళూర్‌లో అంత్యక్రియలు



కన్నడ నటి శోభిత (ఫైల్)

గచ్చిబౌలి: కన్నడ నటి శోభిత మృతదేహానికి సోమవారం ఉస్మానియా హాస్పిటల్‌లో పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గచ్చిబౌలి పీఎస్ పరిధిలోని శ్రీరాంనగర్‌లో భర్త సుధీర్ రెడ్డితో కలిసి నివాసం ఉంటున్న శోభిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆమె కుటుంబసభ్యులు గచ్చిబౌలి పీఎస్‌కు వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లి పోస్టు మార్టం పూర్తయిన తర్వాత శోభిత మృతదేహాన్ని బెంగళూర్‌కు తీసుకెళ్లారు. శోభిత ఆత్మహత్యకు పాల్పడినట్లు పోస్టుమార్టంలో నిర్ధారణ అయినట్లు ఉస్మానియా వైద్యులు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న రోజు రాత్రి 10 గంటల సమయంలో శోభిత తన సోదరితో ఫోన్‌లో మాట్లాడిందని, తాము సంతోషంగా ఉన్నామని, కొద్ది రోజుల్లోనే ఇద్దరం కలిసి ఊరికి వస్తామని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. కాగా 'ఎవ్రీ థింగ్ ఫర్‌ఫెక్ట్, చావాలనుకుంటే దూఇట్' అని శోభిత రూమ్‌లో నోట్ రాసి ఉందని ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు వెల్లడి కాలేదని, శోభిత బంధువులు అనుమానాలు వ్యక్త చేయలేదని ఆయన పేర్కొన్నారు. భర్త అనుమానంతో డోర్ పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా శోభిత ఉరి వేసుకుని కనిపించిందని, ఆ సమయంలోనూ గదిలో భక్తి పాటలు ప్లే అవుతున్నట్లు తెలిసింది.

ఇటీవలే గోవాకు వెళ్లారు

కొద్ది రోజుల క్రితమే గోవాలో జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్‌కు శోభిత, సుధీర్ వెళ్లినట్లు తెలిసింది. తిరిగి వచ్చిన తర్వాత కూడా భార్యాభర్తలు బాగానే ఉన్నారని ఇరుగు పొరుగు వారితో పాటు వారి కుటుంబ సభ్యులు పేర్కొనడం గమనార్హం.

నటనకు అభ్యంతరం చెప్పలేదు: బుచ్చిరెడ్డి

మ్యాట్రిమోని ద్వారా ఇరు కుటుంబాల అంగీకారంతోనే వివాహం చేశామని శోభిత మామ(భర్త తండ్రి) బుచ్చిరెడ్డి పేర్కొన్నారు. సినిమాలు, సీరియల్స్‌లో నటించేందుకు తాము ఎప్పుడు అభ్యంతరం చెప్పలేదన్నారు. ఆమె ఎప్పుడు భగవంతుని ధ్యానంలో ఉండేదని, తమ ఇంట్లో కూతురి లాగా మెలిగిందని ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యురాలిని కోల్పోయామని, సుధీర్ రెడ్డి డిప్రెషన్‌లో ఉన్నాడన్నారు. శోభిత కుటుంబసభ్యుల కోరిక మేరకు బెంగళూర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పావుగంటలో ఇంటికి చేరతామనగా ..

- ఓఆర్‌ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- అక్కతమ్ముడిని కబళించిన మృత్యువు
- మరో నలుగురికి తీవ్ర గాయాలు



లారీకింద ఇరుక్కుపోయిన కారు

అబ్దుల్లాపూర్‌మెట్ : మరో 15 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనుకున్న అక్కా తమ్ముడిని మృత్యువు కబళించింది. ఓఆర్‌ఆర్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. వనపర్తి జిల్లా, కొత్తకోట మండలం, కానాయిపల్లె గ్రామానికి చెందిన ఎరగదిండ్ల మనోజ్ (25) అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని కుంట్లూర్‌కు చెందిన తన అక్క చల్లా పద్మ (31), బావ వెంకటేశ్, మేన కోడళ్లు గంగ, యమున, మేనల్లుడు చల్లా అర్జున్‌తో కలిసి సోమవారం ఉదయం వనపర్తి నుంచి కారులో కుంట్లూర్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో ఔటర్ రింగ్‌రోడ్డుపై కోహెడ -పెద్ద అంబర్‌పేట మార్గంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారుకు ముందు అతి వేగంగా వెళ్తున్న లారీని డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో కారులో ప్రయాణిస్తున్న మనోజ్ తేరుకునేలోపే లారీని వెనుకవైపు నుంచి బలంగా ఢీకొట్టడంతో కారు లారీలో ఇరుక్కుపోయింది. ఈ ఘటనలో మనోజ్‌తో పాటు పద్మ అక్కడికక్కడే మృతిచెందారు. మిగతా వారికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఓటీఎస్ రెస్పాన్స్ @ 14 శాతం

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి నల్లా నీటి పెండింగ్ బిల్లుల వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకానికి స్పందన 14 శాతం మించలేదు. పెండింగ్ బిల్లులను ఎలాంటి ఆలస్యం రుసుం, వడ్డీ లేకుండా చెల్లించేందుకు వెసులుబాటు కల్పించినా వినియోగదారులు సద్వినియోగం చేసుకోలేదు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని జలమండలికి బకాయి పడిన మొత్తం వినియోగదారుల్లో కేవలం 77,640 కనెక్షన్‌దారులు మాత్రమే ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకొని రూ.89.92 కోట్లు చెల్లించారు. మొత్తం మీద మొదటి నెలలో 70,335 మంది వినియోగదారులు సద్వినియోగం చేసుకోగా, రెండో నెలలో 7,315 మంది వినియోగదారులు మాత్రమే బకాయిలు చెల్లించినట్లు జలమండలి అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక గడువు ముగియడంతో ఆలస్య రుసుం, వడ్డీతో కలిపి పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది.

పెరిక యాదయ్య సేవలు అభినందనీయం



సాంఘిక సంక్షేమ అధికారి పెరిక యాదయ్యను సన్మానిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి,సిటీబ్యూరో: ఎస్సీ వసతి గృహాల్లో చదివే పేద పిల్లల ఉన్నతికి జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి పెరిక యాదయ్య చేసిన సేవలు అభినందనీయమని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పెరిక యాదయ్య పదవీ విరమణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెరిక యాదయ్య తన 34 ఏళ్ల సర్వీస్‌లో ఎస్సీ సంక్షేమ శాఖలో వివిధ హోదాల్లో సేవలందించారని కొనియాడారు. ఆనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరి వన్ పి, ముకుంద రెడ్డి, ఈ. వెంకట చారి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఆరోగ్య ఉత్సవాల్లో భాగంగా వర్చువల్ విధానంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నర్సింగ్ కళాశాల, మైత్రి క్లినిక్‌ను సోమవారం ఆదిబట్ల మున్సిపల్ పరిధి మంగళ్‌పల్లి సమీపంలోని భారత్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడుతూ.. ప్రజాపాలన -ప్రజా విజయోత్సవాల్లో భాగంగా నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయడం శుభసూచకమన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల నూతన భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్డీఓ అనంతరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత తదితరులు పాల్గొన్నారు.

పాన్‌షాప్ వద్ద గొడవ.. ఒకరి మృతి

అల్వాల్: పాన్‌మసాలా కొనుగోలు విషయంలో జరిగిన గొడవలో ఒకరు మృతి చెందిన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వినాయక నగర్ చౌరస్తాలోని పాన్‌షాప్ వద్ద సోమవారం సాయంత్రం ఓల్డ్ నేరేడ్‌మెట్‌కు చెందిన సెంట్రింగ్ కార్మికుడు బండారి రాము (38)పాన్ మసాలా కొనుగోలు చేసేందుకు వచ్చాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన శ్రీకాంత్ అనే వ్యక్తి తనకూ పాన్ మసాలా కావాలని గట్టిగా అరిచాడు. దీంతో రాము ఎందుకు అరుస్తున్నావ్ అని అంటూ శ్రీకాంత్‌ను ప్రశ్నించగా ఆగ్రహానికి లోనైన శ్రీకాంత్ రాముపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రాము అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. దీనిని గుర్తించిన శ్రీకాంత్ అక్కడి నుంచి పారిపోయాడు. రాము భార్య బండారు అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు శ్రీకాంత్ కోసం గాలిస్తున్నారు.

విశాఖ టు నిజామాబాద్

- తండ్రీకొడుకుల గంజాయి దందా
- సరుకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- 62 కిలోల గంజాయి, ఆటో, సెల్‌ఫోన్, రూ.10 వేల నగదు సీజ్



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

మహేశ్వరం: ఆటోలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి చెప్పారు. సోమవారం ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా, జక్రాన్‌పల్లి మండలం, తొర్లికొండ గ్రామానికి చెందిన మహ్మద్ మౌలానా ఆటో డ్రైవర్. అతను విశాఖపట్నం జిల్లా చింతపల్లికి చెందిన చిట్టిబాబు నుంచి గంజాయి కొనుగోలు చేసి ఆటోలో తీసుకువచ్చేవాడు. నిజామాబాద్ జిల్లా ధరమాబాద్(మహారాష్ట్ర బోర్డర్)కు చెందిన ప్రాణహిత అనే మహిళకు అధిక ధరకు విక్రయించేవాడు. గత శనివారం సాయంత్రం మౌలానా తన కుమారుడు మహ్మద్ ముస్తాఫాతో కలిసి తుని సమీపంలోని తాళ్లపాలెం వద్ద చిట్టిబాబు నుంచి 62.428 కిలోల(30 ప్యాకెట్లు) గంజాయిని కొనుగోలు చేశారు. ఆటోలో వెనుక భాగంలో ప్రత్యేకంగా తయారు చేయించిన ఫ్రేమ్‌లో గంజాయి ప్యాకెట్లు లోడ్ చేసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. రెగ్యులర్ రూట్‌లో వెళ్తే పోలీసు తనిఖీలుంటాయని మిర్యాలగూడ, దేవరకొండ, కల్వకుర్తి, మహేశ్వరం గేటు నుంచి శ్రీశైలం జాతీయ రహదారి, ఓఆర్‌ఆర్ మీదుగా నిజామాబాద్ వెళ్లాలనుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం కల్వకుర్తి నుంచి మహేశ్వరం గేటు వైపు ఆటోలో గంజాయి తరలిస్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు ఆటోను తనిఖీ చేయగా 62.428 కిలోల గంజాయి గుర్తించారు, టాటా ఏస్ ఆటోతో పాటు, మొబైల్ ఫోన్, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకుని మహ్మద్ మౌలానా, మహ్మద్ ముస్తాఫాలను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం నిందితులను రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మధుసూదన్, క్రైమ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

'చలో శ్రీలంక-బడే దిల్‌వాలే కార్డ్' ఆవిష్కరణ



సనత్‌నగర్: బేగంపేట కంట్రీ క్లబ్‌లో సినీనటి దక్షా నాగర్కర్ సందడి చేశారు. ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్‌రెడ్డితో కలిసి సోమవారం ఆమె 'చలో శ్రీలంక - బడే దిల్‌వాలే కార్డ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజీవ్‌రెడ్డి ఇటీవల తన శ్రీలంక పర్యటన గుర్తుచేసుకుంటూ.. 'చలో శ్రీలంక బడే దిల్‌వాలే కార్డ్' శ్రీలంకలో తన సొంత పర్యటన నుంచి ప్రేరణ పొంది రూపొందించబడిందన్నారు. కొలంబోలో అద్భుతమైన నైట్ లైఫ్, క్యాండీస్ ఐకానిక్ టెంపుల్ ఆఫ్ ద టూత్ రెలిక్, తుల్‌గాలాలో వైట్-వాటర్ రాఫ్టింగ్ వరకు ఎన్నో మధుర జ్ఞాపకాలు ఈ యాత్రతో పోగుచేసుకోవచ్చన్నారు. ప్రపంచ స్థాయి అనుభవాలను తమ సభ్యులకు అందించాలనుకుంటున్నామని, ఈ కార్యక్రమం ద్వారా తమ సభ్యులు కూడా అద్భుతమైన జ్ఞాపకాలను పొందగలరనే నమ్మకం తనకుందన్నారు. 'చలో శ్రీలంక'తో కంట్రీ క్లబ్ ఇండియా ప్రపంచ పర్యాటక రంగంలో కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పుతుందని, సభ్యులకు ప్రత్యేకమైన ప్రయాణ ప్రయోజనాలను మాత్రమే కాకుండా అర్థవంతమైన సాంస్కృతిక సంబంధాలను ఏర్పర్చుకునే అవకాశాన్ని కూడా అందిస్తోందని తెలిపారు. డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు శ్రీలంకను సందర్శించడానికి ఉత్తమ సమయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కూల్‌డ్రింక్ ఆశచూపి..

ఐదేళ్ల చిన్నారిపై లైంగికదాడి

జవహర్‌నగర్: కూల్ డ్రింక్ ఆశచూపి ఐదేళ్ల చిన్నారిపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జవహర్‌నగర్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆరేళ్ల క్రితం ఉత్తర్‌ప్రదేశ్ నుంచి వలస వచ్చిన ఓ కుటుంబం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. వీరికి కుమార్తె (05) యూకేజీ చదువుతోంది. వీరికి ఇంటి సమీపంలో అద్దెకు ఉంటున్న అదే రాష్ట్రానికి చెందిన పరమేశ్ వైర్ల కంపెనీలో పని చేస్తున్నాడు. కొంత కాలంగా తాగుడుకు బానిస కావడంతో పనిలోంచి తొలగించారు. ఆదివారం ఉదయం బాలిక ఇంటి ముందు ఆడుకుంటుండగా పరమేశ్ ఆమెను కూల్‌డ్రింక్ ఇప్పిస్తానని సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఏడుస్తూ ఇంటికి వచ్చిన చిన్నారిని గుర్తించిన తల్లిదండ్రులు విషయం తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేతనాల్లో అక్రమ కోతలు వెంటనే ఆపాలి

నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికుల డిమాండ్


సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటేష్

లక్డీకాపూల్ : నిమ్స్‌లో డబుల్ డ్యూటీ చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల్లో కోత వేధిస్తూ యాజమాన్యం శ్రమ దోపిడీకి పాల్పడుతుందని ఆ యూనియన్ అధ్యక్షుడు ఎం. వెంకటేష్ ఆరోపించారు. నిమ్స్‌లోని ఆంధ్రా బ్యాంక్ చౌరస్తాలో సోమవారం జరిగిన నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా డబుల్ డ్యూటీలు పది చేసినా..ఐదు చేసినా వేతనాల్లో అక్రమ కోతలు విధించడం దుర్మార్గపు చర్యగా పరిగణించారు. చివరికి పండుగలు, సెలవుల్లో కూడా వేతన కోతలు విధించడాన్ని ఆక్షేపించారు. ఈ పరిస్థితుల్లో వేతనాల్లో ఎలాంటి కోతలు విధించకుండా నిమ్స్ ఉద్యోగుల తరహాలోనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిమ్స్ ఉద్యోగులకు 1వ తేదీన చెల్లిస్తున్న యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు మాత్రం 7వ తేదీ వరకు వేతనాలు ఇవ్వకుండా వివక్ష చూపుతుందన్నారు. సకాలంలో వేతనాలు అందక కార్మికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులకు చెల్లిస్తున్న జీతాన్ని ఫిక్స్‌డ్ అలవెన్స్ రూపంలో చూపిస్తున్న రూ.1445లను గ్రాస్ వేతనంలో కలపాలన్నారు. కొత్తగా విధుల్లోకి చేరిన కాంట్రాక్ట్ కార్మికులకు కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ చెందిన కార్మికులకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తామని చేసిన వాగ్దానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెమి స్కిల్డ్ పోస్టులకు అర్హత కలిగిన కాంట్రాక్ట్ కార్మికులకు వయసుతో సంబంధం లేకుండా పదోన్నతి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో కార్మికులు చేపట్టబోయే ఆందోళన, నిరసన కార్యక్రమాలకు యాజమాన్యమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇ. నర్సింహులు, మాజీ ప్రధాన కార్యదర్శి బా లయ్య, నాయకులు డేవిడ్, గోపాల్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సుందరవనాలుగా పలు జంక్షన్లు

హార్టికల్చర్ డీడీ చంద్రశేఖర్


జీవీకే వద్ద జంక్షన్లను పరిశీలిస్తున్న హార్టికల్చర్ డీడీ చంద్రశేఖర్

బంజారాహిల్స్: ప్రధాన కూడళ్లతోపాటు, కాలనీలు, అంతర్గత రహదారుల జంక్షన్లను సుందరవనాలుగా మారుస్తున్నామని హార్టికల్చర్ డీడీ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆయన బంజారాహిల్స్ రోడ్‌నెం. 1లోని జీవీకే వన్ జంక్షన్ కూడలిని పార్కుల విభాగం అధికారి బాలయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లోని ప్రధాన రోడ్లతో పాటు కాలనీల జంక్షన్లను ఆరుకు పైగా అభివృద్ధి చేశామని మరిన్ని కూడళ్లను అందమైన మొక్కలు, నమూనాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జీవీకే వన్ జంక్షన్‌లో భారీగా ఉన్న ఐలాండ్‌లో అందమైన పూలమొక్కలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే దానంకు బీసీ నేతల వినతి



బంజారాహిల్స్: రిజర్వేషన్ అమలు, సావిత్రీబాయి పూలే విగ్రహాలను ఏర్పాటుతోపాటు పలు అంశాలపై బీసీ కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు సోమవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో చర్చించారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహయాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులగణన చేపట్టి కులాల వారీగా ఎంత జనాభా ఉందో ప్రకటించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు కులగణన చేసి 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలన్నారు. 52 శాతం పైగా ఉన్న బీసీలకు విద్య, ఉపాధి, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. బీసీలకు ప్రభుత్వ రంగ సంస్థల్లో, ప్రభుత్వ యంత్రాంగంలో ప్రాముఖ్యత కల్పించాలని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థల్లో, ప్రభుత్వ యంత్రాంగంలో పనిచేస్తున్న బీసీలకు రిజర్వేషన్ శాతం ప్రకారం పదోన్నతులు కల్పించాలన్నారు. బీసీ ఉప ప్రణాళిక అమలుకు, బీసీలకు ప్రత్యేకమైన బీసీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. బీసీ ఫెడరేషన్లను 11 నుంచి 19కి వెంటనే పునరుద్ధరించి ప్రతి ఫెడరేషన్‌కు రూ. 100 కోట్లు నిధులు కేటాయించాలన్నారు. ఫెడరేషన్ల ద్వారా షరతులు లేని సబ్సిడీ రుణాలు అందించాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే పేరిట వృత్తి, వైద్య నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని, శిక్షణ పొందిన బీసీలకు బీసీ కార్పొరేషన్ ద్వారా లేదా బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తే మేలు జరుగుతుందన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలు పూలే ప్రజాభవన్‌లో గానీ, ఐమాక్స్ పరిసరాల్లో గానీ ఏర్పాటు చేసి చక్కటి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నగర అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మధుసూదన్‌గుప్తాను కలిసిన గిడుగు రుద్రరాజు


మధుసూదన్‌గుప్తాతో గిడుగు రుద్రరాజు

లిబర్టీ: కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు గిడుగు రుద్రరాజు మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రధాన శిష్యుడు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మధుసూదన్‌గుప్తాను కలిశారు. హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ఇరువురు కలుసుకొని రాజకీయ అంశాలపై సోమవారం చర్చించారు. కాంగ్రెస్ పార్టీ పనితీరు, ఇరు రాష్ట్రాల్లో బలోపేతం విస్తరణ వంటి అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పనిచేసిన కాలంలో సంక్షేమ కార్యక్రమాలు, ప్రజాహిత పథకాల గురించి ఇరువురు గుర్తు చేసుకున్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన పథకాలను నేటి పాలకులు కొనసాగించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షులుగా పని చేసి సీడబ్ల్యూసీ సభ్యుడిగా ఎన్నికైనందుకు మధుసూదన్‌గుప్తా అభినందించారు.

కేన్సర్ చికిత్సలో విప్లవాత్మకమైన మార్పులు


కేన్సర్స్ చికిత్సలో మార్పులను వివరిస్తున్న హెచ్ఓడి సదాశివుడు

లక్డీకాపూల్: కేన్సర్ వ్యాధి నివారణలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయని పలువురు ఆంకాలజీ నిపుణులు పేర్కొన్నారు. ఈ విషయంలో యువ శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉందన్నారు. సోమవారం నిమ్స్ ట్రామా బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కేన్సర్ నెక్స్-2024 సదస్సు స్ఫూర్తిదాయకమైన రీతిలో జరిగింది. నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప నేతృత్వంలో నిర్వహించిన ఈ మార్క్ సదస్సు దేశంలోని ప్రముఖ ఆంకాలజీ నిపుణులు, పరిశోధకులు, సంరక్షణ ఆవిష్కర్తలను ఒకచోట చేర్చింది. ఈ సందర్భంగా నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగం ప్రొఫెసర్ సదాశివుడు బృందం, ప్రొఫెసర్ విజయ్ కుటాలా బృందం సంచలనాత్మక పరిశోధనలను ప్రదర్శించాయి. మాలిక్యులర్ పాత్‌వేస్ నుంచి అడ్వాన్స్‌డ్ డయాగ్నస్టిక్స్ వరకు అమలవుతున్న అత్యాధునిక వైద్య చికిత్స విధానాలను ఆవిష్కరించారు. ఈ క్రమంలో పీజీ విద్యార్థులు, శాస్త్రవేత్తల పరిశోధనలను సదస్సు అధ్యయనం చేసి ప్రోత్సహించింది. ముఖ్యంగా దేశంలో కేన్సర్ కేర్‌ను మరింత అందుబాటులోకి తీసుకురావడంపై కీలకమైన చర్చ జరిగింది. ఆరోగ్య సంరక్షణ, పరిశోధనలలో నిమ్స్ తన ప్రత్యేకతను చాటుకుంది.

ప్రజల్లో చైతన్యంతోనే కాలుష్యాన్ని నివారించొచ్చు


అవగాహన సదస్సులో అధికారులు, వైద్యులు

వెంగళరావునగర్: ప్రజల్లో చైతన్యం తీసుకొస్తేనే కాలుష్యాన్ని నివారించవచ్చునని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో సోమవారం తెలంగాణా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కాలుష్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీబీ అధికారులు మాట్లాడుతూ పరిశుభ్రతను కాపాడేందుకు, కాలుష్యాన్ని తగ్గించడానికి, వాటిని నివారించడానికి సాధ్యమైనంత వ్యూహాలను రూపొందించి అమలు చేయాలని సూచించారు. పర్యావరణ అనుకూల సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి యువతను, విద్యార్థులను ప్రోత్సాహించాలని చెప్పారు. పర్యావరణాన్ని పరిరక్షించడంలో విద్యుత్ వాహనాలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పీసీబీ అధికారులు డాక్టర్ ప్రసన్నకుమార్, బి.నాగేశ్వరరావు, డాక్టర్ ఉవుల్, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.సిహెచ్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యశోద, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ పి.రవీందర్‌గౌడ్, డాక్టర్ లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బడి.. అసంపూర్తిగా అంగన్‌వాడీ..!

- ప్రభుత్వ బడులు, అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వం శీతకన్ను
- చదువులకు దూరమవుతున్న పేద విద్యార్థులు
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంన్‌వాడీ కేంద్రాలు
- ప్రభుత్వ బడుల్లో కానరాని వసతులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

పేదలకు ఆలయాలతో సామానమైన ప్రభుత్వ బడులు, అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వం ఉదాసీనత వైఖరి ప్రదర్శిస్తోంది. చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ బడుల్లో కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలం కాగా, పలు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలే లేవు. ఈ నేపథ్యంలోనే ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకోగా అటువైపు పాలకులు కానీ, అధికారులు కన్నెతి చూడటం లేదు. అదే విధంగా ఫిలింనగర్‌లోని దీన్‌దయాళ్‌నగర్ బస్తీలో పదేళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రం భవన పనులు ప్రారంభించగా ఇంకా పూర్తి కాలేదు. ఖైరతాబాద్ నియోకవర్గంలో అద్దె గదుల్లో దాదాపు 43 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఇట్టే అర్థం చేసుకోవచ్చు.



ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల భవనం

బంజారాహిల్స్: బడుగు, బలహీన వర్గాలు చదువుకునే సర్కార్ బడులు, అంగన్‌వాడీ కేంద్రాలపై ప్రభుత్వం శీతకన్ను చూపుతోంది. పాఠశాలల్లో అసౌకర్యాలు.. అసంపూర్తి పనులతో అంగన్‌వాడీ కేంద్రాలతో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు పేద, మధ్యతరగతి ప్రజలకు దూరమవుతున్నాయి. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి ఐదేళ్లు గడుస్తోన్నా కొత్త భవనం నిర్మించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ప్రజాప్రతినిధులు పట్టించుకోక, విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ఈ పాఠశాల భవనం పూర్తిగా భూమిలోకి కుంగిపోయింది. ఇక్కడి విద్యార్థులు చదువులకు దూరమయ్యారు. అయినా సరే సర్కార్‌లో మాత్రం కదలిక కరువైంది. ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగే ప్రజాప్రతినిధులు కళ్ల ముందే పాఠశాల భవనం శిథిలావస్థకు చేరినా పట్టించుకోవడం లేదు. స్థానికులు ఎన్నోసార్లు పాఠశాల భవనాన్ని బాగుచేయాలని కోరినా ఎమ్మెల్యేలు, ఎంపీలు పట్టించుకున్న పాపానపోలేదు. తాము అనేసార్లు అధికారులకు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించామని, పేదలం కావడం వల్లనే పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పాఠశాలల్లో 300 మంది వరకు విద్యార్థులు చదువుకునేవారు. బడి లేకపోవడంతో చాలా మంది చదువులకు స్వస్తి పలికారు. నియోజకవర్గంలోని చాలా పాఠశాలల్లో సౌకర్యాలు పూర్తిగా కరువయ్యాయి. ప్రభుత్వాలు పాఠశాలల్లో సౌకర్యాల కోసం పలు పథకాలు ప్రవేశపెట్టినా ఖైరతాబాద్‌లో మాత్రం అవి అరకొరగానే అమలయ్యాయి. ఇక్కడి అధికారులకు ఏమాత్రం పట్టింపు లేకపోవడంతో సర్కార్ బడుల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతున్నది.



అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రం..

ఫిలింనగర్‌లోని దీన్‌దయాళ్‌నగర్ బస్తీలో పదేళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులు చేపట్టారు. సగం పనులు కాగానే పనులు నిలిపివేయడంతో ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉంది. స్థానికంగా అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుంది. ఫిలింనగర్‌లోని 18 బస్తీల్లో 12 అంగన్ వాడీలు అద్దె గదుల్లోనే కొగసాగుతున్నాయి. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో అద్దె గదుల్లో 43 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకునే అంగన్‌వాడీలపై ఎమ్మెల్యే, ఎంపీలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నట్లు కనిపించడం లేదు. నేతలు కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు మంజూరు చేయించుకోవడంలో విఫలమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యే వద్దకు వెళ్లి తమ వద్ద అంగన్‌వాడీ లేదా పాఠశాల భవనాలకు నిధులు మంజూరు చేయాలని అడిగే లీడర్లు లేకపోవడం వల్లనే ఆయా ప్రాంతాల్లో ఈ దుస్థితి నెలకొంది.

అన్ని అధ్యయన కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు

- జేఏసీ సభ్యుల వెల్లడి
- 74వ రోజుకు చేరిన అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసనలు



బంజారాహిల్స్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని అధ్యయన కేంద్రాల్లో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జేఏసీ సభ్యులు వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. గత 74 రోజులుగా జేఏసీ సభ్యులు, ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో పరిపాలనా భవనం ఎదుట బైఠాయించి, నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యమన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) చైర్‌పర్సన్ పల్లవీ కాబడే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ వేణుగోపాల్‌రెడ్డి, ఎల్వీకే రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు రబీంద్రనాథ్ సోలమన్, యాకేష్ దైద, రజనీ, మేరీ సునంద, ఉదయిని, కిషోర్, రాఘవేంద్ర, రజిత, షబ్బీర్, పాండు, రాములు, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

బంజారాహిల్స్: డప్పు చప్పుళ్లు, సంప్రదాయ వాయిద్యాలు, అర్చకుల వేద మంత్రాల నడుమ శివ పార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని హనుమాన్ దేవాయలంలో కొలువుదీరిన మహాశివుడు, పార్వతీదేవీల కల్యాణ మహోత్సవం సోమవారం ఆలయ ఆవరణలో ఆలయ అర్చకులు సీతారామశర్మ నేతృత్వంలో వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం ముగిసిన తర్వాత ప్రతియేటా స్వామివారి కల్యాణం చేయడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ ఈవో జయరామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామునే స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీ సంఖ్యలో విచ్చేసిన భక్తుల నడుమ స్వామివారి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. పల్లకీ సేవ ముగిసిన తర్వాత స్వామివారి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు యోగేష్, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఊరికి వెళ్లొచ్చేలోగా ఇంట్లో చోరీ

వెంగళరావునగర్: ఊరికి వెళ్లి వచ్చేలోగా ఇంట్లో బంగారు వస్తువులు దోచుకెళ్ళిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సిద్ధార్థనగర్‌కాలనీలో నివసించే కె.గణేష్ ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. గతనెల 12వ తేదీన కాకినాడలో తన భార్య ప్రసవం కోసం గణేష్ కుమారునితో కలిసి వెళ్లాడు. తిరిగి ఈనెల 1వ తేదీన ఇంటికి వచ్చి చూడగా తలుపు పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి ప్రవేశించి పరిశీలించగా బీరువా తెరిచి ఉంది. అందులో ఉండాల్సిన పట్టీలు, కుంకుమ భరణి, చిన్న పిల్లలు ప్లేట్లు మాయం అయ్యాయి. మొత్తం దాదాపు రూ.50 వేలు ఖరీదు చేసే వస్తువులు చోరీకి గురైనట్లు బాధితుడు గణేష్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

11న ఢిల్లీలో ఓబీసీల జాతీయ సదస్సు

కాచిగూడ: బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో బీసీల సమరశంఖారావం పేరుతో ఓబీసీల జాతీయ సదస్సు, ధర్నాను నిర్వహిస్తున్నట్లు ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు తెలిపారు. ఢిల్లీలోని కానిస్టిట్యూషనల్ క్లబ్‌లో ఓబీసీల జాతీయ సదస్సు 12న జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జనాభా గణనలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడంతోపాటు బ్యాక్‌లాగ్ ఖాళీలు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగెం సూర్యారావు, ఉగ్గె శ్రీనివాస్ పటేల్, చామకూర రాజు, కె.వి.గౌడ్, బత్తుల సిద్దేశ్వర్, అవ్వారు వేణు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న యువకుల అరెస్ట్

వెంగళరావునగర్: గంజాయి తాగుతున్న ఇరువురిని మధురానగర్ పోలీసులు అదుపులోనికి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... మధురానగర్ ఎస్ఐ సాయినాథ్‌రెడ్డి తన సిబ్బందితో ఆదివారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ సమయంలో సిద్ధార్థనగర్‌కాలనీలోని ప్రైవేట్ స్కూల్ ఆవరణ వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానంగా కనిపించారు. పోలీసులు వారి వద్దకు వెళ్లగా ఇద్దరు పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో ఎస్ఐ సాయినాథ్‌రెడ్డి, సిబ్బంది చాకచక్యంగా వారిని పట్టుకుని విచారించారు. బీకెగూడకు చెందిన ఎస్.వివేక్‌గౌడ్, వెంగళరావునగర్‌కు చెందిన ఎండీ మహబూబ్ ఆలీ షబ్బీర్‌లుగా యువకులు తెలియజేశారు. తాము ఫతేనగర్ వద్ద గంజాయి రోల్స్ కొనుగోలు చేసుకుని ఇక్కడకు వచ్చి తాగడానికి ప్రయత్నిస్తున్నట్టుగా పోలీసులకు తెలిపారు. వారిని సోదా చేయగా రెండు గంజాయి రోల్స్ (ఓసీబీ రోల్స్) లభించాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు పంపారు. మధురానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలి

లిబర్టీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ బీసీ బిల్లు పెడతామని పార్లమెంటులో ప్రభుత్వ పక్షాన ప్రకటన చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుంద్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. డిసెంబర్ 25 వరకు పార్లమెంటు సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లు పెడతామని కేబినెట్ నిర్ణయం తీసుకొని ప్రధానమంత్రి స్వయంగా ప్రకటించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. బీసీ వ్యతిరేక ముద్ర వేసుకోవద్దని ఆయన సూచించారు. గడిచిన పదేళ్ల కాలాన్ని కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం వృథా చేసిందన్నారు. ఇదేవిధంగా బీసీల పట్ల వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని, ఆ తిరుగుబాటులో కేంద్ర ప్రభుత్వం కుప్పకూలుతుందన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు కావాలని అనేకేళ్లుగా వివిధ రూపాల్లో పోరాటం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ బీసీ అయి కూడా బీసీల పట్ల ఇంత నిర్లక్ష్య వైఖరి చూడడం ఎంత వరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా పార్లమెంట్‌లో బీసీల రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు.

మర్రి చెన్నారెడ్డి సేవలు చిరస్మరణీయం

లిబర్టీ: నిఖార్సైన రాజకీయ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి అని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి పి.వి. రాజేశ్వరరావు అన్నారు. మర్రి చెన్నారెడ్డి అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో చెన్నారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా విశిష్ట సేవలు అందించారని గుర్తు చేశారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసి రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పాటుపడ్డారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పి.వి.శ్రీనివాసరావు, పి.వి.సంకీర్త తదితరులు పాల్గొన్నారు.


మహిళలపై పెరుగుతున్న హింస


మాట్లాడుతున్న ఝాన్సీ గెడ్డం

కాచిగూడ: తెలంగాణలో రోజురోజుకూ మహిళలపై హింస పెరుగుతుందని స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాల అమలు, కమిషన్లు, ప్రభుత్వ శాఖల పనితీరు సరిగా లేదని ఆమె ఆరోపించారు. వివిధ మహిళా సంఘాల ప్రతినిధులతో కలిసి సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా 'అంతర్జాతీయ ప్రచారోద్యమం' కార్యక్రమంలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో దళిత స్త్రీశక్తి 16 రోజులపాటు ప్రచారోద్యమాన్ని నిర్వహించిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో స్త్రీలపై ముఖ్యంగా దళిత, ఆదివాసీ స్త్రీలు, బాలికలపై పెరుగుతున్న హింసను రూపుమాపే దిశగా ప్రభుత్వాలు ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ ప్రతినిధి సంధ్యా, గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ ప్రతినిధి సుమలత, మహిళా రైతుల హక్కుల వేదిక ప్రతినిధి రుక్మిణీరావు, కె.సజయ, సామాజిక విశ్లేషకులు కృష్ణకుమారి, సన్నిహిత వి.ఉషారాణి, కొండవీటి సత్యవతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి ధర్మం పాటించడంతోనే ఉన్నతస్థాయికి ఆస్పత్రి

రెయిన్‌బో సిల్వర్ జూబ్లీ వేడుకల్లో చైర్మన్ డాక్టర్ రమేశ్ కంచర్ల



సాక్షి, సిటీబ్యూరో: గత 25 ఏళ్లుగా తమ సిబ్బంది అంకితభావం, నిబద్ధతతో వృత్తి ధర్మాన్ని పాటించడం వల్లే తమ ఆస్పత్రి ఉన్నతస్థాయికి చేరుకుందని రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రి చైర్మన్, ఎండీ డాక్టర్ రమేశ్ కంచర్ల పేర్కొన్నారు. ఆస్పత్రి స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది కుటుంబాల్లో, ముఖ్యంగా చిన్నారుల ముఖాల్లో ఆనందం వెనుక తమ వైద్య బృందం ఎంతో కృషి దాగి ఉందని కొనియాడారు. సిబ్బంది సహాయ సహకారాలతో మున్ముందు ఎంతో ఎత్తుకు ఎదుగుతామనే నమ్మకం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా 15 సంవత్సరాలకు పైగా సంస్థ ఎదుగుదలలో పాలు పంచుకున్న 37 మంది ఉద్యోగులను ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రణతి రెడ్డి, డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల తదితరులు పాల్గొన్నారు.


ఎయిడ్స్‌పై అవగాహన

ఫిలింనగర్: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని అపోలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జయసుధ అన్నారు. ఎయిడ్స్ డే అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు కలిసి అపోలో ఆస్పత్రి వద్ద ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లావణ్య, భారతి, ప్రత్యూష పాల్గొన్నారు.



ఆకట్టుకున్న 'ఎనిమల్స్ ఇన్ ది జంగిల్ థీం'

శ్రీనగర్‌కాలనీ: పర్యావరణం, అడవిలోని జంతువులు వాటి హావభావాలు, స్వభావాలను వివరిస్తూ చిన్నారులు ఎంతోగానో అలరించారు. సోమవారం ఎర్రగడ్డలోని సంస్కార్ దిలైఫ్ స్కూల్ చిన్నారులకు ఎనిమల్స్ ఇన్ ది జంగిల్ థీంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు అడవుల్లోని జంతువుల వేషధారణ, వాటి ప్రవర్తన, విశిష్టతను తెలియజేస్తూ అవగాహన కల్పించి ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు బహుమతులు అందించారు. స్కూల్ సీఈఓ మోహన వంశీ, డైరెక్టర్ మధుమతి పాల్గొన్నారు.





నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సందర్శనకు అందుబాటులో ఉంటుంది.
- గ్లోబల్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ అవార్డు–2024 సదస్సు బేగంపేటలోని హోటల్ గ్రీన్‌పార్క్‌లో సాయంత్రం 6.30 గంటలకు జరుగుతుంది. ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొననున్నారు.
- కేంద్ర రక్షణ శాఖ ఆధ్వర్యంలో నార్సింగ్‌లోని రామ్‌దేవ్‌గూడ తారామతి హోటల్ సమీపంలోని పలని పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 6.30 గంటలకు అగ్నివీర్ పాసింగ్‌అవుట్ పరేడ్ జరుగుతుంది.
- ఇంటర్నేషనల్ డే ఆఫ్ పర్సన్స్ విత్ డిజెబిలిటీస్ సందర్భంగా టీజీపీసీ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని టీ వర్క్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటలకు అసిస్టివ్ టెక్నాలజీ సమ్మిట్ 5.0 జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

అధికారాలు విభజించి.. సమస్యలు పరిష్కరించి..

- ధరణి పెండింగ్ దరఖాస్తులకు వేగంగా మోక్షం
- కలెక్టర్ స్థాయి అధికారాలు అదనపు కలెక్టర్‌కు, ఆర్డీవోలకు..
- పెండింగ్ దరఖాస్తులు వేలల్లోంచి వందల్లోకి..



సాక్షి,సిటీబ్యూరో: జిల్లా కలెక్టర్ స్థాయిలో ఉన్న అధికారులను విభజించి అదనపు కలెక్టర్‌కు, ఆర్డీవోలకు అప్పగించడంతో ధరణి సమస్యలు వేగంగా పరిష్కారమవుతున్నాయి. పెండింగ్ దరఖాస్తులు వేలల్లోంచి వందల్లోకి చేరుకున్నాయి. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేయడమే దీనికి కారణం. జిల్లా కలెక్టర్ స్థాయిలో ఇన్నాళ్లూ ఉన్న అధికారాలను విభజించి పలు సమస్యల పరిష్కార బాధ్యతలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ), రెవెన్యూ డివిజన్ అధికారు(ఆర్డీవో)లకు అప్పగించింది. ఇప్పటివరకు కలెక్టర్ వద్దే ధరణికి చెందిన అన్ని అధికారాలు ఉండిపోవడంతోనే దరఖాస్తులు కుప్పలుగా పేరుకుపోతున్నాయని ధరణి కమిటీ గుర్తించింది. ధరణి కమిటీ సూచన మేరకు ప్రభుత్వం పలు సమస్యలను విభజించి అధికారులకు అప్పగించింది. ఫలితంగా వేలాది దరఖాస్తులు పరిష్కారానికి నోచుకున్నాయి. ప్రస్తుతం కేవలం 1500 దరఖాస్తులే మిగిలాయని రెవెన్యూ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అదనపు కలెక్టర్ పరిధిలో...

జిల్లా కలెక్టర్‌కు సంబంధం లేకుండా ఇకపై అదనపు కలెక్టర్(రెవెన్యూ) వద్ద అయిదు రకాల సమస్యలు పరిష్కారం కానున్నాయి. నాలుగు మాడ్యూళ్ల ద్వారా వచ్చే దరఖాస్తులను తహసీల్దార్, ఆర్డీవోకు పంపించమన్నారు. వారు ఆయా సమస్యలను పరిశీలించి జిల్లా అదనపు కలెక్టర్‌కు పంపిస్తారు. వారు చేసిన సిఫారసులను పరిశీలించిన తర్వాత ఆ సమస్యను అదనపు కలెక్టర్ పరిష్కరించడం లేదా తిరస్కరించటం చేస్తారు. అదనపు కలెక్టర్ తిరస్కరిస్తే దరఖాస్తుదారుడికి స్పష్టమైన సమాధానం అందజేయాల్సి ఉంటుంది. అదనపు కలెక్టర్ పరిధిలో పరిష్కారం కానున్న సమస్యలు ఈ విధంగా ఉన్నాయి.

- యాజమాన్య హక్కు బదిలీ దరఖాస్తులు (టీఎం 3–మ్యుటేషన్)
- కోర్టు కేసులతో ముడిపడి ఉండే భూములకు పట్టా పాసుపుస్తకాలకు వచ్చేవి(టీఎం24),
- పట్టా పాసుపుస్తకం లేదా వ్యసాయేతర భూమిగా మార్చడానికి ఆటంకంగా రికార్డుల్లో గృహం, హౌజ్ సైట్ అని నమోదైన వాటికి సంబంధించినవి
- (టీఎం31),పాసుపుస్తకం సమాచారంలో తప్పుల సవరణ(టీఎం33)
- పేరు మార్పిడి కోసం వచ్చిన దరఖాస్తులు (టీఎం33)

ఆర్డీఓ పరిధిలో ఉన్నవి...

- డిజిటల్ సంతకాలకు వచ్చిన దరఖాస్తులు (టీఎం33, జీఎల్ఎం),
- వారసత్వ బదిలీ దరఖాస్తులు(టీఎం4),
- అసైన్డ్ భూములకు(పాసుపుస్తకం లేనివి) సంబంధించినవి(టీఎం27),
- వ్యసాయేతర భూముల మార్పిడికి సంబంధించి(టీఎం27)
- సర్వే నంబర్లకు సంబంధించినవి

ఏఎన్ఎం పోస్టుల సంఖ్య పెంచాలి



కోఠి ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు, ఏఐటీయూసీ నాయకులు

ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం వద్ద ధర్నా

సుల్తాన్‌బజార్: ఇటీవల మెడికల్ హెల్త్ రిక్రూట్‌మెంట్ సర్వీస్ బోర్డు ప్రకటించిన 1,931 ఏఎన్ఎం పోస్టుల సంఖ్యకు అదనంగా పోస్టులు పెంచి పరీక్ష నిర్వహించాలని, వయసు మీరిన వారికి న్యాయం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఏఎన్ఎంలు ధర్నాకు దిగారు. కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహ మాట్లాడారు. 18 ఏళ్లుగా ఎన్‌హెచ్‌ఎంలో అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఏఎన్ఎంల సేవలను ప్రభుత్వం అనేక రకాలుగా ఉపయోగించుకుంటూ వారి సంక్షేమాన్ని విస్మరించిందని అన్నారు. కోవిడ్ కష్టకాలంలో వీరి సేవలు అమోఘమని పేర్కొన్నారు. ఏఎన్ఎంలు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసి రిటైర్‌మెంట్ సమయంలో ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని విచారం వ్యక్తం చేశారు. డిసెంబర్ 28 వరకు ప్రిపరేషన్ హాలీడేస్, గతంలో ఇచ్చిన హామీ ప్రకారం స్టడీ మెటీరియల్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర 2వ ఏఎన్ఎంల సంఘం గౌరవ అధ్యక్షుడు తోట రామాంజనేయులు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెక్కుల పద్మ, బోయిని శ్యామల, ఉపాధ్యక్షులు తన్వీర్ సుల్తానా, పద్మ, సరోజ, లత, తులసి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనలో కీలకపాత్ర పోషించాలి



ఆలంబన వార్షికోత్సవంలో పాల్గొన్న సభ్యులు, రోటరీ క్లబ్ సభ్యులు

- రాష్ట్ర ఇంటలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి

రాయదుర్గం: సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన వారు పేదరిక నిర్మూలనలో కీలకపాత్ర పోషించాలని రాష్ట్ర ఇంటలిజెన్స్ డీజీపీ బి.శివధర్‌రెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, మావరిక్స్, రోజ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆలంబన' మొదటి వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసిన శివధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి తోడుగా ఆర్థికంగా స్థిరపడినవారు సేవాదృక్పథంతో ముందుకు సాగితే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద కుటుంబాల పిల్లలను వారి కుటుంబాల వద్దే ఉంచి నాణ్యమైన విద్య అందించడం అవసరమన్నారు. రాష్ట్ర ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్ కమిషనర్ కె.శశాంక్ మాట్లాడుతూ ఆలంబన కార్యక్రమాలు ఆరంభించి కేవలం ఒక ఏడాదికాలంలో వందమందికిపైగా అనాథ పిల్లలకు విద్య, ఆహారం అందించడం గర్వకారణమన్నారు. రోటరీ ఫౌండేషన్ చైర్మన్ ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అనాథ చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు నెలకు రూ.2 వేల చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలంబన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవ్ అమర్, రోటరీ క్లబ్ అధ్యక్షురాలు వనశ్రీ, కార్యదర్శి లక్ష్మీనారాయణ, లోకనాథ్, అజయ్, విజయ, ఆలపాటి, సురేష్‌బాబు, సీత, మాధవి, సమన్వయకర్తలుగా మల్లెల ఉదయ్, సూర్యనారాయణ, ప్రసాద్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆలంబన ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆలంబన వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఇంటలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి

ఆర్టీఏ ఆఫీస్‌కు మాజీ సీఎం రాక



సాక్షి, సిటీబ్యూరో: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి సోమవారం ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయానికి వచ్చారు. తమ కంపెనీ ల్యాండ్ అండ్ ట్రీకి చెందిన ఇన్నోవా హైక్రాస్ కారు రిజిస్ట్రేషన్ కోసం ఆయన వచ్చారు.నిబంధనల మేరకు డిజిటల్ ఫొటో, డిజిటల్ సంతకం చేశారు. అనంతరం ప్రాంతీయ రవాణా అధికారి పురుషోత్తం రెడ్డి పర్యవేక్షణలో వాహనం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. ఆయన వాహనానికి అధికారులు 'టీజీ 09 సి 9393'నెంబర్ కేటాయించారు.

విజయోత్సవాలా.. సిగ్గుచేటు

- ప్రభుత్వంపై ధ్వజమెత్తిన ఆర్.కృష్ణయ్య
- విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్

ముషీరాబాద్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 16.75 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన నాలుగు వేల కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌లు, ఫీజులు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహించడం సిగ్గుచేటని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య విమర్శించారు. విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యానగర్‌లోని బీసీ భవన్ వద్ద బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థుల ఫీజు దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టి సంవత్సర కాలం అవుతున్నా విద్యార్థుల ఫీజు బకాయిలకు సంబంధించిన ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ఫీజుల బకాయిలు చెల్లించకుండా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వడంలో ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఫీజుల జాప్యం వల్లే కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పందించి ఫీజు బకాయిలను విడుదల చేసి విజయోత్సవాలను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేముల రామకృష్ణ, బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, సి.రాజేందర్, జి.అనంతయ్య, నందగోపాల్, సుధాకర్, ఉదయ్, మధుసూధన్, రవికుమార్‌యాదవ్, అరవింద్, పృధ్విగౌడ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఫీజుదీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, వేముల రామకృష్ణ, నీల వెంకటేష్

అమరవీరులకు మేజర్ జనరల్ నివాళులు



పరేడ్ మైదానంలో అమర సైనికులకు నివాళులర్పిస్తున్న అజయ్‌మిశ్రా

రసూల్‌పురా: తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా కమాండింగ్ ఆఫీసర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మేజర్ జనరల్ అజయ్ మిశ్రా సోమవారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలోని అమర వీరుల స్తూపం వద్ద ఆర్మీ ఉన్నతాధికారులతో కలసి నివాళులర్పించారు. అమర సైనికుల త్యాగం ధైర్యం, దేశభక్తి విలువలను వెలకట్టలేమని, దేశం కోసం వారు ప్రాణాలర్పించడం వారి నిబద్ధతను సూచిస్తుందని అజయ్‌మిశ్రా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ అధికారులు, హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు మతాలకు చెందిన పెద్దలు పాల్గొన్నారు.

టీపీజీఎల్ నాలుగో సీజన్ విజేత గోల్డెన్ ఈగల్స్



సాక్షి, సిటీబ్యూరో: యువ గోల్ఫర్లకు గొప్ప వేదికగా నిలుస్తున్న తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్(టీపీజీఎల్) నాలుగో సీజన్‌లో గోల్డెన్ ఈగల్స్ విజేతగా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో గోల్డెన్ ఈగల్స్ వ్యాలీ వారియర్స్‌పై విజయం సాధించింది. టైటిల్ పోరులో మొదట సింగిల్స్ మ్యాచ్‌లకు సంబంధించి ఇరు జట్లు చెరొక 2 పాయింట్లు సాధించాయి. డబుల్స్ మ్యాచ్‌లలో కూడా స్కోర్లు సమం కావడంతో ఫలితం కోసం ప్లే ఆఫ్ నిర్వహించారు. ప్లే ఆఫ్ లో గోల్డెన్ ఈగల్స్ గోల్ఫర్ మిథున్‌రెడ్డి కీలకమైన పాయింట్‌తో తన టీంకు టైటిల్ అందించారు. హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో జరిగిన ముగింపు కార్యక్రమానికి ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు ట్రోఫీ, చెక్ అందించారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ గోల్ఫ్ కోర్సును అద్భుతంగా తీర్చిదిద్దిన హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ ప్రతినిధులను స్మితా సబర్వాల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నీలో టీమ్ దాసోస్‌కు చెందిన డాక్టర్ సమీర్ ఎ మహీంద్ర మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్‌గా నిలిచారు. ముగింపు కార్యక్రమంలో హెచ్‌జీఏ వ్యవస్థాపక సభ్యుడు విక్రమ్ దేవ్ రావు, శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ కేటీ మహీ, అన్ని జట్ల ఓనర్లు, గోల్ఫర్లు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని ఆశా వర్కర్ల ధర్నా



ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సుల్తాన్‌బజార్: లెప్రసీ, పల్స్‌పోలియో సర్వేలకు సంబంధించి రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలంటూ ఆశా వర్కర్లు కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మీ మాట్లాడుతూ బకాయిలు చెల్లించిన తర్వాతే కొత్త సర్వేలు చేయించాలని డిమాండ్ చేశారు. 2వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో లెప్రసీ సర్వే చేయాలని ఆశా వర్కర్లకు జిల్లా అధికారులు చెబుతున్నారని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వాయిదా వేయాలని అన్నారు. లెప్రసీ సర్వేకు సంబంధించిన బకాయిలు విడుదల చేసి చాలా కాలమైందని అధికారులు చెబుతుండగా, అవి తమకు రాలేదని డీఎంహెచ్‌వోలు అంటున్నారని పేర్కొన్నారు. ధర్నాలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు యాదమ్మ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, రాష్ట్ర నాయకులు మీనా, భాగ్యలక్ష్మీ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

4న కౌలు రైతుల ప్రజాదర్బార్

- ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తాం: సంయుక్త కిసాన్ మోర్చా

లక్డీకాపూల్: సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని కౌలు రైతుల సమస్యలపై కౌలు రైతుల ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్టు ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్ల కమిటీ ప్రతినిధి విస్సా కిరణ్ కుమార్, పశ్య పద్మ తెలిపారు. రాష్ట్రంలో 22 లక్షలకుపైగా ఉన్న కౌలు రైతుల సమస్యలను రాజధానిలో వినిపించేందుకు రైతు, వ్యవసాయ కార్మిక, కౌలురైతు సంఘాలు కలిసి ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్టు చెప్పారు. ఈ నెల 4న ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద రాష్ట్ర స్థాయి ప్రజాదర్బారు, ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 13న అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ కౌలు రైతులకు రాసిన బహిరంగ లేఖ గురించి ప్రస్తావించారు. 'కౌలు రైతులకు కాంగ్రెసు ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుంది. 2011లో కాంగ్రెస్ భూ అధీకృత సాగుదారుల చట్టం తీసుకువచ్చింది. ఆ చట్టం ప్రకారం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మళ్ళీ ఇస్తుంది. రైతు భరోసాతోపాటు ఇతర పథకాలను, పంట రుణాలను కూడా అందిస్తుంది'అని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లోనూ, ఆరు గ్యారంటీలలోనూ కౌలు రైతులకు సహాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిన కౌలు రైతులకు తాము న్యాయం చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ విషయం గట్టిగా గుర్తుచేస్తామని కిసాన్ మోర్చా నాయకులు స్పష్టం చేశారు.

'వాణీజయరాం పాట' స్వర్ణోత్సవాలు



స్వర్ణోత్సవాల్లో గాయనీ గాయకులతో వెంకట్ గరికపాటి. చిత్రంలో చంద్రశేఖర్, రామాచారి

నాంపల్లి: ప్రఖ్యాత గాయని వాణీజయరాం పాడిన తొలిపాటకు 50 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా సోమవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో శ్రీరామ సాంస్కృతిక సంస్థ, నాద వినోద సంగీత అకాడెమీ(అమెరికా) సంయుక్తంగా స్వర్ణోత్సవం నిర్వహించాయి. వాణీజయరాం పాటలను ఎన్ఆర్ఐ గాయకులు పవన్ ఉమాపతి, శ్రీకాంత్, హర్ష, సంపత్ సుమధురంగా ఆలపించారు. 'దొరుకునా ఇటువంటి సేవా', 'అందెల రవళి పదములదా'వంటి గీతాలు ప్రేక్షకులను మెప్పించాయి. సింధు, చరిత, గాయత్రి, చందన, రవళి తమ గానంతో సభికులను రంజింపజేశారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అన్నమయ్య కీర్తనల వ్యాఖ్యాన ప్రవచకుడు వెంకట్ గరికపాటి మాట్లాడుతూ సామ గాన సమీర అలనాటి మీరాబాయి మాదిరిగానే వాణీజయరాం భక్తిగీతాలను మధురంగా గానం చేశారని అన్నారు. చక్కగా పాటలు పాడిన గాయకుల ప్రతిభ ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు కె.రామాచారి, గొర్తి చంద్రశేఖర్, తులసీ రాం తదతరులు పాల్గొన్నారు.

జియోస్మార్ట్ ఇండియా–2024 ప్రారంభం

చందానగర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ప్రీమియర్ జియో స్పేషియల్ టెక్నాలజీ కాన్ఫరెన్స్ జియోస్మార్ట్ ఇండియా–2024 సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వ పట్టణ వ్యవహారాలు, భూనిర్వహణ, సివిల్ ఏవియేషన్ శాఖ మంత్రి బాలో రాజా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నామని, పరిపాలనను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. వైమానిక రవాణాను మెరుగుపరచడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తున్నామని పేర్కొన్నారు. అరుణ్ డోర్ సంచార్ ప్రాజెక్టు, జియోస్పేసియల్ సాంకేతికత ద్వారా డిజిటల్ అంతరాన్ని తగ్గిస్తున్నామని తెలిపారు. సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. పర్యావరణహిత, ప్రణాళికాబద్ధమైన పట్టణ ప్రాంతాలను సృష్టించడమే కర్తవ్యంగా భావిస్తున్నామని చెప్పారు. బాధ్యతాయుతంగా వనరుల నిర్వహణకు ప్రాధాన్య ఇవ్వడమే తమ లక్ష్యమన్నారు.



కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ అథరైజేషన్ సెంటర్ డాక్టర్ పవన్ గోయెంకా, జియో స్పేసియల్ వరల్డ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంజయ్‌కుమార్, యూకేలోని ఆర్డినెన్స్ సర్వే చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిక్ బోల్టన్, ఇస్రి ఇండియా ఎండీ అజేంద్రకుమార్, బోరిస్ స్కోప్లాక్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల ప్రతిభా పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో జస్టిస్ శేషశయనారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: పద్మశ్రీ ఘంటసాల తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.శేషశయనారెడ్డి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు సౌజన్యంతో యువకళావాహిని ఆధ్వర్యంలో ఘంటసాల 102వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయనీగాయకులు మణిశాస్త్రీ, చంద్రతేజలకు ఘంటసాల ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకుముందు నిర్వహించిన ఘంటసాల సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, రచయిత్రి కేవీ కృష్ణకుమారి, సంస్థ అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప పాలనాదక్షుడు మర్రి చెన్నారెడ్డి

కవాడిగూడ: మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ మర్రి చెన్నారెడ్డి గొప్ప పాలనాదక్షుడని పలువురు వక్తలు కొనియాడారు. మర్రి చెన్నారెడ్డి 28వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఇందిరాపార్కులోని మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ రాక్ గార్డెన్‌లో ఉన్న ఆయన సమాధి వద్ద పలువురు నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ముఖ్యమంత్రి నాదేండ్ల భాస్కర్‌రావు తదితరులు చెన్నారెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన మర్రి చెన్నారెడ్డి సేవలు మరువలేనివని కొనియాడారు. రాజకీయాలకతీతంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినప్పుడే చెన్నారెడ్డికి నిజమైన నివాళి అర్పించినట్లు అని అన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రులు పొన్నాల లక్ష్మయ్య, సమరసింహారెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, చెన్నారెడ్డి కుటుంబసభ్యులు మర్రి రవీందర్‌రెడ్డి, మర్రి ఆదిత్యరెడ్డి, మర్రి పురోవర్‌రెడ్డితోపాటు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, నాయకులు పాల్గొన్నారు.



చెన్నారెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న జిష్ణుదేవ్ వర్మ, దత్తాత్రేయ, నాదేండ్ల తదితరులు

కెనడియన్ నర్సుకు అరుదైన శస్త్రచికిత్స

గచ్చిబౌలి: కెనడాకు చెందిన నర్సు సోఫియా(42) అరుదైన ఫైబ్రాయిడ్ శస్త్రచికిత్సను గచ్చిబౌలి కేర్ హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా చేశారు. ఆహారం కొద్దిగా తిన్నా కడుపు నిండినట్లుగా ఉండటం , మూత్రవిసర్జన నెమ్మదించడంతో మూడు నెలలుగా ఆమె తీవ్ర ఇబ్బందులకు గురవుతోంది. దీంతో కేర్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరింది. ఎంఆర్ఐ ద్వారా పరీక్షించి కడుపులో ద్రాక్ష పండ్ల గుత్తిలాగా కనిపించిన ఫైబ్రాయిడ్లు వివిధ పరిమాణాల్లో 52 వరకు ఉన్నట్లు డాక్టర్ ప్రభ అగర్వాల్ బృందం గుర్తించింది. డాక్టర్ ప్రభ అగర్వాల్ మాట్లాడుతూ సంక్లిష్టమైన శస్త్ర చికిత్సను అంకితభావంతో విజవంతంగా పూర్తి చేశామని పేర్కొన్నారు. గర్భాశయాన్ని కాపాడుతూ సంతానోత్పత్తికి ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. కేర్ హాస్పిటల్ సీఓఓ నీలేష్ గుప్త మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలను ఉపయోగించుకొని నైపుణ్యం కలిగిన వైద్యులు క్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారన్నారు.

ఘనంగా అపోలో మెడికల్ కాలేజీ స్నాతకోత్సవం

బంజారాహిల్స్: అపోలో మెడికల్ కాలేజీ స్నాతకోత్సవం జూబ్లీహిల్స్‌లోని ఆర్ఎస్ఆర్ ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోంటరాలజీ (ఏఐజీ) చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి హాజరై వైద్య విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. 2018 బ్యాచ్‌కు చెందిన వందమంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి అపోలో హాస్పిటల్స్ గ్రూపు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి, డీన్ డాక్టర్ మనోహర్, ఏఐఎంఎస్ఆర్ సీఓఓ అపర్ణారెడ్డిలు హాజరయ్యారు. చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి బంగారు పతకం ఉత్తమ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థి సిద్ధాంత్ బర్మేచాకు అందించారు. ఈ అవార్డు సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ కేవీఆర్ ప్రసాద్ స్మారకార్థం ఏర్పాటు చేశారు.



గోల్డ్ మెడల్ అందుకుంటున్న దండు అవినాష్‌రెడ్డి

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 3, డిసెంబర్, 2024



- లండన్‌లో రేడియో జాకీగా రాణిస్తున్న హైదరాబాదీ
- శ్రోతల ముందు గొప్పోళ్ల జీవిత విశేషాల ఆవిష్కరణ
- ఉద్యోగం చేసుకుంటూనే వారాంతాల్లో ఆర్‌జేగా..
- భరత్ కల్యాణ్ గొంతుకి ఫిదా..

వహ్వా.. వాయిస్

సాక్షి, సిటీబ్యూరో: గుడ్ మార్నింగ్ లండన్.. మీరు వింటున్నారు 98.8 స్పైస్ ఎఫ్‌ఎం.. అంటూ ఓ గొంతు ఉదయమే అందరినీ పలకరిస్తుంటుంది. గొప్ప వ్యక్తుల జీవితాలను పరిచయం చేస్తూ స్ఫూర్తిని నింపుతుంది. ప్రపంచ దేశాల్లోని శ్రోతలకు ఆ గొంతు ఒక వ్యసనం.. ఆ గొంతు విననిదే చాలామందికి రోజు గడవదంటే అతిశయోక్తి కాదు. ఇదంతా ఎందుకు చెప్పుకోవడమంటే ఆ గొంతు మన తెలుగు అబ్బాయిది కాబట్టి.. అదీ మన హైదరాబాదీ గొంతు కాబట్టి. ఆ గొంతుక పేరే భరత్ కల్యాణ్. ఉప్పల్‌కు చెందిన భరత్ పేరు యూకే, యూఎస్, కెనడా, భారత్‌తో పాటు అనేక దేశాల్లో రేడియో శ్రోతలకు వరల్డ్ ఫేమస్ అని చెప్పొచ్చు. వారం మొత్తం జాబ్ చేసుకుని.. వారాంతాల్లో ఫ్రెండ్స్‌తో జాలీగా ఎంజాయ్ చేయకుండా.. శనివారం అక్కడి స్పైస్ ఎఫ్‌ఎంలో ది కల్యాణ్ క్రానికల్స్ విత్ భరత్ అనే కార్యక్రమం ద్వారా ఎంతో మందికి చేరువయ్యాడు.

ఉన్నత చదువుల కోసం వెళ్లి..



అందరు యువకుల్లాగే విదేశాలకు వెళ్లి ఎంఎస్ చేయాలనేది తన కోరిక. ఎలాగోలా యూకేలోని న్యూక్యాసిల్ వెళ్లి ఎంఎస్ పూర్తి చేశాడు. బిజినెస్ ఇంటిలిజెన్స్ డెవలపర్‌గా మంచి ఉద్యోగం కూడా సంపాదించాడు. అయితే ప్రజలతో మమేకం కావడమంటే చిన్నప్పటి నుంచి మనోడికి ఇష్టం. ఉద్యోగరీత్యా అది సాధ్యం కాదు. దీంతో ఏం చేయాలా అని ఆలోచిస్తుండగా.. ఓ ఆన్‌లైన్ ఎఫ్‌ఎం స్టేషన్‌లో రేడియో జాకీ ఉద్యోగం ఉందని ప్రకటన చూసి దరఖాస్తు చేసుకోవడం.. మనోడి స్కిల్స్ చూసి సెలెక్ట్ అయిపోవడం చకచకా జరిగిపోయాయి. అప్పటి నుంచి దేశ, విదేశాల్లో సక్సెస్ అయిన వారి జీవిత విశేషాలు, సక్సెస్ జర్నీని శ్రోతలకు పరిచయం చేస్తూ స్ఫూర్తి నింపుతున్నాడు. అలా మన తెలుగు వారిని కూడా ఇంటర్వ్యూ చేశాడు. 2014 యూపీఎస్సీ టాపర్ ఇరా సింఘాల్ ఇంటర్వ్యూ ఎంతో ఇష్టమని భరత్ చెప్పాడు. గొప్ప వ్యక్తుల జీవిత విశేషాలు పది మందితో పంచుకుంటుంటే.. ఎంతో మంది తనకు ఫోన్ చేసి మెచ్చుకుంటుంటే ఆ తృప్తే వేరని పేర్కొంటున్నాడు. ఇక, తాను పనిచేసే ఎఫ్‌ఎం దక్షిణాసియా దేశాలకు చెందిన వారు నడుపుతున్నారని, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌కు చెందిన వారు ఎంతో సోదర భావంతో పనిచేస్తుంటామని, ఎలాంటి బేధాలు లేకుండా చాలా సంతోషకరమైన వాతావరణం ఉంటుందని వివరించాడు.







ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌ల వల్ల కొన్ని గంటల్లో ఫ్యాన్సీ కేక్‌లను పంపడం/స్వీకరించడం సర్వసాధారణమైపోయింది. కేక్ గిఫ్టింగ్ కోసం ఈ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా కొనుగోలు చేసి, బహుమతిగా పంపే సౌలభ్యంతో కేక్‌ల విక్రయాల్లో 12–15% పెంపునకు ఈ సైట్లు కారణమయ్యాయని అంచనా. ప్రముఖ ఆన్‌లైన్ బేకరీ రిటైల్ చైన్ అయిన విన్నీ విక్రయాల తీరు రాఖీ, భాయ్ దూజ్ లేదా దీపావళి వంటి పండుగల సమయంలో డిమాండ్‌కు అద్దం పడుతోంది. ఏతావాతా ప్లాట్‌ఫారమ్‌ల వెల్లువ కేక్ గిఫ్టింగ్ మార్కెట్ వృద్ధికి గణనీయంగా దోహదపడింది. రాఖీ, భైదూజ్ దీపావళి వంటి పండుగల సమయంలో కేక్ విక్రయాల దాదాపు 20% వృద్ధి రేటును చూసింది.

ఊపుతెచ్చిన.. ఈ-కామర్స్

ప్రయాణం చేస్తూనే అల్పాహారం తీసుకోవాలనుకున్న ఓ యువ ప్రొఫెషనల్ దీని కోసం అరటి వాల్‌నట్ కేక్ తయారు చేసుకుంటాడు. బిజీగా ఉండే ఓ మోడ్రన్ మదర్.. చిన్నపిల్లల స్నాక్ బాక్స్ కోసం తన ప్యాంట్రీలో నిల్వ చేసిన ఫ్రూట్ పుడ్డింగ్ కేక్‌ని బయటకు తీసి రెడీగా ఉంచుతుంది. ఇలా ఉదయాన్నే తీసుకునే అల్పాహారం నుంచి రాత్రి పూట ఆస్వాదించే బ్రౌనీస్ వరకూ.. కేక్స్ నగరవాసుల వేగవంతమైన డైలీ రొటీన్‌లో భాగం అయిపోయాయి. ఇక న్యూఇయర్‌ని, క్రిస్మస్‌లను మోసుకొచ్చే డిసెంబర్ నెలలో అయితే కేక్‌ల సందడికి హద్దే ఉండదని చెప్పాలి. - సాక్షి, సిటీబ్యూరో

కేకుపుట్టించే టేస్ట్!

అల్పాహారం నుంచి బ్రంచ్‌లూ.. డిన్నర్ దాకా..

హైదరాబాద్ వైబ్స్



- సిటీజనుల డైలీ రొటీన్‌లో భాగంగా కేక్స్
- క్రిస్మస్, న్యూఇయర్‌తో పాటు ఇతర పండుగలకూ గిఫ్టులు
- బర్త్‌డేల నుంచి మరిన్ని వేడుకల్లోనూ కేకులదే షోకు..

కేకుల వినియోగంలో సౌలభ్యంతో పాటు వాటి రుచి కారణంగా చాలా మందికి ఆహారపరంగా ప్రాధాన్యత జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాయి. లాక్‌డౌన్ సమయంలో ఇళ్లకే పరిమితమైన సిటిజనులు హోమ్ బేకింగ్‌ను అలవాటు చేసుకున్నారు. అలా పదుల సంఖ్యలో పుట్టుకొచ్చిన హోమ్ బేకర్స్.. ఆన్‌లైన్ వేదికగా అనేక మందికి వీటిని చేరువ చేశారు. దీంతో ఈ డెజర్ట్ సిటిజనులకు మరింత ఇష్టమైన ఆహారంగా మారింది.

హాట్ కేక్.. ఈట్ రైట్..

సిటీలో విరివిగా వినియోగంలో ఉన్నవాటిని ప్యాకేజ్డ్ కేకులు: ఆర్టిసానల్ కేక్‌లుగా విభజించవచ్చు. వీటిలో స్పాంజ్ కేక్‌లు, కప్ కేక్‌లు, చీజ్ కేక్‌లు, కేక్ పాప్స్ వంటివి వేగంగా తినే పని ముగించాలనుకునేవారికి ఇష్టమైనవిగా మారాయి. దీనికి తోడు పలు బ్రాండ్స్ మార్కెట్లోకి ప్రవేశపెడుతున్న వివిధ రుచులు ఆకట్టుకునే ప్యాకేజీలతో మరింతగా ఆదరణ దక్కించుకుంటున్నాయి. ప్లెయిన్ స్పాంజ్ కేకులు, ఫ్రాస్టెడ్ ఐసింగ్, స్విస్ రోల్స్, ఫ్రూట్ ఫిల్డ్ మఫిన్‌ల వరకు అందుబాటులో ఉన్న అనేక రకాల ప్యాకేజ్డ్ కేక్‌లకు డిమాండ్ బాగా ఉంది. గులాబ్ జామూన్, రసమలై కేకులు లేదా ఫిర్నీ తిరమిసు ఇలా బ్రెడ్ తయారీదారులు మన రుచులతో పాశ్చాత్య డెజర్ట్‌లను చొప్పిస్తున్నారు.

పండుగలకూ పసందే..

పుట్టిన రోజులు లేదా వివాహాలతో పాటు కేక్ సంప్రదాయం భారతీయ పండుగలకు కూడా విస్తరించింది. రాఖీ, దీపావళి భాయ్ దూజ్ వంటి పండుగలు సంప్రదాయ స్వీట్లు – బహుమతులతో పాటు కేక్‌లను బహుమతిగా ఇచ్చే వారి సంఖ్య పెరుగుతోంది.

సంప్రదాయ స్వీట్‌లు ఇప్పటికీ పెద్ద ఎత్తున ఆదరణ పొందుతున్నప్పటికీ, కేక్‌ను బహుమతిగా ఇవ్వడం అనేది కూడా క్రమక్రమంగా ఊపందుకుంటోంది. అలా ఇచ్చి పుచ్చుకోవాలనుకునేవారి కోసం రిచ్ ప్లమ్ కేక్, విక్టోరియన్ ప్లమ్ కేక్, చాకొలెట్ ఐసింగ్ కేక్, వెనీలా ఐసింగ్ కేక్, పైనాపిల్, స్ట్రాబెర్రీ, బట్టర్ స్కాచ్, బ్లాక్ ఫారెస్ట్ కేకులతో పాటు ఫ్రెష్ ఫ్రూట్ కేక్, క్యారామిల్ కేక్, చాకొలెట్ ఆల్మండ్ కేక్.. వంటి వెన్నో.. సిటీ మార్కెట్లో సందడి చేస్తున్నాయి.

సోషల్.. సోస్టైల్..

డిజైనర్ కేక్స్ హవాకు సోషల్ మీడియా ఆజ్యం పోస్తోంది. ఆకర్షణీయమైన వెరైటీలను సోషల్ వేదికలపై ఇన్‌ఫ్లుయెన్సర్లు, ఫుడ్ బ్లాగర్‌లు తాజా కేక్ డిజైన్‌లను క్రమం తప్పకుండా ప్రదర్శిస్తున్నారు. తద్వారా ప్రత్యేక సందర్భాలకు తగ్గట్టుగా డిజైన్ చేసిన కేక్‌ల వైపు వినియోగదారుల చూపు మళ్లేలా చేస్తున్నారు. పరిశ్రమ నివేదికల ప్రకారం, సోషల్ మీడియా ప్రభావం వల్ల దేశంలో కేక్ మార్కెట్ కొన్ని సంవత్సరాలుగా 20శాతం వరకూ పెరుగుతోందట.



సందర్భమేదైనా.. సందడి కేక్స్‌దే..

ఒకప్పుడు కేక్స్‌ను కేవలం బర్త్‌డేలకు మాత్రమే ఎక్కువగా వినియోగించేవారు. క్రిస్మస్, న్యూ ఇయర్‌లతో పాటు ఇప్పుడు ఇవి విభిన్న సందర్భాలకు విస్తరించాయి. చిన్నారుల పుట్టిన రోజుల్ని ప్రతినెలా జరపడం దగ్గర నుంచీ వివాహ వార్షికోత్సవాల దాకా అలాగే కొత్తగా జాబ్‌లో చేరడం దగ్గర నుంచీ ప్రమోషన్స్, పదవీ విరమణ దాకా.. ఇలా అనేకానేక సందర్భాలకు కేక్స్‌ను వినియోగించడం జరుగుతోంది. పైనాపిల్ కేక్, బటర్‌స్కాచ్ కేక్, ఛీజ్ కేక్, బిస్కోటి కేక్.. తదితర వెరైటీలకు ఫుల్ డిమాండ్ ఉంది.

– సయ్యద్ ఇర్ఫాన్, సుభాన్ బేకరీ

వస్త్ర వైభవం.. స్వయం శోభితం

పెళ్లిళ్ల సీజన్ ఒక్కసారిగా హాట్‌గా మారడానికి సిటీలో జరుగుతున్న హీరో అక్కినేని నాగ చైతన్య శోభితా ధూళిపాళల వివాహం ఓ రీజన్‌గా చెప్పొచ్చు. సిటీలో చాలా ఏళ్ల తర్వాత జరుగుతున్న టాప్ సెలబ్రిటీల వివాహ వేడుక కావడంతో వీరి పెళ్లి టాక్ ఆఫ్ ద టౌన్‌గా మారింది. మరోవైపు వధూవరుల దుస్తుల డిజైన్ చేసే ఛాన్స్ ఎవరు దక్కించుకుంటారా అని సిటీ ఫ్యాషన్ సర్కిల్ ఆసక్తిగా ఎదురు చూసింది. అయితే అందర్నీ ఆశ్చర్యపరుస్తూ.. శోభిత స్వయంగా తానే డిజైనర్‌గా మారినంత పనిచేసి మరీ తమ పెళ్లి దుస్తుల్ని శ్రద్ధగా రూపొందించుకోవడం విశేషం. - సాక్షి, సిటీబ్యూరో



తన పెళ్లి వేడుకల్లో ధరించే దుస్తుల కోసం శోభిత ఏ ఫ్యాషన్ డిజైనర్‌నీ సంప్రదించడం లేదట. తన పెళ్లి దుస్తుల కోసం, ఆమె తల్లితో కలిసి షాపింగ్ చేశారనీ, బంగారు జరీ వర్క్‌తో కూడిన కంజీవరం చీరను ఎంపిక చేసుకున్నారని, మరో చీరను ఆంధ్రప్రదేశ్‌లోని స్థానిక నేత పనివారి ద్వారా తయారు చేయించారని సమాచారం. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ప్రసిద్ధి పొందిన పొందూరు ఖాదీ చీరను కూడా ఆమె తీసుకున్నారట. దానితో పాటే చైతన్య కోసం కూడా ఒక మ్యాచింగ్ జతను ఎంచుకున్నారట. గతంలో మోడల్‌గా ర్యాంప్‌పై మెరిసిన శోభితకు ఫ్యాషన్ రంగంతో సన్నిహితంగా మెలిగిన అనుభవం ఉంది. అయితే ఆమె తన సంప్రదాయ నిశ్చితార్థ వేడుక కోసం మనీష్ మల్హోత్రా చీరను ధరించారు. మరోవైపు పెళ్లి వేడుకల్లో.. డిజైనర్ ఆభరణాలకు బదులుగా.. శోభిత వారసత్వంగా వచ్చిన ఆభరణాలను ధరిస్తున్నారు. వేడుక సందర్భంగా తన తల్లి, అమ్మమ్మ నుంచి వారసత్వంగా పొందిన ఆభరణాలతో తనను తాను అలంకరించుకున్నట్లు ఆమె సోషల్ మీడియా వేదికగా భావోద్వేగాన్ని పంచుకున్నారు.

వెల్‌కమ్ వేడుక.. వార్ ఆఫ్ డీజేస్..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నూతన సంవత్సర వేడుకల సందడికి కంట్రీ క్లబ్ శ్రీకారం చుట్టింది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఈ నెల 31న వార్ ఆఫ్ డీజేస్ పేరుతో ఈవెంట్ నిర్వహిస్తోంది. క్లబ్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్, ఎండీ రాజీవ్‌రెడ్డి ఈ వివరాలను తెలిపారు. నగరంలోని పోలీస్ హాకీ స్టేడియంలో నిర్వహించనున్న ఈ వేడకలో భాగంగా టాప్ డీజేల మ్యూజిక్, విందు వినోద కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదేవిధంగా సినీనటి దక్షా నాగర్కర్ నృత్యాలు ప్రధాన ఆకర్షణగా పేర్కొన్నారు. సమావేశంలో నటి దక్షా పాల్గొని మాట్లాడిన అనంతరం నృత్యకార్యక్రమం జరిగింది.





ఏ ఈవెంట్.. ఎక్కడ..?

ఇయర్ ఎండ్ వేడుకలకు సిద్ధమవుతున్న నగరం

వాట్ హ్యాపెనింగ్ ఇన్ హైదరాబాద్ అంటూ నగరవాసుల గూగుల్ సెర్చ్ | లైవ్ కన్సర్ట్‌లు, ఇయర్ వేడుకలకు ముందస్తు బుకింగ్స్‌కు ఆసక్తి

సాక్షి, సిటీబ్యూరో: ఎప్పుడూ బిజీ బిజీ లైఫ్‌తో తీరిక లేకుండా ఉండే నగరవాసులు ఒక్కసారిగా హైదరాబాద్‌లో ఏం జరుగుతుందోనని తెలుసుకునేందుకు ఆరా తీస్తున్నారు. ప్రొఫెషనల్, పర్సనల్ పనులు సైతం కాస్త పక్కపెట్టి మరీ ఈ డిసెంబర్‌పై ఫోకస్ పెంచారు. ఇందులో భాగంగానే వాట్సాప్ హైదరాబాద్, వాట్స్ హ్యాపెనింగ్ ఇన్ సిటీ అంటూ గూగులింగ్ చేస్తున్నారు. ఇయర్ ఎండ్ నేపథ్యంలో డిసెంబర్ నెలలో వేడుకలు, ఎంజాయ్‌మెంట్‌కు సంబంధించి ముందే ప్లానింగ్ చేస్తున్నారు సిటీజనులు. ఇప్పటి నుంచే నగరంలో జరగనున్న ఈవెంట్లు, లైవ్ కన్సర్ట్‌లు, కేక్ మిక్సింగ్‌లు, 31 నైట్ సెలబ్రేషన్స్‌పై ముందస్తు బుకింగ్స్‌కు ఆసక్తి చూపుతున్నారు.

లైవ్ కన్సర్ట్‌లు.. మెమరబుల్ ఈవెంట్స్..

పాత సంవత్సరానికి బైబై చెబుతూ.. నూతన ఏడాదికి గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పడం నగరం ఆనవాయితీ. ప్రతీ ఏడాది ఈ వేడుకల కోసం నగరం అందంగా ముస్తాబై విభిన్న ఆహ్లాదకర వేడుకలతో అలరిస్తూనే ఉంది. అయితే.. ఈ ఈవెంట్స్‌కు సంబంధించి ముందుగానే ప్లాన్ చేకుంటే పాసులు, ఎంట్రీ దొరకడం చాలా కష్టమని అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెలలో నగరంలో జరగనున్న ఈవెంట్ల గురించి ముందుగానే ఆరా తీస్తున్నారు. చివరి రెండు వారాల్లో జరగనున్న లైవ్ కన్సర్ట్‌లు, ఫైవ్ స్టార్ ఈవెంట్లు, ఇతర వినోద కార్యక్రమాకు సంబంధించి గూగుల్‌లో, ఈవెంట్స్ వెబ్‌సైట్లలో వెతుకుతున్నారు. ఇలాంటి వేడుకలకు నగరవాసుల నుంచి పెరుగుతున్న ఆదరణ, అంతేగాకుండా ఆయా రోజుల్లో ముందస్తుగానే సెలవులు పెట్టుకోవాల్సిన దృష్ట్యా వాట్స్ హ్యాపెనింగ్ ఇన్ హైదరాబాద్ అంటూ సెర్చ్ చేస్తున్నారు.

గ్రాండ్‌గా.. ఈవెంట్స్..

డిసెంబర్ నెలకు సంబంధించి నిర్వహించనున్న ఈవెంట్లకు సంబంధించి ఇప్పటికు ప్రణాళికలు మొదలైనప్పటికీ అనుమతులు, ఆంక్షల నేపథ్యంలో తేదీల వివరాలను నిర్వాహకులు ఇంకా ప్రకటించలేదు. కొన్ని ప్రత్యేక ఈవెంట్ల వివరాలు మాత్రం ఇప్పటికే వెల్లడించి బుక్ మై షోలో టిక్కెట్లు సైతం అందుబాటులో ఉన్నాయి. అయితే మాదాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో న్యూ ఇయర్ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు నిర్వాహకులు. వీటి కోసం ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రాంతాలతో పాటు విదేశాల నుంచి సైతం ప్రముఖ మ్యూజిక్ బ్యాండ్స్, ఈవెంట్స్ ఆర్గనైజర్స్ నగరానికి చేరుకోనున్నారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు అలరించాయి. ఎల్‌కేజీ నుంచి ప్రాథమిక స్థాయి తరగతులకు చెందిన చిన్నారులు విభిన్న రకాల దుస్తులను ధరించి ఆకట్టుకున్నారు. జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, అడవుల పరిరక్షణ థీమ్, ట్రాఫిక్ సిగ్నల్లు, రైతులు, చెట్లు, సీతాకోక చిలుకలు, ఏంజిల్స్, అడవి జంతువులు, ఆదిమానవులు, రోబోలు, అల్లావుద్దీన్ అద్భుత దీపం తదితర కాన్సెప్ట్‌లతో ఆకట్టుకుని విలువైన సందేశాలను అందించారు. స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించే లక్ష్యంగా ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. చిన్ననాటి నుంచే దేశం పట్ల గౌరవాన్ని అలవర్చాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు చంద్రకళాయాదవ్, హెచ్ఎస్ త్రిపాఠి, ప్రిన్సిపాల్ రాధిక తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా...

మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డికి వీడ్కోలు..

అమెరికా వెళ్లనున్న బీఆర్‌ఎస్ నేత



వీడ్కోలు సమావేశంలో శ్రీనివాసరెడ్డి, హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ భవన్ ఇన్‌చార్జిగా సుమారు 24 ఏండ్ల పాటు పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ నేతలు సోమ వారం తెలంగాణ భవన్‌లో వీడ్కోలు పలికా రు. మాజీ మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన జరి గిన వీడ్కోలు సమావేశంలో పలువురు నేతలు పార్టీకి శ్రీనివాస్‌రెడ్డి అందించిన సేవలను గు ర్తు చేసుకున్నారు. శేష జీవితాన్ని అమెరికాలో గడిపేందుకు వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డిని తెలంగాణ ఉద్యమ అనుభవాలను క్రోడీకరించి పుస్తకం రాయాల్సిందిగా నాయకులు కోరారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీనివాస్‌రెడ్డి అనేక కీల క ఘట్టాలకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్నారన్నారు. మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పద్మారావు గౌడ్, ఎమ్మెల్సీలు మధుసూదనా చారి తదితరులు శ్రీనివాస్‌రెడ్డితో తమకున్న అనుబంధాన్ని వివరించారు. కాగా, తనకు మంచి గుర్తింపును ఇచ్చిన పార్టీ అధినేత కేసీఆర్‌కు మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఏప్రిల్ దాకా దొడ్డు బియ్యమే!



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి పండుగ నుంచి కాకుండా ఉగాది పండుగ నుంచి సన్నబియ్యం పంపిణీ చేపట్టాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభు త్వం ఈ మేరకు దొడ్డు బియ్యం సేకరణపై దృష్టి సారించింది. 6 లక్షల మెట్రిక్ టన్నుల ప్రొ క్యూర్‌మెంట్ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలవారీగా, రైస్ మిల్లుల వారీగా దొడ్డు బియ్యం సేకరణ అలాట్‌మెంట్ ఇచ్చింది. ఖరీఫ్ 2023–24, రబీ 2023–24 సీజన్ల బియ్యాన్ని సీఎంఆర్ కోటాలో స్టేట్ పూల్ కింద తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మన విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యమెంత?

- రేపు దేశవ్యాప్తంగా న్యాస్ పరీక్ష
- ఈసారి 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహణ
- రాష్ట్రంలోని 3,500 పాఠశాలల నుంచి లక్షమంది ఎంపిక
- ఫలితాలు ఏప్రిల్, మే నెలలో వెలువడే అవకాశం



సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఈ నెల 4వ తేదీన దేశవ్యాప్తంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) జరగనుంది. దీనికో సం రాష్ట్రంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆయా స్కూళ్ళను సందర్శించి సర్వేలో భాగంగా పరీక్ష నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అధికారులు దీనిని పర్యవేక్షిస్తారు. న్యాస్ పరీక్ష ఆధారంగానే రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు ఎలా ఉన్నాయనేది నిర్ధారిస్తారు. ప్రతి మూడేళ్ళకోసారి ఈ పరీక్ష జరుగుతుంది. 2021లో జరిగిన న్యాస్ పరీక్షలో తెలంగాణ రాష్ట్రం దేశంలో అయిదవ స్థానంలో నిలిచింది. జాతీయ సగటు స్కోర్ కంటే కూడా రాష్ట్ర విద్యార్థుల స్కోర్ తక్కువగా ఉన్నట్టు గుర్తించా రు. దీంతో ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాలని ప్రభుత్వం ఆదేశించింది. న్యాస్‌ను ప్ర తిష్టాత్మకంగా తీసుకోవాలని చెప్పడంతో కొన్ని నెలలుగా పరీక్షపై పాఠశాలల ప్రధానోపాధ్యా యులు దృష్టి పెట్టారు. విద్యార్థులకు ఇప్పటికే మూడుసార్లు మోడల్ పరీక్షలు నిర్వహించారు. తాజా పరీక్ష ఫలితాలను ఏప్రిల్ లేదా మే నెలలో వెల్లడిస్తారని అధికారులు తెలిపారు.

ఫరాఖ్‌కు నిర్వహణ బాధ్యతలు

న్యాస్ పరీక్షను 2021 వరకూ జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) నిర్వహించింది. ఈసారి నుంచి రాష్ట్రీయ సర్వేక్షణ్–2024 పేరుతో ఎన్‌సీఈఆర్‌టీలోని స్వ తంత్ర సంస్థ ఫరాఖ్ (పర్‌ఫార్మెన్స్ అసెస్‌మెంట్, రివ్యూ అండ్ అనాలసిస్ ఆఫ్ నాలెడ్జ్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్) నిర్వహిస్తోంది. గ తంలో 3, 5, 8, 10 తరగతులకు న్యాస్ పరీక్ష ఉండేది. ఈసారి 3, 6, 9 తరగతులకు ఆ క్లాసు ల్లోని ప్రమాణాల మేర పరీక్ష నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా 75,565 పాఠశాలల నుంచి 22,94,377 మంది ఈ పరీక్ష రాస్తున్నారు. వీరిలో ప్రభుత్వ స్కూళ్ళ నుంచి 50 శాతం, ప్రైవేటు స్కూళ్ళ నుంచి మరో 50 శాతం మంది విద్యార్థులు ఉన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 3,500 పాఠశాలల నుంచి లక్ష మందిని పరీక్షకు ఎంపిక చేశారు.

ఈసారి క్రిటికల్ థింకింగ్ కూడా..

న్యాస్ పరీక్ష విధానంలో ఈసారి నైపుణ్యాలకు పెద్దపీట వేస్తున్నారు. తరగతుల వారీగా విద్యార్థులకు భాష, గణితం, సైన్స్, సోషల్ సైన్స్, పరిసరాల పరిజ్ఞానంపై ప్రశ్నలు ఇస్తారు. ఈసారి అదనంగా విమర్శనాత్మక ఆలోచన (క్రిటికల్ థింకింగ్)కు సంబంధించిన నేర్పు, విశ్లేషణ నైపుణ్యాలు, భవిష్యత్‌లో ఉద్యోగాలు చేసేందుకు అవసరమైన నైపుణ్యాలపై కూడా ప్రశ్నలు ఇస్తున్నారు. మల్టిపుల్ చాయిస్‌గా ఉండే ప్రశ్నలకు ఓఎంఆర్ షీట్‌లో జవాబులు గుర్తించాల్సి ఉంటుంది. మూడో తరగతికి 45 ప్రశ్నలు, గంటన్నర సమయం, ఆరో తరగతికి 51 ప్రశ్నలు, గంటన్నర, 9వ తరగతికి 60 ప్రశ్నలకు రెండు గంటల సమయం ఉంటుంది. మొత్తం మీద న్యాస్ పరీక్ష కఠినంగా ఉండే అవకాశం ఉందని టీచ ర్లు చెబుతున్నారు. ప్రశ్నలను అనేక విధాలుగా ఇస్తున్నారని, సెంట్రల్ సిలబస్‌తో కూడిన ప్రశ్నలకు రాష్ట్ర విద్యార్థులు ఏ మేరకు జవాబిస్తారో వేచిచూడాల్సి ఉందని అంటున్నారు.

‘మేడిగడ్డ’ ఎప్పుడు దెబ్బతింది?

- కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లను డ్యామ్‌లుగా ఏ ప్రాతిపదికన పరిగణించారు
- 2019లో బరాజ్‌లు పూర్తయితే 2021లో వాటిని గుర్తించడం వెనక ఆంతర్యమేంటి?
- రాష్ట్ర డ్యామ్‌ల భద్రత సంస్థ మాజీ ఎస్‌ఈ మురళీకృష్ణకు పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నలు
- ఆయన అమెరికాలో ఉండటంతో వర్చువల్‌గా సాగిన క్రాస్ ఎగ్జామినేషన్

సాక్షి, హైదరాబాద్: ‘వరదనీటి మళ్లింపు కోసం నిర్మించే బరాజ్‌లను నీటినిల్వ డ్యామ్‌లుగా ఏ ప్రాతిపదికన పరిగణించారు? 2019లో బరాజ్‌లు పూర్తయితే 2021లో వచ్చిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్ కింద 2023 జూలైలో కాళేశ్వరం బరాజ్‌లను డ్యామ్‌లుగా గుర్తించడం వెనక ఆంతర్యం ఏమిటి?’ అని రాష్ట్ర డ్యామ్‌ల భద్రత సంస్థ (ఎస్డీఎస్ఓ) మాజీ ఎస్ఈ మురళీకృష్ణను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సోమవారం అమెరికాలో ఉన్న మురళీకృష్ణను వర్చువల్‌గా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.

చట్టంలో ఉన్నందునే పరిగణించాం..

‘డ్యామ్‌ల రక్షణ చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది? మీరు అఫిడవిట్లో పేర్కొన్నదంతా వాస్తవమేనా? మీ బాధ్యతలేంటి?’ అని కమిషన్ మురళీకృష్ణను ప్రశ్నించింది. అందుకు ఆయన బదులిస్తూ 2021 డిసెంబర్ 30న నేషనల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్‌ను నోటిఫై చేశారని పేర్కొన్నారు. 15 మీటర్ల ఎత్తు కలిగి, నీటిని నిల్వ చేసే జలాశయాలతోపాటు 10 మీటర్లకు మించి ఎత్తున్న చెక్ డ్యామ్‌లను కూడా డ్యామ్‌లుగా పరిగణించాలని చట్టంలో ఉందని మురళీకృష్ణ తెలియజేశారు. దీనిపై కమిషన్ స్పందిస్తూ ‘నీటిని మళ్లించడానికే బరాజ్‌లు కడతారు.. మరి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను డ్యామ్‌లుగా ఎలా పరిగణించారు? అని మళ్లీ ప్రశ్నించింది. చట్ట ప్రకారం స్పెసిఫైడ్ డ్యామ్‌లుగా బరాజ్‌లను నోటిఫై చేశారని మురళీకృష్ణ వివరించారు. డ్యామ్‌ల రక్షణ చట్టం అమలు కోసం క్షేత్రస్థాయిలో అధికారులతో చర్చించామని.. ఆయా డ్యామ్‌లను సమగ్రంగా పరిశీలించి నోటిఫై చేయించామని తెలిపారు. బరాజ్‌లు ఎప్పుడు పూర్తయ్యాయని కమిషన్ ప్రశ్నించగా 2023లో స్పెసిఫైడ్ డ్యామ్‌లుగా నోటిఫై చేశామన్నారు. 2021లో చట్టం వస్తే 2019లోనే బరాజ్ పూర్తవడం వాస్తవమా? కాదా? అని కమిషన్ అడగ్గా వాస్తవమేనని చెప్పారు. పదేపదే విజ్ఞప్తుల అనంతరం స్పెసిఫైడ్ డ్యామ్‌ల జాబితాలో బరాజ్‌లను చేర్చారని బదులిచ్చారు. 2019లో మేడిగడ్డలో వరదలు వచ్చాయని, తొలుత సుందిళ్ల, అన్నారంలో బుంగలు ఏర్పడ్డాయని, ఆ తర్వాత మేడిగడ్డ దెబ్బతిందని మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అయితే బరాజ్‌ల అధికారులు ఈ విషయాన్ని నివేదించలేదని మురళీకృష్ణ వెల్లడించారు.

రెండో వారంలో మళ్లీ విచారణ

నాలుగో విడత క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి చేసిన జస్టిస్ చంద్రఘోష్.. మంగళవారం సాయంత్రం కోల్‌కతా తిరిగి వెళ్లనున్నారు. అనంతరం రెండో వారంలో తిరిగి హైదరాబాద్ వచ్చి ఐదో దఫా విచా రణలో ఈఎన్సీలు, మాజీ ఈఎన్సీలను ప్రశ్నించ నున్నారు. ఆ తర్వాత ఐఏఎస్‌లను విచారించే అవకాశాలున్నాయి.

ఎస్సీ ఎస్టీలకు ‘షాక్’

ఏపీలో ఉచిత విద్యుత్ కట్..

- ఉచిత విద్యుత్‌పై పేదల మొర ఆలకించని కూటమి సర్కారు
- దళితులు, గిరిజనులకు ఉచిత విద్యుత్ అందించిన వైఎస్సార్‌సీపీ

అన్నమయ్య జిల్లా కోడూరులో స్కూటర్ మెకానిక్‌గా పని చేసే డబ్బు రవి ఉన్నఫళంగా రూ.1.50 లక్షలు కరెంట్ బిల్లు కట్టాలంటూ అధికారులు తేల్చి చెప్పడంతో హతాశుడయ్యాడు. ఉచిత విద్యుత్తుకు అర్హత ఉన్నా ఏమిటీ దారుణమని వాపోతున్నాడు.

ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంకు చెందిన అయినపర్తి శ్రీనివాసరావు పూరి గుడిసెలో జీవిస్తున్నాడు. పాత బకాయిలు కట్టాలంటూ ఆయన తండ్రి యాకోబు పేరుతో ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను అధికారులు తొలగించారు. ఇప్పటికి నెల రోజులుగా చీకట్లోనే మగ్గుతున్నాడు.



ఏలూరు జిల్లా రెడ్డి గణపవరంలో విద్యుత్ కనెక్షన్లు కట్ చేయడంతో నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

సాక్షి, అమరావతి: ఏపీలో ఉచిత విద్యుత్‌పై కూటమి సర్కారు మోసంతో రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజన నివాసాల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. గత ప్రభుత్వం ఉచితంగా అందించిన విద్యుత్‌ను కూడా పాత బకాయిలుగా చూపిస్తూ ఎస్సీ, ఎస్టీల నుంచి బలవంతపు వసూళ్లకు దిగుతోంది. రూ.లక్షలు.. వేలల్లో బకాయిలు చెల్లించాలంటూ ఆదేశిస్తోంది. అంత డబ్బు కట్టలేని పేదల కరెంట్ కనెక్షన్లను విద్యుత్ సిబ్బంది నిర్దాక్షిణ్యంగా కట్ చేస్తూ మీటర్లను తొలగిస్తున్నారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో పలు గ్రామాల్లో గిరిజన, దళితులకు చెందిన విద్యుత్ కనెక్షన్లను అధికారులు కట్ చేశారు. పుట్లగట్లగూడెం, మైసన్నగూడెం, రెడ్డిగణపవరం, పాలకుంట, వీరభద్రపురం లాంటి గిరిజన గూడేలు, దళితపేటలు అంధకారంలో మగ్గిపోతున్నాయి. దాదాపు 250 కుటుంబాలు నివసించే అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం రాఘవరాజపురం హరిజనవాడలో బకాయిలు చెల్లించాలంటూ విద్యుత్‌శాఖ సిబ్బంది బిల్లులు జారీ చేయడంతో స్థానికులు నిరసనగా దిగారు. పలువురికి రూ.4,000 నుంచి రూ.10,000 వరకు బిల్లులు జారీ అయ్యాయి. ఇంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలంటూ పేదలు ఆందోళన వ్యక్తం చేశారు.

200 యూనిట్ల వరకు ఉచితంగా ఇచ్చిన వైఎస్ జగన్

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది జనవరి వరకు 15,29,017 ఎస్సీ కుటుంబాలకు ఉచిత విద్యుత్తుతో రూ.2,361.95 కోట్ల మేర లబ్ధి చేకూరగా 4,57,586 ఎస్టీ కుటుంబాలకు రూ.483.95 కోట్ల మేర ప్రయోజనం కలిగింది. మొత్తం 19,86,603 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.2,845.90 కోట్ల మేర ఉచిత విద్యుత్తు ద్వారా మేలు చేశారు.

అప్పులు కడుతూ.. అవరోధాలు అధిగమిస్తూ

ఏడాది కాలంలో రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని వివరించిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: పదేళ్లపాటు గత ప్రభుత్వం చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులను తీరుస్తూనే క్రమశిక్షణతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి కార్యాలయం సోమవారం ఆర్థిక ముఖచిత్రాన్ని వివరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. అప్పులు కడుతూనే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని, ఆరు గ్యారంటీల అమలుకు ప్రత్యేక చొరవ చూపుతున్నామని వెల్లడించింది. ఇష్టారాజ్యంగా అప్పులు తీసుకునే విధానానికి స్వస్తి పలికి.. బడ్జెట్ పరిమితులకు లోబడి రుణాలు తీసుకుని సర్దుబాటు విధానాన్ని అనుసరిస్తున్నట్టు తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు వచ్చే పద్ధతిని పునరుద్ధరించామని, అప్పులు తెచ్చిన దాని కంటే ఎక్కువ చెల్లింపులు చేయడం ద్వారా రాష్ట్ర ప్రజలపై రుణభారం తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించింది.

ఏడాది కాలంలో రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రంలోని ముఖ్యాంశాలు:

- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల.
- డిసెంబర్, 2023 నుంచి నవంబర్, 2024 వరకు రూ.52,118 కోట్ల రుణ సమీకరణ. గతంలో తీసుకున్న అప్పులకు వడ్డీలు, అసలు కలిపి రూ. 64,516 కోట్ల చెల్లింపులు.
- రూ.20,617 కోట్లతో రాష్ట్రంలో 25.36 లక్షల మంది రైతులకు రుణ విముక్తి. రైతు సంక్షేమం కోసం వివిధ పథకాల కింద రూ.57 వేల కోట్ల ఖర్చు.

గజవాహనంపై శ్రీమహాలక్ష్మి

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి అమ్మవారు శ్రీమహాలక్ష్మిగా గజవాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం 8 గంటలకు జగన్మోహినిగా తిరువీధుల్లో పల్లకిలో విహరించిన అమ్మవారికి మధ్యాహ్నం స్నపన తిరుమంజనం అనంతరం వేడుకగా వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఆస్థాన మండపంలో కనులపండువగా ఊంజల్‌సేవ చేశారు. సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారిని వాహనమండపంలో గజవాహనంపై కొలువుదీర్చారు. అనంతరం పట్టుపీతాంబర వజ్రవైడూర్య స్వర్ణాభరణాలతో పాటు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తీసుకొచ్చిన సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని అమ్మవారికి అలంకరించారు. రాత్రి 7 గంటలకు అమ్మవారు గజేంద్రుడిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.



రైతులను రోడ్డున పడేశావ్!

ధాన్యం సేకరణలో వైఫల్యంపై సీఎం చంద్రబాబుపై వైఎస్ జగన్ మండిపాటు



సాక్షి, అమరావతి: ధాన్యం సేకరణలో టీడీపీ కూటమి సర్కారు దారుణ వైఫల్యంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మద్దతు ధర కల్పించి ఆదుకోవాలన్న కనీస ధ్యాస కూడా ఈ ప్రభుత్వానికి లేదని.. రైతులను రోడ్డున పడేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటంతా వర్షాలకు తడిసిపోతున్నా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని.. కృష్ణా, గోదావరి డెల్టాలో ఎటు చూసినా కిలోమీటర్ల మేర ధాన్యం రాసులే కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముఖం చాటేయడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు 75 కిలోల బస్తాకు రూ.300–400 నష్టానికి దళారులకు అమ్ము కోవాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. గత ఐదేళ్లూ పారదర్శకంగా ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ప్రతి రైతన్నకూ కనీస మద్దతు ధర కల్పించి తోడుగా నిలబడ్డామని గుర్తు చేశారు. తేమ శాతంతో సంబంధం లేకుండా తడిసిన, మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని సైతం ఎమ్మెస్పీకి కొనుగోలు చేశామన్నారు. అధికారంలోకి వచ్చేందుకు మోసపూరిత హామీలతో మోసగించిన చంద్రబాబు రైతులను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ప్రతి రైతుకూ రూ.20 వేల చొప్పున ఇస్తామన్న పెట్టుబడి సాయాన్ని ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఈమేరకు సోమవారం తన ‘ఎక్స్’ ఖాతాలో వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.

మరిన్ని వివరాలు, వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

తేలని ‘విభజన’ చర్చలు!

- తెలంగాణ, ఏపీ సీఎస్‌ల ఆధ్వర్యంలోని కమిటీ భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన అంశాలపై జరిగిన తెలంగాణ, ఏపీ సీఎస్‌ల ఆధ్వర్యంలోని కమిటీ భేటీ ఏమీ తేల్చకుండానే ముగిసింది. కొన్ని అంశాలపై ఏకాభిప్రాయం వ్యక్తమైనా ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు. వచ్చే సమావేశం నాటికి ఆయా అంశాలపై నిర్దిష్టమైన ప్రతిపాదనలతో రావాలని తీర్మానించారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ జరిగి పదిన్నరేళ్లు అవుతున్నా చాలా సమస్యలు అలాగే ఉండిపోయిన విషయం తెలిసిందే. అలా అపరిష్కృతంగా ఉన్న అంశాలపై చర్చించేందుకు... ఇరు రాష్ట్రాల సీఎస్‌ల ఆధ్వర్యంలోని అధికారుల కమిటీ సోమవారం ఏపీలోని మంగళగిరిలో ఉన్న ఏపీఐఐసీ కార్యాలయంలో సమావేశమైంది.

15 అంశాలపై చర్చించినా..

సుమారు రెండు గంటల పాటు జరిగిన కమిటీ భేటీలో... ఇరు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న 15 అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్టు చర్చల్లో పాల్గొన్న తెలంగాణ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. విభజన జరిగి పదేళ్లు పూర్తయినందున త్వరగా సమస్యలను పరిష్కరించుకోవాలని ఇరు రాష్ట్రాల సీఎస్‌లు అభిప్రాయపడ్డారని తెలిపారు. ఈ ఏడాది జూలై 6న ఇరు రాష్ట్రాల సీఎంలు సమావేశమై జరిపిన చర్చలకు అనుగుణంగా సమస్యలను పరిష్కరించుకోవాలని మరోసారి నిర్ణయించినట్టు వివరించారు. ఈ మేరకు వచ్చే సమావేశం నాటికి ఈరోజు చర్చించిన అంశాలపై నిర్దిష్ట ప్రతిపాదనలతో రావాలని తీర్మానించినట్టు తెలిపారు. ఇందుకోసం ఆయా శాఖల అధికారులు ముందుగా సమావేశమై చర్చించుకోవాలని, పరిష్కారానికి అవసరమైన వివరాలు సేకరించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. త్వరలో కమిటీ మరోసారి సమావేశం కావాలని నిర్ణయించినట్టు తెలిపారు.

మంత్రుల కమిటీకే ‘విద్యుత్’ అంశం

రెండు రాష్ట్రాల మధ్య విద్యుత్ కొనుగోళ్లు, విక్రయాల అంశంలో నెలకొన్న వివాదాన్ని మంత్రుల కమిటీకి వదిలేయాలని సీఎస్‌ల కమిటీ నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే 861 కోట్ల లేబర్ సెస్ నిధులను పంపిణీ చేసుకోవాలని, ఉద్యోగుల పరస్పర బదిలీలపై విస్తృతంగా చర్చించాలని ఏకాభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. ఈ అంశాలపై సీఎంలకు నివేదించిన తర్వాత తుది నిర్ణయానికి వచ్చే అవకాశముంది. ఈ సమావేశంలో తెలంగాణ సీఎస్ శాంతికుమారి, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ రిజ్వీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, ఏపీ సీఎస్ నీరబ్‌కుమార్ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో 15 శాతం వృద్ధి

- ఐటీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి వెల్లడి
- తెలంగాణ, ఏపీ కలిపి రూ.59 వేల కోట్ల పన్ను వసూళ్లు



సాక్షి, హైదరాబాద్: పన్ను వసూళ్లలో తెలంగాణ మంచి వృద్ధిరేటు చూపుతోందని, గతేడాదితో పోలిస్తే 15 శాతం వృద్ధి సాధించిందని ఆదాయ పన్ను శాఖ తెలంగాణ, ఏపీల ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత తెలిపారు. తెలంగాణ, ఏపీ కలిపి ఈ ఏడాది పన్ను వసూళ్ల లక్ష్యం రూ.1,21,000 కోట్లు కాగా, ఇందులో ఇప్పటివరకు రూ.59,000 కోట్ల మార్కును చేరుకున్నామని చెప్పారు. పూర్తి లక్ష్యాన్ని చేరుకుంటామనే ఆశాభావంతో ఉన్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) సోమవారం ఉదయం ఆదాయపు పన్నుపై నిర్వహించిన సమావేశంలో మధుస్మిత మాట్లాడారు. రెండు రాష్ట్రాల్లో కలిపి రూ. 2 లక్షల కోట్ల పన్ను పెండింగ్‌లో ఉందని తెలిపారు. వ్యాపారాన్ని సులభతరం చేయడం అనేది భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆదా యపు పన్ను శాఖ నినాదం అని ఆమె చెప్పారు. ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఖర్చు చేయ డానికి వీలుగా ఎక్కువ ఆదాయాన్ని సేకరించడం తమ కర్తవ్యమని చెప్పారు. ఫేస్‌లెస్ ఇన్‌కమ్ ట్యాక్స్ అసెస్‌మెంట్ గురించి మాట్లాడుతూ.. ఫేస్‌లెస్ అసెస్‌మెంట్ అనేది పన్ను చెల్లింపుదారుడికి, మదింపు అధికారికి మధ్య ప్రత్యక్ష పరస్పర చర్య లేకుండా ఎలక్ట్రానిక్ పద్ధతిలో నిర్వహించబడే వ్యవస్థ అని వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్య

మరో ఘటనలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

పోచారం/నిజాంపేట/ బీబీనగర్/ భానుపురి (సూర్యాపేట): వేర్వేరు కాలేజీల్లో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మరో ఘటనలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.

అన్నోజిగూడ నారాయణ కళాశాలలో...

బీబీనగర్ మండలంలోని పెద్దపలుగు తండాకు చెందిన బానోతు తనుష్‌నాయక్ (16) తల్లిదండ్రులు నగరానికి వలస వచ్చి కుషాయిగూడలోని చక్రీపురంలో ఉంటున్నారు. అన్నోజిగూడలోని నారాయణ జూనియర్ కళాశాలలో తనుష్‌ను ఇంటర్ ఫస్టియర్(ఎంపీసీ)లో చేర్పించారు. సోమవారం సాయంత్రం హాస్టల్ బాత్‌రూమ్‌లోకి వెళ్లిన తనుష్ ఎంత సేపటికీ బయటకు రాలేదు. దీంతో తోటి విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది తలుపులు పగులగొట్టి చూడగా..తనుష్ ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో నేరుగా గాంధీ ఆస్పత్రికి తరలించారు. తనుష్‌కు ఫిట్స్ వచ్చాయని కళాశాల నిర్వాహకులు చెబుతుండగా..అధ్యాపకుల ఒత్తిడి కారణంగానే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు.



నారాయణ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



తనుష్‌నాయక్

ఎస్ఎస్ఆర్ కళాశాలలో...

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం చిన్నతడం గ్రామానికి చెందిన ప్రజ్ఞారెడ్డి ప్రగతినగర్‌లోని ఎస్ఎస్ఆర్ ఇంపల్స్ ఐఐటీ గర్ల్స్ క్యాంపస్‌లో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతూ కళాశాలకు చెందిన హాస్టల్‌లో ఉంటోంది. సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో ప్రజ్ఞారెడ్డి తాను ఉంటున్న హాస్టల్ గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే విద్యార్థిని మృతి చెందిన విషయాన్ని దాచి పెట్టిన కళాశాల యాజమాన్యం హుటాహుటిన మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించింది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకుందా లేక ఇతరత్రా కారణాలేమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఎస్ఎస్ఆర్ ఇంపల్స్ ఐఐటీ క్యాంపస్‌కు ఇంటర్ బోర్డు అనుమతి లేదని సమాచారం.

ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో....

సూర్యాపేట జిల్లా కోదాడ స్నేహ నర్సింగ్ కళాశాలలో అసోం రాష్ట్రానికి చెందిన నర్గిస్ పర్వీన్ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొద్ది రోజులుగా ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యం ఒత్తిడి చేయడంతో బుధవారం రాత్రి కాలేజీ హాస్టల్‌లో శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను సూర్యాపేట ఆస్పత్రిలో చేర్పించగా..కోలుకుంది. మళ్లీ ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యం డిమాండ్ చేయడంతో సోమవారం గ్రీవెన్స్‌డేలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు కాలేజీకి చెందిన పలువురు విద్యార్థులతో కలిసి ఆమె సూర్యాపేటలోని కలెక్టరేట్‌కు వచ్చింది. వారంతా కలిసి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఆ తర్వాత కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో బాధిత విద్యార్థిని తన వెంట తెచ్చుకున్న శానిటైజర్ తాగి మళ్లీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో వెంటనే కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది ఆమెను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నర్గిస్ పర్వీన్ కలెక్టర్ తేజస్ నందలాల్ పరామర్శించారు.

రాష్ట్ర వన్యప్రాణి బోర్డు పునర్వ్యవస్థీకరణ

సభ్యులుగా పలువురు ఎమ్మెల్యేలు, స్వచ్ఛంద సంస్థలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వన్యప్రాణి బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. మూడేళ్లపాటు కొనసాగనున్న ఈ బోర్డు... ఏడాదికి కనీసం రెండు సార్లు సమావేశం కావాల్సి ఉంటుంది. రాష్ట్రంలో రక్షిత ప్రాంతాల ప్రకటన, వన్యప్రాణుల సంరక్షణ, ఏవైనా ప్రత్యేకతలున్న మొక్కల పరిరక్షణ, ఏదైనా షెడ్యూల్‌కు సవరణలు, అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు, ఇతర ప్రజల అవసరాలకు తగ్గట్టుగా తగిన చర్యలు, రాష్ట్ర ప్రభుత్వం చేసే సూచనలు వంటి వాటిని ఈ బోర్డు పరిశీలించనుంది. తదనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయా అంశాలపై సలహాలు, సూచనలు ఇవ్వనుంది. బోర్డు చైర్మన్‌గా ముఖ్యమంత్రి, వైస్ చైర్‌పర్సన్‌గా అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ బోర్డులో సభ్యులుగా... ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు (ఖానాపూర్), సీహెచ్ వంశీకృష్ణ (అచ్చంపేట) మురళీనాయక్ (మహబూబాబాద్) లను నియమించారు. వన్యప్రాణులతో ముడిపడిన రంగాలు, కార్యకలాపాల్లో నిమగ్నమైన స్వచ్ఛంద సంస్థల నుంచి... డబ్ల్యూడబ్ల్యూఎఫ్ హైదరాబాద్ ఆఫీస్ స్టేట్ డైరెక్టర్ ఫరీదా తంపాల్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ సంస్థాపక కార్యదర్శి ఇమ్రాన్ సిద్ధిఖీ, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి అవినాష్ విశ్వనాథన్‌లు సభ్యులుగా నియమితులయ్యారు. పర్యావరణవేత్తలు... లాకోన్స్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.ఉమాపతి, విశ్రాంత ఐఎఫ్ఎస్ ఎంఏ వహీద్, నెహ్రూ జూపార్క్ వెటర్నరీ కన్సల్టెంట్ డా.నవీన్‌కుమార్, ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.వాసుదేవ రావు, ఈ కేటగిరీలో ఇంకా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు (పినపాక), రాందాస్ మాలావత్ (వైరా)లను సభ్యులుగా నియమించారు. ఇంకా... ఇతర సభ్యులుగా అటవీ, గిరిజన, ఇతర శాఖల ప్రతినిధులు, పీసీసీఎఫ్ నియమితులయ్యారు. ఈ బోర్డు సభ్యకార్యదర్శిగా చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ (అరణ్యభవన్) వ్యవహరిస్తారు. సోమవారం ఈ మేరకు అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీచేశారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 3-12-2024

భోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగి నేటికి 40 ఏళ్లు. డిసెంబర్ 2, 1984 అర్ధరాత్రి మొదలై డిసెంబర్ 3 వరకూ కొనసాగిన విష వాయువులు ఆ ఒక్క రాత్రితో తమ ప్రభావాన్ని ఆపేయలేదు. అవి జన్యువుల్లో దూరి నేటికీ వెంటాడుతూనే ఉన్నాయి. ఆ దుర్ఘటన నుంచి బయటపడిన వారికి నేటికీ అవకరాలతో పిల్లలు పుడుతున్నారు. ఏనాటి ఎవరి పాపమో ఇప్పటికీ వీళ్లు అనుభవిస్తున్నారు. అయితే వీరిలో కొందరు పిల్లలు పారా స్పోర్ట్స్‌లో ప్రతిభ చూపుతుండటం ఒక ఆశ. కాని ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని చెప్పడమే వీరు మనకు కలిగిస్తున్న చైతన్యం.



భోపాల్ గ్యాస్ దుర్ఘటన జరిగి 40 ఏళ్లు నిండిన సందర్భంగా శ్రద్ధాంజలి కార్యక్రమం

ఇంటర్నేషనల్ డే ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీ

● పాపాల భోపాల్‌లో పారా తారలు

విషం కాటేసినా ఆటై మెరిశారు



భోపాల్ విషవాయు బాధితురాలు

పదిహేడేళ్ల దీక్షా తివారి 'ఇంటెలెక్చువల్ డిజేబిలిటీ డిజార్డర్' (ఐడిడి) రుగ్మతతో బాధ పడుతోంది. ఆ అమ్మాయిని బాల్యంలో గమనించిన తల్లిదండ్రులు మహేష్ తివారి, అర్తి తివారి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లినప్పుడు ఆయన 'ఇది భోపాల్ గ్యాస్ విష ఫలితం' అనంటే ఆ తల్లిదండ్రులు హతాశులయ్యారు. 'అదెప్పటి సంగతో కదా' అన్నారు. 'అవును... ఇప్పటికీ వెంటాడుతోంది' అన్నాడు డాక్టర్. దానికి కారణం భోపాల్ ఘటన జరిగినప్పుడు మహేష్ వయసు 5 ఏళ్లు, అర్తి వయసు 3 సంవత్సరాలు. వారు భోపాల్‌లో ఆ గ్యాస్‌ని పీల్చారు. కాని అది జన్యువుల్లో దూరి సంతానానికి సంక్రమిస్తుందని నాడు వాళ్లు ఊహించలేదు. అదృష్టం ఏమిటంటే దీక్షా తివారి 2023 స్పెషల్ ఒలింపిక్స్‌లో భారత్ తరఫున బాస్కెట్ బాల్‌లో రజత పతకం తేవడం. ఈ అమ్మాయే కాదు భోపాల్ విష వాయువు వెంటాడుతున్న చాలా మంది బాలలు భోపాల్‌లోని జేపీ నగర్ ప్రాంతంలో అత్యధికం ఉన్నారు. వీరంతా తమ శారీరక, మానసిక లోపాలను, రుగ్మతలను జయించడానికి స్పోర్ట్స్‌ను ఎంచుకున్నారు. అథ్లెటిక్స్, సైక్లింగ్, ఫుట్‌బాల్ తదితర ఆటల్లో ప్రతిభ చూపుతున్నారు. బతుకు జీవచ్ఛవం కాకుండా ఉండేందుకు క్రీడలు వారిని కాపాడుతున్నాయి. కాని ప్రభుత్వం వీరికి చేయవలసింది చేసిందా?

40 టన్నుల గ్యాస్

డిసెంబర్ 2, 1984 అర్ధరాత్రి భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుంచి అత్యంత ప్రాణాంతకమైన 'మిథైల్ ఐసోసైనెట్' విడుదల వడం మొదలయ్యి మరుసటి రోజు సాయంత్రం వరకూ వ్యాపించింది. దాదాపు 40 టన్నుల విషవాయువు విడుదలైంది. దీని వల్ల చనిపోయిన వారు అధికారికంగా 2,259 కాని 20 వేల నుంచి 40 వేల వరకు మరణించి ఉంటారని సామాజిక కార్యకర్తల అంచనా. ఆ సమయంలో బతికున్నవారు జీవచ్ఛవాలుగా మారితే కొద్దిపాటి అస్వస్థతతో బయట పడిన వారూ ఉన్నారు. విషాదం ఏమంటే ఈ ఘటన జరిగినప్పుడు చంటిపాపలు, చిన్న పిల్లలుగా ఉన్నవారు ఆ ఘటన నుంచి బయట పడి అదృష్టవంతులం అనుకున్నారు కానీ వారికి యుక్త వయసు వచ్చి పిల్లలు పుట్టాక వారిలో అధిక శాతం దివ్యాంగులుగా, మానసిక దుర్బలురుగా మిగిలారు.



దీక్షా తివారి

1300 మంది దివ్యాంగులు

''భోపాల్ విషవాయువులు భోపాల్‌లోని 42 వార్డుల మీద ప్రభావాన్ని చూపాయి. ఆ 42 వార్డుల్లో దివ్యాంగ శిశువులు జన్మిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం వీరి సంఖ్య అధికారికంగా 1300. వీరిలో అత్యధికులు అంధత్వం, సెరిబ్రల్ పాల్సీ, డౌన్ సిండ్రోమ్, మస్క్యులర్ డిస్ట్రఫీ, అటెన్షన్ డెఫిసిట్ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ) వంటి సమస్యలతో బాధ పడుతున్నారు. వీరికి రెగ్యులర్‌గా థెరపీ అవసరం. కాని మా వద్ద వున్న వనరులతో కేవలం 300 మందికే సేవలు అందించగలుగుతున్నాం. మిగిలినవారికీ ఏ థెరపీ అందడం లేదు. వీరిలో చాలామంది పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాల వారు. ఈనాటికీ వీరికి నష్టపరిహారం అందలేదు'' అని 'చింగారి' ట్రస్ట్ బాధ్యుడొకరు తెలిపారు. భోపాల్ విషవాయువు బాధిత దివ్యాంగ శిశువులకు ఈ సంస్థ వైద్య సహాయం అందిస్తుంది.

కల్లాకపటం లేని పిల్లలు

భోపాల్‌లోని జేపీనగర్‌లో కల్లాకపటం లేని అమాయక బాలలు చాలా మంది కనిపిస్తారు. ముద్దొచ్చే మాటలు మాట్లాడుతూ అందరి లాగా ఆటలాడాలని, స్కూలుకు వెళ్లాలని, కబుర్లు చెప్పే వీరంతా చాలామటుకు బుద్ధి మాంద్యంతో బాధపడే పిల్లలే. కొందరు శరీరం చచ్చుబడ్డ వారే. ప్రతి సంవత్సరం డిసెంబర్ 2వ తేదీన వీరంతా నిరసన కార్యక్రమం జరుపుతుంటారు. న్యాయం కోరుతుంటారు. కానీ దుర్ఘటన జరిగి 40 ఏళ్లు అవుతున్నా వీరు రోడ్ల మీదకు వస్తూనే ఉండాల్సి రావడం బాధాకరం.

నీరు తాగి

భోపాల్ విష వాయులు భూమిలోకి ఇంకడం వల్ల కొన్ని చోట్ల ఇప్పటికీ ఆ నీరు విషతుల్యం అయి ఉంది. వేరే దిక్కు లేక పేదలు ఆ నీరే చాలాకాలం తాగి ఇప్పుడు దివ్యాంగ శిశువులకు జన్మనిస్తున్నారు. 'ఆటలాడే ఉత్సాహం ఉన్నా వీరికి ఆటవస్తువులు లేవు. హెల్త్ కార్డులు లేవు' అని తల్లిదండ్రులు భోరున విలపిస్తుంటే ఏ పాపానికి ఈ శిక్ష అనిపిస్తుంది.

అమ్మా... నేనూ నీతో వచ్చేస్తా...

పిల్లలు పెద్దవాళ్లు అయ్యాక, వాళ్ల చిన్ననాటి సంగతులు తలచుకుని తల్లిదండ్రులు మురిసిపోతుండటం మామూలే. అయితే వారి హృదయాన్ని మెలిపెట్టి పశ్చాత్తాపానికి లోను చేసే జ్ఞాపకాలూ కొన్ని ఉంటాయి. ప్రియాంక చోప్రా తల్లి మధు చోప్రాను ఇప్పటికీ బాధిస్తూ, కన్నీళ్లు పెట్టించే అలాంటి ఒక జ్ఞాపకం.. కూతురి చదువు విషయంలో తానెంతో కటువుగా ప్రవర్తించటం!

ప్రియాంకను ఏడేళ్ల వయసులో బోర్డింగ్ స్కూల్లో చేర్పించారు మధు చోప్రా. ''నేను మంచి తల్లిని కాదేమో నాకు తెలీదు. 'వద్దమ్మా.. ప్లీజ్..' అని ఎంత వేడుకుంటున్నా వినకుండా నేను ప్రియాంకను బలవంతంగా బోర్డింగ్ స్కూల్లో చేర్పించాను. ప్రతి శనివారం సాయంత్రం నా డ్యూటీ అయిపోయాక ట్రెయిన్ ఎక్కి ప్రియాంకను చూడ్డానికి బోర్డింగ్ స్కూల్‌కి వెళ్లే దాన్ని. ప్రియాంక అక్కడ నా కోసం ఎదురు చూస్తూ ఉండేది. తను ఆ వాతావరణంలో ఇమడలేక పోయింది. ''అమ్మా.. నేనూ నీతో ఇంటికి వచ్చేస్తా..'' అని నన్ను చుట్టుకుపోయి ఏడ్చేది. ఆ ఏడుపు ఇప్పుడు గుర్తొస్తే నాకూ కన్నీళ్లొచ్చేస్తాయి. 'లేదు, నువ్విక్కడ చదువుకుంటే భవిష్యత్తు బాగుంటుంది' అని చెప్పేదాన్ని. తనకేమీ అర్థమయ్యేది కాదు. తన కోసం నేను ఆదివారం కూడా అక్కడే ఉండిపోయేదాన్ని. అది చూసి ప్రియాంక టీచర్ ఒకరోజు నాతో 'మీరిక ఇక్కడికి రావటం ఆపేయండి' అని గట్టిగా చెప్పేశారు..' అని 'సమ్‌థింగ్ బిగ్గర్ టాక్ షో' పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో చెప్పారు మధు చోప్రా.

ప్రియాంక తండ్రి అశోక్ చోప్రాకు ప్రియాంకను బోర్డింగ్ స్కూల్లో చేర్పించటం అస్సలు ఇష్టం లేదు. అయితే మధు చోప్రా తన నిర్ణయాన్ని మార్చుకోకపోవటంతో వారిద్దరి మధ్య గొడవలయ్యాయి. కొంత కాలం ఒకరితో ఒకరు మాట్లాడటం మానేశారు కూడా. (ఇప్పుడు ఆయన లేరు).

ఆనాటి సంగతులను గుర్తు చేసుకుంటూ – ''ప్రియాంక తెలివైన అమ్మాయి. ఆ తెలివికి పదును పెట్టించకపోతే తల్లిగా నా బాధ్యతను సరిగా నెరవేర్చినట్లు కాదు అనిపించింది. అందుకే లక్నోలోని లా మార్టినియర్ బోర్డింగ్ స్కూల్లో చేర్పించాలనుకున్నాను. అందులో సీటు కోసం ప్రియాంక చేత ఎంట్రెన్స్ టెస్టు కూడా రాయించాను. తను చక్కగా రాసింది. అడ్మిషన్ వచ్చేసింది. ఆ విషయాన్ని నా భర్తకు చెబితే ఆయన నాపై ఇంతెత్తున లేచారు. 'ఇదే నీ నిర్ణయం అయితే, వచ్చే ఫలితానికి కూడా నువ్వే బాధ్యురాలివి' అని అన్నారు. ఏమైతేనేం చివరికి అంతా బాగానే జరిగింది. ప్రియాంక తన కాళ్లపై తను నిలబడింది'' అని పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో చెప్పారు మధు చోప్రా.



తల్లి మధు చోప్రాతో ప్రియాంక చోప్రా

పిల్లల భవిష్యత్తు కోసం తల్లితండ్రులు వారిని దూరంగా ఉంచవలసి వచ్చినందుకు బాధపడటం సహజమే. అయితే పిల్లల్ని ప్రయోజకుల్ని చేసే యజ్ఞంలో ఆ బాధ ఒక ఆవగింజంత మాత్రమే.

బ్యూటిప్స్



● ఓట్‌మీల్ పౌడర్ టీ స్పూన్ తీసుకుని అందులో ఆరెంజ్ జ్యూస్ కలిపి ముఖం, చేతులు, మెడకు ప్యాక్ వేసుకోవాలి. ఆరిన తర్వాత కొద్దిగా నీళ్లు చల్లి వలయాకారంగా మర్దన చేసి ఆ తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ఇలా వారానికోసారి చేస్తుంటే చర్మం కాంతివంతంగా ఉంటుంది.



● బాగా పండిన అరటి పండు గుజ్జు టేబుల్ స్పూన్ తీసుకుని అందులో ఐదారు చుక్కల తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ, చేతులకు రాసి వలయాకారంగా మర్దన చేయాలి. మిశ్రమంలోని తేమ ఇంకే వరకు మర్దన చేసి, ఆ తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ఇది పొడి చర్మానికి ఈ కాలంలో మంచి ఫలితాన్నిస్తుంది.



సాగుబడి
జ్యేష్ఠ కార్తె : డిసెంబర్ 2 నుంచి

2024 అంతర్జాతీయ భూముల దినోత్సవం (డిసెంబర్ 5) సందర్భంగా 'మట్టి గణాంకాల సేకరణ, పర్యవేక్షణ, నిర్వహణ'పై దృష్టిని కేంద్రీకరించాలని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) ప్రపంచ దేశాల ప్రభుత్వాలకు పిలుపునిచ్చింది.

నేలలపై శ్రద్ధ పెట్టాలి!

నేలల స్వభావానికి తగిన పంటలు వేసుకోవాలి | సేంద్రియ కర్బనాన్ని అన్ని సాగు భూముల్లోనూ 0.7 శాతానికి పెంచుకోవడం అవసరం | తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు ప్రముఖ నేలల నిపుణుడు డాక్టర్ వి. రామ్మూర్తి సూచన

'మన కాళ్ల కింద ఉన్న నేల ఒక జీవవ్యవస్థ. అనేక జాతుల మనోహరమైన మొక్కలు, జంతుజాలానికి నిలయం. మనకు పోషకాహారంతో పాటు స్వచ్ఛమైన నీరు, జీవవైవిధ్యాన్ని అందిస్తున్న నేలలపై శ్రద్ధ పెట్టి పరిరక్షించుకోవటానికి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాల'ని ప్రముఖ నేలల నిపుణుడు డాక్టర్ వి. రామ్మూర్తి సూచించారు. బెంగళూరులోని నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ లాండ్ యూజ్ ప్లానింగ్ (ఐసిఎఆర్ అనుబంధం) ప్రాంతీయ కార్యాలయం అధిపతిగా ప్రధాన శాస్త్రవేత్త (వ్యవసాయం)గా ఆయన వ్యవహరిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో నేలల బాగోగులపై అధ్యయనం చేసి, విధాన నిర్ణేతలకు తగు సూచనలు ఇచ్చే కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని అనేక మండలాల్లో నేలల స్థితిగతులపై తమ సంస్థ జరిపిన అధ్యయనంలో వెల్లడైన విషయాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి వెల్లడించారు.

2 రాష్ట్రాల్లో నేలలపై అధ్యయనం

తెలంగాణలోని గజ్వేల్, ఇంద్రవెల్లి, మహబూబ్‌నగర్ రూరల్ మండలాల్లో.. ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ జిల్లా రాయచోటి, తొండూరు మండలాల్లో, అనంతపురం జిల్లా కదిరి, ఓబుల దేవర చెరువు(ఓడిసి) మండలాల్లోని నేలల స్థితిగతులపై నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ లాండ్ యూజ్ ప్లానింగ్ తరఫున అధ్యయనం చేశామని డా. రామ్మూర్తి తెలిపారు. భూమి స్థితిగతులను తెలుసుకోవడానికి అది ఏ రకం భూమి? మట్టి ఎంత లోతుంది? వంటి వివరాలతో పాటు భూసారాన్ని అంచనా వేయటానికి సేంద్రియ కర్బనం ఆయా నేలల్లో ఎంత శాతం ఉందో మట్టి పరీక్షల ద్వారా నిర్ధారణ చేస్తారు.



సేంద్రియ కర్బనాన్ని మూడు స్థాయిల్లో (తక్కువ – 0.50% లోపు, మధ్యస్థం – 0.50–0.75% మధ్య, అధికం – 0.75% కన్నా ఎక్కువ) లెక్కిస్తారు. సేంద్రియ కర్బనం తెలంగాణ నేలలతో పోల్చితే రాయలసీమ నేలల్లో తక్కువగా ఉందని డా. రామ్మూర్తి అన్నారు. ఈ తేడాలకు కారణం ప్రకృతి వైపరీత్యాలు, వర్షపాతం, సాగు పద్ధతి కారణాలని తెలిపారు.

మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని పరీక్షలు నిర్వహించిన సాగు భూముల్లో 100% నేలల్లో సేంద్రియ కర్బన శాతం అధికంగా (అంటే.. 0.75% కన్నా ఎక్కువగా) ఉండటం విశేషం. అనంతపురం జిల్లా ఇనగలూరు పంచాయతీలోని 46.29% సాగు భూముల్లో సేంద్రియ కర్బనం తక్కువగా, 35.26% భూముల్లో మధ్యస్థంగా, 18.45% భూముల్లో అధికంగా ఉందని వెల్లడైందన్నారు (పూర్తి వివరాలు పట్టికలో).

వరి, పత్తి, మిర్చికి రసాయనాల వాడకం ఎక్కువ

వరి, పత్తి, మిర్చి పంటలకు రసాయనిక ఎరువులు మరీ ఎక్కువగా వేస్తున్నారు. ఎంత అవసరమో గమనించకుండా పక్క రైతును చూసి వేస్తున్నారు. పురుగుమందుల పిచికారీ కూడా అంతే. పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులను చాలా మంది రైతులు వాడటం లేదు. అదే పంటను ప్రతి ఏటా సాగు చేస్తున్నారు. అందుకే సేంద్రియ కర్బనం అడుగంటుతోందని డా. రామ్మూర్తి తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు, రైతులు ఇప్పటికైనా జాగ్రత్తపడి సేంద్రియ కర్బనాన్ని అన్ని సాగు భూముల్లోనూ 0.7 శాతానికి పెంచుకోకపోతే భూములు సాగు యోగ్యం కాకుండా పోతాయని హెచ్చరిస్తున్నారాయన.

పొటెన్షియల్ క్రాప్ జోన్లు

ఆయా భూముల స్వభావం, భూసార పరిస్థితులు, ఆ ప్రాంత వాతావరణం, వర్షపాతం, అక్కడి ప్రజల ఆసక్తి, మార్కెట్ స్థితిగతులపై 20 ఏళ్ల క్రితం నాటి నుంచి సమాచారం సేకరించి విశ్లేషించామని డా. రామ్మూర్తి చెప్పారు. ఈ సమాచారంతో శాస్త్రీయంగా పొటెన్షియల్ క్రాప్ జోన్స్ నివేదికలు ఇస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పత్తి, వరి, జొన్న, వేరుశనగ పంటలకు ఏయే జిల్లాలో ఎన్ని హెక్టార్ల భూమిలో 'చాలా బాగా, ఒక మాదిరిగా, కొంతమేరకు' ఆయా పంటల సాగుకు అనువుగా ఉన్నాయో చెప్పామన్నారు.

సాగు భూముల్లో సేంద్రియ కర్బనం ఏ స్థాయిలో ఉంది?

ఎక్కడ	తక్కువ (0.50%లోపు)	మధ్యస్థం (0.50-0.75%)	అధికం (0.75%పైగా)
సిద్ధిపేట జిల్లా గజ్వేల్	16.64	82.58	0.78
మహబూబ్‌నగర్ రూరల్	-	-	100
అనంతపురం జిల్లా వెంకటాపురం	11.79	55.89	32.32
అనంతపురం జిల్లా తుమ్మలకుంట్లపల్లి	17.48	63.08	19.44
అనంతపురం జిల్లా ఇనగలూరు	46.29	35.26	18.45
వైఎస్సార్ జిల్లా రాయచోటి	35.34	34.62	30.03

(గమనిక: సేంద్రియ కర్బనాన్ని 3 స్థాయిల్లో లెక్కిస్తారు. ఎంత శాతం భూమిలో ఏ స్థాయిలో సేంద్రియ కర్బనం ఉందో ఈ పట్టిక తెలియజేస్తుంది)



అన్ని మండలాల్లో మట్టిని అధ్యయనం చేయాలి

భూమిపై మన జీవితం ఆరోగ్యకరమైన నేలలపై ఆధారపడి ఉంటుంది. మన పాదాల కింద ఉన్న నేల ఒక జీవవ్యవస్థ. అనేక మనోహరమైన మొక్కలు, చెట్లు, జంతువులకు నిలయం. మట్టి మనకు పోషకాహారాన్ని, స్వచ్ఛమైన నీటిని, జీవవైవిధ్యాన్ని అందిస్తుంది. ప్రతి జిల్లాలో అన్ని మండలాల్లోని పొలాల్లో మట్టి పరీక్షలు చేసి, అధ్యయనం చేయాలి. మన మట్టిలో వుండే పోషకాలు ఏమిటి? మట్టిలోని జీవరాశి ఏమేమి ఉన్నాయి? ఏమేమి లేవు? కాలక్రమంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటున్నాయి? సాగు భూములు బాగుండాలంటే వాటిని ఎలా నిర్వహించుకోవాలి? అనే విషయాలపై పాలకులు శ్రద్ధ చూపాలి. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ప్రోత్సాహమిస్తే మట్టి ఎలా ఉందో పరీక్షించి ఎక్కువగా ఎరువులు వేయకుండా నివారించటంతో పాటు పంటల మార్పిడి, మట్టిని పంటలతో కప్పి ఉంచటం వంటి భూసంరక్షణ పద్ధతులపై రైతులకు చైతన్యం కలిగిస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుంది. సుసంపన్న సాంస్కృతిక జీవనానికి, ఆరోగ్యకరమైన జీవనానికి కూడా మట్టి మూలాధారం. మట్టి ద్వారానే 95% ఆహారం మనకు వస్తోంది. ఇందులో 18 సూక్ష్మ,స్థూల పోషకాంశాలు ఉంటాయి. వీటిలో 15 పోషకాంశాలను నేల నుంచి మిగతా మూడిటిని వాతావరణం నుంచి మనం పొందుతున్నాం. ఈ స్పృహతో సాగు నేలల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి.



– డాక్టర్ వి. రామ్మూర్తి (94803 15146),
అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త (వ్యవసాయం),
ప్రాంతీయ కార్యాలయం, ఐసిఎఆర్– నేషనల్ బ్యూరో ఆఫ్ సాయిల్ సర్వే అండ్ లాండ్ యూజ్ ప్లానింగ్, బెంగళూరు

నిలువు పుచ్చ తోట!



అవును..!

మీరు చదివింది, ఈ ఫొటోలో చూస్తోంది.. నిజమే!

మన పుచ్చ తోటల్లో పాదులు నేలపై పరచుకొని ఉంటాయి. పుచ్చ కాయలు నేలపైనే పెరుగుతాయి కదా. సౌతాఫ్రికాలో ఒక కంపెనీ పాలీహౌస్‌లలో పుచ్చ పాదులు నిలువుగా ఎగబాకుతున్నాయి. పుచ్చ కాయలు వాటికి వేలాడుతున్నాయి. ట్రెల్లిస్ పద్ధతిలో పెరిగే టొమాటోల మాదిరిగా ఈ పుచ్చకాయలు వేలాడుతున్నాయి కదూ.. కాండీ బాల్ సీడ్‌లెస్ పుచ్చకాయలు కిలో నుంచి కిలోన్నర వరకు బరువు పెరుగుతాయి. అదేమాదిరిగా కిలో బరువు పెరిగే స్టైల్ మెలన్స్ (ఇదో రకం కర్బూజ) పండ్లను కూడా నిలువు తోటల్లో పెంచుతున్నారు. టొమాటోలు వంటి కాయలు బరువు తక్కువగా ఉంటాయి కాబట్టి తీగజాతి మొక్కలు మొయ్యగలుగుతాయి. అయితే, ఇలాంటి నిలువు తోటలో పుచ్చకాయలు, కర్బూజ కాయల బరువు మొక్కలకు భారం కాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్లాస్టిక్ నెట్ కవర్లతో కాయలను ప్లాస్టిక్ వైర్లకు కట్టేస్తున్నారు. 'నిలువు తోటలో పెరిగిన పుచ్చకాయలను మేం త్వరలోనే అమ్మకానికి పెట్టబోతున్నాం. సౌతాఫ్రికా మార్కెట్‌లో మేమే ఫస్ట్' అంటున్నారు ఆ కంపెనీ ప్రతినిధి ఫ్రాంకోయిస్ ఫౌరీ. పాలీహౌస్‌లు, నెట్‌హౌస్‌లలో, మేడపై ఇంటిపంటల్లో ట్రెల్లిస్ పుచ్చ, కర్బూజ సాగు సాధ్యమే అని గ్రహించాలి!



12 నుంచి విశాఖ ఆర్గానిక్ మేళా

గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, ఏపీ రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయదారుల సేవాల సంఘం సంయుక్తంగా డిసెంబర్ 12 నుంచి 15వ తేదీ వరకు విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 5వ విశాఖ ఆర్గానిక్ మేళా నిర్వహించనున్నాయి. రైతులు, ప్రకృతి/సేంద్రియ వ్యవసాయదారులు, ఆహారోత్పత్తుల ఉత్పత్తిదారుల, వినియోగదారులు పెద్ద ఎత్తున పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. 12న ఉ. 10 గంటలకు ప్రారంభోత్సవంతో పాటు సేంద్రియ/ప్రకృతి వ్యవసాయదారుల సమ్మేళనం ఉంటుంది. 13న ఉ. 10 గం.కు ఆరోగ్య అవగాహన సదస్సు, 14న ఆహార ప్రాసెసింగ్‌పై సదస్సు, 15 సేంద్రియ ఇంటిపంటలు/ మిద్దె తోటల సదస్సు, ముగింపు సమావేశం జరుగుతాయి. అందరూ ఆహ్వానితులే. ఇతర వివరాలకు.. 78934 56163, 91001 86522.



'పారా బ్యాడ్మింటన్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' రేసులో నితేశ్ కుమార్

న్యూఢిల్లీ: భారత పారాలింపిక్ చాంపియన్ నితేశ్ కుమార్ 'పారా బ్యాడ్మింటన్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు నామినేట్ అయ్యాడు. పురుషుల విభాగంలో అతనితో పాటు మరో ముగ్గురు ప్లేయర్లను సోమవారం ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) నామినేట్ చేసింది. ఈ ఏడాది పారిస్‌లో జరిగిన పారా విశ్వక్రీడల్లో నితేశ్ ఎస్‌ఎల్3 కేటగిరీలో బంగారు పతకం గెలుపొందాడు. 29 ఏళ్ల భారత ఆటగాడికి... రెండు పారాలింపిక్ స్వర్ణ పతకాల విజేత చియా లీ హౌ (మలేసియా), డైకి కజివారా (జపాన్), కు జిమో (చైనా)ల నుంచి పోటీ ఎదురుకానుంది. పారాలింపిక్స్‌లో ఏకైక పతకం నెగ్గినప్పటికీ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నితేశ్ (రెండు రజతాలు, ఒక కాంస్యం) మూడు పతకాలతో సత్తా చాటుకున్నాడు. దీంతో భారత ప్లేయర్ అవార్డు రేసులో ముందు వరుసలో ఉన్నాడు. విజేతని ఈ నెల 9న చైనాలోని హాంగ్జౌ నగరంలో జరిగే బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ ముందు జరిగే 'గాలా డిన్నర్' ఈవెంట్‌లో ప్రకటిస్తారు. డిసెంబర్ 11 నుంచి 15 వరకు బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ జరుగుతుంది.



పెళ్లి పీటలెక్కనున్న సింధు

ఈనెల 22న ఉదయ్‌పూర్‌లో వివాహం • 24న హైదరాబాద్‌లో రిసెప్షన్

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ మహారాణి పూసర్ల వెంకట (పీవీ) సింధు త్వరలో పొరాణితో ముస్తాబుకానుంది. ఆమె పెళ్లి బాజాకు మూహూర్తం కూడా ఖరారైంది. ఈ నెల 22న ఉదయ్‌పూర్ (రాజస్తాన్)లో అంగరంగ వైభవంగా వివాహ మహోత్సవం జరుగనుంది. రెండేళ్ల తర్వాత సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ ట్రోఫీతో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించిన ఆమె నవ వధువుగా పెళ్లి పీటలెక్కబోతోంది. హైదరాబాద్‌కు చెందిన వెంకట దత్తసాయితో ఏడడుగులు నడిచేందుకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వరుడు వెంకట దత్తసాయి 'పొసిడెక్స్ టెక్నాలజీస్' సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది పెద్దలు కుదిర్చిన వివాహం. వధూవరుల కుటుంబాలకు ఇదివరకే పరిచయముంది. తాజా పరిణయంతో ఇరు కుటుంబాలు బంధువులు కానున్నారు. పెళ్లి వార్తను సింధు తండ్రి పీవీ రమణ ధ్రువీకరించారు. 'ఇరు కుటుంబాలు కలసి నెల క్రితమే పెళ్లి ముహూర్తాన్ని ఖాయం చేశాం. వచ్చే జనవరి నుంచి సింధుకు బిజీ షెడ్యూల్ ఉండటంతో అందుబాటులో ఉన్న ఈ నెలలోనే వివాహం జరిపించాలని నిర్ణయించుకున్నాం. పెళ్లి వేడుకను ఉదయ్‌పూర్‌లో నిర్వహిస్తాం. ఈనెల 24న హైదరాబాద్‌లో రిసెప్షన్‌ను ఏర్పాటు చేస్తాం. పెళ్లికి ముందు జరిగే కార్యక్రమాలు ఈ నెల 20 నుంచి జరుగుతాయి' అని రమణ వెల్లడించారు. భారత బ్యాడ్మింటన్‌లో తారాస్థాయి చేరుకున్న సింధు ఖాతాలో ఐదు ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాలు, రెండు వరుస ఒలింపిక్స్ పతకాలు ఉన్నాయి. సింధు 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం ... 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించింది. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన సింధు... 2017, 2018లలో రజతం, 2013, 2014లలో కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. కామన్వెల్త్ క్రీడల్లో మరో ఐదు పతకాలు గెలుచుకుంది.



వెంకట దత్తసాయి



బ్రాడ్‌మన్ క్యాప్ విలువ రూ. 2 కోట్లు!



సిడ్నీ: భారత క్రికెట్ జట్టు 1947–48లో తొలిసారి ఆస్ట్రేలియాలో పర్యటించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విదేశీ గడ్డపై మనకు ఇదే తొలి సిరీస్. భారత్, ఆస్ట్రేలియా మధ్య 5 టెస్టులు జరగ్గా ... ఆస్ట్రేలియా 4–0తో సిరీస్‌ను నెగ్గింది. ఈ సిరీస్‌లో క్రికెట్ దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ 178.75 సగటుతో 715 పరుగులు చేయగా... ఇందులో ఒక డబుల్ సెంచరీ సహా 4 సెంచరీలు, 1 అర్ధసెంచరీ ఉన్నాయి. బ్రాడ్‌మన్ తన కెరీర్‌లో భారత్‌పై ఆడిన సిరీస్ ఇదొక్కటే కావడం విశేషం. ఇప్పుడు ఈ సిరీస్‌లో బ్రాడ్‌మన్ ధరించిన 'బ్యాగీ గ్రీన్' క్యాప్ వేలానికి వచ్చింది. నేడు జరిగే ఈ వేలంలో ఈ క్యాప్‌నకు 2 లక్షల 60 వేల డాలర్లు (సుమారు రూ. 2.20 కోట్లు) పలకవచ్చని అంచనా. టెస్టు క్రికెట్ ఆడే ఆస్ట్రేలియా క్రికెటర్లకు ఆకుపచ్చ రంగుతో కూడిన బ్యాగీ గ్రీన్‌లను అందజేస్తారు. సుదీర్ఘ కెరీర్‌లో చినిగిపోయి, రంగులు వెలసిపోయినా వారు దానినే ఉపయోగిస్తారు. అలాంటి క్యాప్‌లపై క్రికెట్ వర్గాల్లో, అభిమానుల్లో ఎంతో ఆసక్తి ఉంటుంది. ఇరవై ఏళ్ల తన టెస్టు కెరీర్‌లో 52 టెస్టుల్లోనే అనితరసాధ్యమైన 99.94 సగటుతో 6996 పరుగులు చేసిన బ్రాడ్‌మన్ 92 ఏళ్ల వయసులో 2001లో కన్నుమూశారు.

అమాన్ అదరహో

- సెంచరీతో చెలరేగిన యువ భారత్ కెప్టెన్
- జపాన్‌పై 211 పరుగులతో టీమిండియా ఘన విజయం
- అండర్–19 ఆసియా కప్ క్రికెట్ టోర్నీ



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డుతో అమాన్

షార్జా: ఆసియా కప్ అండర్–19 క్రికెట్ టోర్నీ తొలి పోరులో పాకిస్తాన్ చేతిలో ఓడిన భారత్ రెండో మ్యాచ్‌లో తమ స్థాయికి తగ్గ ప్రదర్శనను కనబర్చింది. సోమవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో భారత్ 211 పరుగుల భారీ తేడాతో జపాన్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత యువ జట్టు 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. కెప్టెన్ మొహమ్మద్ అమాన్ (118 బంతుల్లో 122 నాటౌట్; 7 ఫోర్లు) శతకంతో కదం తొక్కాడు. ఇతర బ్యాటర్లలో కేపీ కార్తికేయ (49 బంతుల్లో 57; 5 ఫోర్లు, 1 సిక్స్), ఆయుశ్ మాత్రే (29 బంతుల్లో 54; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. అమాన్, కార్తికేయ నాలుగో వికెట్‌కు 122 పరుగులు జోడించగా... సిద్ధార్థ్ (35), హార్దిక్ రాజ్ (25 నాటౌట్), 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ (23) కొన్ని కీలక పరుగులు జత చేశారు. జపాన్ బౌలర్లలో హ్యూగో కెల్లీ, కీఫర్‌లకు చెరో 2 వికెట్లు దక్కాయి. అనంతరం జపాన్ పేలవ బ్యాటింగ్‌ను కనబర్చింది. 50 ఓవర్లూ ఆడిన ఆ టీమ్ 8 వికెట్లు చేజార్చుకొని 128 పరుగులే చేయగలిగింది. ఓపెనర్ హ్యూగో కెల్లీ (111 బంతుల్లో 50; 6 ఫోర్లు) అర్ధ సెంచరీతో పాటు చార్లెస్ హింజ్ (35 నాటౌట్) ఫర్వాలేదనిపించగా... మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. భారత బౌలర్లలో హార్దిక్ రాజ్, చేతన్ శర్మ, కేపీ కార్తికేయ తలా 2 వికెట్లు పడగొట్టారు. అమాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. సోమవారం జరిగిన మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ 69 పరుగుల తేడాతో యూఏఈపై విజయం సాధించింది. పాక్ 3 వికెట్లకు 314 పరుగులు చేసింది. జవాబుగా యూఏఈ 8 వికెట్లకు 245 పరుగులు సాధించి ఓడిపోయింది. గ్రూప్ 'ఎ' పాయింట్ల పట్టికలో ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్న భారత్ బుధవారం జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో యూఏఈతో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే జట్టు సెమీస్ చేరుతుంది. ఇరు గ్రూప్‌ల నుంచి టాప్–2 జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

ఆంధ్రప్రదేశ్ 26 పుదుచ్చేరి 1

- భారీ విజయంతో ముగింపు
- దక్కని క్వార్టర్ ఫైనల్ బెర్త్

సాక్షి, హైదరాబాద్: ప్రత్యర్థి జట్టుపై గోల్స్ వర్షం కురిపించినా... జాతీయ సబ్ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు నాకౌట్ దశకు చేరుకోలేకపోయింది. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టు లీగ్ దశలోనే వెనుదిరిగింది. సోమవారం జరిగిన చివరిదైన గ్రూప్ 'హెచ్' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు 26–1 గోల్స్ తేడాతో పుదుచ్చేరి జట్టుపై భారీ విజయం నమోదు చేసుకుంది. నాలుగు జట్లున్న గ్రూప్ 'హెచ్'లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన మధ్యప్రదేశ్ జట్టు అగ్రస్థానంలో నిలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాక ఎనిమిది గ్రూపుల్లో టాప్ స్థానంలో నిలిచిన ఎనిమిది జట్లు (హరియాణా, జార్ఖండ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మిజోరం, ఢిల్లీ, పంజాబ్, మధ్యప్రదేశ్) క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో ఉత్తరప్రదేశ్‌తో మిజోరం; మహారాష్ట్రతో జార్ఖండ్; మధ్యప్రదేశ్‌తో హరియాణా; ఒడిశాతో ఢిల్లీ తలపడతాయి.

తులసీ 9 గోల్స్...

పుదుచ్చేరితో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయిలు ఆరంభం నుంచే అదరగొట్టారు. 6వ నిమిషంలో మొదలైన గోల్స్ వేట 56వ నిమిషం వరకు కొనసాగింది. ఏపీ అమ్మాయిలు అవకాశం దొరికినపుడల్లా పుదుచ్చేరి గోల్ పోస్ట్‌పై దాడులు చేసి అనుకున్న ఫలితం సాధించారు. ముఖ్యంగా కెప్టెన్ కుప్పా తులసీ చెలరేగిపోయింది. ఆమె ఏకంగా 9 గోల్స్ సాధించి అబ్బురపరిచింది. తులసీ 6వ, 12వ, 21వ, 23వ, 32వ, 33వ, 34వ, 43వ, 56వ నిమిషాల్లో గోల్స్ కొట్టింది. పూజారి మధురిమ బాయి నాలుగు గోల్స్ (26వ, 39వ, 42వ, 47వ నిమిషాల్లో), మునిపల్లి నాగనందిని నాలుగు గోల్స్ (16వ, 28వ, 29వ, 54వ నిమిషాల్లో), పరికి లక్ష్మి మూడు గోల్స్ (8వ, 32వ, 37వ నిమిషాల్లో), చిల్లారు నాగతేజ రెండు గోల్స్ (14వ, 24వ నిమిషాల్లో), మండల వైష్ణవి (19వ, 45వ నిమిషాల్లో) రెండు గోల్స్, ముజియా బేగం పఠాన్ (11వ నిమిషంలో), తిరుమలశెట్టి జోష్నా (41వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. పుదుచ్చేరి జట్టుకు నిలోవియా (28వ నిమిషంలో) ఏకైక గోల్ అందించింది. సోమవారం జరిగిన ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో మణిపూర్ 5–1తో దాద్రా అండ్ నాగర్ హవేలి అండ్ డమన్ అండ్ డియు జట్టుపై, చండీగఢ్ 3–0తో కేరళపై, పంజాబ్ 9–0తో అస్సాంపై గెలుపొందగా... బిహార్, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్ 0–0తో 'డ్రా'గా ముగిసింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా



ఊహించని అద్భుతాలు జరిగాయి

- శ్రీను వైట్ల

''డైరెక్టర్ కావాలని నా చిన్నప్పటి నుంచే కోరుకున్నాను. ఇందు కోసం చిన్న వయసులోనే చెన్నై వెళ్లాను. ఇండస్ట్రీలో నిలబడాలనే తపన, సినిమా క్రాఫ్ట్స్‌పై ఆసక్తి ఉండేవి. కానీ, ఓ దర్శకుడిగా ఇండస్ట్రీలో పాతిక సంవత్సరాలు ఉంటానని నిజంగా ఆ రోజు ఊహించలేదు. నా కెరీర్‌లో ఇలా ఊహించని ఎన్నో అద్భుతాలు జరిగాయి. నా ప్రయాణం పట్ల చాలా సంతోషంగా ఉన్నాను. ఈ ప్రయాణంలో భాగమైన హీరోలు, నిర్మాతలు, టెక్నీషియన్స్, నా కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు'' అని దర్శకుడు శ్రీనువైట్ల అన్నారు. రవితేజ, మహేశ్వరి జంటగా శ్రీనువైట్ల దర్శకత్వం వహించిన చిత్రం 'నీ కోసం (1999)'. గంటా శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రంతో శ్రీనువైట్ల దర్శకుడిగా పరిచయమయ్యారు. ఈ సినిమా విడుదలై నేటితో 25 ఏళ్లు పూర్తవుతాయి. అలాగే ఇండస్ట్రీలో పాతిక సంవత్సరాల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు శ్రీనువైట్ల. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ–''నీ కోసం' కి ముందు మరో సినిమా చేయాల్సింది. కానీ, ఆ సినిమా ఆగిపోవడంతో నిరుత్సాహంగా అనిపించింది. ఆ తర్వాత తక్కువ బడ్జెట్‌లో ఓ సినిమా చేయాలనుకుని 'నీ కోసం' కథ రాసుకుని, సినిమా స్టార్ట్ చేశాం. కానీ, ఈ సినిమా కూడా మధ్యలోనే ఆగిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే రవితేజగారి సహాయంతో పూర్తి చేశాం. ఫస్ట్ కాపీ చూసి నాగార్జునగారు నన్ను మెచ్చుకుని, డైరెక్షన్ చాన్స్ ఇవ్వడం ఎప్పటికీ మర్చిపోలేను. అలాగే 'నీ కోసం' రిలీజ్‌కు రామోజీరావుగారు అండగా నిలబడ్డారు. అలాగే ఆయన బ్యానర్‌లోనే 'ఆనందం' సినిమా అవకాశం ఇచ్చారు. 'నీ కోసం' సినిమాకి ఏడు నంది అవార్డు వచ్చాయి. ఇక 'ఆనందం, వెంకీ, రెడీ, దూకుడు, ఢీ' సినిమాలు నా కెరీర్‌లోని టాప్ ఫైవ్ మూవీస్‌గా చెప్పుకుంటాను. 'దూకుడు' సినిమాను తమిళంలో అజిత్‌గారితో రీమేక్ చేసే అవకాశం వచ్చింది. కానీ, అప్పటికే నేను 'బాద్‌షా'కు కమిటై ఉండటంతో కుదర్లేదు. 'బాద్‌షా' హిట్ అయింది. సో.. అజిత్‌గారితో నేను ఆ సినిమా చేయలేదనే బాధ లేదు. మహేశ్‌బాబుగారితో నేను చేసిన 'ఆగడు' సినిమా ఎన్నో అంచనాల మధ్య విడుదలై, ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఆ విషయంలో కాస్త బాధగా అనిపించింది. అయితే ఆ సినిమా తర్వాత మహేశ్‌గారు నాకు మంచి మోరల్ సపోర్ట్ ఇచ్చారు.. ఆ విషయాన్ని మర్చిపోలేను. 'వెంకీ' సినిమాకు సీక్వెల్ తీయాలనే ఆలోచన ఉంది. ఇటీవల నా దర్శకత్వంలో వచ్చిన 'విశ్వం' సినిమా హిట్‌గా నిలిచినందుకు సంతోషంగా ఉంది. నా తర్వాతి సినిమాని త్వరలోనే చెబుతాను'' అని చెప్పారు.



• ఉపేంద్ర

నా అధికారానికి పవర్ ఎక్కువ

కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో రూపొందిన డిఫరెంట్ ఫిల్మ్ 'యూ ఐ: ది మూవీ'. లహరి ఫిల్మ్స్, జి.మనోహరన్ అండ్ వీనస్ ఎంటర్‌టైనర్స్ కేపీ శ్రీకాంత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న రిలీజ్ కానుంది. ఈ సినిమా కొత్త గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. వీడియోలో ఉన్న విజువల్స్ చూస్తే ఈ కథ 2040లో జరుగుతుంది. ''సాధారణ ప్రజలకు అత్యవసరమైన రైస్‌బాల్, మొబైల్‌ఫోన్స్‌లను సర్కారువారు ఉచితంగా పంచుతున్నారు', 'బ్రో.. మనోళ్లంతా మంగళ గ్రహంపైకి వెళ్తున్నారు', 'మనోళ్లు ఎంతెంత లేటెస్ట్ వెపన్స్ కొన్నారో తెలుసా.. మనం చాలా సేఫ్‌గా ఉన్నాం.. బ్రో', 'ధిక్కారం..ధిక్కారం..' 'ఈ ధిక్కారాల కన్నా.. నా అధికారానికి పవర్ ఎక్కువ' వంటి డైలాగ్స్ తెలుగు వెర్షన్‌లో ఉన్నాయి. రీష్మా నానయ్య, మురళీ శర్మ, సన్నీలియోన్, నిధి సుబ్బయ్య, సాధు కోకిల, మురళీకృష్ణ, ఇంద్రజిత్ లంకేష్ ఇతర ముఖ్య పాత్రల్లో నటించిన ఈ సినిమాకు అజనీష్ లోకనాథ్ సంగీతం అందించారు.



• రవిశంకర్, నవీన్ ఎర్నేని, దేవి శ్రీ ప్రసాద్, చెర్రీ, రాజమౌళి, అల్లు అర్జున్, సుకుమార్, రష్మిక, శ్రీలీల, అల్లు అరవింద్

పుష్ప కోసం జీవితం పెట్టేశాం

- అల్లు అర్జున్

''పుష్ప 1, పుష్ప 2' సినిమాల కోసం మేమంతా కష్టపడ్డామని చెబితే చిన్న మాట అవుతుంది. సుకుమార్‌గారు, నేను, మా యూనిట్ అంతా ఐదేళ్ల జీవితాలు పెట్టేశాం. మా నిర్మాతలు నవీన్, రవిగార్లకు కృతజ్ఞతలు. వాళ్లు కాకుండా ఏ ప్రొడ్యూసర్ అయినా 'పుష్ప' అయ్యేది కాదు. మమ్మల్ని నమ్మి కోట్లు ఖర్చు పెట్టినందుకు వాళ్లకు ధన్యవాదాలు'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్, రష్మికా మందన్నా జోడీగా నటించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. శ్రీలీల ప్రత్యేక పాటలో నటించారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో 'పుష్ప వైల్డ్ ఫైర్ జాతర' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో **అల్లు అర్జున్ మాట్లాడుతూ–** ''పుష్ప 2: ది రూల్' కోసం నాతో పనిచేసిన వారందరికీ థ్యాంక్స్. నాది, దేవి శ్రీది 20 ఏళ్ల ప్రయాణం. తన పాటల్లో నా కోసం ఎక్స్‌ట్రా లవ్ ఉంటుంది. ఈ తరం తెలుగమ్మాయిలకు శ్రీలీల స్ఫూర్తి. నేను ఐదేళ్లుగా పనిచేస్తున్న ఒకే ఒక హీరోయిన్ రష్మిక. తన అంకితభావానికి హ్యాట్సాఫ్. సుకుమార్‌గారి గురించి ఎంత చెప్పినా తక్కువే. 'పుష్ప 1, పుష్ప 2' ఆయన సినిమాలే. ఇంత మంచి డైరెక్టర్ మన తెలుగులో ఉన్నారా? అనే భావనని ఆయన కలిగిస్తారు. సుకుమార్‌గారు లేకపోతే నేను లేను. ఆయన నాతో 'ఆర్య' తీయకపోయి ఉంటే నేను, ఈ వేదిక, ఈ జనాలు ఏవీ ఉండేవి కాదు. 'పుష్ప' నా కోసం ఆడాలని నేనెప్పుడూ అనుకోలేదు. సుకుమార్‌గారి కష్టం కోసమైనా ఆడాలనుకున్నాను. అలాగే ఈ సినిమా కోసం మూడేళ్లు త్యాగం చేసి, కష్టపడిన చిత్రబృందం కోసం ఆడాలని రెండోసారి అనుకున్నాను. 'బాహుబలి, ఆర్ఆర్ఆర్' సినిమాలు వచ్చినప్పుడు తెలుగువారు ఎంతో గర్వించారు. ఆ తర్వాత 'పుష్ప' సినిమాకీ ఆ స్థాయిలో అంచనాలు ఉండటంతో తెలుగువారి కోసం ఈ సినిమా ఆడాలి అనుకున్నాను'' అని తెలిపారు.

దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ– ''సుమారు రెండు మూడు నెలల క్రితం 'పుష్ప 2' షూటింగ్‌కి వెళ్లాను. పుష్పరాజ్ ఇంట్రడక్షన్ సీన్‌ని సుకుమార్‌గారు చూపించారు. ఆ ఒక్క సన్నివేశం చూడగానే ఈ సినిమా ఎలా ఉండబోతుంది అనేది నాకు అర్థం అయిపోయింది'' అన్నారు.

నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''నేను వారం క్రితం 'పుష్ప 2' సినిమా చూసి ఇంటికెళ్లాను. 'మగధీర' సినిమాకి ముందు మీ మొహం ఎంతో వెలిగిపోవడం చూశాను.. మళ్లీ ఇప్పుడు చూస్తున్నాను' అని నా భార్య నిర్మల అన్నారు. 'పుష్ప' యూనిట్‌కి ఆల్ ది బెస్ట్'' అని తెలిపారు.

సుకుమార్ మాట్లాడుతూ– ''పుష్ప' ఇలా వచ్చిందంటే కారణం కేవలం నాకు, బన్నీకి మధ్య ఉన్న బంధమే. తన మీద ప్రేమతోనే ఈ సినిమా తీశాను. అలాగే మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలకు ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు.

''పుష్ప 2'ని ప్రేక్షకులు హిట్ చేస్తారనుకుంటున్నాం'' అన్నారు **నవీన్ ఎర్నేని**. ''ప్రపంచవ్యాప్తంగా 12,500 స్క్రీన్స్‌లో మా సినిమాని విడుదల చేస్తున్నాం'' అని **రవిశంకర్** చెప్పారు. ''ఇంత పెద్ద మూవీ చేసే అవకాశం రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు మైత్రీ మూవీస్ **సీఈవో చెర్రీ**. ''పుష్ప' చిత్రంలో పనిచేసినందుకు ఎంతో గర్వంగా ఉంది'' అని పేర్కొన్నారు సంగీత దర్శకుడు **దేవి శ్రీ ప్రసాద్**. ''ఈరోజు నేను ఇలా నటిస్తున్నానంటే అది కేవలం సుకుమార్, అల్లు అర్జున్‌గార్ల వల్లే'' అని తెలిపారు **రష్మిక మందన్నా**. ''పుష్ప'లో నాకు అవకాశం ఇచ్చినందుకు చిత్ర బృందానికి థ్యాంక్స్'' అని **శ్రీలీల** చెప్పారు.

ఈ వేడుకలో నిర్మాతలు నాగవంశీ, సతీశ్ కిలారు, దర్శకులు గోపీచంద్ మలినేని, బుచ్చిబాబు, వివేక్ ఆత్రేయ, శివ నిర్వాణ, నటి అనసూయ, కెమెరామేన్ మిరోస్లో కుబా బ్రోజెక్ తదితరులు మాట్లాడారు.

పుట్టినరోజు ప్రత్యేకం



• అరియానా, వివియానా

మంచు విష్ణు లీడ్ రోల్‌లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మంచు మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ సినిమా 2025 ఏప్రిల్ 25న విడుదల కానుంది. కాగా ఈ సినిమాలో మంచు విష్ణు కుమార్తెలు అరియానా, వివియానా నటించారు. డిసెంబరు 2న వారి పుట్టినరోజుని పురస్కరించుకుని 'కన్నప్ప' లో వారి పాత్రల లుక్స్‌ని విడుదల చేశారు మేకర్స్. గిరిజన వేషధారణలో చాలా వైవిధ్యంగా కనిపిస్తున్నారు అరియానా, వివియానా. శ్రీ కాళహస్తి పురాణ కథ ప్రాముఖ్యతను చాటి చెప్పే పాటలో వారు కనిపించనున్నారు. 'పాట పాడినా, నృత్యం చేసినా, ఇది శివుని కోసం' అంటూ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఉంది. ఈ సందర్భంగా మంచు విష్ణు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. ''కన్నప్ప' నుంచి నా కుమార్తెల ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. ఈ క్షణంలో నా హృదయం గర్వంతో ఉప్పొంగుతోంది. నా చిన్ని తల్లులు తెరపై సృష్టించే మ్యాజిక్‌ను చూసేందుకు నేను ఎంతగానో ఎదురుచూస్తున్నాను'' అన్నారు.

క్వీన్ ఆఫ్ సౌత్



• చంద్రిక

దివంగత నటి సిల్క్ స్మిత జీవితం ఆధారంగా 'సిల్క్ స్మిత' అనే కొత్త సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. 'క్వీన్ ఆఫ్ సౌత్' అన్నది ఉపశీర్షిక. స్త్రీ సినిమాస్ పతాకంపై ఎస్‌బీ విజయ్ అమృత్‌రాజ్ 'సిల్క్ స్మిత' మూవీ నిర్మిస్తున్నారు. జయరామ్ శంకరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సిల్క్ స్మిత పాత్రలో నటి చంద్రిక రవి నటిస్తున్నారు. డిసెంబరు 2న సిల్క్ స్మిత జయంతి. ఈ సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ మేరకు చంద్రిక రవి కొత్త లుక్స్‌ని కూడా విడుదల చేశారు. ''సిల్క్ స్మిత బయోపిక్‌గా ఇప్పటి వరకు చాలా సినిమాలు వచ్చాయి. అయితే ఆ చిత్రాలకు భిన్నంగా ఆమె నిజ జీవిత ఘటనలతో మా 'సిల్క్ స్మిత' తెరకెక్కుతోంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. కాగా సిల్క్ స్మిత జీవిత చరిత్రతో ఇప్పటికే పలు భాషల్లో చిత్రాలు రూపొందాయి. ముఖ్యంగా హిందీలో రూపొందిన 'ద డర్టీ పిక్చర్'(2011) ఘన విజయం సాధించడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో సిల్క్ స్మితగా నటించిన విద్యాబాలన్‌ని జాతీయ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. – సాక్షి, తమిళ సినిమా

శ్రీ కృష్ణుడి సందేశం



• అక్షయ్, ఐశ్వర్య

అక్షయ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'డియర్ కృష్ణ'. మమిత బైజు, ఐశ్వర్య హీరోయిన్లుగా నటించారు. దినేష్ బాబు దర్శకత్వం వహించిన ఈ సినిమా ద్వారా పీఎన్ బలరామ్ రచయితగా, నిర్మాతగా పరిచయమవుతున్నారు. పీఎన్‌బీ సినిమాస్‌పై రూపొందిన 'డియర్ కృష్ణ' ప్రెస్‌మీట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. పీఎన్ బలరామ్ మాట్లాడుతూ–''శ్రీ కృష్ణుడిని మేము ఎంతగానో ఆరాధిస్తాం. ఆయన వల్ల మా కుటుంబంలో జరిగిన ఓ అద్భుతాన్ని కథగా తీసుకొని ఈ సినిమా తీశాం. కృష్ణుడి సందేశాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్న వ్యక్తిగా నేను భావిస్తున్నాను. మా అబ్బాయి అక్షయ్ హీరోగా నటించాడు'' అని తెలిపారు. ''శ్రీ కృష్ణుడికి, ఆయన భక్తుడికి మధ్య జరిగిన ఒక అద్భుతాన్ని ప్రేరణగా తీసుకొని ఈ చిత్రాన్ని రూపొందించాం'' అని చెప్పారు అక్షయ్. ''ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది'' అన్నారు ఐశ్వర్య.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	445	80,248
నిఫ్టీ ▲	145	24,276

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	19,417	▲	199
డోజోన్స్	44,776	▽	139
ఎఫ్‌టీఎస్ఈ 100	8,319	▲	26
డాక్స్	19,934	▲	307
షాంఘై	3,364	▲	38
నికాయ్	38,513	▲	305

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 క్యారెట్)	76,308
బంగారం (99.5 క్యారెట్)	76,002
వెండి (కిలో)	88,611

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారతీయ రూపాయి	82.86	85.15
£	బ్రిటన్ పౌండ్	భారతీయ రూపాయి	104.50	107.59
€	యూరో	భారతీయ రూపాయి	86.42	89.22
¥	జపాన్ ఎన్ (100)	భారతీయ రూపాయి	45.43	61.48
AU$	ఆస్ట్రేలియా డాలర్	భారతీయ రూపాయి	52.23	55.25
S$	సింగపూర్ డాలర్	భారతీయ రూపాయి	60.52	63.39
SAR	సౌదీ రియాల్	భారతీయ రూపాయి	21.69	23.24
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ రూపాయి	22.17	23.17
¥	చైనా యువాన్	భారతీయ రూపాయి	10.77	12.60

పబ్లిక్ ఆఫర్ల వెల్లువ!

7 ఐపీవోలకు సెబీ గ్రీన్ సిగ్నల్

- మొత్తం రూ. 12,000 కోట్ల సమీకరణకు ప్రతిపాదనలు
- లిస్టులో ఈకామ్ ఎక్స్‌ప్రెస్, ట్రూఆల్ట్ బయోఎనర్జీ



న్యూఢిల్లీ: మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా ఏడు కంపెనీల ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లకు (ఐపీవో) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఇష్యూల ద్వారా కంపెనీలు దాదాపు రూ. 12,000 కోట్లు సమీకరించనున్నాయి. సెబీ ఆమోదం పొందిన వాటిల్లో ఈకామ్ ఎక్స్‌ప్రెస్, స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్, ట్రూఆల్ట్ బయోఎనర్జీ, ఇంటర్నేషనల్ జెమాలాజికల్ ఇనిస్టిట్యూట్ (ఐజీఐ), కెరారో ఇండియా, కాంకర్డ్ ఎన్విరో సిస్టమ్, వెంటివ్ హాస్పిటాలిటీ ఉన్నాయి. ఇవి ఈ ఏడాది ఆగస్టు–సెప్టెంబర్ మధ్య తమ ముసాయిదా పత్రాలను సమర్పించగా, నవంబర్ 26–29 మధ్య సెబీ.. అబ్జర్వేషన్లను జారీ చేసింది. సెబీ పరిభాషలో అబ్జర్వేషన్లను ఐపీవో ప్రతిపాదనకు ఆమోదంగా పరిగణిస్తారు.

ఐజీఐ.. 4,000 కోట్లు

ఇంటర్నేషనల్ జెమాలాజికల్ ఇనిస్టిట్యూట్ ఐపీవో ద్వారా రూ. 4,000 కోట్లు సమీకరించనుంది. ఇందుకోసం రూ. 1,250 కోట్లు విలువ చేసే షేర్లను కొత్తగా జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్‌లో భాగమైన ప్రమోటరు, బీసీపీ ఆసియా టూ టాప్‌కో రూ. 2,750 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించనుంది. సహజసిద్ధమైన వజ్రాలు, ల్యాబ్‌లో రూపొందించిన వజ్రాలు మొదలైన వాటికి సర్టిఫికేషన్ సేవలను ఐజీఐ అందిస్తోంది.

ఇతర కంపెనీల వివరాలు..

- గురుగ్రామ్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈకామ్ ఎక్స్‌ప్రెస్ రూ. 1,284.50 కోట్ల షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ప్రమోటర్లు..ఇతర షేర్‌హోల్డర్లు రూ. 1,315.50 కోట్ల విలువ చేసే షేర్లను ఓఎఫ్ఎస్ కింద విక్రయించనున్నారు.
- బ్లాక్‌స్టోన్ గ్రూప్, పంచశీల్ రియల్టీ సంస్థల జాయింట్ వెంచర్ అయిన వెంటివ్ హాస్పిటాలిటీ ప్రతిపాదిత ఐపీవో పూర్తిగా కొత్త షేర్ల జారీ రూపంలో ఉండనుంది. సంస్థకు భారత్, మాల్దీవుల్లో బిజినెస్, లీజర్ విభాగాల్లో ఆతిథ్య రంగ లగ్జరీ అసెట్స్ ఉన్నాయి. వెంటివ్‌లో పంచశీల్‌కు 60 శాతం, బ్లాక్‌స్టోన్‌కు మిగతా 40 శాతం వాటాలు ఉన్నాయి.
- స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్ కొత్తగా షేర్ల జారీ ద్వారా రూ. 550 కోట్లు సమీకరించనుండగా, ప్రమోటర్లు 67.59 లక్షల షేర్లను ఓఎఫ్ఎస్ కింద విక్రయించనున్నారు.
- కెరారో ఇండియా రూ. 1,812 కోట్లు సమీకరించేందుకు ఐపీవో తలపెట్టింది. ముసాయిదా ప్రాస్పెక్టస్ ప్రకారం సెల్లింగ్ షేర్‌హోల్డరయిన కెరారో ఇంటర్నేషనల్ సంస్థ.. తమ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయించనుంది. కెరారో ఇండియా 1997లో ఏర్పాటైంది. ట్రాన్స్‌మిషన్ సిస్టమ్స్, యాక్సిల్స్ తయారీతో కార్యకలాపాలు ప్రారంభించింది.
- బయోఫ్యూయెల్ తయారీ దిగ్గజం ట్రూఆల్ట్ బయోఎనర్జీ ప్రతిపాదిత ఐపీవో ఇటు కొత్త షేర్ల జారీ, అటు ఓఎఫ్ఎస్ రూపంలో ఉండనుంది. రూ. 750 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ప్రమోటర్లు 36 లక్షల షేర్లను విక్రయించనున్నారు. బెంగళూరుకు చెందిన ట్రూఆల్ట్ బయోఎనర్జీ ఇథనాల్ ఉత్పత్తి చేస్తోంది.రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం 1,400 కిలోలీటర్లుగా ఉంది
- ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ సొల్యూషన్స్ సంస్థ కాంకర్డ్ ఎన్విరో సిస్టమ్స్ తలపెట్టిన ఇష్యూలో భాగంగా రూ. 192.3 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనున్నారు. ప్రమోటర్లు, ఇన్వెస్టరు.. ఓఎఫ్ఎస్ కింద 51.84 లక్షల షేర్లను విక్రయించనున్నారు.

2025లో జెప్టో ఐపీవో...




క్విక్‌కామర్స్ దిగ్గజం జెప్టో వచ్చే ఏడాది (2025) పబ్లిక్ ఇష్యూకి వచ్చే వీలున్నట్లు కంపెనీ సహవ్యవస్థాపకుడు, సీఈవో ఆదిత్ పాలిచా ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల 35 కోట్ల డాలర్ల(సుమారు రూ. 2,950 కోట్లు) సమీకరణతో జెప్టో పూర్తిస్థాయిలో దేశీ కంపెనీగా ఆవిర్భవించినట్లు పేర్కొన్నారు. దేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు సమకూర్చడం దీనికి కారణమని తెలియజేశారు. కంపెనీ నికర లాభాలు ఆర్జించే బాటలో సాగుతున్నట్లు వెల్లడించారు. క్విక్‌కామర్స్ విధానాలు సంప్రదాయ కిరాణా స్టోర్ల వృద్ధిని దెబ్బతీస్తున్నట్లు వెలువడుతున్న ఆరోపణలను కొట్టిపారేశారు.

చమురుపై విండ్‌ఫాల్ ట్యాక్స్ ఎత్తివేత

ఓఎన్‌జీసీ, రిలయన్స్ వంటి సంస్థలకు ఊరట

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా క్రూడాయిల్ రేట్లు దిగివచ్చిన నేపథ్యంలో దేశీయంగా ఉత్పత్తి చేసే చమురుపై, విమాన ఇంధనం, డీజిల్, పెట్రోల్ ఎగుమతులపై దాదాపు రెండున్నరేళ్లుగా విధిస్తున్న విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్‌ను కేంద్రం తొలగించింది. అలాగే పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై విధిస్తున్న రహదారులు, మౌలిక సదుపాయాల సెస్సును కూడా ఉపసంహరించింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం రాజ్యసభ ముందుంచారు. దీనితో దేశీయంగా ముడిచమురు ఉత్పత్తి చేసే ప్రభుత్వ రంగ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ (ఓఎన్‌జీసీ), ఆయిల్ ఇండియా వంటి సంస్థలకు, అలాగే ఎగుమతులు చేసే రిలయన్స్, నయారాలాంటి కంపెనీలకు ప్రయోజనం చేకూరనుంది.



ఆయిల్ కంపెనీలకు వచ్చే అసాధారణ లాభాలపై విధించే పన్నును విండ్‌ఫాల్ ట్యాక్స్‌గా వ్యవహరిస్తారు. 2022 జూలై 1న దేశీయంగా తొలిసారి దీన్ని విధించారు. ఆయిల్ బ్యారెల్‌ను 75 డాలర్లకు మించి ఎంత రేటుకు విక్రయించినా, వచ్చే ఆ లాభాలపై ప్రభుత్వం ఈ ట్యాక్స్‌ను విధిస్తూ వస్తోంది. 2022లో దేశీయంగా ఉత్పత్తి చేసే క్రూడాయిల్‌పై టన్నుకు రూ. 23,250 చొప్పున, ఎగుమతి చేసే పెట్రోల్.. ఏటీఎఫ్‌పై లీటరుకు రూ. 6 చొప్పున, డీజిల్‌పై లీటరుకు రూ. 13 చొప్పున దీన్ని విధించింది. తద్వారా 2022–23లో రూ. 25,000 కోట్లు, 2023–24లో రూ. 13,000 కోట్లు, ఈ ఆర్థిక సంవత్సరం రూ. 6,000 కోట్ల వరకు సమీకరించింది. దీన్ని ఎత్తివేయాలంటూ చాలాకాలంగా పరిశ్రమతో పాటు కేంద్ర పెట్రోలియం..సహజ వాయువు శాఖ లాబీయింగ్ చేస్తున్నాయి. ప్రస్తుతం భారత్ దిగుమతి చేసుకునే క్రూడాయిల్ బాస్కెట్ రేటు సగటున 73.02 డాలర్ల స్థాయిలో ఉంది.

11 నెలల కనిష్టానికి 'తయారీ'



న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగానికి సంబంధించి హెచ్ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) నవంబర్‌లో 56.5కు పడిపోయింది. గడచిన 11 నెలల్లో ఇంత తక్కువ స్థాయికి పీఎంఐ పడిపోవడం ఇదే తొలిసారి. అక్టోబర్‌లో సూచీ 57.5 వద్ద ఉంది. అంతర్జాతీయంగా తీవ్ర పోటీ పరిస్థితులు, ద్రవ్యోల్బణం ఒత్తిడులు, దీనితో కొత్త ఆర్డర్ల తగ్గడం సమీక్షా నెల్లో తయారీ రంగం మందగమనానికి కారణం. అయితే సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువనకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
హైదరాబాద్‌లో ఇళ్ల ధరల పెరుగుదల | అడి కార్ల రేట్లు పెంపు

రెండో రోజూ మార్కెట్ జోరు

- మిడ్‌సెషన్ నుంచీ భారీ కొనుగోళ్లు
- సెన్సెక్స్ 445, నిఫ్టీ 145 పాయింట్లు ప్లస్



ముంబై: ఈ ఏడాది జూలై–సెప్టెంబర్(క్యూ2)లో జీడీపీ వృద్ధి 5.4 శాతానికి మందగించినప్పటికీ దేశీ స్టాక్ మార్కెట్లు జోరు చూపాయి. గత 7 త్రైమాసికాలలోనే ఆర్థిక వ్యవస్థ కనిష్ట వృద్ధికి పరిమితమైనప్పటికీ ఇన్వెస్టర్లు పెట్టుబడులకే ప్రాధాన్యత ఇవ్వడంతో వరుసగా రెండో రోజు లాభాలతో నిలిచాయి. ఆర్థిక వృద్ధి మందగించిన కారణంగా స్వల్ప వెనకడుగుతో ప్రారంభమైన మార్కెట్లు వెనువెంటనే కోలుకున్నాయి. మిడ్‌సెషన్ నుంచీ కొనుగోళ్లు పెరగడంతో జోరందుకున్నాయి. వెరసి సెన్సెక్స్ 445 పాయింట్లు లాభపడింది. 80,248 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 145 పాయింట్లు బలపడి 24,276 వద్ద నిలిచింది.

రియల్టీ జూమ్..: ఎన్ఎస్ఈలో రియల్టీ అత్యధికంగా 3 శాతం ఎగసింది. కన్జూమర్ డ్యూరబుల్స్, హెల్త్‌కేర్, ఆటో రంగాలు 2–1 శాతం మధ్య పుంజుకున్నాయి. నిఫ్టీ దిగ్గజాలలో అల్ట్రాటెక్, అపోలో, గ్రాసిమ్, శ్రీరామ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ, అదానీ పోర్ట్స్, ఎంఅండ్ఎం, టెక్ఎం, టైటన్, డాక్టర్ రెడ్డీస్, ఆర్ఐఎల్, సన్, మారుతీ, హెచ్‌సీఎల్ టెక్, కోల్ ఇండియా 4–1.3 శాతం మధ్య బలపడ్డాయి. అయితే హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎన్‌టీపీసీ, సిప్లా, ఎస్‌బీఐ లైఫ్, హెచ్‌యూఎల్, బ్రిటానియా, కొటక్ బ్యాంక్, ఇండస్ఇండ్ 2.7–0.5 శాతం మధ్య డీలాపడ్డాయి. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 1 శాతం చొప్పున పుంజుకున్నాయి. మధ్య, చిన్నతరహా షేర్లలో 463 కౌంటర్లు అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. ఈ జాబితాలో రామ్‌కో సిస్టమ్స్, గోల్డియామ్ ఇంటర్నేషనల్, అతుల్ ఆటో, కొచిన్ షిప్‌యార్డ్ తదితర కంపెనీలు ఉన్నాయి.

అదానీ గ్రూప్ నేలచూపు: మార్కెట్లు లాభపడినప్పటికీ అదానీ గ్రూప్‌లోని ఆరు కౌంటర్లలో అమ్మకాలు తలెత్తాయి. అదానీ టోటల్ గ్యాస్ 5 శాతం, ఎనర్జీ సొల్యూషన్స్ 4 శాతం చొప్పున పతనమయ్యాయి. ఇతర షేర్లలో ఎన్‌డీటీవీ, అదానీ విల్మర్, అదానీ పవర్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1–0.5 శాతం మధ్య నీరసించాయి.

ఇక ఉబర్‌లో 'శికారా'!



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రవాణా రంగంలో ఉన్న ఉబర్ ఆసియాలో తొలిసారిగా జల రవాణా సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో శికారా బుకింగ్‌ను పరిచయం చేసింది. శ్రీనగర్‌లోని ప్రముఖ దాల్ సరస్సులో ప్రశాంత జలాల మీదుగా విరామ ప్రయాణంలో శికారా రైడ్ పర్యాటకులకు ఒక అద్భుతమైన మరపురాని అనుభవం. శికారాలు సంప్రదాయ చెక్క పడవలు. శతాబ్దాలుగా సరస్సులో రవాణా, విశ్రాంతి కోసం వీటిని ఉపయోగిస్తున్నారు. 'సాంకేతికత, సంప్రదాయాన్ని మిళితం చేసి ప్రయాణికులకు వారి శికారా రైడ్ కోసం అడ్డంకులు లేని అనుభవాన్ని అందించడానికి మా వినయపూర్వకమైన ప్రయత్నం ఇది. కశ్మీర్‌లోని ఉత్కంఠభరిత ప్రకృతి దృశ్యాన్ని మరింత మందికి చేరువ చేయడం, పర్యాటకాన్ని మెరుగుపరిచే ఈ ఐకానిక్ అనుభవాన్ని సృష్టించడం మాకు గర్వకారణం' అని ఊబర్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్ తెలిపారు. ఉబర్ వినియోగదారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఈ సేవలను పొందవచ్చు. శికారా రైడ్‌ను ఉదయం 10 నుండి సాయంత్రం 5 మధ్య బుక్ చేసుకోవచ్చు. ఉబర్ వేదికగా 15 రోజుల ముందు కూడా బుక్ చేసుకోవచ్చు. కనీసం 12 గంటల ముందు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. దాల్ లేక్‌లో దాదాపు 4,000 శికారాలు ఉన్నట్లు అంచనా.

జారుడుబల్లపై రూపాయి

కొత్త కనిష్టం వద్ద ముగింపు



వరుసగా రెండో రోజు దేశీ కరెన్సీ పతనమైంది. డాలరుతో మారకంలో తాజాగా 12 పైసలు నీరసించింది. 84.72 వద్ద ముగిసింది. వెరసి రెండో రోజూ సరికొత్త కనిష్టం వద్ద స్థిరపడింది. గత వారాంతాన సైతం 13 పైసలు నష్టపోయి 84.60 వద్ద నిలిచింది. జూలై–సెప్టెంబర్‌లో దేశ జీడీపీ వృద్ధి 5.4 శాతానికి మందగించడం, బ్రిక్ దేశాలపై యూఎస్ టారిఫ్‌ల విధింపు అంచనాలు, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు ప్రభావం చూపినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రపంచ ప్రధాన కరెన్సీలతో మారకంలో కొద్ది రోజులుగా డాలరు బలపడుతున్న నేపథ్యంలో రూపాయి విలువ కోల్పోతూ వస్తున్న సంగతి తెలిసిందే. కాగా.. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 84.59 వద్ద ప్రారంభమైంది. తదుపరి 84.73వరకూ క్షీణించింది. అంతర్జాతీయంగా డాలరు ఇండెక్స్ 0.5 శాతం పుంజుకొని 106.27 వద్ద కదులుతోంది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఐటీబీపీలో 27 అసిస్టెంట్ సర్జన్ పోస్టులు

ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ).. అసిస్టెంట్ సర్జన్(అసిస్టెంట్ కమాండెంట్/వెటర్నరీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 27
» అర్హత: బీవీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» వయసు: 35 ఏళ్లు మించకూడదు.
» పే స్కేల్: నెలకు రూ.56,100 నుంచి రూ.1,77,500.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 24.12.2024.
» వెబ్‌సైట్: https://recruitment.itbpolice.nic.in

ఎన్‌టీపీసీలో 50 అసిస్టెంట్ ఆఫీసర్ పోస్టులు

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ).. అసిస్టెంట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 50.
» అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ (మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/సివిల్/ప్రొడక్షన్/కెమికల్/కన్‌స్ట్రక్షన్/ఇన్‌స్ట్రుమెంటేషన్)తో పాటు డిప్లొమా/అడ్వాన్స్‌డ్ డిప్లొమా/పీజీ డిప్లొమా (ఇండస్ట్రియల్ సేఫ్టీ) ఉత్తీర్ణులై ఉండాలి.
» వేతనం: నెలకు రూ.30,000 నుంచి రూ.1,20,000.
» గరిష్ఠ వయో పరిమితి: 45 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
» ఎంపిక విధానం: విద్యార్హతలు, దరఖాస్తు షార్ట్‌లిస్టింగ్/స్క్రీనింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 10.12.2024.
» వెబ్‌సైట్: http://ntpc.co.in

పారా మెడికల్.. అవకాశాలకు మార్గం!

పారా మెడికల్ టెక్నాలజీ.. వైద్య రంగంలో కెరీర్ కోరుకునే వారికి చక్కటి ప్రత్యామ్నాయంగా నిలుస్తున్న కోర్సు! బీఎస్సీలో పలు విభాగాల్లో.. పారా మెడికల్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి! ఈ కోర్సులు పూర్తి చేసుకుంటే విస్తృత కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు! తాజాగా.. బీఎస్సీ పారా మెడికల్ టెక్నాలజీ ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్‌లోని వైద్య విశ్వ విద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. బీఎస్సీ పారా మెడికల్ టెక్నాలజీ కోర్సులు, ప్రత్యేకతలు, ప్రవేశ విధానం, కెరీర్ అవకాశాల వివరాలు..



పారా మెడికల్ టెక్నాలజీ.. వైద్య రంగంలో పలు విభాగాలకు సంబంధించి నైపుణ్యాలను అందించే కోర్సు. బీఎస్సీ స్థాయిలో పలు స్పెషలైజేషన్లతో ఉన్న ఈ కోర్సులను పూర్తి చేసుకుంటే.. ఉపాధి అవకాశాలను సొంతం చేసుకోవచ్చు. ముఖ్యంగా వైద్య రంగంలో కెరీర్ కోరుకునే వారికి ఎంతో కీలకమైన కోర్సుగా పారా మెడికల్ టెక్నాలజీ నిలుస్తోంది.

అర్హతలు

- బీఎస్సీ పారా మెడికల్ టెక్నాలజీ కోర్సులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర వైద్య విశ్వ విద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. బైపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అదే విధంగా.. ఇంటర్మీడియెట్ ఒకేషనల్ (ఎంఎల్‌టీ) పూర్తి చేసుకుని.. బయాలజీ, ఫిజికల్ సైన్సెస్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తి చేసుకున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: 2024, డిసెంబర్ 31 నాటికి కనీసం 17 ఏళ్లు పూర్తి చేసుకోవాలి.

15 స్పెషలైజేషన్లు

ఏపీలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం–ప్రస్తుతం బీఎస్సీ పారా మెడికల్ టెక్నాలజీలో 15 స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి. అవి.. బీఎస్సీ–మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ; బీఎస్సీ–న్యూరో ఫిజియాలజీ టెక్నాలజీ;బీఎస్సీ–ఆప్టోమెట్రిక్ టెక్నాలజీ; బీఎస్సీ–రెనల్‌డయాలసిస్ టెక్నాలజీ; బీఎస్సీ–పెర్‌ఫ్యూషన్ టెక్నాలజీ;బీఎస్సీ–కార్డియాక్ కేర్ అండ్ కార్డియో వాస్క్యులర్ టెక్నాలజీ; బీఎస్సీ–ఇమేజింగ్ టెక్నాలజీ; బీఎస్సీ–ఎమర్జెన్సీ మెడికల్ టెక్నాలజీ; బీఎస్సీ–రెస్పిరేషన్ థెరపీ టెక్నాలజీ; బీఎస్సీ–ఫిజిషియన్ అసిస్టెంట్ టెక్నాలజీ; బీఎస్సీ–మెడికల్ రికార్డ్స్ అసిస్టెంట్ టెక్నాలజీ; బీఎస్సీ–ట్రాన్స్‌ఫ్యూజన్ టెక్నాలజీ; బీఎస్సీ–రేడియో థెరపీ టెక్నాలజీ; బీఎస్సీ–ఎకో కార్డియోగ్రఫీ టెక్నాలజీ.

మెరిట్ ఆధారంగా ఎంపిక

బీఎస్సీ పారా మెడికల్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్మీడియెట్ (బైపీసీ) మార్కులను ప్రాతిపదికగా తీసుకుంటారు. ముందుగా అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత మార్కుల ఆధారంగా ప్రొవిజినల్ మెరిట్ జాబితా, అనంతరం ఫైనల్ మెరిట్ జాబితా విడుదల చేస్తారు. విద్యార్థులు వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా కోర్సులు, ఇన్‌స్టిట్యూట్‌ల ప్రాధాన్యతలను పేర్కొనాల్సి ఉంటుంది.

కెరీర్ అవకాశాలు

- పారామెడికల్ నిపుణులు రోగి చికిత్సకు అవసరమైన నివేదికలు అందిస్తారు. అదే విధంగా చికిత్సలో వైద్యులకు సహకరించేలా విధులు నిర్వహిస్తారు. ఈ నైపుణ్యాలు పారా మెడికల్ టెక్నాలజీ కోర్సుల ద్వారా లభిస్తాయి.
- బీఎస్సీ స్థాయిలో పారా మెడికల్ టెక్నాలజీ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి అవకాశాలు విస్తృతం అవుతున్నాయి. వీరికి ప్రధానంగా హాస్పిటల్స్, లేబొరేటరీస్, డయాగ్నస్టిక్ సెంటర్స్ ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, డిసెంబర్ 9
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://drntr.uhsap.in

స్పెషలైజేషన్ల వారీగా

బీఎస్సీ పారా మెడికల్ టెక్నాలజీలోని ఆయా స్పెషలైజేషన్ల వారీగా కోర్సుల ప్రత్యేకతల వివరాలు..

మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ

వ్యాధి నిర్ధారణకు మెడికల్ లేబొరేటరీల్లో పరీక్షలు నిర్వహించి.. వైద్యులకు నివేదికలు అందించాల్సి ఉంటుంది. ఈ ఎంఎల్‌టీ కోర్సు పూర్తి చేసిన వారు తమ నైపుణ్యంతో నివేదికలు రూపొందిస్తారు. వీరికి ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్న మెడికల్ లేబొరేటరీల్లో, ప్రైవేటు మెడికల్ లేబొరేటరీల్లో అవకాశాలు లభిస్తాయి. ప్రారంభంలో నెలకు రూ.25 వేల వరకు వేతనం లభిస్తుంది.

న్యూరో ఫిజియాలజీ టెక్నాలజీ

బీఎస్సీ పారా మెడికల్ టెక్నాలజీలో మరో ప్రత్యేకమైన కోర్సు.. న్యూరో ఫిజియాలజీ టెక్నాలజీ. మెదడు నాడీ వ్యవస్థకు సంబంధించిన అంశాలు, సమస్యలు, వాటికి పరిష్కారంపై ఈ కోర్సు ద్వారా అవగాహన లభిస్తుంది. అదే విధంగా శరీరంలోని ఇతర నాడీ వ్యవస్థల పని తీరుకు సంబంధించిన అంశాలపైనా నైపుణ్యం సొంతం చేసుకోవచ్చు. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి న్యూరోపాథాలజిస్ట్, న్యూరో కన్సల్టెంట్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.

ఆప్టోమెట్రిక్ టెక్నాలజీ

ఇటీవల కాలంలో ఉపాధి అవకాశాల పరంగా వేగంగా వృద్ధి చెందుతున్న విభాగం.. ఆప్టోమెట్రీ. కంటి సమస్యలకు సంబంధించి జాగ్రత్తలు, వ్యాధులు, వాటిని గుర్తించే పద్ధతులను ఈ కోర్సు ద్వారా తెలుసుకోవచ్చు. కంటి ఆసుపత్రుల్లో నేత్ర వైద్యులకు అనుబంధంగా సేవలు అందించటంలో ఆప్టోమెట్రీషియన్ల పాత్ర కీలకంగా మారుతోంది.

రెనల్ డయాలసిస్ టెక్నాలజీ

కిడ్నీ సమస్యలకు సంబంధించిన పరిష్కారాలను కనుగొనే నైపుణ్యాలను ఈ కోర్సు ద్వారా సొంతం చేసుకోవచ్చు. డయాలసిస్ చేసే సమయంలో ఉపయోగించే పరికరాల నాణ్యత, నిర్వహణ వంటి నైపుణ్యాలు లభిస్తాయి.

పెర్‌ఫ్యూషన్ టెక్నాలజీ

గుండెకు సంబంధించిన వ్యాధులకు చికిత్స చేసేందుకు పర్‌ఫ్యూషన్ టెక్నాలజీ కీలకంగా మారుతోంది. ముఖ్యంగా శస్త్రచికిత్సల సమయంలో ఆపరేషన్ థియేటర్లో డాక్టర్లకు సహకరించడం, సంబంధిత పరికరాలను నిర్వహించడం, కృత్రిమ పరికరాలు (ఉదాహరణకు హార్ట్–లంగ్ మిషిన్, డిఫిబ్రిలేటర్, వైబ్రేటర్ తదితర) ఎంపిక, అమరికలో పర్‌ఫ్యూషన్ టెక్నాలజీ నిపుణుల సేవలు కీలకంగా నిలుస్తున్నాయి. ఈ కోర్సును పూర్తి చేసుకుంటే..ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థలు, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

అనస్థీషియాలజీ టెక్నాలజీ అండ్ ఆపరేషన్ టెక్నాలజీ

శస్త్ర చికిత్స సమయంలో సదరు రోగికి ఆ బాధ తెలియకుండా ఉండేందుకు వైద్యులు అనుసరిస్తున్న విధానం.. అనస్థీషియా. దీంతో అనస్థీషియా టెక్నాలజీ ఎంతో కీలకంగా నిలుస్తోంది. రోగులకు మత్తు ఇవ్వడం, ఇవ్వాల్సిన స్థాయి, శరీరంలో ఏ భాగంలో ఇవ్వాలి వంటి నైపుణ్యాలు అందించే కోర్సుగా అనస్థీషియా టెక్నాలజీ నిలుస్తోంది.

కార్డియాక్ కేర్ టెక్నాలజీ, కార్డియో వాస్క్యులర్ టెక్నాలజీ

గుండె పనితీరుకు సంబంధించి నైపుణ్యాలను అందించే కోర్సు.. కార్డియాక్ కేర్ టెక్నాలజీ అండ్ కార్డియో వాస్క్యులర్ టెక్నాలజీ. గుండె ఆపరేషన్ల పరంగా అవసరమైన బెలూన్ యాంజియోప్లాస్టీ, అనస్థీషియా, క్రెప్పింగ్ వంటి విధానాల్లోనూ అవగాహన పొందుతారు. అదే విధంగా కార్డియో వ్యాస్కులర్ వ్యాధులకు సంబంధించి చికిత్స సమయంలో వైద్యులకు అవసరమయ్యే పరికరాల నిర్వహణ,యాంజియోప్లాస్టీ, కార్డియాక్ క్యాథరైజేషన్,ఎలక్ట్రో ఫిజియాలజీ వంటి ప్రక్రియల్లో పాల్గొంటారు.

మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ

ఎంఆర్ఐ, ఎక్స్‌రే, సీటీ స్కాన్, అల్ట్రా సౌండ్ స్కానింగ్‌కు సంబంధించిన నైపుణ్యాలు అందించే కోర్సు.. ఇమేజింగ్ టెక్నాలజీ. ఎంఆర్ఐ, ఎక్స్‌రే, సీటీ స్కాన్ తదితర పరీక్షల సమయంలో రేడియాలజిస్ట్‌ల సూచనలకు అనుగుణంగా సాంకేతిక పరికరాలను వినియోగించడం వంటి నైపుణ్యాలను మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ కోర్సు ద్వారా సొంతం చేసుకోవచ్చు.

ఎమర్జెన్సీ మెడికల్ టెక్నాలజీ

అత్యవసర పరిస్థితుల్లో లైఫ్ సపోర్ట్ అందించడం, క్రిటికల్ కేర్ సపోర్ట్, వెంటిలేషన్, కార్డియాక్ అరెస్ట్స్, క్రిటికల్ మెడికల్ కేస్‌లను పరిష్కరించడం వంటి నైపుణ్యాలను అందించే కోర్సు ఇది. వీరికి నెఫ్రాలజిస్ట్ కన్సల్టెంట్, క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్, క్లినికల్ ఇన్వెస్టిగేటర్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.

రెస్పిరేటరీ థెరపీ టెక్నాలజీ

ఊపిరితిత్తులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించే కోర్సు రెస్పిరేటరీ థెరపీ. 'బ్రోంకోస్కోపి'టెస్ట్ చేయడంలో రెస్పిరేటరీ థెరపీ టెక్నాలజీ నైపుణ్యాలు ఎంతో కీలకంగా నిలుస్తాయి.

ఫిజిషియన్ అసిస్టెంట్ టెక్నాలజీ

ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, ప్యాథాలజీ, ఫార్మకాలజీ వంటి అంశాలపై నైపుణ్యం లభిస్తుంది. అదే విధంగా జనరల్ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్, కార్డియాలజీ వంటి విభాగాల్లో నైపుణ్యం లభిస్తుంది.

మెడికల్ రికార్డ్స్ అసిస్టెంట్ టెక్నాలజీ

రోగుల హెల్త్‌కేర్ డేటాను నిర్వహించే నైపుణ్యాలను అందించే కోర్సు ఇది. మెడికల్ రికార్డ్స్ కలెక్షన్, అనలైజేషన్ వంటి ప్రక్రియలు ఉంటాయి. మెడికల్ కోడింగ్, హెల్త్‌కేర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ వంటి నైపుణ్యాలు కూడా లభిస్తాయి.

ట్రాన్స్‌ఫ్యూజన్ టెక్నాలజీ

ఈ కోర్సు ప్రధానంగా.. రక్త సేకరణ నైపుణ్యాలు అందించేలా ఉంటుంది. బ్లడ్ స్టోరేజ్, బ్లడ్ టెస్టింగ్, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ప్రక్రియలలో నైపుణ్యాలు లభిస్తాయి. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్స్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ స్పెషలిస్ట్స్, క్వాలిటీ అష్యూరెన్స్ ఆఫీసర్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.

రేడియో థెరపీ టెక్నాలజీ

కేన్సర్ వంటి వాటికి రేడియేషన్‌ను ఏ స్థాయిలో ఇవ్వాలి అనే దానితోపాటు డయాగ్నస్టిక్ టెస్ట్స్(ఎక్స్‌రే, సీటీ స్కాన్ తదితర)పై అవగాహన కల్పించే కోర్సు ఇది.

ఎకో కార్డియోగ్రఫీ టెక్నాలజీ


గుండె పనితీరుకు సంబంధించి ప్రాథమికంగా అవగాహన కల్పించే కోర్సు.. ఎకో కార్డియో గ్రఫీ టెక్నాలజీ. హార్ట్ బీట్, హార్ట్ ఇంపల్సెస్‌కు సంబంధించిన నైపుణ్యాలను, సాంకేతిక పరికరాలను సమర్థంగా వినియోగించే నైపుణ్యాలను అందించే కోర్సు ఇది.



ఎక్కడ ఆ పులి.. ఇక్కడ ఆడ బెబ్బులి..

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్‌–టి మండలంలోని పలు గ్రామాల్లో పులి సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. వ్యవసాయ పనులకు వెళ్లాలంటేనే పరిసర ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. అయితే, అదే మండలంలోని పులిదాడి జరిగిన దుబ్బగూడ గ్రామానికి చెందిన ఓ మహిళా రైతు ఏమాత్రం వణుకులేకుండా ఎద్దుల బండిని తోలుతూ వ్యవసాయ పనులకు వెళ్తుండటం ఆమె ధైర్యానికి ప్రతీకగా నిలుస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



సోషల్ మీడియా దుష్ప్రభావాల బారి నుంచి 16 ఏళ్లలోపు టీనేజర్లను కాపాడేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం తాజాగా కఠిన నిర్ణయం తీసుకుంది. పిల్లల సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధిస్తూ చట్టం తీసుకొచ్చింది. వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వచ్చే ఈ చట్టాన్ని అతిక్రమించే సోషల్ మీడియా సంస్థలకు రూ. 275 కోట్ల భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఇదే అంశంపై ఇటీవల ఇప్సోస్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో పాల్గొన్న 30 దేశాల్లో మూడింట రెండొంతుల దేశాలు 14 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వాడకంపై బ్యాన్ ఉండాలని అభిప్రాయపడ్డాయి. ఫ్రాన్స్‌లో అత్యధికంగా 80 శాతం మంది (సర్వేలో పాల్గొన్న వారిలో) నిషేధాన్ని సమర్థించగా భారత్‌లో 73 శాతం మంది సమర్థించారు.

– సాక్షి సెంట్రల్ డెస్క్

11 నెలల్లో 61 మందుల దుకాణాలు సీజ్

- నకిలీ క్లినిక్‌లపై 124 కేసులు
- నిషేధిత మందుల విక్రయంపై మరో మూడు కేసులు
- నకిలీ మందుల ముఠాలపై కొరడా ఝుళిపిస్తున్న డీసీఏ అధికారులు



సాక్షి, హైదరాబాద్: నకిలీ మందుల విక్రయం, నిబంధనలకు విరుద్ధంగా మందుల నిల్వ.. అధిక ధరలకు మందుల విక్రయం తదితర అంశాలపై తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా సోదాలు కొనసాగినట్టు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. అనధికారికంగా మందులు నిల్వ చేయ డం, డ్రగ్స్ లైసెన్స్ లేకుండా మందుల విక్ర యాలు కొనసాగిస్తున్న 61 మందుల దుకాణాలను సీజ్ చేసినట్టు తెలిపారు. అలాగే ఎనిమిది రకాల కల్తీ మందులను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఎలాంటి అర్హతలు లేకుండా క్లినిక్‌లను నిర్వహిస్తూ వైద్యం చేయడంతోపాటు మందులు విక్రయిస్తున్న నకిలీ క్లినిక్‌లు, నకిలీ ఆర్‌ఎంపీల విషయంలో డీసీఏ కఠినంగా వ్యవహరిస్తోంది. నకిలీ క్లినిక్‌లపై 11 నెలల్లో 124 కేసులు నమోదు చేసినట్టు కమలాసన్‌రెడ్డి తెలిపారు. మందులను ఆహార ఉత్పత్తులు, న్యూట్రిషియన్స్ పేరిట నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నట్టు గుర్తించి 41 కేసులు నమోదు చేశామన్నారు. కాస్మెటిక్స్ మాన్యుఫాక్చరింగ్ లైసెన్స్ లేకుండా విక్రయాలు చేస్తున్న నిందితులపై 5 కేసులు పెట్టామని తెలిపారు. నిషేధిత మందులను సైతం కొందరు విక్రయిస్తున్నట్టు అధికారుల తనిఖీల్లో వెల్లడయినట్లు ఆయన వివరించారు. నిషేధిత మందుల విక్రయానికి సంబంధించి మూడు కేసులు నమోదు చేసినట్టు డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిస్పెన్సరీలు

- అత్యవసర సేవలు తప్ప మిగతా వైద్యం అక్కడే
- ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వైద్యులు, టెక్నీషియన్ల నియామకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు, రిటైరైన సిబ్బంది ఇకపై ఉచిత చికిత్సల కోసం తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి వరకు రావాల్సిన బాధ తప్పనుంది. ఆర్టీసీ ఆసుపత్రికి అనుబంధంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్పెన్సరీలను ఆసుపత్రులుగా మారుస్తుండటమే అందుకు కారణం. నిధుల సమస్యతో ఇంతకాలం డిస్పెన్సరీలను బాగుచేయలేని పరిస్థితి నెలకొనగా తాజాగా వాటిని ఉద్యోగులకు చేరువ చేసేలా ఎండీ సజ్జనార్ చర్యలు తీసుకున్నారు.

వైద్యులు.. పరికరాలు.. మందులు..

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 14 చోట్ల ఆర్టీసీ డిస్పెన్సరీలున్నాయి. వాటిల్లో నాలుగు హైదరాబాద్‌లోనే ఉన్నాయి. కానీ కొన్ని డిస్పెన్సరీల్లో వైద్యులు లేరు. అలాగే ఎక్కడా కూడా వైద్య పరికరాలు లేవు. ఇప్పుడు అన్ని డిస్పెన్సరీలకూ వైద్యులను కేటాయించారు.



నలుగురు వైద్యులను ప్రభుత్వం కేటాయించగా మిగతా వైద్యులను, టెక్నీషియన్లను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఆర్టీసీ సమకూర్చుకుంది. వారు స్థానికంగా అందుబాటులో ఉంటూ సాధారణ చికిత్సలకు పూర్తిస్థాయిలో సేవలందించనున్నారు. అయితే ఎమర్జెన్సీ కేసులకు మాత్రం కీలక చికిత్సలు డిస్పెన్సరీల్లో ఉండవు. అత్యవసర వైద్యం అవసరమయ్యే రోగులు ఆర్టీసీ ప్రధాన ఆసుపత్రికో లేదా ఆర్టీసీ రిఫరల్ జాబితాలోని ప్రైవేటు ఆసుపత్రులకో వెళ్లే వరకు అవసరమయ్యే ప్రాథమిక చికిత్సలు అందిస్తారు. అలాగే అన్ని రకాల మందులను కూడా డిస్పెన్సరీల్లో సమకూరుస్తున్నారు. ఆర్టీసీ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స తీసుకున్న వారు మందుల కోసం ప్రతిసారీ హైదరాబాద్‌కు రావాల్సి వస్తోంది. ఇకపై డిస్పెన్సరీల్లోనే ఉచితంగా మందులు అందిస్తారు. మరోవైపు కొత్తగా ఏర్పడ్డ పెద్ద జిల్లా కేంద్రాల్లో కూడా డిస్పెన్సరీలు ఏర్పాటు చేయాలన్న నిర్ణయంలో భాగంగా తాజాగా నాగర్‌కర్నూల్‌లో డిస్పెన్సరీ ఏర్పాటైంది. మిగతా వాటిల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

నోట్స్ సరిగ్గా రాయలేదని..

- విద్యార్థిని చెట్టుకు వేలాడదీసి కొట్టిన ప్రిన్సిపాల్
- తల్లిదండ్రులు పోలీస్ కేసు పెట్టడంతో క్షమాపణ
- సంగారెడ్డి జిల్లా వట్‌పల్లిలో ఘటన

వట్‌పల్లి(అందోల్): కొద్ది రోజులుగా విద్యార్థి సరిగ్గా నోట్స్ రాయడం లేదన్న కారణంతో ఆ బాలుడిని స్కూల్ ప్రిన్సిపాల్ చెట్టుకు వేలాడదీసి కొట్టిన ఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అల్లాదుర్గం మండలం చేవెళ్ల గ్రామానికి చెందిన నవీన్ వట్‌పల్లిలోని అక్షర పబ్లిక్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. నవీన్ కొద్ది రోజులుగా నోట్స్ సరిగా రాయడం లేదని శనివారం ప్రిన్సిపాల్ అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థిని తాడుతో చెట్టుకు కట్టి వేలాడదీసి కర్రతో చితకబాదాడు. దీంతో నవీన్ ఎడమ చేతి భుజానికి, కాలికి గాయాలయ్యాయి. నవీన్ ఇంటికెళ్లి విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో సోమవారం వారు పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ విఠల్ పాఠశాలకు వెళ్లి వివరాలను సేకరించారు. జరిగిన ఘటనపై క్షమించాలని విద్యార్థి తల్లిదండ్రులను కోరుతూ, మళ్లీ ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా చూసుకుంటానని ప్రిన్సిపాల్ రాత పూర్వకంగా హామీ ఇవ్వడంతో నవీన్ తల్లిదండ్రులు శాంతించారు. మండల విద్యాధికారి గోవింద్‌రెడ్డి పాఠశాలకు వెళ్లి ఈ ఘటనపై ఆరా తీశారు. ఇతర విద్యార్థులను ఈ ఘటన గురించి అడగ్గా.. రోజురోజుకూ ప్రిన్సిపాల్ శిక్షలను తట్టుకోలేకపోతున్నామ ని వెల్లడించారు. దీనిపై నివేదికను డీఈఓకు పంపినట్లు ఆయన తెలిపారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఆ విద్యార్థికి చదువు రావాలని భయపెట్టేందుకే అలా చేశానని చెప్పారు.



గాయాలను చూపుతున్న విద్యార్థి నవీన్

వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో మహిళా వర్సిటీ బిల్లు

సాక్షి, హైదరాబాద్: చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ బిల్లును వచ్చే అసెంబ్లీ సమావేశంలో ఆమోదించే వీలుంది. ఇందుకు సంబంధించిన ఫైల్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. న్యాయపరమైన అంశాలను పరిశీలించాలని ఉన్నత విద్యామండలికి ముఖ్యమంత్రి కార్యాలయం సూచించింది. ఈ అంశంపై నిపుణులతో ఓ కమిటీని ఏర్పాటు చేసినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్ కోఠిలోని మహిళా కాలేజీకి యూనివర్సిటీ హోదా కల్పిస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ప్రభుత్వం దీన్ని చాకలి ఐలమ్మ పేరుతో యూనివర్సిటీగా మార్పు చేసింది. అయితే, ఇప్పటికీ ఈ యూనివర్సిటీకి యూజీసీ గుర్తింపు రాలేదు. చట్టసభలో ఇందుకు సంబంధించిన సవరణల బిల్లును పాస్ చేయలేదు. సభ ఆమోదించిన బిల్లును ప్రభుత్వం యూజీసీకి పంపాల్సి ఉంటుంది. యూజీసీ గుర్తింపు లేని కారణంగా గతంలో మాదిరిగానే ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ పేరుతోనే డిగ్రీలు ఇవ్వాల్సి వస్తోంది. ఉద్యోగులు కూడా ఓయూ పరిధిలోకి వస్తున్నారు. మహిళా వర్సిటీకి అటానమస్ అనేది కేవలం కాగితాలకే పరిమితమైంది. దీనిపై విద్యార్థులు, ఉద్యోగుల నుంచి ఆందోళన రావడంతో ప్రభుత్వం చట్టసభలో బిల్లు ఆమోదించాలని నిర్ణయించింది.

5న 'మహిళా శక్తి బజార్' ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్‌ను ఈనెల 5న పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రారంభించనున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఈ బజార్ ఏర్పాటుకు సంబంధించి 106 దుకాణాలతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసింది.

లంచావతారాలపై ఏసీబీ పంజా

ఒక్క నెలలో 18 కేసులు నమోదు

- 27 మంది ప్రభుత్వ ఉద్యోగులు, ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అరెస్టు
- మూడు కేసుల్లో శిక్షలు ఖరారు
- ఏసీబీ డీజీ కార్యాలయం వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అవినీతి నిరోధకశాఖ ఈ ఏడాది నవంబర్‌లో 17 ట్రాప్ కేసులు, ఒక ఆదాయానికి మించిన ఆస్తుల కేసుతో కలిపి మొత్తం 18 కేసులను నమోదు చేసింది. ఈ కేసులతో సంబంధం ఉన్న 27 మంది ప్రభుత్వ ఉద్యోగులు, ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అరెస్టు చేసి, జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ మేరకు ఏసీబీ డీజీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పంచాయతీరాజ్, విద్యాశాఖ, పోలీస్, మున్సిపల్, టీజీఎస్‌పీడీసీఎల్, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, కమర్షియల్ ట్యాక్స్, సర్వే, ల్యాండ్ రికార్డ్స్, ఇరిగేషన్ శాఖల్లో అవినీతికి పాల్పడుతున్న అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ కేసుల్లో మొత్తం రూ.3,54,000 అవినీతి సొమ్మును స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అలాగే ఇరిగేషన్ విభాగంలోని ఏఈఈ నిఖేశ్‌కుమార్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సోదాలు జరపగా రూ.17,73,53,500 విలువైన ఆస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఎవరైనా లంచం అడిగితే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

మూడు కేసుల్లో శిక్షలు ఖరారు..

➡ లంచం తీసుకుంటూ 2013లో ఏసీబీకి చిక్కిన జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సీనియర్ అసిస్టెంట్ జిలగం వెంకటేశ్వరరావుకు గతనెల 7న ఏడాది జైలు శిక్ష, రూ.20వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ➡ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల సర్కిల్ డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ తొగురి పోచయ్య 2013లో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. ఈ కేసులో గతనెల 12న వెలువడిన తీర్పులో కో ర్టు ఆయనకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధించింది. ➡ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏఈ పి.అశోక్ లంచం తీసుకుంటూ 2012లో ఏసీబీకి చిక్కాడు. కేసు నిరూపణ కావడంతో గతనెల 13న రెండేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
మంగళవారం 3-12-2024

రెడ్ కారిడార్‌కు చెక్ పడినట్టే?

భద్రాద్రి జిల్లా మీదుగా తెలంగాణలోకి మావోలు

అడ్డుకట్ట వేసేలా తెలంగాణ సరిహద్దులో కొత్తగా పోలీసు క్యాంపులు

ఫలితంగా కట్టుదిట్టంగా మారిన నిఘా

తాజా ఎన్‌కౌంటర్‌తో తెగిపోనున్న సంబంధాలు



చర్ల మండలం చింతవాగు దగ్గర కొత్తగా అందుబాటులోకి వచ్చిన వంతెన

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణలో మరోసారి పాగా వేయాలనే మావోయిస్టుల ప్రయత్నాలు ఇప్పట్లో సాకారమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఓ వైపు పోలీసు నిఘా పెరిగిపోగా.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మావోల వ్యూహాలకు అడ్డు కట్టలు వేస్తున్నాయి. పలుచోట్ల పోలీసు క్యాంపుల ఏర్పాటుతో పహారా పెరిగింది. దీనికి తోడు ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లలో మావోలు మృతి చెందడంతో వారు తెలంగాణలో స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలన్న వ్యూహానికి చెక్ పడినట్టు తెలుస్తోంది.

ఆ రెండు జిల్లాల పరిధిలోనే...

బస్తర్ అడవుల్లో మావోయిస్టులు ఏర్పాటు చేసిన జనతన సర్కార్ ప్రభావం క్రమంగా సరిహద్దులో ఉన్న తెలంగాణ జిల్లాలకు విస్తరించింది. మావోయిస్టుల అడ్డాగా బీజాపూర్, సుక్మా జిల్లాతో సరిహద్దు పంచుకుంటున్న ములుగు జిల్లాలోని వెంకటాపురం, భద్రాద్రి జిల్లాలోని చర్ల, దుమ్ముగూడెం మండలాలు మావోలకు సరికొత్త అడ్డాగా మారాయి. తెలంగాణ వచ్చిన తర్వాత దళాల సంచారం, వాల్ పోస్టర్లు, బ్యానర్లు కట్టడం, బాంబులు పేల్చడం తదితర ఘటనలన్నీ ఈ రెండు జిల్లాల పరిధిలోనే జరిగాయి. చర్ల మండలం మావోయిస్టుల ప్రభావంతో ఎరుపెక్కింది. చర్లతో సరిహద్దు పంచుకుంటున్న పామేడు-కంచాల-కొండపల్లి ఏరియాల పరిధిలో గడిచిన పదేళ్లలో అనేకసార్లు మావోయిస్టులు, పోలీసులకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.

ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా..

మావోల కంచుకోటలోకి చొచ్చుకుపోయే లక్ష్యంతో చర్ల కు సమీపంలో ఉన్న పామేడు దగ్గర మావోల అడ్డాకు సరి హద్దుగా ఉన్న చింతవాగు దగ్గర ఏడాది క్రితం కేంద్ర భద్రతా దళాలు క్యాంపు ఏర్పాటు చేశాయి. కానీ ఇక్కడ ఉన్న దట్టమైన అడవు లు, ఉధృతంగా ప్రవహించే వాగుల కారణంగా ప్రభుత్వ భద్రతా దళాలు పామేడును దాటి అడవుల్లోకి చొచ్చుకుపోవడం కష్టమైంది. మరోవైపు ఈ వాగుకు ఆవల ప్రాంతమంతా మావోయిస్టుల్లోనే శక్తివంతంగా భావించే దక్షిణ బస్తర్ జోన్ కమిటీ ఆధీనంలో ఉంది. దీంతో కేంద్ర భద్రతా దళాలకు చెందిన జవాన్ల ఆత్మస్థైర్యం దెబ్బతీసే లక్ష్యంతో అదే పనిగా పామేడు సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై దాడులు జరిపారు. జవాన్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో ఈ దాడులను తిప్పికొట్టగలిగారు. లేదంటే భారీ స్థాయిలో ప్రాణనష్టం జరిగేది.

చుట్టుముట్టేస్తున్నారు..

మావోలకు పట్టున్న ప్రాంతంలోకి చొచ్చుకుపోయేందుకు వీలుగా ఇటీవల పామేడు దగ్గరున్న చింతవాగుపై నిర్మించిన వంతెన అందుబాటులోకి వచ్చింది. ఆ తర్వాత నెల వ్యవధిలోనే పామేడు అవతల ఉన్న ధర్మారం, జీడిపల్లి, కొండపల్లి, తుమ్మలపాడు గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ క్యాంపులు ఏర్పాటయ్యాయి. వారం వ్యవధిలోనే మొబైల్ టవర్లు వచ్చేశాయి. ఈ వేసవి నాటికి పామేడు నుంచి కొండపల్లి మీదుగా పూవర్తి వరకు యుద్ధప్రాతిపదికన రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో పామేడు మీదుగా తెలంగాణలోకి మావోల రాక కష్టం కానుంది. మరోవైపు తెలంగాణ, ఆంధ్రకు సరిహద్దుగా ఉన్న కర్రెగుట్టలే మావోలకు అడ్డాగా మారాయి. ఈ కర్రెగుట్టలను కేంద్రంగా చేసుకొని తరచు వెంకటాపురం, చర్ల మండలాల్లోకి మావోలు వచ్చిపోయేవారు. అయితే కర్రెగుట్టల సమీపంలో ఉన్న పూసుగుప్పతోపాటు చెలిమెల, వద్దిపేట, చెన్నాపురంలో కూడా క్యాంపులు ఏర్పాటయ్యాయి. దీంతో ఈ మార్గం కూడా మూసుకుపోయినట్టుగానే భావిస్తున్నారు.

అడుగంటిన ఆశలు..

తీవ్ర నిర్బంధ పరిస్థితులు ఉన్నా, మళ్లీ తెలంగాణలో పాతుకుపోవాలనే లక్ష్యంతో ఐదు నెలల కిందట మావోయిస్టు దళాలు రాష్ట్రంలోకి వచ్చాయి. గోదావరి తీరం వెంబడి జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెంతో పాటు ఏపీలోని అల్లూరి జిల్లాలో పార్టీని బలోపేతం చేసే యత్నాలు జరిగాయి. అయితే ప్రస్తుతం ఇటు తెలంగాణ, అటు ఏపీలో మావోలకు మద్దతుగా నిలిచే ప్రజలు, సానుభూతిపరుల సంఖ్య తగ్గిపోయింది. దీంతో క్షేత్రస్థాయిలో విస్తరణకు అనుకూల పరిస్థితి లేకుండా పోయింది. మరోవైపు తెలంగాణ అటవీ గ్రామీణ ప్రాంతాల్లో రవాణా మార్గాలు మెరుగుకావడంతో మావోల కదలికలను మరింత కష్టంగా మార్చింది. చివరకు ఐదు నెలల వ్యవధిలో జరిగిన మూడు ఎన్‌కౌంటర్లలో 14 మంది మావోలు మృత్యువాత పడ్డారు. దీంతో రెడ్ కారిడార్‌లో భాగంగా మరోసారి తెలంగాణకు రావాలనే మావోల ఆశలు అడుగంటినట్టే అనే అభిప్రాయం కలుగుతోంది.



చింతవాగు దగ్గర వంతెనపై ఆదివాసీలు, స్థానికుల రాకపోకలు

ప్రక్షాళన.. సంస్కరణల జోరు..

వార్షిక పురోగతి నివేదికను విడుదల చేసిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్




సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత టీజీపీఎస్సీ ప్రక్షాళనపైనే దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా యూపీఎస్సీ లాంటి సంస్థను అనుసరిస్తూ పలు సంస్కరణలు తీసుకొచ్చారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగానే.. చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత పెండింగ్‌లో ఉన్న నోటిఫికేషన్లకు సంబంధించి పరీక్షల నిర్వహణ, ఆ తర్వాత వేగంగా ఫలితాల ప్రకటన, కీ విడుదల, తుది జాబితాలను చకచకా పూర్తి చేసింది. పోటీ పరీక్షల నిర్వహణలో మరింత పారదర్శకత, విద్యావేత్తల సహకారానికి యూనివర్సిటీలు, అకడమిక్ సంస్థలతో టీజీపీఎస్సీ ఒప్పందాలు చేసుకుంది. సంప్రదాయ ఓఎంఆర్ పద్ధతిలో కాకుండా కంప్యూటర్ ఆధారిత పోటీ పరీక్షలు (సీబీఆర్‌టీ) నిర్వహించేందుకు కమిషన్ టీసీఎస్‌తో అవగాహన కుదుర్చుకుంది. దీంతో దాదాపు అన్ని పరీక్షలు సీబీఆర్‌టీ పద్ధతిలోనే నిర్వహించింది. మరింత పారదర్శకంగా..అవకతవకలకు తావులేకుండా 2024 జనవరి నుంచి టీజీపీఎస్సీ నిర్వహిస్తున్న పరీక్షలకు అభ్యర్థుల బయోమెట్రిక్‌ను 100 శాతం తీసుకుంటోంది. పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల సీసీ పుటేజీని టీజీపీఎస్సీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా సమీక్షించేలా కమిషన్ సాంకేతిక ఏర్పాట్లు చేసింది. పరీక్ష కేంద్రాల గుర్తింపు, ప్రశ్నపత్రాల తరలింపు, విద్య ధ్రువపత్రాల పరిశీలనకు ఉన్నత విద్యామండలి, ఎస్‌సీఈఆర్‌టీ, పోలీసు, సాంకేతిక విద్యావిభాగం, వివిధ వర్సిటీలు, సంక్షేమ విభాగాలు, విద్యాశాఖ, ఐటీశాఖల సహకారం తీసుకుంటోంది. రాష్ట్రంలో తొలిసారిగా సమగ్ర జాబ్ కేలండర్ టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో వెలువడింది. ఉద్యోగ పోటీపరీక్షల్లో న్యాయ వివాదాలను వేగంగా పరిష్కరించేందుకు కమిషన్ ఫుల్‌టైం లా ఆఫీసర్‌తోపాటు నలుగురు లీగల్ కన్సల్టెంట్లను నియమించింది. ఐటీ వ్యవస్థను మరింత పటిష్టం చేసింది. ఐటీసెల్‌లో చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారి, చీఫ్ ఐటీ సెక్యూరిటీ అధికారిని నియమించింది. ఐటీ పరిజ్ఞానం కలిగిన ప్రభుత్వ అధికారులను గుర్తించి, కొత్తగా ఏర్పాటు చేసిన ఐటీ సెల్‌లో నియమించింది. మానవ తప్పిదాలు జరగకుండా ఫలితాల వెల్లడిలో ఆటోమేషన్ ప్రాసెసింగ్ ప్రవేశపెట్టింది.

గ్రూప్ కొలువుల ఫలితాలపై కసరత్తు

ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రూప్–1 నోటిఫికేషన్ జారీ చేసిన కమిషన్..ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. అతి త్వరలో తుది ఫలితాలను ప్రకటించేందుకు సిద్ధంగా ఉంది. గ్రూప్–3 పరీక్షలు సైతం పూర్తయ్యాయి. త్వరలో గ్రూప్–2 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వీలైనంత వేగంగా వీటిని పూర్తి చేయాలని కమిషన్ భావిస్తోంది. టీజీపీఎస్సీ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి పదవీకాలం ముగిసింది. ఇందులో భాగంగా సోమవారం ఆయనకు కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కొత్త చైర్మన్‌గా బుర్రా వెంకటేశం ఒకట్రెండు రోజుల్లో పదవీ బాధ్యతలు తీసుకోనున్నట్టు సమాచారం.

పోస్టు కేటగిరీ	ప్రకటించినవి	భర్తీ చేసినవి
హార్టికల్చర్ ఆఫీసర్	22	19
డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు	18	18
అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (వ్యవసాయం)	100	95
అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (మెకానికల్)	97	96
అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఎలక్ట్రికల్)	163	163
అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (సివిల్)	1,180	1,154
భూగర్భ జలశాఖలో గెజిటెడ్ పోస్టులు	32	30
అకౌంట్స్ ఆఫీసర్ తదితరాలు (ఎంఏయూడీ)	78	76
అగ్రికల్చర్ ఆఫీసర్	148	145
ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2	325	282
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్	616	596
వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్	185	171
లైబ్రేరియన్	71	64
అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్	113	113
గ్రూప్–4	8,180	8,143
ఫిజియోథెరపిస్ట్	52	48
జూనియర్ లెక్చరర్	1,392	882
పాలిటెక్నిక్ లెక్చరర్	247	206
ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్	24	24
భూగర్భ జలశాఖలో నాన్–గెజిటెడ్ పోస్టులు	25	25
డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్	53	53
మొత్తం	13,121	12,403

నోట్: జూనియర్, పాలిటెక్నిక్ లెక్చరర్లకు సంబంధించిన మరికొన్ని పోస్టుల ఎంపికలు పురోగతిలో ఉన్నాయి.





ఉత్సవ కాంతులు

ఏడాది ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నగరవ్యాప్తంగా చారిత్రక కట్టడాలు, ప్రముఖ పర్యాటక స్థలాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించిన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి బీఆర్‌కే భవన్, అమరవీరుల స్తూపం, ట్యాంక్‌బండ్ రోడ్డు పరిసర ప్రాంతాలు విద్యుత్ కాంతుల్లో మెరుస్తున్న దృశ్యం

మూడు వారాల్లో నియమిస్తాం

వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడిపై హైకోర్టుకు సర్కార్ హామీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడిని మూడు వారాల్లో నియమిస్తామని హైకోర్టుకు రాష్ట్రప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు సమయం ఇచ్చిన న్యాయస్థానం తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం .. కమిషన్ అధ్యక్షుడిని వెంటనే నియమించేలా ఆదేశాలు జారీ చేయాలని న్యాయవాది, వినియోగదారుల రక్షణ చట్టం పుస్తక సహరచయిత బాగ్లేకర్ ఆకాశ్ కుమార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. న్యాయవాది ఆకాశ్ వాదనలు వినిపిస్తూ.. 2023, ఫిబ్రవరి 4న మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్కే జైస్వాల్ కమిషన్ అధ్యక్షుడిగా పదవీ విరమణ పొందారని, అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉందని చెప్పారు. పదవీ విరమణకు ముందు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల కోసం 2022లో నోటిఫికేషన్ జారీ చేసినా.. ఇప్పటికీ ఎవరినీ నియమించలేదని తెలిపారు. వస్తు కొనుగోలు, సేవలకు సంబంధించి రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు ఈ కమిషన్ విచారణ చేపడుతుందన్నారు. అలాగే జిల్లా కమిషన్లు ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీళ్లను కూడా విచారణకు స్వీకరిస్తుందని వెల్లడించారు. పరీక్ష విధానం లేకుండా వినియోగదారుల కమిషన్ పోస్టులు నియమించవద్దని గత నెల 11న సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని స్పెషల్ జీపీ పాట్టిగారి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇప్పటికే సర్క్యులర్ జారీ చేశామని, మూడు వారాల్లో రాష్ట్ర కమిషన్ అధ్యక్షుడి నియామకం చేపడతామని వెల్లడించారు.



గ్లోబల్ సౌత్ అలియన్స్ సమావేశం నిమిత్తం రాజ్యసభ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి గత నెల 27-30 వరకూ ఇండోనేసియాలోని జకార్తాలో పర్యటించారు. ఈ ప్రాంతంలోని దేశాల మధ్య వ్యూహాత్మక సహకారం, క్లైమేట్ చేంజ్‌పై ఉమ్మడి కార్యాచరణ, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో పరస్పర అవగాహన తదితర అంశాలు లక్ష్యాలుగా ఈ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రసంగించిన సురేశ్‌రెడ్డి.. క్లైమేట్ చేంజ్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో గ్లోబల్ సౌత్ అన్నది బలమైన కూటమిగా నిలుస్తుందని పేర్కొన్నట్లు ఎంపీ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు.

తెలంగాణలో ఎన్‌కౌంటర్లను ఆపాలి

అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్‌కౌంటర్లను ఆపాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో ఎన్‌కౌంటర్లు పెరిగిపోయాయని సోమవారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. సాయుధులైన వ్యక్తులను సజీవంగా పట్టుకునే అవకాశాలు ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగానే చంపి.. ఎన్‌కౌంటర్ కథలు అల్లుతున్నారని విమర్శించారు. నక్సలైట్లతోనే సమాజంలో మార్పు వస్తుందని పలుమార్లు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో ఎన్‌కౌంటర్లు ఎలా జరుగుతున్నాయో చెప్పాలని ప్రశ్నించారు.

ధాన్యం కొనుగోళ్లలో నిజామాబాద్ టాప్

- అత్యధికంగా 4,60,867 మెట్రిక్ టన్నుల కొనుగోలు
- రెండు, మూడు స్థానాల్లో కామారెడ్డి, జగిత్యాల

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో వేగం పుంజుకుంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడంతో రైతులు ఈసారి అత్యధికంగా సన్న ధాన్యం పండించారు. దీంతో ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), ఫార్మర్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్, మహిళ సంఘాల ఆధ్వర్యంలో గతేడాది కంటే ఈసారి కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచి మరీ కొనుగోళ్లు ప్రారంభించింది.

దిగుబడి పెరుగుతుందని అంచనా వేసి.....

గత ఏడాది 65.94 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈసారి 66.77 లక్షల ఎకరాల్లో 40 లక్షల మంది రైతులు వరి సాగు చేశారు. దీంతో దిగుబడి కూడా అదే స్థాయిలో పెరుగుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. గత ఏడాది 1.46 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ఈసారి 1.53 కోట్ల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ లెక్కలు వేసింది. దానికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను పెంచింది. గత ఏడాది 5,543 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయగా, ఈసారి 8,230 కేంద్రాలను ప్రారంభించింది.

33.15 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 12 జిల్లాల్లో అత్యధికంగా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందులో నిజామాబాద్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. అక్కడ అత్యధికంగా 4,68,874 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఆ తర్వాత కామారెడ్డి జిల్లాలో 4,04,568 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేయగా, జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 2,24,674 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. మరో 9 జిల్లాల్లోనూ ఒక్కో జిల్లాలో ఇప్పటివరకు లక్ష మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం వరకు కొనుగోలు కేంద్రాల ద్వారా 33,15,426 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది.

వేగంగా చెల్లింపులు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు వేగంగా డబ్బులు చెల్లించేలా సర్కారు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం విలువ రూ.7,691.43 కోట్లు కాగా, అందులో రూ. 6,347.40 కోట్లు చెల్లించింది. మరో రూ.1,344.02 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్టు లెక్కలు వేసింది.



అత్యధిక ధాన్యం కొనుగోలు చేసిన జిల్లాలివే..

జిల్లా	కొనుగోలు చేసిన ధాన్యం(టన్నుల్లో)	ధాన్యం విలువ (రూ. కోట్లలో)
నిజామాబాద్	4,68,874	1087.76
కామారెడ్డి	4,04,568	938.58
జగిత్యాల	2,24,674	521.24
మెదక్	2,16,031	501.19
కరీంనగర్	2,07,414	481.27
యాదాద్రి భువనగిరి	1,98,721	461.03
నల్లగొండ	1,90,916	442.92
సిద్ధిపేట	1,93,338	448.54
రాజన్నసిరిసిల్ల	1,84,326	427.64
పెద్దపల్లి	1,76,919	410.42
సంగారెడ్డి	1,43,046	331.87
సూర్యాపేట	1,27,870	296.66

జనవరి 10వ తేదీ వరకు కొనుగోళ్లు



రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకూ కొంటాం. జనవరి 10వ తేదీ వరకు కేంద్రాల్లో కొనుగోళ్లు చేపడతాం. రైతులు తొందరపడి బయట అమ్ముకొని నష్టపోవద్దు. చెల్లింపుల్లోనూ జాప్యం లేకుండా ఆదేశాలు జారీ చేశాం.

– ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి

క్లుప్తంగా...

వచ్చే ఏడాది 53 మంది వైద్యుల పదవీ విరమణ



సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో పనిచేస్తున్న 53 మంది అడిషనల్ డీఎంఈ, ప్రొఫెసర్లు వచ్చే ఏడాదిలో రిటైర్ కానున్నారు. 2025లో రిటైర్ అయ్యే వైద్యుల వివరాలను సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు నోటిఫై చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

పంచాయతీ వీధి దీపాలపై అధికారుల కమిటీ

సాక్షి, అమరావతి: గ్రామ పంచాయతీలో ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణలో ప్రస్తుతం ఉన్న ఇబ్బందులు అధిగమిస్తూ ఎలా ముందుకెళ్లాలన్న దానిపై కార్యాచరణ నివేదిక (రోడ్ మ్యాప్) తయారు చేసేందుకు ప్రభుత్వం ముగ్గురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ఏపీ జెన్కో జేఎండీ చెకూరికీర్తి కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించి గతంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఈఈఎస్ఎల్, ఏపీ ఎస్ఈఈడీసీవోలతో చేసుకున్న ఒప్పందం మేరకు ఈఈఎస్ఎల్ అనేక ఆర్థిక అంశాలపై ప్రభుత్వానికి అందజేసిన నివేదికపై అధ్యయనం చేయడంతో పాటు గ్రామ పంచాయతీలలో ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణకు తగిన నిధులు అందుబాటులో ఉండేలా ప్రాజెక్ట్ పునరుద్ధరణ కోసం రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయాల్సి ఉంది. అలాగే వీధి దీపాల పర్యవేక్షణకు ప్రత్యేక డ్యాష్ బోర్డు ఏర్పాటు, రోజు వారీ వీధి దీపాల నిర్వహణలో ఆటోమేటిక్ ఆన్-ఆఫ్‌లకు సీసీఎంఎస్ బాక్స్‌ల స్థానంలో టైమర్ల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సి ఉంది. పది రోజుల్లో కమిటీ నివేదిక అందజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వయోజన విద్యలో డీపీసీ పునరుద్ధరణ

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యలో అంతర్భాగమైన వయోజన విద్యాశాఖలో డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ)ని పునరుద్ధరించారు. ఈ మేరకు పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వయోజన విద్య డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గానూ, వయోజన/ పాఠశాల విద్యలో సర్వీస్ అంశాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, అడిషనల్ సెక్రటరీలను మిగతా మెంబర్లుగానూ నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కమిటీ వయోజన విద్యలోని లెవెల్ 1, 2 స్థాయి గెజిటెడ్ పోస్టుల పదోన్నతులకు షెడ్యూల్ సిద్ధం చేయనుంది. కమిటీ రెండేళ్ల పాటు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డ్రోన్ స్టార్టప్‌లకు రూ.5 లక్షల వరకు ప్రోత్సాహకాలు

ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ సీఎండీ దినేష్ కుమార్



సాక్షి, అమరావతి: డ్రోన్ రంగంలో స్టార్టప్‌లు పెట్టడానికి ముందుకువచ్చే యువతకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ప్రోత్సాహకాలు ఇస్తుందని, ఈ అవకాశాన్ని యువత అందిపుచ్చుకోవాలని ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ సీఎండీ కె.దినేష్‌కుమార్ చెప్పారు. సోమవారం విజయవాడలోని ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో డ్రోన్ రంగం ఒక కీలక రంగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మన దేశానికి ఆంధ్రప్రదేశ్‌ను డ్రోన్ క్యాపిటల్‌గా అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించారని, ఆ దిశగా ఇప్పటికే డ్రోన్ రంగంలో ఏపీ ముందుకు వెళుతోందన్నారు. డ్రోన్స్ తయారీ రంగంలో పరిశ్రమలు పెట్టడానికి ముందుకొచ్చే వారికి 20 శాతం మేర రాయితీ ఇస్తున్నామని తెలిపారు. ఓర్వకల్లు వద్ద 300 ఎకరాల విస్తీర్ణంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సాంకేతిక విద్యాసంస్థలు కూడా డ్రోన్ రంగంలో వస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిణామాల గురించి వివరించాలని కోరారు. ఈ దిశగా విద్యార్థులకు డ్రోన్లపైన తర్ఫీదు ఇవ్వడానికి ముందుకొచ్చే విద్యాసంస్థలకు కావాల్సిన సహకారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

బకాయిలపై స్పందించాలి: ఏపీటీఎఫ్

సాక్షి, అమరావతి: టీచర్లు, ఉద్యోగులు దాచుకున్న పెండింగ్ బకాయిలపై కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు జి.హృదయరాజు, కార్యదర్శి చిరంజీవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆరు నెలలుగా దరఖాస్తులను పరిష్కరించలేదని, తాము దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుసుం దాదాపు రూ.2 వేల కోట్లు ఉన్నాయని, వాటిని నుంచి వచ్చిన దరఖాస్తులకు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయితీరాజ్‌లో వేలాది కారుణ్య నియామకాలు పెండింగ్‌లో ఉన్నాయని, సరెండర్ లీవ్, ఎన్‌క్యాష్‌మెంట్, పీఆర్సీ, డీఏలపై ఈ కేబినెట్‌లోనైనా చర్చించి పరిష్కారం చూపాలన్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఇచ్చిన 100 రోజుల ప్రణాళికను సంక్రాంతి, ఆదివారాలు, సెలవు దినాల్లో మినహాయింపు ఇవ్వాలని సూచించారు.

ఘన చరితకు సాక్ష్యం
గండికోట




గండికోటలోని పెన్నా

తెలుగువారి శౌర్యప్రతాపాలకు నిలువెత్తు సాక్ష్యం. విజయనగర సామ్రాజ్యానికి వెన్నెముకగా నిలిచి, దండయాత్రకు వచ్చిన శత్రువులను చీల్చిచెండాడి విజయభేరి మోగించిన శత్రుదుర్భేద్యమైన దుర్గం. చుట్టూ ఎత్తయిన ఎర్రని కొండలు, మధ్యలో నిలువులోతున హొయలు పోతూ వడివడిగా ప్రవహించే పెన్నమ్మ, నలుచెరగులా పచ్చదనాన్ని కప్పుకున్న ప్రకృతికాంత అందాలు. కొండపైన నిలువెత్తు బురుజులతో అబ్బురపరచే గండికోటను చరిత్రకారులు అమెరికాలోని గ్రాండ్‌క్యానియన్‌తో పోలుస్తారు. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన గండికోట అందాలు పర్యాటకుల్ని అలరిస్తున్నాయి.

- తెలుగువారి శౌర్యప్రతాపాలకు మచ్చుతునక
- క్రీస్తు శకం 1123లో గండికోటను నిర్మించిన కాకరాజు
- రెండు కొండలను 5 కిలోమీటర్ల మేర గండికొట్టి ప్రవహిస్తున్న పెన్నా
- ప్రపంచంలోని 40 ప్రసిద్ధ భౌగోళిక విశేషాల్లో ఒకటిగా పేరు

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోట గిరి, జల, వన దుర్గంగా పేరుపొందింది. ఈ కోటను శత్రుదుర్భేద్యమైనదిగా చెబుతారు. పెన్నానది ఇక్కడ రెండు కొండలను ఐదు కిలోమీటర్ల పొడవునా గండికొట్టి వెళ్తుంది కనుక ఆ ప్రాంతంలో కట్టిన ఈ కోటకు గండికోటగా పేరొచ్చింది. 11వ శతాబ్దం నుంచి దాదాపు 800 సంవత్సరాలపాటు ఈ కోట పలు వంశాల రాజుల పాలనలో ఉంది. కై ఫీయత్ ప్రకారం 1123లో కాకరాజు ఈ కోటను నిర్మించాడు. ఈ ప్రాంతాన్ని అంతకుముందు రేనాడుగా వ్యవహరించే వారు. చాళుక్య ప్రభువు త్రైలోక మల్లుడి ప్రతినిధిగా ములికినాడు సీమ పాలకుడు కాకరాజుకు ఈ కోటతో విశేషమైన గుర్తింపు లభించింది. కల్యాణి చాళుక్యుల ఆధీనం నుంచి ఆ తర్వాత ఈ కోట కాకతీయుల పరమైంది.

- కాకతీయ ప్రభువు గణపతిదేవ చక్రవర్తి కాయస్థ వంశీకుడు గంగయ సాహిణిని ఈ కోట పాలకుడిగా నియమించారు. అనంతరం జమ్మిగ దేవుడు, త్రిపురారి దేవుడు, అంబదేవుడు, రెండవ త్రిపురారి దేవుడు కాకతీయుల ప్రతినిధిగా కోటను పాలించారు. మొత్తంపై వంద సంవత్సరాలకు పైబడి 1304 దాక ఈ కోట కాయస్థ వంశీకుల ఆధీనంలో ఉంది.
- కాయస్థ వంశీకుల తర్వాత ఈ కోట సుల్తానుల పరమైంది. కిల్జీ వంశీయులు దీన్ని పాలించారు. తర్వాత మూడు శతాబ్దాలపాటు శ్రీకృష్ణ దేవరాయలు, అచ్యుతరాయులు, సదాశివ రాయల ప్రతినిధులు గండికోటను పాలించారు. తర్వాత కొద్దికాలం మహమ్మద్ కులీకుతుబ్‌షా ఆజ్ఞ మేరకు మీర్‌జుమ్లా ఈ కోటను పాలించాడు.
- 1687లో ఔరంగజేబు గోల్కొండను జయించాక ఈ కోట మొఘలుల పరమైంది. 1717 నుంచి 1779 వరకు మొగల్ సుబేదారులు, కొన్నాళ్లు కడప నవాబులు ఈ కోటను పాలించారు. 1799 వరకు గండికోట మైసూర్ సుల్తానుల పాలనలో ఉంది. హైదరాబాదు నిజాం పాలనా కాలంలో ఆంగ్లేయులు బలపడుతున్న సమయంలో నిజాం నవాబు గండికోటతోసహా బళ్లారి, అనంతపురం, కర్నూలు, కడపజిల్లాలను ఆంగ్లేయులకు దారాదత్తం చేశారు. వీటిని దత్త మండలాలు అనే వారు.



గండికోటలో సాహస క్రీడల్లో యువత



కోటలోని మాధవరాయస్వామి ఆలయం



కోటలోని ప్రధాన ఆకర్షణ జుమ్మా మసీదు

కోటలో చూడదగ్గ ప్రాంతాలు


- కోటలో చూడదగ్గ ప్రాంతాలు చాలానే ఉన్నాయి. కోటలో అడుగు పెట్టగానే మూడంతస్తుల కావలి మండపం కనిపిస్తుంది. ఈ మండపం పై అంతస్తులో సైనికులు కాపలాకాస్తూ బయటి నుంచి వచ్చే శత్రువులను గమనించేవారు.
- గండికోటలో మరో ఆకర్షణీయ కట్టడం జామియా మసీదు. మూడు ప్రవేశ ద్వారాలతో ఇస్లామిక్ భారతీయ శిల్పకళా నైపుణ్యాల మేళవింపుతో నిర్మించిన ఈ మసీదులో ఒకేసారి 300 మంది ప్రార్థనలు చేసుకునే అవకాశం ఉంది. మసీదు ఎదుట వజూ ఖానా కూడా ఉంది. కోట ఎదుటగల ఎర్ర కోనేరు నుంచి దీనికి భూగర్భ గొట్టాల ద్వారా నీరు వచ్చేదని చరిత్రలో పేర్కొన్నారు. మసీదు లోపల 64, వెలుపల 32 గదులు ఉన్నాయి. బయట గుర్రాలను కట్టేసేవారని, లోపల యాత్రికులు విశ్రాంతి తీసుకునే వారని తెలుస్తోంది.
- కోటలో జామియా మసీదు ప్రక్కనే ఎత్తయిన ధాన్యాగారం కనిపిస్తుంది. కరువు కాటకాలు, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ఇందులో ధాన్యాన్ని నిల్వ చేసే వారని సమాచారం. దీనిలో పైకి వచ్చేందుకు మెట్ల సౌకర్యం కూడా ఉంది.
- జామియా మసీదు ఎదుట విశాలమైన కోనేరు ఉంది. దీన్ని ఎర్ర కోనేరు అని, కత్తుల కోనేరు అని కూడా పిలుస్తారు. సైనికులు యుద్ధం అనంతరం కత్తులను ఇందులో కడిగేవారని, అందుకే నీరు ఎర్రబారిందని ప్రచారంలో ఉంది.
- దాన్యాగారం పక్కనే శిథిలస్థితిలో ఉన్న శ్రీ రఘునాథస్వామి ఆలయం ఉంది. అద్భుతమైన శిల్పకళకు ఆలవాలంగా నిలిచి ఉన్న ఈ ఆలయంలో ప్రాకారాలపై రేఖా చిత్రాలు అందరినీ ఆకర్షిస్తాయి. ఈ ఆలయానికి కొద్దిదూరంలోనే పెన్నా లోయ ప్రవాహం ఉంటుంది.

గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియా

గండికోటలోని పెన్నా ప్రవాహంగల లోయకు గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియా అని పేరు. ప్రపంచంలోని 40 ప్రసిద్ధ భౌగోళిక విశేషాల్లో గండికోట ఒకటిగా పేరు గాంచింది. పెన్నా నది ఎర్రమల కొండను రెండుగా చీల్చుతూ కోట వెనుక వైపు నుంచి తూర్పు దిశగా వెళ్లి మైలవరం డ్యాంలో కలుస్తుంది. రెండు కొండల మధ్య దాదాపు 300 మీటర్లకు పైగా వెడల్పు ఉంది. అందులో నీరు పారుతూ ఉన్న దృశ్యాన్ని పైనుంచి చూడడం గొప్ప అనుభూతి ఇస్తుంది. సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతంగా చారిత్రకంగా దేశంలోనే రెండవ స్థానాన్ని ఆక్రమించిన పెన్నాలోయ అందం చూసి తీరాల్సిందే. ఇక్కడి చారిత్రక నిర్మాణాలు, సహజ సిద్ధమైన అందాల కారణంగా పలు సినిమాల చిత్రీకరణలు జరుగుతున్నాయి. గండికోట లోయ సాహస కృత్యాలకు అనువుగా ఉండటంతో 2000 సంవత్సరంలో ఇక్కడ అడ్వెంచర్స్ స్పోర్ట్స్ క్లబ్‌ను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్–2లో భాగంగా గండికోట అభివృద్ధికి రూ.78 కోట్లు కేటాయించింది.

కోట విశిష్టత...

పెన్నానది ఐదు కిలోమీటర్లు కొండను గండికొట్టి ప్రవహిస్తుండడంతో దీని గట్టుపై కట్టిన కోటను గండికోట అని వ్యవహరిస్తున్నారు. కోట చుట్టూ మూడు రాతి ప్రాకారాలు ఉన్నాయి. కోట గోడలను ఒక్కొక్కటి టన్ను బరువు ఉండే ఎర్రటి శానపురాళ్లతో నిర్మించారు. పునాదులు లేకుండా కేవలం కొండ బండలపై కోటను నిర్మించడం కష్టం. కోట తూర్పు నుంచి పడమరకు 1200 మీటర్ల పొడవు, వెడల్పు 800 మీటర్లుగా ఉంది. కోట చుట్టూ 101 బరుజులు ఉన్నాయి. కోట తూర్పు ప్రధాన ప్రవేశ ద్వారం 20 అడుగుల ఎత్తు ఉంది. ద్వారం తలుపులకు సూది మొన గల ఇనుప గుబ్బలు బిగించారు. వీటిని మూసి తెరిచేందుకు ఏనుగులను ఉపయోగించే వారని తెలుస్తోంది. కోట చుట్టూ సైనికులు గస్తీ తిరిగేందుకు ఐదు మీటర్ల వెడల్పుగల బాటను నిర్మించారు. శత్రువుల రాకను గమనించేందుకు, కోట గోడలపైనుంచి ఫిరంగులు ఉపయోగించేందుకు ప్రత్యేకంగా రంధ్రాలు ఉన్నాయి. పలుచోట్ల భారీ కొండరాళ్లే కోట గోడలుగా కనిపిస్తాయి. ఇంకొన్ని చోట్ల భారీ బండలపైనే కోట గోడల నిర్మాణం సాగింది.



గండికోట విహంగ దృశ్యం

తూర్పు నావికాదళంలో రఫేల్-ఎం జెట్స్

- ఐఎన్ఎస్ దేగా మరింత విస్తరణ
- విశాఖలో జనవరి 4న నేవీ విన్యాసాలు
- త్వరలోనే ఐఎన్ఎస్ విక్రాంత్ సేవలు
- యుద్ధనౌకల్లో 200 మంది మహిళా అధికారులు
- తూర్పు నావికాదళాధిపతి రాజేష్ పెందార్కర్



మీడియాతో మాట్లాడుతున్న తూర్పు నావికాదళాధిపతి రాజేష్ పెందార్కర్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: తూర్పు నావికాదళ అమ్ముల పొదిలో రఫేల్-ఎం జెట్స్ చేరనున్నట్టు తూర్పు నావికాదళాధిపతి రాజేష్ పెందార్కర్ తెలిపారు. రఫేల్-ఎం జెట్స్ కార్యకలాపాలకు అనుగుణంగా ఐఎన్ఎస్ దేగాను మరింతగా విస్తరిస్తామన్నారు. బుధవారం నేవీ డే సందర్భంగా.. సోమవారం తూర్పు నావికాదళంలోని ఆఫీసర్స్ మెస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 4న నేవీ డే సందర్భంగా ఏటా విశాఖలో నిర్వహించే విన్యాసాలను ఈసారి ఒడిశాలోని పూరిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో విశాఖలో ప్రత్యేకంగా జనవరి 4న విన్యాసాలు నిర్వహిస్తామని, సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఐఎన్ఎస్ విక్రాంత్‌ను తూర్పు నావికాదళానికి కేటాయించారని చెప్పారు. విశాఖలో బెర్తింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందుకోసం విశాఖ పోర్టు ట్రస్ట్‌తో చర్చిస్తున్నామని తెలిపారు. రెండు ఎంక్యూ-9 డ్రోన్లను ఇప్పటికే వినియోగిస్తున్నామని, మరిన్నింటి కోసం ఆర్డర్ చేశామని, 2029 నాటికి వచ్చే అవకాశం ఉందని చెప్పారు.

మరింతగా మహిళల భాగస్వామ్యం

2022లో యుద్ధనౌకల్లో మహిళల భాగస్వామ్యం ప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం నావికాదళంలో 200 మంది మహిళలు యుద్ధనౌకల్లో విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. వీరి భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు అనుగుణంగా యుద్ధనౌక నిర్మాణాల్లో కూడా మహిళల అవసరాలకు అనుగుణంగా మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తూర్పు నావికాదళ పరిధిలో రూ.1,200 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దేశ రక్షణ రంగంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈల) భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నావికాదళంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని ప్రారంభించామన్నారు. ప్రస్తుతం కార్యాలయ పనులకే పరిమితమైన ఏఐ వినియోగాన్ని రానున్న రోజుల్లో విస్తరిస్తామని చెప్పారు. ఈ నెల 15వ తేదీన వైజాగ్‌లో నేవీ మారథాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేవలం రక్షణ రంగంలోనే కాకుండా ఆపద సమయాల్లో కూడా నేవీ తనవంతు సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. తుపాన్ల సమయాల్లో వివిధ రాష్ట్రాల్లో నేవీ సేవలందించిన విషయాన్ని గుర్తుచేశారు. నావికాదళంలో నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు దేశాల మధ్య పరస్పర సహకారం కోసం వివిధ దేశాలతో కలిసి విన్యాసాలు నిర్వహించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో విశాఖపట్నంలోని యుద్ధనౌకల నుంచి ఎంహెచ్60-ఆర్ హెలికాప్టర్లు కార్యకలాపాలు నిర్వహించనున్నాయని, తద్వారా మరింత పకడ్బందీగా సముద్రగర్భంలో గస్తీ నిర్వహించే అవకాశం ఏర్పడనుందని ఆయన తెలిపారు.

చంద్రానికి ఇక పూర్తి సెలవు!

- ముగిసిన ఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ సెలవు గడువు
- అదే పదవిలో కొనసాగడానికి ఫలించని ప్రయత్నాలు
- ఇంటర్నల్ ఆడిట్ సీజీఎం హరిబాబుకు బాధ్యతలు



సాక్షి ఎఫెక్ట్..

అమరావతి: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఈపీడీసీఎల్)లో ఫైనాన్స్ డైరెక్టర్‌గా కొనసాగేందుకు దండగల చంద్రం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఫైనాన్స్ డైరెక్టర్‌గా 2020 నవంబర్‌లో చేరిన ఆయన రెండేళ్ల పదవీకాలం ముగియడంతో 2022 సెప్టెంబర్‌లో పొడిగించారు. అది కూడా గత నెల 15తో ముగిసింది. అయితే.. వ్యక్తిగత కారణాల రీత్యా ఆయన కోరిన మేరకు గత నెల 14 నుంచి 30వ తేదీ వరకూ 17 రోజులపాటు ఇంధన శాఖ సెలవు మంజూరు చేసింది. ఆ సెలవు గడువు శనివారంతో ముగిసింది. అలాగే డిసెంబర్ 1న పబ్లిక్ హాలిడేని వినియోగించుకోవడానికి ఇచ్చిన అవకాశం కూడా ఆదివారంతో పూర్తయ్యింది. అదే పదవిలో కొనసాగడం కోసం అన్ని ప్రయత్నాలు, రాజకీయ పైరవీలు చేసుకోవడం కోసమే ఆయనకు ఇన్ని రోజుల పాటు అవకాశాలు కల్పించారు. వాటన్నిటినీ 'సాక్షి' ఆధారాలు సహా వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. చివరికి అవేవీ ఇప్పటివరకూ ఫలించలేదు. 'సాక్షి' కథనాల నేపథ్యంలో ఉన్నతాధికారులు, ప్రతినిధులు ఆలోచనలో పడ్డారు. ఇంకా ఆయనను కొనసాగిస్తే విమర్శలు ఎదుర్కొవాల్సి వస్తుందని భావించి ముందుగా అనుకున్న నిర్ణయాన్ని అమలు చేయడానికి సంశయిస్తున్నారు. చంద్రం సెలవులో ఉన్నప్పుడు ఆయన బాధ్యతలు ఫైనాన్స్ విభాగం చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్వీ రమణకు అప్పగించారు. ఆయన గత నెల 30న ఉద్యోగ విరమణ చేశారు. మరోవైపు చంద్రంకు ఇచ్చిన 17 రోజుల సెలవు కూడా అయిపోయింది. సెలవును పొడిగిస్తూ ఇంధన శాఖ ఆదేశాలు జారీ చేయలేదు. అలాగే డైరెక్టర్ పోస్టులో చంద్రం కొనసాగేందుకు కూడా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. దీంతో ఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా ఇంటర్నల్ ఆడిట్ సీజీఎం ఎస్.హరిబాబు (పూర్తి అదనపు బాధ్యతలతో)ను నియమిస్తూ సీఎండీ ఐ.పృథ్వీతేజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరో వైపు చంద్రం మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలా విజయవాడలోనే మకాం వేసి పైరవీలు కొనసాగిస్తున్నట్టు సమాచారం.

రైలు ఢీకొని పాలిటెక్నిక్ విద్యార్థి మృతి

- హాస్టల్‌లో మరుగుదొడ్లకు నీటిసౌకర్యం లేక..
- బహిర్భూమికి రైలుపట్టాల పక్కకు వెళ్లడంతో ప్రమాదం
- నంద్యాలలో దారుణం





కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు (ఇన్‌సెట్‌లో) సతీష్ (ఫైల్)

నంద్యాల: సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం ఒక విద్యార్థిని బలితీసుకుంది. హాస్టళ్లలో వసతుల కల్పనను సర్కారు పట్టించుకోకపోవడం ఆ విద్యార్థి ఉసురు తీసింది. నంద్యాల జిల్లా కేంద్రం నంద్యాలలోని ఎస్టీ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి ఈ.సతీష్ (16) రైలు ఢీకొని మృతిచెందాడు. నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ఎస్టీ హాస్టల్‌లో 92 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇక్కడ మరుగుదొడ్లకు తలుపులు లేకపోగా కనీసం నీటి సదుపాయం లేదు. దీంతో విద్యార్థులు హాస్టల్ పక్కనే ఉన్న రైల్వేట్రాక్ వెంబడి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళుతున్నారు. ఈనెల 18వ తేదీన సాక్షి దినపత్రిక సంక్షేమ హాస్టళ్ల వసతులపై విజిట్ చేసి ఈ సమస్యను వెలుగులోకి తెచ్చింది. అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. డోన్ పట్టణానికి చెందిన సతీష్ నంద్యాలలోని పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం డీఎంఈ చదువుతున్నాడు. ఎస్టీ హాస్టల్‌లో ఉంటున్నాడు. సోమవారం ఉదయం ఆరుగంటల సమయంలో బహిర్భూమికి రైలుపట్టాల పక్కకు వెళ్లాడు. ఈ సమయంలో రైలు రాకను గమనించకపోవడంతో అతడిని రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. సతీష్ తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన విద్యార్థి సంఘాలు

అధికారుల నిర్లక్ష్యమే పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి మృతికి కారణమని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. విద్యార్థి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఎమ్మార్పీఎస్, రాయలసీమ విద్యార్థి సంఘం, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు వేర్వేరుగా కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించకపోవడంతోనే విద్యార్థులు బహిర్భూమికి బయటకు వెళ్తున్నారన్నారు. నీటివసతి కూడా కల్పించలేని ప్రభుత్వం, అధికారులు విద్యార్థి మృతికి కారణమని చెప్పారు. మృతిచెందిన విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నా అరెస్ట్ విషయంలో లేనిపోని అత్యుత్సాహం

- ముందస్తు బెయిల్ ప్రాసెస్ నడుస్తోంది
- సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ



హైదరాబాద్: తన అరెస్ట్ విషయంలో ఒక సెక్షన్ మీడియా అత్యుత్సాహం ప్రదర్శిస్తోందని, ముందస్తు బెయిల్ కోసం జ్యుడిషియల్ ప్రాసెస్ కొనసాగుతోందని సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మ అన్నారు. ఏడాది క్రితం సోషల్ మీడియాలో తాను చేసిన పోస్టుపై ఏపీలోని అనేకచోట్ల కేసులు నమోదు కావడంపై రాంగోపాల్‌వర్మ స్పందించారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తనపై నమోదైన కేసులు ఉద్దేశపూర్వకంగా ఉన్నాయనే అనుమానంతో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నానని రాంగోపాల్‌వర్మ తెలిపారు. మనది ఫ్రీ వరల్డ్ అని, వ్యంగ్యం అనేది మీడియా సహా ప్రతిచోటా ఉంటుందన్నారు. ఇప్పుడున్న సోషల్ మీడియా ఓపెన్ చేస్తే వందలాది మీమ్స్ కనిపిస్తాయన్నారు. తాను ఏడాది క్రితం చేసిన పోస్ట్ కూడా అలాంటిదేనన్నారు. అయితే.. ఏడాది తర్వాత ఒక వ్యక్తి మేల్కొని తనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. ఆ తర్వాత ఒకే పోస్టును కారణంగా చూపుతూ ఏపీలోని అనేకచోట్ల కేసులు నమోదయ్యాయన్నారు. ఇంతలో ఒక సెక్షన్ మీడియా సంస్థలు వర్మను ఎందుకు అరెస్టు చేయడం లేదని, వర్మ భయపడి పారిపోయాడని న్యూస్ టెలికాస్ట్ చేస్తున్నాయన్నారు. ఇదే మీడియా సంస్థలు అనేక ప్రోగ్రామ్స్ నాయకుల మీద, ఇతరుల మీద నెగెటివ్‌గా చేస్తుంటాయన్నారు. మొదటిసారి పోలీసులు సంప్రదించినప్పుడు తాను అందుబాటులో లేనని, రెండోసారి కూడా ఇంకాస్త సమయం కావాలని అడిగానన్నారు. కావాలంటే వర్చువల్‌గా మాట్లాడతానని చెప్పానని వివరించారు. తాను రాజకీయపరమైన సినిమాలు మానేస్తానని చెప్పింది అక్కడ జరిగే సెన్సార్ ఇబ్బందుల వల్లేనని, ఏడాది పాటు ఆ సెన్సార్ కోసం వేచిఉండటం చికాకుగా ఉండి పొలిటికల్ బేస్డ్ సినిమాలు చేయనని చెప్పానన్నారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 67,496 మంది స్వామివారిని దర్శించుకోగా 19,064 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.35 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఎస్వీ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

తిరుపతి సిటీ: ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ అంతర వ్యవసాయ కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు-2024లో తిరుపతి ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ చాటారు. తిరుపతి, బాపట్ల, నైరా వ్యవసాయ కళాశాలల ప్రాంగణాల్లో రాష్ట్ర స్థాయిలో మూడు విడతల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థుల జట్టు బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్ విభాగాల్లో విజేతగా నిలిచింది. అంతేకాకుండా చెస్, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, హై జంప్‌లో తృతీయ స్థానం దక్కించుకుంది. ఫుట్ బాల్ విజేతగా, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం, 100 మీటర్ల రిలేలో తృతీయ స్థానంలో నిలిచింది.

శాస్త్రోక్తంగా మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూతి వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

హెల్త్
సాక్షి ప్లస్
మంగళవారం ॥ 3-12-2024



నెలసరి నిలిచాకా 'కనిపిస్తే' కలవరం!

మహిళల్లో నెలసరి సమయంలో రక్తస్రావం కావడం మామూలే. కానీ రుతుస్రావాలు ఆగిపోయి... ఏడాది కాలం దాటాక మళ్లీ తిరిగి రక్తస్రావం కనిపిస్తుందంటే అదో ప్రమాద సూచన కావచ్చు. అది ఎందుకు జరుగుతోంది, దానికి కారణాలు కనుగొని... తగిన చికిత్స తప్పక చేయించుకోవాలి. మెనోపాజ్ తర్వాత కూడా రక్తస్రావం కనిపిస్తుందంటే దానికి కారణాలేమిటో, అదెంత ప్రమాదకరమో, తీసుకోవాల్సిన జాగ్రత్తలు / చికిత్స ఏమిటో అవగాహన కలిగించేందుకే ఈ కథనం.

ఓ మహిళకు మెనోపాజ్ తర్వాత కొద్ది పాటి రక్తస్రావం కనిపించినా దాన్ని తేలిగ్గా తీసుకోకూడదు. తప్పనిసరిగా వైద్యుల్ని సంప్రదించాలి. అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి. సాధారణంగా అయితే యాభై లేదా అరవై ఏళ్లు దాటాక ఇలా రక్తస్రావం కనిపిస్తే అది ఎండోమెట్రియల్ క్యాన్సర్ అయ్యేందుకు ఆస్కారముంది. అలా రక్తస్రావం జరగడానికి కచ్చితమైన కారణాన్ని తెలుసుకోవడం తప్పనిసరి.

చేయించాల్సిన పరీక్షలివి...

మహిళల్లో మెనోపాజ్ తర్వాత రక్తస్రావం కనిపిస్తే... అల్ట్రాసౌండ్, ట్రాన్స్‌వెజైనల్ వంటి స్కానింగ్ పరీక్షలు చేస్తారు. ఈ పరీక్షలో ఎండోమెట్రియం పొర మందం గురించి తెలుస్తుంది. మెనోపాజ్ తర్వాత ఎండోమెట్రియం పొర మందం ఐదు మిల్లీమీటర్ల కన్నా తక్కువగా ఉండాలి. పదిహేను, ఇరవై మిల్లీమీటర్లు ఉంటే అది క్యాన్సర్‌కి సూచన కావచ్చు. అప్పుడు మరికొన్ని పరీక్షలూ చేయించాలి. అల్ట్రాసౌండ్ స్కాన్‌లో గర్భాశయంలో ఉండే ఫైబ్రాయిడ్లూ, గర్భాశయ పరిమాణం, ఆకృతి, ఇతర వివరాలు తెలుస్తాయి. అండాశయాలు చిన్నగా కుంచించుకుపోయినట్లుగా కనిపించడానికి బదులు అండాశయాల్లో సిస్టులు ఉండటం, వాటి పరిమాణం పెరుగుతుండటం, కణితుల్లాంటివి ఉండటం జరిగితే అసహజమని గుర్తించాలి. అవసరాన్ని బట్టి ఎండోమెట్రియల్ బయాప్సీ కూడా చేయాల్సి రావచ్చు.

గర్భాశయం లోపలి ఎండోమెట్రియం పొర నమూనా సేకరించి బయాప్సీకి పంపిస్తారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న మరో పరీక్ష హిస్టెరోస్కోపీ. సమస్యను గుర్తించేందుకు మరో పరీక్ష సెలైన్ ఇన్ఫ్యూజన్ సోనోగ్రఫీ. అంటే, గర్భాశయంలోకి సెలైన్‌ని ఎక్కించి అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తూ కారణాలు తెలుసుకుంటారు. ఇలాంటి పరీక్షలు చేసినా కూడా కారణం కనిపించకపోతే సిస్టోస్కోపీ, ప్రాక్టోస్కోపీ, కొలనోస్కోపీ లాంటివీ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ని అంచనా వేసేందుకు పాప్‌స్మియర్ చేయాల్సి రావచ్చు.

ఇతరత్రా కారణాలుండవచ్చు...

మెనోపాజ్ తర్వాత రక్తస్రావం అనగానే అది తప్పక క్యాన్సరే అని ఆందోళన అక్కర్లేదు. ఈ పరిస్థితికి ఇతర కారణాలూ ఉండవచ్చు. ఉదాహరణకు... పెద్దవయసులో బాత్రూంకి వెళ్లినప్పుడు రక్తస్రావం కనిపించగానే వైద్యులు ముందు ప్రైవేట్ పార్ట్స్ చుట్టుపక్కల ఉండే అవయవాలను క్షుణ్ణంగా పరీక్షిస్తారు. మూత్రాశయం, మలద్వారం నుంచి కూడా రక్తస్రావం కావచ్చు. మలబద్ధకం ఉన్నప్పుడు, మలద్వారం నుంచి కూడా రక్తస్రావం అవుతుంది. ఏళ్లు గడిచేకొద్దీ యోనిలోని పొర పలుచబడటం వల్ల పొడిబారి చిట్లిపోయి, రక్తస్రావం అయ్యేందుకూ అవకాశముంది. జననేంద్రియాల్లో ఇన్ఫెక్షన్ ఉన్నా, గర్భాశయంలో పాలిప్స్ ఉన్నా రక్తస్రావం కనిపించవచ్చు. అలాగే జననేంద్రియ, గర్భాశయ ముఖద్వార, ఫెల్లోపియన్ ట్యూబులు, అండాశయ క్యాన్సర్లున్నా కూడా రక్తస్రావం అవుతుంది. మెనోపాజ్ దశ దాటాక హార్మోన్ చికిత్స (హెచ్ఆర్‌టీ) తీసుకునేవారిలో మధ్యమధ్య రక్తస్రావం కనిపిస్తుంది. రొమ్ము క్యాన్సర్ కోసం వాడే టామోక్సిఫిన్ వల్ల... గర్భాశయం లోపలి పొర మళ్లీ పెరిగి కొంతమందిలో పాలిప్స్ కనిపించవచ్చు. మరికొందరిలో ఎండోమెట్రియల్ క్యాన్సర్ రావచ్చు.

హైబీపీ, డయాబెటిస్ వంటివి ఉంటే...?

సాధారణ ఆరోగ్యవంతులైన మహిళల కంటే అధిక బరువూ, అధిక రక్తపోటూ, మధుమేహం (డయాబెటిస్) ఉన్నవారు ఈ సమస్య బారిన పడే అవకాశాలు రెండు నుంచి నాలుగు రెట్లు ఎక్కువ. కాబట్టి వారు తమ బరువును అదుపులో ఉంచుకునేందుకు వ్యాయామం చేయడం తప్పనిసరి. కుటుంబంలో అనువంశికంగా, తమ ఆరోగ్య చరిత్రలో క్యాన్సర్ ఉన్న కుటుంబాల్లోని మహిళలు ముప్ఫై అయిదేళ్లు దాటినప్పటి నుంచి తప్పనిసరిగా గర్భాశయ, అండాశయ, పెద్దపేగుకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి. రొమ్ముక్యాన్సర్‌కి మందులు వాడుతున్నప్పుడు అల్ట్రాసౌండ్ స్కాన్‌తో ఎప్పటికప్పుడు ఎండోమెట్రియం పొర వివరాలు తెలుసుకోవాలి.

చికిత్స అవసరమయ్యేదెప్పుడంటే...

ఎండోమెట్రియం పొర నాలుగు మిల్లీమీటర్లు అంతకన్నా తక్కువగా ఉన్నప్పుడు, పాప్ స్మియర్ ఫలితంలో ఏమీ లేదని తెలిసినప్పుడూ రక్తస్రావం కనిపించినప్పటికీ భయం అక్కర్లేదు. మూడునెలలు ఆగి మళ్లీ పరీక్ష చేయించుకుంటే చాలు.

బయాప్సీ ఫలితాన్ని బట్టి చికిత్స ఉంటుంది. ఒకవేళ ఎండోమెట్రియల్ క్యాన్సర్ అని తేలితే మళ్లీ ఎంఆర్ఐ స్కాన్ చేసి ఆ క్యాన్సర్ ఎండోమెట్రియం పొరకే పరిమితమైందా, లేదంటే గర్భాశయ కండరానికీ విస్తరించిందా, గర్భాశయం దాటి లింఫ్ గ్రంథులూ, కాలేయం, ఊపిరితిత్తుల వరకు చేరిందా అని వైద్యులు నిశితంగా పరీక్షిస్తారు. దాన్ని బట్టి ఎలాంటి చికిత్స / శస్త్రచికిత్స చేయాలనేది నిర్ణయిస్తారు.

అలాగే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ ఉంటే... దానికి అనుగుణమైన చికిత్స చేసి ఆ భాగాలను తొలగిస్తారు. తరవాత రేడియేషన్, కీమోథెరపీ లాంటివి చేయాలా వద్దా అన్నది నిర్ణయిస్తారు. ఒకవేళ క్యాన్సర్ కాకపోతే చాలామటుకు హిస్టెరోస్కోపీలోనే పాలిప్స్, ఫైబ్రాయిడ్ల లాంటివి కనిపిస్తే... వాటిని తొలగిస్తారు. ఎండోమెట్రియం పొర మందం ఎక్కువగా పెరిగి.. రిపోర్టులో హైపర్‌ప్లేసియా అని వస్తే తీవ్రతను బట్టి ప్రోజెస్టరాన్ హార్మోను సూచిస్తారు లేదా హిస్టెరెక్టమీ చేస్తారు. కొన్నిసార్లు హార్మోన్లు లేకపోవడం వల్ల ఎండోమెట్రియం పొర పలుచబడి 'ఎట్రోఫిక్ ఎండోమెట్రియం' పరిస్థితి వస్తుంది. అప్పుడు అందుకు తగినట్లుగా హార్మోన్లు వాడాలని డాక్టర్లు సూచిస్తారు.



మోచేతి నొప్పులా... ఇవిగో టిప్పులు!

దాదాపుగా అందరికీ జీవితంలోనూ ఏదో ఒక సమయంలో మోచేయి నొప్పి రావచ్చు. మరీ ముఖ్యంగా ఇంటి పనులు చేస్తుండే గృహిణుల్లో ఈ సమస్య ఇంకా ఎక్కువ. ఇలా మోచేతికి సమస్య రావడం ఎందుకంటే... ఇతర దేశాల్లోని మహిళలతో పోలిస్తే మన దేశంలోని మహిళలూ, గృహిణులూ నిత్యం ఏదో ఒక ఇంటిపని చేస్తూనే ఉంటారు. ఈ కారణంతో ఏదో ఓ సమయంలో మోచేతికి వచ్చే సమస్యలు వాళ్లలోనే ఎక్కువగా బయటపడుతుంటాయి. ఇక మరో కారణమేమిటంటే... నిర్మాణపరమైన తేడాలున్నప్పుడు కూడా కొందరిలో మోచేతి సమస్యలు బయటపడుతుంటాయి. మోచేతి సమస్యలపై అవగాహన, నివారణ కోసం ఈ కింది అంశాలు తెలుసుకుందాం.

సాధారణంగా మోచేతికి ఈ కింద పేర్కొన్న సమస్యలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. మోచేతి విషయంలో కనిపించే కొన్ని సమస్యలు...

- **ఆటల్లో గాయాల వల్ల :** క్రికెట్ లేదా టెన్నిస్, బ్యాడ్మింటన్ వంటి రాకెట్‌తో ఆడే ఆటల్లోనూ, ప్రధానంగా పురుషుల్లో మరింత ఎక్కువ బరువు వేసి వెయిట్ లిఫ్టింగ్ వంటివి చేసినప్పుడు మోచేయి గాయపడి నొప్పి రావచ్చు. చేతిని వాడాల్సిన పద్ధతిలో ఉపయోగించకుండా అకస్మాత్తుగా కదిలించడం, ఆటలకు ముందు తగినంత వార్మప్ చేయకపోవడం వంటి కారణాలతో ఇలా జరగవచ్చు.
- **హైపర్ ఎక్స్‌టెండెడ్ ఎల్బోస్ :** చేతిని పూర్తిగా చాచినప్పుడు... మోచేతి దగ్గర అది 180 డిగ్రీలు ఉంటుంది. కానీ కొందరిలో అంటే... దాదాపు 30 శాతం మందిలో (అందునా ప్రధానంగా మహిళల్లో) అది 180 డిగ్రీల కంటే ఎక్కువే ఒంపు తిరుగుతుంది. ఇలా 180 డిగ్రీల కంటే కాస్తంత ఎక్కువగా మోచేయి బయటివైపునకు ఒంపు తిరగడాన్ని 'హైపర్ ఎక్స్‌టెండెడ్ ఎల్బో'గా చెబుతారు. ఇలా ఎక్కువగా ఒంగుతున్నట్లు కనిపించడమన్న అంశమే మహిళలు ఎక్కువగా బరువులు మోసినప్పుడు అది మోచేతి బెణుకుకు కారణమవుతుంటుంది.
- **ఎపీకాండలైటిస్ :** చేతి భాగంలోని ఎముక (ఎపికాండైల్)కు ఒకసారి గాయమయ్యాక, మళ్లీ అదే చోట పదే పదే దెబ్బతగులుతుండటం వల్ల ఆ గాయం తిరిగి రేగుతుండవచ్చు. భుజం కండరాలు కూడా ఈ చోటే ఎముకకు అతికి ఉంటాయి. దాంతో ఏ కొద్దిపాటి శ్రమ చేసినా మళ్లీ గాయం రేగిపోయి నొప్పి వస్తుండవచ్చు. ఒక్కోసారి ఆ నొప్పి ఒకే చోట ఉండవచ్చు లేదా చేయి అంతటికి పాకవచ్చు. ఇలా జరగడాన్నే ల్యాటరల్ ఎపికాండైలైటిస్ అంటారు. చాలా ఎక్కువగా శ్రమించేవారిలో, ఈ శ్రమలో భాగంగా మోచేతిని ఎక్కువగా వాడేవారిలో కొన్ని సందర్భాల్లో మోచేతి దగ్గర కండరాన్ని ఎముకకు అంటించే 'టెండన్' విపరీతంగా అరిగిపోవచ్చు. ఇలాంటి కండిషన్‌నే 'టెన్నిస్ ఎల్బో'గా పేర్కొంటారు. చాలా సందర్భాల్లో 'ల్యాటరల్ ఎపీకాండైటిస్'నూ 'టెన్నిస్ ఎల్బో'నూ దాదాపుగా ఒకే అర్థంలో వాడుతుంటారు.

మోచేతి నొప్పి తగ్గాలంటే...

- మోచేయి విషయంలో ఏదైనా సమస్య ఉందేమో తెలుసుకోవడానికి ఎవరికి వారే ఇలా చెక్ చేసుకోవచ్చు. మొదట చేతిని చాచాలి. అది 180 డిగ్రీలు చాచగలిగితే పరవాలేదు. లేదంటే ఏదైనా సమస్య ఉందని అర్థం.
- మోచేతి ప్రాంతంలో వేలితో నొక్కాలి. లేదంటే ఏదైనా పనిచేస్తున్నప్పుడైనా మోచేతి పరిసరాల్లో నొప్పి వస్తోందంటే ఏదో సమస్య ఉన్నట్లు భావించాలి.

కొన్ని పరిష్కారాలు...

సాధారణంగా మోచేతికి ఏదైనా సమస్య వచ్చినా లేదా నొప్పి మరీ ఎక్కువగా లేకపోయినా... ప్రతివాళ్లూ తాము రోజూ చేసినట్లే ఇంట్లోని బరువులు ఎత్తడం / ఆటలాడటం వంటివి చేయవచ్చు. మరీ నొప్పిగా ఉంటే మాత్రం చేతికి తగినంత విశ్రాంతినివ్వాలి.

- ఏదైనా ఆటలాడటం వల్ల నొప్పి వస్తుంటే... ఒకవేళ ఆ గాయం తాజాదైతే (1 – 3 రోజులది) దానికి ఐస్‌ప్యాక్ పెట్టవచ్చు.
- వేణ్నీళ్లతోనూ కాపడం పెట్టవచ్చు.
- నొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు ఎలక్ట్రోథెరపీ వంటివి చేయించుకోవడం ఒక్కటే సరిపోదు. ఇలాంటి గాయాలైన సమయంలో మోచేతికి విశ్రాంతినివ్వడంతో పాటు ఎల్బో, రిస్ట్ స్ట్రెచ్చింగ్ వ్యాయామాలు చేయాలి. ఆ సమయంలో మోచేతికి శ్రమ కలిగించడం గానీ లేదా తగిలిన చోటే మళ్లీ మళ్లీ గాయం రేగేలా దెబ్బతగలనివ్వడం గానీ చేకూడదు. అలాంటి సందర్భాల్లో గాయం రేగితే 'టెండన్' దెబ్బతినవచ్చు. అందుకే మోచేతి నొప్పి రెండు వారాలకుపైగా అదేపనిగా కొనసాగితే తప్పక డాక్టర్‌కు చూపించుకోవాలి.
- కొన్ని సందర్భాల్లో మోచేతి నొప్పి అదే పనిగా వస్తుంటే ఒకసారి డాక్టర్‌కు చూపించి అది రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధులు కారణంగా వస్తుందేమోనని చూసుకొని, అక్కడ సమస్య ఏమీ లేదని నిర్ధారణ చేసుకొని నిశ్చింతగా ఉండవచ్చు.



డా. సుధీర్ రెడ్డి,
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్



తిండి ఇలా గుండెకు అలా

వెరైటీ డైట్

చాలా మంది సరిగా భోజనం చేయరు. ఏమీ తినాలనిపించడం లేదనీ, తమకు అన్నం సయించడం లేదనీ చెబుతుంటారు. సాధారణంగా కాస్త పెద్దవయసు వచ్చాక ఇలాంటి మార్పు చాలామందిలో కనిపిస్తుంది. ఇలాంటివారు ఎలా తినాలో, ఎలా తినడం వల్ల తమకు అందాల్సిన పోషకాలు అందుతాయో తెలుసుకుందాం.

అన్నం సయించనివారు ఏదో తినడం కోసమంటూ చాలా తక్కువగానే తింటున్నప్పటికీ ఆ భోజనం అన్ని పోషకాలూ అందేలాంటి బ్యాలెన్స్‌డ్ డైట్‌తో కూడిన మీల్ గా ఉండాలి. అంటే అందులో దేహానికి అవసరమైన పిండి పదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు వంటివి పుష్కలంగా అందేలా కాయధాన్యాలూ, పప్పుధాన్యాలు, తినేవారైతే మాంసాహారంలోని వేటమాంసం, కోడిమాంసం, చేపలు, ఇక మిగతా అందరూ ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పాల ఉత్పాదనలు, తాజా పండ్లు ఇవన్నీ.

ఎంత ఆహారం అవసరమంటే...

ఓ వ్యక్తికి ఇంత ఆహారం అవసరమని నిర్దిష్టంగా చెప్పడం సాధ్యం కాదు. ఎందుకంటే... ఓ వ్యక్తికి ఎన్ని క్యాలరీల ఆహారం అవసరం అన్నది... వారి వయస్సు, వారు పురుషుడా/మహిళా, వాళ్ల బరువు, వాళ్లు రోజువారీ చేసే పనులు, అవి శ్రమతో కూడినవా, లేక ఒకేచోట కూర్చుని చేసేవా... ఇలాంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది.

అన్నం సయించని వారు తినే వాటిల్లోనే రుచిగా...

అన్నం సయించడం లేదంటూ పెద్దగా ఆహారం తీసుకోనివారు... తాము తినే ఆ కొద్దిపాటి ఆహారంలోనే వీలైనన్ని రకరకాల పదార్థాలు రకరకాల పద్ధతుల్లో కాస్తంత నాలుకకు రుచిగా వండినవి, తినేందుకు ప్రయత్నించాలి. ఆహారంలోనూ అనేక రకాలు (వెరైటీస్) వండి తీసుకోవడం వల్ల ... అవి కొన్నీ, ఇవి కొన్నీ తీసుకుంటూ చాలా రకాలు ఉండటం వల్ల తీసుకోవాల్సిన పరిమాణం అంతో ఇంతో భర్తీ అయ్యే అవకాశం ఉంది. దాంతో వారు తీసుకోవాల్సిన రోజువారీ ఆహారపు పరిమాణం చాలావరకు అందే అవకాశముంది.

ఇదీ సాధారణ డైట్ ప్లాన్...

అన్నం సయించనివారు ఈ కింది సాధారణ డైట్ ప్లాన్ అవలంబిస్తే మంచిది. ఇలాంటి వాళ్లంతా రోజూ తమ రోజువారీ ఆహారంలో చపాతీ లేదా అన్నంతో పాటు పప్పులు (దాల్) లేదా శెనగలు, రాజ్మా వంటివి తీసుకోవడం మంచిది. వీటి కారణంగా వారికి అవసరమైన కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు సమకూరుతాయి. భోజనం చివర్లో ఓ కప్పు పెరుగుతో పెరుగన్నం తినాలి. భోజనానికి ముందు క్యారట్, కీర, దోస వంటి కూరగాయలను సలాడ్స్‌గా తీసుకోవాలి.

ప్రతి రోజూ పడుకోబోయే ముందు ఓ కప్పు పాలు తాగితే కొద్దిమేర ఆరోగ్యకరమైన కొవ్వులు, క్యాల్షియమ్ సమకూరుతాయి.

తినే పరిమాణం తక్కువైనా, అందులోనే ఆ సీజన్‌లో దొరికేవైన తాజా పండ్లను సాధ్యమైనన్ని తీసుకోవాలి. చాలా తరచుగా అప్పుడప్పుడూ తృణధాన్యాలతో ఏవైనా వంటకాలను చిరుతిండ్లలా చేయించుకుని తినాలి. చిరుతిండి కాబట్టి ఈ శ్నాక్స్ రుచిగా ఉండి, బాగా తినాలని అనిపిస్తాయి.

ఇలా ఇన్ని వెరైటీలుగా రకరకాల ఆహారాల్ని తీసుకోవడం వల్ల ఒంటికి అవసరమైన కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజలవణాలూ, మైక్రో, మ్యాక్రో న్యూట్రియెంట్లు... అన్నీ అందేందుకు అవకాశం ఉంది. ఇవన్నీ తీసుకుంటే తక్కువగానే తింటున్నప్పటికీ అవసరమైన పోషకాలన్నీ చాలావరకు దొరుకుతాయి.



బ్రైట్ ఫ్రూట్

గుండెజబ్బులను నివారించడానికి లైఫ్ స్టైల్ మాడిఫికేషన్స్‌లో భాగంగా డాక్టర్లు చాలా రకాల మార్గాలు సూచిస్తుంటారు. అందులో పండ్లు తినడమూ ఒకటి. అయితే కొన్ని రకాల పండ్లు చాలా రుచిగా ఉండటంతో పాటు, వాటిలో ఉండే కొన్ని రకాల పోషకాల వల్ల గుండెకు పటిష్టమైన రక్షణనిస్తాయి. వాటితో పాటు పూర్తి ఆరోగ్యానికీ తోడ్పడతాయి. అలా గుండెకు మేలు చేయడానికి వాటిల్లోని ఏయే పోషకాలూ, ఏయే అంశాలు ఉపయోగపడతాయో చూద్దాం.



అన్ని చోట్లా దొరుకుతూ, అన్ని వేళలా లభ్యమయ్యే పండ్లలో అరటి, నారింజ, ఆపిల్ వంటివి చాలా ముఖ్యం. అలా గుండెకు మేలు చేసే ఆల్ సీజన్ పండ్ల గురించి తెలుసుకుందాం.

అరటి పండు : ఈ పండులోని పొటాషియమ్, మెగ్నీషియమ్‌లు రక్తపోటును అదుపులో ఉంచుతాయి. హైబీపీ అన్నది గుండెపోటుకు ఒక రిస్క్‌ఫ్యాక్టర్ కాబట్టి అరటిలోని పొటాషియమ్ హైబీపీని తగ్గించడం ద్వారా పరోక్షంగా గుండెపై ఒత్తిడిని తగ్గిస్తుంది. అలా అరటి గుండెపోటును నివారిస్తుంది. ఈ పండు కేవలం రక్తపోటును అదుపు చేయడం, గుండెపోటు నివారించడమే కాకుండా... ఇందులోని విటమిన్ బి6, విటమిన్ – సి, పీచుపదార్థాలు దేహానికీ మేలు చేస్తాయి. ఇవి మార్కెట్లో ఎప్పుడూ దొరుకుతూనే ఉండటమన్నది ఓ సానుకూల అంశం.

ద్రాక్ష: మన దేహంలో ఆయా అవయవాల ఆకృతికి దగ్గరగా మంచి పోలిక కలిగి ఉండే పండ్లు, కూరగాయలు, డ్రైఫ్రూట్స్ వంటివి ఆయా దేహ భాగాలకు మేలు చేస్తాయనే భావన చాలా మందిలో ఉంది. ఉదాహరణకు అక్రోట్ వంటివి మెదడుకు ఆకారంలో ఉండి మెదడుకు మేలు చేస్తాయనీ... అలాగే అడ్డంగా కోసినప్పుడు అచ్చం కన్నులోని నల్లగుడ్డులో ఉన్నట్లుగా రింగులు కనిపించే క్యారట్ కన్నుకు మేలు చేస్తుందంటారు. అలాగే ద్రాక్ష గుత్తిని చూసినప్పుడు... ఆ పండ్లు ఉండే ఈనెలన్నీ దేహంలోని రక్తప్రసరణ వ్యవస్థలో ఉండే రక్తనాళాల్లా కనిపిస్తాయి. ఈ కారణం చేత ద్రాక్ష పండు గుండెకు మంచిదని అంటుంటారు. ద్రాక్షగుత్తి మొత్తాన్ని చూసినప్పుడు కూడా అది గుండె ఆకృతిలోనే ఉంటుంది. నిర్దిష్టంగా చూస్తే పండు ఆకృతికీ, అది చేసే మేళ్లకూ సైంటిఫిక్‌గా ఎలాంటి నిదర్శనాలూ లేవు. అయినప్పటికీ కాకతాళీయంగానైనా ఇది రక్తనాళాల్లోని కొవ్వులను తొలగిస్తుంది. ద్రాక్ష పండ్లు మన రక్తనాళాల్లోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా గుండెపోటు అవకాశాలను నివారిస్తాయి. ద్రాక్షలోని పోషకాలైన లినోలిక్ ఆసిడ్, ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ ఆలిగోమెరిక్ ప్రోయాంథో సయానిడిన్స్ వంటివి హైకొలెస్ట్రాల్‌ను తగ్గించి, అధిక రక్తపోటును అదుపులో ఉంచుతాయి. తద్వారా గుండెజబ్బులను నివారిస్తాయి.

నారింజపండ్లు: నిమ్మజాతికి చెందిన నారింజ, బత్తాయి వంటి పండ్లన్నీ గుండెకు బాగా మేలు సమకూర్చేవే. బాగా పండిన నారింజలో విటమిన్‌ఏ, బి6, సి పుష్కలంగా ఉంటాయి. దాంతోపాటు ఫోలేట్ పొటాషియమ్, ఫైబర్ ఎక్కువ. పొటాషియమ్ వల్ల రక్తపోటు తగ్గుతుందనీ దాంతో గుండెకు రక్షణ కలుగుతుందన్న విషయం తెలిసిందే. ఇవి కూడా ఏ సీజన్‌లోనైనా దొరికే పండ్లు కావడం ఓ మంచి విషయం.

ఆపిల్ : ఇందులోని ఫ్లేవనాయిడ్స్ రక్తనాళాల్లోని ప్లేట్‌లెట్లు రక్తనాళాల గోడలకు అంటుకోకుండా చూస్తాయి. దాంతోపాటు రక్తనాళాలు మూసుకుపోకుండా చూడటం, కొలెస్ట్రాల్‌ను తగ్గించడం కూడా చేస్తాయి. ఇలా అవి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.

కర్బూజ (కాంటలౌప్) : ఈ పండ్లలోని పొటాషియమ్ రక్తపోటును నియంత్రించి గుండెపోటును నివారిస్తుంది. ఈ పండ్లలోని విటమిన్-ఏ, విటమిన్-బి6, ఫోలేట్, పీచుపదార్థాలు పూర్తి శరీర ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

అన్ని చోట్లా దొరికే ద్రాక్ష, అరటి, నారింజ, ఆపిల్‌తో పాటు దాదాపుగా పట్టణ, నగర ప్రాంతాల్లోని పెద్ద పెద్ద మార్కెట్లలో దొరకే మరికొన్ని పండ్లు కూడా గుండెకు మేలు చేస్తాయి. వాటిలో కొన్ని...

బెర్రీపండ్లు: బెర్రీ పండ్లలో కూడా పొటాషియమ్ ఎక్కువగానే ఉంటుంది. పొటాషియమ్ రక్తపోటును నివారించడం ద్వారా గుండెకు మేలు చేస్తుందని అరటిపండు విషయంలో చూశాం కదా. అందుకే ఇది కూడా అరటి మాదిరిగానే గుండెకు మేలు చేస్తుంది. ఇక బెర్రీపండ్లలోని బ్లాక్‌బెర్రీ, బ్లూబెర్రీ, రాస్ప్‌బెర్రీలలో ఉండే విటమిన్ సి, ఫోలేట్, ఫైబర్ అన్నీ పూర్తి శరీర ఆరోగ్యానికి దోహదపడతాయి.

కివీ: ఇప్పుడు నగర ప్రాంతాల్లోని పెద్దపెద్ద మార్కెట్లతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ కివీ పండ్లు దొరుకుతున్నాయి. ఇవి గుండె ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పతాయి. కివీలోని విటమిన్-ఈ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ఫలితం గా రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే గుణం తగ్గి గుండె ఆరోగ్యం పదిలంగా ఉంటుంది.

అప్రికాట్: ముదురు నారింజ లేదా పసుపు రంగులో ఉండే అప్రికాట్స్ గుండెకు మంచివి. ఇందులో ఉండే విటమిన్-కె – రక్తకణాల ఆరోగ్యానికి దోహదపడుతుంది. అంతేకాదు అప్రికాట్‌లో ఉండే విటమిన్- ఏ, విటమిన్- సీ, విటమిన్-ఈ వల్ల పూర్తి శరీర ఆరోగ్యం కూడా బాగుపడుతుంది.

పైన పేర్కొన్నవాటితో పాటు బ్రైట్‌గా ఉండి ముదురురంగుల్లో మెరుస్తున్నట్లు కనిపించే రంగులతో ఉండే పండ్లన్నీ గుండెకు మేలు చేసేవే. ఆపిల్ ఈ కోవలోనిదే. ఇక పండ్లతో పాటు మిగతాజీవనశైలి మార్గాలను సైతం పాటిస్తూ ఉంటే గుండె ఆరోగ్యం పదికాలాలపాటు పదిలంగా ఉంటుంది.

బిజినెస్ రీల్

నవీ ఫిన్‌సర్వ్‌పై ఆంక్షలు ఎత్తివేత

navi FINSERV

ముంబై: రుణాలివ్వకుండా నవీ ఫిన్‌సర్వ్‌పై విధించిన ఆంక్షలను ఎత్తివేస్తూ రిజర్వ్ బ్యాంక్ నిర్ణయం తీసుకుంది. ఇది తక్షణం అమల్లోకి వస్తుందని తెలిపింది. వడ్డీ రేట్లు, మార్జిన్లు మొదలైన విషయాల్లో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడం లేదనే ఆరోపణలపై నవీ ఫిన్‌సర్వ్‌తో పాటు మరో మూడు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలపై ఈ ఏడాది అక్టోబర్ 17న ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. ఆ తర్వాత, లోపాలను సరిదిద్దుకునే క్రమంలో ఆర్‌బీఐతో నవీ ఫిన్‌సర్వ్ పలు మార్లు భేటీ అయింది. కంపెనీ తీసుకున్న చర్యలపై సంతృప్తి చెందిన ఆర్‌బీఐ తాజా నిర్ణయం తీసుకుంది. అక్టోబర్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆంక్షలు విధించిన వాటిల్లో న్యూఢిల్లీకి చెందిన డీఎంఐ ఫైనాన్స్, కోల్‌కతా సంస్థ ఆరోహణ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, చెన్నైకి చెందిన ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ కూడా ఉన్నాయి.

రిలయన్స్ బిగ్‌కు సెబీ షాక్

బ్యాంక్ ఖాతాలు, షేర్ల అటాచ్‌మెంట్

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు షాక్ ఇచ్చింది. బ్యాంక్ ఖాతాలతోపాటు షేర్లు, మ్యూచువల్ ఫండ్ హోల్డింగ్స్ అటాచ్‌మెంట్‌కు ఆదేశాలు జారీ చేసింది. రూ. 26 కోట్ల బకాయిల రికవరీకి తాజా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఆర్‌బెప్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా అవతరించిన కంపెనీకి 15 రోజుల్లోగా బకాయిలు చెల్లించమంటూ ఇప్పటికే గత నెల(నవంబర్) 14న నోటీసు జారీ చేసింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్‌కు సంబంధించిన నిధుల అక్రమ మళ్లింపు కేసులో సెబీ జరిమానాకు తెరతీసింది. అయితే రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్ బకాయిలను చెల్లించకపోవడంతో ఖాతాల అటాచ్‌మెంట్‌కు ఆదేశించింది. వడ్డీ, రికవరీ వ్యయాలు కలిపి రూ. 26 కోట్లను చెల్లించమంటూ సెబీ నోటీసు జారీ చేసింది.

హెచ్‌సీఎల్‌టెక్, గూగుల్ క్లౌడ్ జోడీ

న్యూఢిల్లీ: క్లౌడ్ కంప్యూటింగ్ సేవల్లో ఉన్న గూగుల్ క్లౌడ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఐటీ సంస్థ హెచ్‌సీఎల్‌టెక్ సోమవారం తెలిపింది. ఇందులో భాగంగా అంతర్జాతీయ సంస్థల కోసం సైబర్ సెక్యూరిటీని పెంపొందించే లక్ష్యంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత యూనివర్సల్ మేనేజ్డ్ డిటెక్షన్, రెస్పాన్స్ సొల్యూషన్స్‌ను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-12-2024

విశాఖ	605-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	615-00
విజయవాడ	620-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	615-00
వరంగల్	617-00
రిటైల్ ధర	6.75

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ULTRACEMCO	11,630.20	3.82
APOLLOHOSP	7,064.25	3.45
GRASIM	2,686.00	3.06
SHRIRAMFIN	3,097.00	2.56
JSWSTEEL	990.4	2.53

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HDFCLIFE	640.2	-2.67
NTPC	358.35	-1.46
CIPLA	1,513.00	-1.36
SBILIFE	1,422.50	-1.06
HINDUNILVR	2,479.00	-0.69

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,329
ఎన్ఎస్ఈ	99,059
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,57,104
ఎఫ్ఐఐ	- 238
డీఐఐ	+ 3,589

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.25	$ 68.00
బ్రెంట్	72.06	$ 71.84

హైదరాబాద్‌లో

ఇళ్ల ధరల పెరుగుదల

సెప్టెంబర్ క్వార్టర్‌లో 3 శాతం అధికం

- ప్రధాన నగరాల్లో 11 శాతం వృద్ధి
- క్రెడాయ్-కొలియర్స్-లైసెస్ ఫొరాస్ నివేదిక



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో 11 శాతం మేర పెరిగాయి. ఇందులో అత్యధికంగా ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 32 శాతం మేర ధరలు ఎగిసిపడగా, హైదరాబాద్‌లో 3 శాతం పెరిగాయి. ఈ వివరాలను రియల్టర్ల మండలి క్రెడాయ్, కొలియర్స్, లైసెస్ ఫొరాస్ సంస్థల సంయుక్త నివేదిక వెల్లడించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో రియల్టీ మార్కెట్లో బలమైన డిమాండ్ నమోదైంది. ఇళ్ల సగటు ధరలు వరుసగా 15వ త్రైమాసికంలోనూ వృద్ధి బాటలో నడిచాయి. ఎనిమిది నగరాల్లో ఇళ్ల సగటు ధరలు 11 శాతం వృద్ధితో చదరపు అడుగు (ఎస్ఎఫ్‌టీ) ధర రూ.11,000కు చేరినట్టు ఈ నివేదిక వెల్లడించింది.

పట్టణాల వారీగా..

- జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో అత్యధికంగా 32 శాతం మేర ఇళ్ల ధరల్లో వృద్ధి కనిపించింది. ఎస్ఎఫ్‌టీ ధర రూ.11,438కి చేరింది.
- ఢిల్లీ తర్వాత అత్యధికంగా బెంగళూరులో ఇళ్ల ధరలు సగటున 24 శాతం పెరిగాయి. చదరపు అడుగు ధర రూ.11,743గా నమోదైంది.
- హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు సగటున 3 శాతం పెరిగాయి. ఎస్ఎఫ్‌టీ రూ.11,351కి చేరింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.11,040గా ఉంది.
- పుణెలో ఎస్ఎఫ్‌టీ ధర 10 శాతం పెరిగి రూ.9,890కు చేరింది.
- ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో 4 శాతం పెరిగి ఎస్ఎఫ్‌టీ రూ.20,438గా ఉంది.
- కోల్‌కతాలోనూ 3 శాతం పెరుగుదల నమోదైంది. చదరపు అడుగు ధర రూ.11,351కి చేరింది.
- చెన్నై మార్కెట్లో చదరపు అడుగు ధర రూ.7,889గా నమోదైంది. మెట్రోల్లో అతి తక్కువ పెరుగుదల ఇక్కడే.
- అహ్మదాబాద్‌లో 16 శాతం వృద్ధితో ఎస్ఎఫ్‌టీ రూ.7,640కు చేరింది.

సానుకూల సెంటిమెంట్..

ఇళ్ల ధరల పెరుగుదల గృహ కొనుగోలుదారుల్లో నెలకొన్న సానుకూల సెంటిమెంట్, సానుకూల వాతావరణానికి నిదర్శనమని క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ పేర్కొన్నారు. విక్రయాలు, ధరల పెరుగుదల కొనసాగడం అందుబాటు ధరలు, డిమాండ్‌ను తెలియజేస్తున్నట్టు లైసెస్ ఫొరాస్ ఎండీ పంకజ్ కపూర్ వ్యాఖ్యానించారు. కొత్త ప్రాజెక్టుల ఆవిష్కరణలు క్రమంగా తగ్గుతున్నప్పటికీ లగ్జరీ ఇళ్ల విభాగం ఆధిపత్యం కొనసాగుతోందని చెప్పారు. ఎంఎంఆర్, పుణె, హైదరాబాద్ మార్కెట్లు విక్రయాలు, సరఫరాల్లో మార్పులేని స్థితికి చేరాయని.. ఢిల్లీ ఎన్‌సీఆర్, చెన్నై, టైర్-2 పట్టణాల్లో సరఫరా తగ్గిందని తెలిపారు. ధరలు పెరుగుతున్నప్పటికీ.. ద్రవ్య విధానాన్ని ఆర్‌బీఐ సరళీకరించడం, రెపో రేటు తగ్గింపు అంచనాలతో గృహ కొనుగోలుదారులకు సమీప కాలంలో ఉపశమనం లభిస్తుందని కొలియర్స్ ఇండియా సీఈవో బాదల్ యాగ్నిక్ అభిప్రాయపడ్డారు.

రియల్టీలోకి భారీగా ఏఐఎఫ్ పెట్టుబడులు

రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధులు (ఏఐఎఫ్) పెద్ద ఎత్తున వస్తున్నాయి. దేశ రియల్ ఎస్టేట్ పరిశ్రమలో ఏఐఎఫ్ పెట్టుబడులు రూ.75,000 కోట్లకు చేరినట్టు రియల్టీ కన్సల్టెంట్ అనరాక్ తెలిపింది. ఏఐఎఫ్ మొత్తం పెట్టుబడుల్లో 17 శాతం రియల్ ఎస్టేట్ రంగంలోకే వచ్చినట్టు వెల్లడించింది. గడిచిన 10 ఏళ్లలో భారత్‌లో ఏఐఎఫ్‌లలో భారీ వృద్ధి కనిపించినట్టు పేర్కొంది. మిగిలిన రంగాలతో పోల్చి చూసినప్పుడు ఏఐఎఫ్ పెట్టుబడులకు రియల్టీ ఆకర్షణీయ ఎంపికగా ఉన్నట్టు వివరించింది. ''సెబీ తాజా డేటా ప్రకారం.. 2024-25 సెప్టెంబర్ త్రైమాసికం (క్యూ2) వరకు రూ.4,49,384 కోట్ల ఏఐఎఫ్ పెట్టుబడుల్లో రియల్ ఎస్టేట్ రంగంలోకి వచ్చినవి రూ.75,468 కోట్లు (17 శాతం)గా ఉన్నాయి'' అని అనరాక్ నివేదిక వెల్లడించింది. రియల్ ఎస్టేట్ తర్వాత ఐటీ/ఐటీఈఎస్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎన్‌బీఎఫ్‌సీలు, బ్యాంక్‌లు, ఫార్మా, ఎఫ్ఎంసీజీ, రిటైల్, రెన్యువబుల్ ఎనర్జీ, ఇతర రంగాలు ఏఐఎఫ్‌లతో ప్రయోజనం పొందినట్టు తెలిపింది. ''ఏఐఎఫ్ ద్వారా రియల్ ఎస్టేట్‌లోకి వచ్చిన పెట్టుబడులు 2024 మార్చి నాటికి రూ.68,540 కోట్లుగా ఉంటే, 2024-25 సెప్టెంబర్ త్రైమాసికం నాటికి రూ.75,468 కోట్లకు పెరిగాయి. కేవలం ఆరు నెలల్లోనే 10 శాతం మేర పెట్టుబడుల్లో వృద్ధి కనిపించింది'' అని అనరాక్ చైర్మన్ అనుజ్‌పురి వెల్లడించారు.

పెట్టుబడుల తీరు..

రియల్టీ తర్వాత ఐటీ/ఐటీఈఎస్ రంగంలోకి అత్యధికంగా రూ.27,815 కోట్లు ఏఐఎఫ్‌ల ద్వారా వచ్చాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్‌లోకి రూ.25,782 కోట్లు, ఎన్‌బీఎఫ్‌సీల్లోకి రూ.21,503 కోట్లు, బ్యాంకుల్లోకి రూ.18,242 కోట్లు, ఫార్మాలోకి రూ.17,272 కోట్లు, ఎఫ్ఎంసీజీలోకి రూ.11,680 కోట్లు, రిటైల్‌లోకి రూ.11,379 కోట్లు, పునరుత్పాదక ఇంధన వనరుల రంగంలోకి రూ.10,672 కోట్లు, ఇతర రంగాల్లోకి రూ.2,29,571 కోట్లు వచ్చాయని ఈ నివేదిక వెల్లడించింది. దశాబ్ద గరిష్టానికి ఏఐఎఫ్ పెట్టుబడులు చేరాయని, మొత్తం ఏఐఎఫ్ ఫండ్స్ సంఖ్యలోనూ వృద్ధి నెలకొన్నట్టు తెలిపింది. ''ఏఐఎఫ్ పెట్టుబడుల్లో కేటగిరీ 2 ఏఐఎఫ్‌ల పాత్ర కీలకంగా ఉంది. రియల్ ఎస్టేట్ ఫండ్స్, ప్రైవేటు ఈక్విటీ ఫండ్స్, డెట్ ఫండ్స్, ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్‌వోఎఫ్) ఇందులో భాగంగా ఉన్నాయి'' అని పురి తెలిపారు. గడిచిన ఐదేళ్ల కాలంలో మొత్తం ఏఐఎఫ్ పెట్టుబడుల్లో కేటగిరీ-2 నుంచే 80 శాతం మేర ఉన్నట్టు అనరాక్ నివేదిక తెలిపింది. రియల్ ఎస్టేట్‌లో ఏఐఎఫ్ పెట్టుబడులు అధికంగా ఉండడం వెనుక ఈ రంగంలో భద్రత, రక్షణ ఎక్కువగా ఉండడమే కారణమని గోల్డెన్ గ్రోత్ ఫండ్ సీఈవో అంకుర్ జైన్ తెలిపారు.



న్యూఢిల్లీలో జరిగిన 2024 సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ (29వ ఎడిషన్)లో కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, ఇతర దేశాల మంత్రులు

పర్యావరణ అనుకూల ఉత్పత్తులను వినియోగించాలి

- తద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించొచ్చు
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ: సుస్థిర వినియోగ విధానాలను అనుసరించాలని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. పర్యావరణానికి అనుకూలమైన ఉత్పత్తులను వినియోగించడంపై ప్రపంచ ప్రజలు దృష్టి సారించాలని, దీంతో కర్బన ఉద్గారాలను తగ్గించొచ్చన్నారు. దీంతో పర్యావరణ సంబంధిత సమస్యలకూ పరిష్కారం లభిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా గోయల్ మాట్లాడారు. ''ప్రస్తుత జీవన శైలి ధోరణుల కారణంగా వెలువడుతున్న వ్యర్థాలు, కర్బన ఉద్గారాల పట్ల స్పృహ కలిగి ఉండడం ఎంతో అవసరం. ప్రపంచానికి మెరుగైన భవిష్యత్‌కు ఇది కీలకం. వినియోగ ధోరణులను చక్కదిద్దుకోకపోతే సుస్థిర, పర్యావరణ సవాళ్లకు పరిష్కారం లభించదు'' అని చెప్పారు. పర్యావరణ సవాళ్లు అన్నవి తయారీ రంగం వెలువరించే కర్బన ఉద్గారాల వల్లే అని భావించకూడదు. వినియోగం వల్లే కర్బన వ్యర్థాలు వెలువడేవి. వినియోగ డిమాండ్‌పైనే తయారీ ఆధారపడి ఉంటుంది'' అని వివరిస్తూ.. వినియోగ ధోరణుల్లో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయంగా పర్యావరణ విధ్వంసానికి దక్షిణాది దేశాలు కారణం కాదని.. ఇది అభివృద్ధి చెందిన దేశాల పని అంటూ, అవి చౌక ఇంధనాలను వినియోగిస్తున్నట్టు గోయల్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ ఆర్థిక, పరిశ్రమల మంత్రి ఎంకే నిర్ బర్కత్ ఇదే సమావేశంలో మాట్లాడుతూ.. రెండు దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు. ఈ సదస్సులో ఇటలీ, భూటాన్, బహ్రెయిన్, అల్జీరియా, నేపాల్, సెనెగల్, దక్షిణాఫ్రికా, మయన్మార్, ఖతార్, కంబోడియా దేశాల సీనియర్ మంత్రులు పాల్గొన్నారు.

సిప్లాలో 1.72 శాతం వాటా విక్రయం

విలువ రూ. 2,111 కోట్లు



న్యూఢిల్లీ: ఫార్మాస్యూటికల్ రంగ దిగ్గజం సిప్లా ప్రమోటర్లు తాజాగా మైనారిటీ వాటాను విక్రయించారు. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా సమీనా హమీద్, రుమానా హమీద్ 1.72 శాతం వాటాను రూ. 2,111 కోట్లకు విక్రయించారు. సింగపూర్ ప్రభుత్వం, సొసైటీ జనరాలి, బీఎన్‌పీ పారిబా, మోర్గాన్ స్టాన్లీ తదితరాలు ఈ వాటాలు కొనుగోలు చేశాయి. ఎన్ఎస్ఈ బ్లాక్ డీల్ గణాంకాల ప్రకారం షేరుకి రూ. 1,518.75 ధరలో సమీనా 89.54 లక్షల షేర్లు(1.11 శాతం వాటా), రుమానా 49.43 లక్షల షేర్లు(0.61 శాతం వాటా) చొప్పున విక్రయించారు. ఈ లావాదేవీల తదుపరి సిప్లాలో ప్రమోటర్ల వాటా 30.92 శాతం నుంచి 29.2 శాతానికి తగ్గింది.

ఎన్ఎస్ఈలో సిప్లా షేరు 1.4 శాతం క్షీణించి రూ. 1,513 వద్ద ముగిసింది.

నెలాఖరులోగా 4,000 స్టోర్స్: ఓలా

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విక్రయంలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ డిసెంబర్‌లోగా ఔట్‌లెట్ల సంఖ్యను 4,000లకు చేరుస్తోంది. ఇప్పటికే సంస్థకు దేశవ్యాప్తంగా 800 కేంద్రాలు ఉన్నాయి. సర్వీసు సౌకర్యంతో కొత్త స్టోర్లు ఏర్పాటవుతాయని ఓలా ఎలక్ట్రిక్ సీఎండీ భవీశ్ అగర్వాల్ తెలిపారు. తద్వారా సర్వీస్ నెట్‌వర్క్ బలపడుతుందని అన్నారు. ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల వెలుపల కూడా రిటైల్ కేంద్రాలను విస్తరిస్తామని చెప్పారు. నెట్‌వర్క్ పార్టనర్ ప్రోగ్రామ్ కింద కంపెనీ 2025 చివరి నాటికి సేల్స్, సర్వీస్‌లలో 10,000 మంది భాగస్వాములను చేర్చుకోవాలని యోచిస్తోంది.

400 నగరాలకు స్విగ్గీ బోల్ట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ.. బోల్ట్ పేరుతో అందిస్తున్న 10 నిముషాల ఫుడ్ డెలివరీ సేవలను 400 నగరాలు, పట్టణాలకు విస్తరించినట్టు ప్రకటించింది. బోల్ట్ సేవల్లో భాగంగా తక్కువ సమయంలో తయారు చేసే లేదా తినడానికి సిద్ధంగా ఉన్న ఆహారాన్ని ప్రసిద్ధ రెస్టారెంట్‌లు, క్విక్ సర్వీస్ రెస్టారెంట్స్ నుండి వినియోగదార్లకు అందిస్తోంది.

ముందంజలో ఏపీ, తెలంగాణ



తొలుత బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, న్యూఢిల్లీ, ముంబై, పుణేలో కంపెనీ ఈ సేవలను ప్రారంభించింది. బోల్ట్ ఇప్పుడు జైపూర్, లక్నో, అహ్మదాబాద్, ఇండోర్, కోయంబత్తూర్, కొచ్చి వంటి నగరాల్లో కూడా చురుకుగా ఉందని స్విగ్గీ వెల్లడించింది. రూర్కీ, గుంటూరు, వరంగల్, పట్నా, జగిత్యాల, సోలన్, నాసిక్, షిల్లాంగ్ వంటి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో సైతం ఈ సేవలను పరిచయం చేశామని వివరించింది. బోల్ట్ సేవలను వినియోగించడంలో దేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముందున్నాయని స్విగ్గీ తెలిపింది. హర్యానా, తమిళనాడు, గుజరాత్, పశ్చిమ బెంగాల్, రాజస్తాన్, పంజాబ్ ఆ తర్వాతి స్థానాలను కైవసం చేసుకున్నాయని వివరించింది. బోల్ట్ కింద ప్రస్తుతం 2 కిలోమీటర్ల పరిధిలోని కస్టమర్లకు 10 లక్షలకు పైగా ఉత్పత్తుల శ్రేణిని ఆఫర్ చేస్తోంది. 40,000ల పైచిలుకు రెస్టారెంట్లు ఈ సేవల్లో నిమగ్నం అయ్యాయి. బోల్ట్ ఔట్‌లెట్లకు దగ్గరగా ఉన్న డెలివరీ ఎగ్జిక్యూటివ్‌లకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా డెలివరీ వేగంగా పూర్తి చేస్తున్నట్టు స్విగ్గీ తెలిపింది.



పుంజుకున్న పెట్రోల్, డీజిల్ అమ్మకాలు

పండుగల సందర్భంగా డిమాండ్

న్యూఢిల్లీ: పండుగల సందర్భంగా పెట్రోల్, డీజిల్‌కు డిమాండ్ ఏర్పడింది. వరుసగా కొన్ని నెలల పాటు క్షీణించిన అమ్మకాలు నవంబర్‌లో తిరిగి పుంజుకున్నాయి. ప్రభుత్వరంగ ఆయిల్ కంపెనీల (ఐవోసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్) గణాంకాల ప్రకారం.. పెట్రోల్ విక్రయాలు నవంబర్‌లో 8.3 శాతం పెరిగి 3.1 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే నెలలో అమ్మకాలు 2.86 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. డీజిల్ విక్రయాలు సైతం క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 5.9 శాతం పెరిగి 7.2 మిలియన్ టన్నులకు చేరాయి. వర్షాల సీజన్‌లో వాహనాల కదలికలు తగ్గడం వల్ల పెట్రోల్, డీజిల్ డిమాండ్ క్షీణిస్తుంటుంది. అదే కాలంలో వ్యవసాయ రంగం నుంచి డీజిల్ డిమాండ్ తగ్గుతుంది. ఇక అక్టోబర్ నెల విక్రయాలతో పోల్చి చూస్తే.. నవంబర్‌లో 4.7 శాతం అధికంగా 2.96 మిలియన్ టన్నులు మేర పెట్రోల్ విక్రయాలు నమోదయ్యాయి. డీజిల్ విక్రయాలు 11 శాతం పెరిగి 6.5 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. పెట్రోలియం ఇంధన విక్రయాల్లో 40 శాతం వాటా డీజిల్ రూపంలోనే ఉంటుంది. వాణిజ్య వాహనాలు, వ్యవసాయ రంగంలో వినియోగించే పనిముట్లకు డీజిల్‌ను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ముఖ్యంగా రవాణా రంగమే 70 శాతం డీజిల్‌ను వినియోగిస్తుంటుంది. జెట్ ఫ్యూయల్ (విమానాల ఇంధనం/ఏటీఎఫ్) అమ్మకాలు 3.6 శాతం పెరిగి 6,50,900 టన్నులుగా ఉన్నాయి. ఏటీఎఫ్ డిమాండ్ కరోనా పూర్వపు స్థాయిని దాటిపోయింది. వంట గ్యాస్ (ఎల్‌పీజీ) అమ్మకాలు 7.3 శాతం పెరిగాయి. 2.76 మిలియన్ టన్నులుగా నమోదైంది. అంతకుముందు నెల అక్టోబర్‌లో 2.76 మిలియన్ టన్నులుగా ఉండడం గమనార్హం.

ఆడి కార్ల ధరలు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి అన్ని మోడళ్ల ధరలను 2025 జనవరి 1 నుండి 3 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. అధికం అవుతున్న ముడిసరుకు వ్యయాలు, రవాణా ఖర్చుల ప్రభావాన్ని భర్తీ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ సోమవారం తెలిపింది. 'స్థిరమైన వృద్ధిని నిర్ధారించడానికి కంపెనీతోపాటు డీలర్ భాగస్వాములకు ఈ దిద్దుబాటు అవసరం. మా విలువైన కస్టమర్లపై ధరల పెంపు ప్రభావాన్ని తగ్గించడానికి కట్టుబడి ఉన్నాం' అని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ అన్నారు. ఏ4, ఏ6, క్యూ3, క్యూ5, క్యూ7 వంటి మోడళ్లను భారత్‌లో ఆడి విక్రయిస్తోంది. అన్ని మోడళ్ల ధరలను 2025 జనవరి 1 నుండి 3 శాతం వరకు పెంచుతున్నట్టు బీఎండబ్ల్యూ ఇండియా సైతం ఇటీవలే ప్రకటించింది. ధరల సవరణ విషయంలో మెర్సిడెస్ బెంజ్ ఇండియా సైతం ఈ కంపెనీల బాటలోనే ఉంది.

వీధి వ్యాపారులకు రూ.5 లక్షల వరకు రుణం

- ముత్తూట్ ఫిన్‌కార్ప్ వన్ శ్రీకారం
- డిజిటల్ చెల్లింపుల ఆధారంగా మంజూరు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రైవేటు రుణ రంగంలో ముత్తూట్ ఫిన్‌కార్ప్ వన్ సంచలనాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వీధి వ్యాపారులు సైతం ఇప్పుడు రూ.5 లక్షల వరకు రుణాలు పొందవచ్చు. రోజువారీ వసూళ్ల కోసం క్యూఆర్-కోడ్ ఆధారిత యాప్‌లను ఉపయోగించే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) సంస్థలకు రోజువారీ చెల్లింపు సౌకర్యంతో రుణాలను అందిస్తామని ముత్తూట్ ఫిన్‌కార్ప్ వన్ వెల్లడించింది. 'ఇది చిన్న వ్యాపారాల కోసం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జూలై 23న తన బడ్జెట్ ప్రెజెంటేషన్‌లో ప్రకటించిన 'న్యూ క్రెడిట్ అసెస్‌మెంట్ మోడల్'కు అనుగుణంగా ఉంది. ఈ మోడల్ కింద బ్యాంకులు చిన్న వ్యాపారుల బ్యాలెన్స్ షీట్లతో కాకుండా డిజిటల్ లావాదేవీల ఆధారంగా వ్యాపారాలను అంచనా వేయాలి. బలమైన నగదు రాక ఉన్నప్పటికీ రుణం పొందడంలో వ్యాపారులు విఫలం చెందుతున్నారు. ఇటువంటి వారు క్యూఆర్ కోడ్ లావాదేవీల ఆధారంగా రుణం అందుకోవచ్చు' అని కంపెనీ తెలిపింది. 'భారత్‌లో దాదాపు 6 కోట్ల అనధికారిక సూక్ష్మ వ్యాపారాలు ఉన్నాయి. ఇవి దేశంలోని అతిపెద్ద ఉపాధి సృష్టికర్తలలో ఒకటి. దేశ జీడీపీకి గణనీయంగా తోడ్పడుతున్నాయి' అని ముత్తూట్ ఫిన్‌కార్ప్ వన్ సీఈవో చందన్ ఖైతాన్ అన్నారు. 'సంప్రదాయకంగా అధికారిక రుణాలను పొందడంలో అడ్డంకులను ఎదుర్కొనే అనధికారిక సూక్ష్మ వ్యాపారాలకు క్రెడిట్‌ను అందుబాటులో ఉంచడం క్యూఆర్-కోడ్-ఆధారిత రుణ కార్యక్రమం యొక్క లక్ష్యం. ఈ ఉత్పత్తిని వారి రోజువారీ వ్యాపార అవసరాలకు అనుగుణంగా రూపొందించాం. ఇప్పటి వరకు 75,000 పైచిలుకు అనధికారిక సూక్ష్మ వ్యాపారులకు రుణం సమకూర్చాం' అని వివరించారు.

బీఎండబ్ల్యూ మోటోరాడ్ ధరలు ప్రియం



న్యూఢిల్లీ: వాహన తయారీలో ఉన్న జర్మనీ సంస్థ బీఎండబ్ల్యూకు చెందిన ద్విచక్ర వాహన విభాగం బీఎండబ్ల్యూ మోటోరాడ్ 2025 జనవరి 1 నుండి అన్ని మోడళ్ల ధరలను 2.5 శాతం వరకు పెంచనున్నట్టు శుక్రవారం ప్రకటించింది. ముడిసరుకు ఖర్చులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా ధరలను సవరిస్తున్నట్టు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చే ఏడాది జనవరి నుంచి తమ మొత్తం కార్ల శ్రేణి ధరలను 3 శాతం వరకు అధికం చేస్తున్నట్లు బీఎండబ్ల్యూ ఇండియా ఇప్పటికే ప్రకటించింది. భారత్‌లో తన వాహనాల ధరలను వచ్చే నెల నుండి 3 శాతం వరకు పెంచనున్నట్లు ఈ నెల ప్రారంభంలో మెర్సిడెస్-బెంజ్ ఇండియా వెల్లడించిన సంగతి తెలిసిందే.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు జూమ్

తొలి 6 నెలల్లో 29.79 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ గణాంకాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి అర్ధభాగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు భారీగా ఎగశాయి. ఏప్రిల్-సెప్టెంబర్‌లో 45 శాతం జంప్‌చేసి 29.79 బిలియన్ డాలర్లను తాకాయి. ప్రధానంగా సర్వీసులు, కంప్యూటర్, టెలికం, ఫార్మా రంగాలకు పెట్టుబడులు పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలు పేర్కొన్నాయి. గతేడాది(2023-24) ఇదే కాలంలో 20.5 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు మాత్రమే లభించాయి. ఈ ఏడాది రెండో త్రైమాసికం(జులై-సెప్టెంబర్)లో ఎఫ్‌డీఐలు 43 శాతం వృద్ధితో 13.6 బిలియన్ డాలర్లకు చేరాయి. గతేడాది క్యూ2లో కేవలం 9.52 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు తరలి వచ్చాయి. ఇక ఈ ఏడాది తొలి క్వార్టర్(ఏప్రిల్-జూన్)లో మరింత అధికంగా 48 శాతం అధికంగా 16.17 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు నమోదయ్యాయి. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో ఈక్విటీ పెట్టుబడులుసహా మొత్తం ఎఫ్‌డీఐలు 28 శాతం పెరిగి 42.1 బిలియన్ డాలర్లను తాకాయి. గతేడాది తొలి 6 నెలల్లో ఇవి 33.12 బిలియన్ డాలర్లు మాత్రమే.



57 ఏళ్ల తర్వాత...

హైదరాబాద్‌లో సంతోష్ ట్రోఫీ ఫైనల్

న్యూఢిల్లీ: సుదీర్ఘ విరామం తర్వాత జాతీయ సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ 'సంతోష్ ట్రోఫీ' ఫైనల్ రౌండ్ పోటీలు హైదరాబాద్‌లో జరగనున్నాయి. గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 14 నుంచి 31 వరకు క్వార్టర్ ఫైనల్స్, సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహిస్తామని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) సోమవారం ప్రకటించింది. చివరిసారి హైదరాబాద్



1967లో సంతోష్ ట్రోఫీ టోర్నీకి ఆతిథ్యమిచ్చింది. ఈసారి ఫైనల్ రౌండ్ టోర్నీలో మొత్తం 12 జట్లు పోటీపడతాయి. ఇందులో తొమ్మిది గ్రూప్ విజేతలుగా కాగా... గత ఏడాది చాంపియన్ సర్వీసెస్, రన్నరప్ గోవా జట్లు ఉన్నాయి. 12 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ దశ మ్యాచ్‌లు డెక్కన్ ఎరీనాలో జరుగుతాయి. నాకౌట్ మ్యాచ్‌లు గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తారు. రెండు గ్రూప్‌ల్లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు డిసెంబర్ 26, 27వ తేదీల్లో జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడతాయి. సెమీఫైనల్స్ డిసెంబర్ 29న, ఫైనల్ డిసెంబర్ 31న ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు సంతోష్ ట్రోఫీ 77 సార్లు జరిగింది. పశ్చిమ బెంగాల్ జట్టు రికార్డుస్థాయిలో 32 సార్లు విజేతగా నిలిచింది.



పెర్త్ టెస్టులో బుమ్రా బౌలింగ్‌లో అవుటైన హెడ్

బుమ్రా 'గ్రేటెస్ట్' పేసర్‌గా నిలిచిపోతాడు!

- భారత పేసర్‌పై ట్రావిస్ హెడ్ ప్రశంసలు
- అతడితో తలపడటం గొప్పగా ఉందన్న ఆసీస్ బ్యాటర్

అడిలైడ్: భారత పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్ పదునేమిటో ఆ్రస్టేలియా జట్టు పెర్త్ టెస్టులో రుచి చూసింది. గతంలోనూ బుమ్రా కొన్నిసార్లు చక్కటి బౌలింగ్‌తో ఆకట్టుకున్నా... తొలి మ్యాచ్‌లో అతడి ఒక్కో బంతిని ఎదుర్కొనేందుకు ఆసీస్ బ్యాటర్లు నానా తిప్పలు పడ్డాడు. అతని 8 వికెట్ల ప్రదర్శనతో బుమ్రా స్థాయి వారికి తెలిసింది. అందుకే అతని బౌలింగ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ జాబితాలో ఇప్పుడు ఆ్రస్టేలియా టాప్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ కూడా చేరాడు. రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రా బౌలింగ్‌లోనే హెడ్ అవుటయ్యాడు. 'బుమ్రా బౌలింగ్ ఎంత అద్భుతంగా ఉందో ఇప్పుడు మాకు అనుభవంలోకి వస్తోంది. అతను విసిరే సవాల్‌ను ఎదుర్కొంటూ పోటీపడటం ప్రత్యేకంగా అనిపిస్తోంది. కెరీర్ ముగిసిన తర్వాత నేనూ బుమ్రాను ఎదుర్కొన్నాను అని మా మనవలకు చెప్పుకోగలను. ఈ సిరీస్‌లో మరికొన్నిసార్లు అతడితో తలపడే అవకాశం ఎలాగూ వస్తుంది. నా దృష్టిలో క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్లలో ఒకడిగా బుమ్రా నిలిచిపోయాడు' అని హెడ్ వ్యాఖ్యానించాడు. పెర్త్ టెస్టులో హెడ్ ఒక్కడే కాస్త బుమ్రాను సమర్థంగా ఎదుర్కొని అర్ధ సెంచరీ సాధించగా... స్మిత్, లబుషేన్, ఖాజా పూర్తిగా విఫలమయ్యారు. 'బుమ్రా ప్రత్యేకమైన బౌలర్. అయితే ఏ బౌలర్‌నైనా ఎదుర్కొనేందుకు ప్రతీ బ్యాటర్‌కు తనదైన శైలి ఉంటుంది. వారు ఎలా ఆడగలరనేది వారికి మాత్రమే తెలుసు. నేను కాస్త మెరుగ్గా ఆడినంత మాత్రాన నా సహచరులు సలహాలు, సూచనల కోసం నా వద్దకు రాలేదు కదా' అని బుమ్రా బౌలింగ్ గురించి హెడ్ అభిప్రాయపడ్డాడు. నాలుగేళ్ల క్రితం 'పింక్ బాల్' టెస్టులో భారత్ 36 పరుగులకు ఆలౌట్ అయిన విషయం తనకు గుర్తుందని, అయితే ఈసారి అలాంటిది జరగకపోవచ్చని అతను అన్నాడు. తాము కూడా 'పింక్ బాల్' టెస్టు ఆడి చాలా కాలమైందని... పరిస్థితులకు తగినట్లుగా మన ఆటను మార్చుకోవడమే ఇరు జట్లకు కీలకమని హెడ్ చెప్పాడు.

ఎలాంటి విభేదాలు లేవు...

పెర్త్ టెస్టులో ఫలితం తర్వాత ఆ్రస్టేలియా జట్టులోని ఆటగాళ్ల మధ్య విభేదాలు వచ్చాయంటూ వినిపిస్తున్న వార్తలను హెడ్ కొట్టిపారేశాడు. ఓటమి తర్వాత బ్యాటర్లదే తప్పు అన్నట్లుగా పేసర్ హాజల్‌వుడ్ పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీశాయి. 'ఏ జట్టులోనైనా గెలుపోటముల్లో బ్యాటర్లు, బౌలర్లందరి సమాన బాధ్యత ఉంటుంది. ఏ ఆటగాడైనా విజయం కోసం తాను వ్యక్తిగతంగా కూడా కీలకపాత్ర పోషించేందుకు ప్రయత్నిస్తాడు. మేం భారీ స్కోరు చేస్తే బౌలర్ల పని సులువవుతుందని తెలుసు. కాబట్టి సమష్టిగా ఉండటం తప్ప విభేదాలనే మాటకు తావు లేదు. మేం 0–1తో వెనుకబడి ఉన్నామనేది వాస్తవం. కానీ మాకు ఇంకా చాలా అవకాశం ఉంది. ఎన్నోసార్లు ప్రతికూల పరిస్థితుల్లో కోలుకొని చెలరేగిన సత్తా మా సొంతం' అని హెడ్ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశాడు.

ఆసియా ఈ-స్పోర్ట్స్‌లో పవన్‌కు కాంస్యం



న్యూఢిల్లీ: తెలంగాణకు చెందిన పవన్ కంపెల్లి ఆసియా ఈస్పోర్ట్స్ క్రీడల్లో పతకంతో మెరిశాడు. ఈస్పోర్ట్స్‌లో పతకం గెలిచిన తొలి భారతీయుడుగా పవన్ ఘనతకెక్కాడు. బ్యాంకాక్‌లో జరిగిన ఈ ఈవెంట్‌లో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన పవన్ ఈ–ఫుట్‌బాల్‌లో కాంస్య పతకం సాధించాడు. 'మిస్టర్ టామ్‌బాయ్'గా పేరొందిన అతను... 2022 ఈ–ఫుట్‌బాల్ వరల్డ్ ఫైనల్స్ విజేత అస్గర్ అజిజి (ఇండోనేసియా)పై గెలుపొందాడు. ఆసియాకు చెందిన పలువురు ఈ–ఫుట్‌బాల్ ప్లేయర్లతో తలపడిన పవన్ నిలకడైన విజయాలతో పతకం సాధించాడు. కాంస్య విజేత అయిన పవన్‌కు 500 అమెరికా డాలర్లు (రూ. 42, 367) ప్రైజ్‌మనీగా లభించాయి. 'భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమే గొప్ప గౌరవం. ఇందులో పతకం దక్కడం అమితానందాన్నిచ్చింది' అని పవన్ అన్నాడు.

స్నూకర్ దిగ్గజం గ్రిఫిత్ కన్నుమూత



వేల్స్: బ్రిటన్‌కు చెందిన ప్రపంచ స్నూకర్ మాజీ చాంపియన్, దిగ్గజం టెర్రీ గ్రిఫిత్ కన్నుమూశారు. వయోభార సంబంధిత అనారోగ్య కారణాలతో 77 ఏళ్ల గ్రిఫిత్ సోమవారం ఉదయం మృతి చెందారు. అతని కుమారుడు వేన్ తన తండ్రి మరణ వార్తను ఈ మేరకు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశాడు. ఓ క్వాలిఫయర్‌గా ప్రపంచ చాంపియన్‌షిప్‌లోకి అడుగుపెట్టి విజేతగా ఆవిర్భవించిన ఘనత గ్రిఫిత్ సొంతం చేసుకున్నాడు. 1970 దశకం చివర్లో, 80 దశకంలో మేటి స్నూకర్ చాంపియన్‌గా ఎదిగాడు. 1979లో తొలిసారి ప్రపంచ చాంపియన్‌గా అవతరించాడు. 'ట్రిపుల్ క్రౌన్' గెలిచిన 11 మందిలో గ్రిఫిత్ ఒకడిగా నిలిచాడు. స్నూకర్ క్రీడలో మాస్టర్స్, యూకే చాంపియన్‌షిప్, ప్రపంచ చాంపియన్‌షిప్ ఈ మూడు గెలిస్తే 'ట్రిపుల్ క్రౌన్' విజేతగా అభివర్ణిస్తారు. గ్రిఫిత్ ప్రపంచ చాంపియన్‌షిప్ గెలిచిన మరుసటి ఏడాది 1980లో మాస్టర్స్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. రెండేళ్ల తర్వాత 1982లో యూకే చాంపియన్‌షిప్ నెగ్గాడు. సాధారణంగా బిలియర్డ్స్, స్నూకర్ ఆడేవాళ్లంతా సంపన్నులే ఉంటారు. కానీ గ్రిఫిత్ మాత్రం సాధారణ వ్యక్తి. 15 ఏళ్ల వయసులో గనుల్లో పనిచేశాడు. తదనంతరం బస్ కండక్టర్, ఇన్సురెన్స్ ఏజెంట్, పోస్ట్‌మన్‌గానూ బతుకుబండి లాగించాడు. 1978లో ప్రొఫెషనల్ స్నూకర్ ప్లేయర్‌గా ఎదిగాడు. ఆ మరుసటి ఏడాది ప్రపంచ చాంపియన్‌గా నిలువడంతో రాత మారిపోయింది.

పదేళ్ల తర్వాత ఆటోగ్రాఫ్!

కాన్‌బెర్రా: ప్రైమ్ మినిస్టర్స్ ఎలెవన్‌తో ఆదివారం భారత్ ప్రాక్టీస్ మ్యాచ్ ముగిసింది. విజయానంతరం భారత కెప్టెన్ రోహిత్ శర్మ ప్రేక్షకుల గ్యాలరీ వద్దకు వచ్చి ఆటోగ్రాఫ్‌లు ఇస్తున్నాడు. అదే సమయంలో మరోవైపు నుంచి రోహిత్... రోహిత్ అంటూ అభిమానులు కేకలు వేశారు. ముందుగా రోహిత్ కూడా ఇది సహజమే అన్నట్లుగా దీనిని పట్టించుకోలేదు. కానీ ఆ వ్యక్తి 'రోహిత్ భాయ్ ప్లీజ్...ఇప్పటికే పదేళ్లు గడిచిపోయాయి. ముంబై రాజా రోహిత్' అంటూ అతను అరిచాడు. దాంతో రోహిత్ మొహంలో చిరునవ్వు కనిపించింది. వెనక్కి తిరిగి అతని వైపు వచ్చిన రోహిత్ బ్యాట్‌పై తన ఆటోగ్రాఫ్ ఇచ్చాడు. తాను గత పదేళ్లుగా రోహిత్ ఆటోగ్రాఫ్ కోసం ఎదురు చూస్తున్నట్లు అతను చెప్పాడు. తన మినియేచర్ బ్యాట్‌పై రోహిత్



సంతకం పెట్టగానే ఆ వ్యక్తి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. అక్కడే ఉన్న ఇతర ఫ్యాన్స్ కూడా చప్పట్లతో హోరెత్తిస్తూ అతడిని అభినందించడం విశేషం. 'ఆ అభిమానికి అదృష్టం కలిసొచ్చిన రోజు ఇది' అంటూ బీసీసీఐ ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

వెర్‌స్టాపెన్‌కు తొమ్మిదో విజయం

దోహా: ఇప్పటికే ఈ ఏడాది ఫార్ములావన్ ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్ ఖరారు చేసుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ తన ఖాతాలో తొమ్మిదో విజయం నమోదు చేసుకున్నాడు. సీజన్‌లోని 23వ రేసు ఖతార్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. నిర్ణీత 57 ల్యాప్‌ల ఈ రేసును వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 31 నిమిషాల 05.323 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని అందుకున్నాడు. లెక్‌లెర్క్ (ఫెరారీ) రెండో స్థానంలో, పియాస్ట్రి (మెక్‌లారెన్) మూడో స్థానంలో నిలిచారు. సీజన్‌లోని చివరిదైన 24వ రేసు అబుదాబి గ్రాండ్‌ప్రి 8న జరుగుతుంది. గతవారం లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రిలో టాప్–5లో నిలిచిన వెర్‌స్టాపెన్ వరుసగా నాలుగో ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్‌ను ఖరారు చేసుకున్నాడు.



బుమ్రా మార్గనిర్దేశనంలోనే...

తొలి టెస్టులో రాణించానన్న సిరాజ్

- 'పింక్ బాల్'తో ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టిన పేసర్

కాన్‌బెర్రా: స్వదేశంలో భారత జట్టు ఆడిన గత ఐదు టెస్టుల్లో నాలుగింటిలో హైదరాబాద్ పేసర్ మొహమ్మద్ సిరాజ్ బరిలోకి దిగాడు. వీటిలో అతను మొత్తం ఆరు వికెట్లు పడగొట్టగలిగాడు. ఈ పేలవ ఫామ్‌తో ఆ్రస్టేలియా గడ్డపై అడుగు పెట్టిన అతను తొలి టెస్టులోనే తన సత్తా చూపించాడు. ఐదు వికెట్లతో పెర్త్ టెస్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఆ మ్యాచ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన జస్‌ప్రీత్ బుమ్రా అండతోనే తాను మళ్లీ లయ అందుకున్నట్లు సిరాజ్ వెల్లడించాడు. 'నేను తరచుగా నా బౌలింగ్ గురించి బుమ్రాతో చర్చిస్తూనే ఉంటా. తొలి టెస్టుకు ముందు కూడా నా పరిస్థితి గురించి అతనికి వివరించా. బుమ్రా నాకు ఒకటే విషయం చెప్పాడు. ఎలాగైనా వికెట్ సాధించాలనే లక్ష్యంతో దాని గురించే అతిగా ప్రయత్నించవద్దు. నిలకడగా ఒకే చోట బంతులు వేస్తూ బౌలింగ్‌ను ఆస్వాదించు. అప్పటికీ వికెట్లు లభించకపోతే నన్ను అడుగు అని బుమ్రా చెప్పాడు. అతను చెప్పిన మాటలను పాటించా. వికెట్లు కూడా దక్కాయి' అని సిరాజ్ తన సీనియర్ పేసర్ పాత్ర గురించి చెప్పాడు. భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా తనతో దాదాపు ఇవే మాటలు చెప్పి ప్రోత్సహించాడని కూడా సిరాజ్ పేర్కొన్నాడు. ఆరంభంలో సిరాజ్ కెరీర్‌ను తీర్చిదిద్దడంతో భారత మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ కీలకపాత్ర పోషించాడు. అందుకే ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అరుణ్‌ను సంప్రదించడం సిరాజ్‌కు అలవాటు. 'సుదీర్ఘ కాలంగా నా బౌలింగ్ గురించి ఆయనకు బాగా తెలుసు. అందుకే నాకు ఇలా ఎందుకు జరుగుతోంది అంటూ అరుణ్ సర్‌ను అడిగా. ఆయన కూడా వికెట్లు తీయడంకంటే ఒక బౌలర్ తన బౌలింగ్‌ను ఆస్వాదించడం ఎంతో కీలకమో, ఫలితాలు ఎలా వస్తాయో చెప్పారు' అని వెల్లడించిన సిరాజ్... స్ట్రేలియాకు బయలుదేరడానికి ముందు భారత ఫీల్డింగ్ కోచ్, హైదరాబాద్‌కే చెందిన దిలీప్‌తో కలిసి సాధన చేసిన విషయాన్ని కూడా గుర్తు చేసుకున్నాడు. మరోవైపు అడిలైడ్‌లో జరిగే రెండో టెస్టు కోసం 'పింక్ బాల్'తో



సిద్ధమవుతున్నట్లు సిరాజ్ చెప్పాడు. 'గులాబీ బంతి సింథటిక్ బంతి తరహాలో అనిపిస్తోంది. ఎరుపు బంతితో పోలిస్తే భిన్నంగా, గట్టి సీమ్‌తో ఉంది. నా దృష్టిలో ఈ బాల్‌తో షార్ట్ ఆఫ్ లెంగ్త్ తరహాలో బంతులు వేస్తే బాగుంటుంది. దీంతో ఎంత ఎక్కువ సాధన చేస్తే అంత పట్టు చిక్కుతుంది. అయితే లైట్లు ఉన్నప్పుడు ఎక్కువగా స్వింగ్ అవుతుందని విన్నా. నేను అలాంటి స్థితిలో ఎప్పుడూ ప్రాక్టీస్ చేయలేదు. అడిలైడ్‌లో అలాంటి వాతావరణంలో ప్రాక్టీస్ చేస్తా' అని సిరాజ్ వివరించాడు.

భారత్ X హాంకాంగ్

న్యూఢిల్లీ: ఆసియా మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ నేడు ప్రారంభంకానుంది. తొలి లీగ్ మ్యాచ్‌లో హాంకాంగ్‌తో భారత జట్టు తలపడనుంది. తొలిసారి ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యమిస్తున్న భారత జట్టుకు దీక్షా కుమారి కెప్టెన్‌గా వ్యవహరించనుంది. గ్రూప్ 'బి'లో భారత్, హాంకాంగ్‌లతో పాటు జపాన్, ఇరాన్ జట్లున్నాయి.



నెట్‌ను ముద్దాడుతున్న డెల్ పొట్రో

జొకోవిచ్‌పై 'ఆఖరి సవాల్' గెలిచి...

టెన్నిస్‌కు డెల్ పొట్రో వీడ్కోలు

- గాయాలతో నిలకడలేమి
- కెరీర్‌లో 22 టైటిల్స్ హస్తగతం
- 2009లో నాదల్, ఫెడరర్‌లను ఓడించి యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ సొంతం

బ్యూనస్‌ఎయిర్స్ (అర్జెంటీనా): శక్తివంతమైన సర్వీస్‌లకు పెట్టింది పేరు... బుల్లెట్‌లా దూసుకుపోయే ఫోర్‌హ్యాండ్ షాట్‌లు... ఏ క్షణంలోనైనా మ్యాచ్‌ను తన వైపునకు తిప్పుకోగల సమర్థుడు... 97 కేజీల బరువు... 6 అడుగుల 6 అంగుళాల ఆజానుబాహుడు... అతనే అర్జెంటీనా వెటరన్ టెన్నిస్ స్టార్ యువాన్ మార్టిన్ డెల్ పొట్రో. ఎంతో సత్తా ఉన్నా గాయాల కారణంగా కెరీర్‌ను కొనసాగించలేక ఎట్టకేలకు ఆటకు టాటా చెప్పేశాడు. సొంతగడ్డపై అభిమానుల సమక్షంలో చివరి మ్యాచ్‌లో టెన్నిస్ దిగ్గజం జొకోవిచ్‌పై గెలిచి డెల్ పొట్రో కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మాజీ ప్రపంచ మూడో ర్యాంకర్ డెల్ పొట్రో 6–4, 7–5తో వరుస సెట్లలో సెర్బియా దిగ్గజంపై గెలిచాడు. 'ది లాస్ట్ చాలెంజ్' (ఆఖరి సవాల్) పేరిట జరిగిన ఈ ఎగ్జిబిషన్ మ్యాచ్‌కు అర్జెంటీనా మహిళా టెన్నిస్ స్టార్ గాబ్రియేలా సబటినితోపాటు పలువురు సెలబ్రిటీలు, శ్రేయోభిలాషులు, కుటుంబసభ్యులు విచ్చేశారు. దీంతో వీడ్కోలుకు వేదికైన పార్కే రోకా స్టేడియం కిక్కిరిసిపోయింది. అంతిమ సమరంలో విజయానంతరం అభిమానులు, ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య డెల్ పొట్రో తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. కోర్టులో నెట్‌ను ముద్దాడాడు. చెమర్చిన కళ్లతో వున్న అర్జెంటీనా స్టార్‌ను అనునయిస్తూ జొకోవిచ్ అభినందించాడు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ 'యువాన్‌ను ప్రేమించని వారంటూ ఉండరు. అందరు అభిమానించే ఆటగాడు అతను. అతని జీవితంలో అతిపెద్ద విజయం ఏదైనా ఉందంటే అది అతని వ్యక్తిత్వమే' అని 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్ల విజేత, ఆల్‌టైమ్ గ్రేటెస్ట్‌లలో ఒకడైన సెర్బియన్ సూపర్‌స్టార్ డెల్ పొట్రోను ఆకాశానికెత్తాడు.

2009లో జరిగిన యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో రాఫెల్ నాదల్ (స్పెయిన్), రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్)లను వరుసగా సెమీఫైనల్, ఫైనల్లో ఓడించిన డెల్‌పొట్రో తన కెరీర్లోనే ఏకైక గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించి అందరి దృష్టిలో పడ్డాడు.



2009 యూఎస్ ఓపెన్ రన్నరప్ ఫెడరర్‌తో చాంపియన్ డెల్ పొట్రో

కానీ గాయాలు అతన్ని కుదురుగా ఆడనివ్వలేకపోవడంతో కెరీర్ ఆసాంతం ఫిట్‌నెస్ సమస్యలతోనే సతమతమయ్యాడు. అతను చివరిసారిగా రెండేళ్ల క్రితం అంతర్జాతీయ టెన్నిస్ మ్యాచ్ ఆడాడు. ఓవరాల్‌గా 22 టైటిళ్లను గెలుచుకున్నాడు. 36 ఏళ్ల డెల్ పొట్రో కెరీర్‌లో రెండు ఒలింపిక్ పతకాలు కూడా ఉన్నాయి. 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన డెల్ పొట్రో 2016 రియో ఒలింపిక్స్‌లో రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. 2016లో పురుషుల ప్రపంచ టీమ్ టెన్నిస్ చాంపియన్‌షిప్ 'డేవిస్ కప్' టైటిల్ అర్జెంటీనాకు దక్కడంలో డెల్ పొట్రో కీలకపాత్ర పోషించాడు. మిగతా గ్రాండ్‌స్లామ్ టోర్నీల విషయానికొస్తే... రెండుసార్లు ఆ్రస్టేలియన్ ఓపెన్‌లో (2009, 2012)... రెండుసార్లు ఫ్రెంచ్ ఓపెన్‌లో (2009, 2018) క్వార్టర్ ఫైనల్ వరకు చేరాడు. వింబుల్డన్ టోర్నీలో (2013) ఒకసారి సెమీఫైనల్లోకి ప్రవేశించాడు.



జొకోవిచ్, సబటిని, డెల్ పొట్రో

3 డెల్ పొట్రో సాధించిన కెరీర్ బెస్ట్ ర్యాంక్. 2018లో అత్యుత్తమంగా మూడో స్థానానికి చేరుకున్నాడు.

439 అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) టూర్‌లో డెల్ పొట్రో గెలిచిన మ్యాచ్‌లు.

174 అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) టూర్‌లో డెల్ పొట్రో ఓడిన మ్యాచ్‌లు.

4418 డెల్ పొట్రో తన కెరీర్‌లో సంధించిన ఏస్‌లు.

2,58,96,046 డాలర్లు (రూ. 219 కోట్లు) డెల్ పొట్రో కెరీర్‌లో సాధించిన మొత్తం ప్రైజ్‌మనీ



పాండా ఇతివృత్తంతో సోమవారం హాంకాంగ్‌లో 'పాండా గో..! పేరుతో ఎగ్జిబిషన్ ఏర్పాటైంది. కార్యక్రమానికి ఆహ్వానం పలుకుతూ హాంకాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సుమారు 2,500 పాండా బొమ్మలను ఇదిగో ఇలా ఏర్పాటు చేశారు.

ప్రాణాలు తీస్తున్న బ్లీడింగ్ ఐ

వైరస్ ధాటికి రువాండాలో 15 మంది దుర్మరణం

కిగలీ(రువాండా): రక్తనాళాలను ధ్వంసం చేస్తూ రక్తస్రావానికి కారణమయ్యే ప్రమాదకర మార్బర్గ్ వైరస్ రువాండా దేశంలో ప్రాణాలు తీస్తోంది. ఇప్పటికే ఈ వైరస్ సోకి 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకా వందల మందికి ఇప్పటికే ఈ వైరస్‌సోకి ఉంటుందని రువాండా అధికారులు భావిస్తున్నారు. విపరీతమైన జ్వరం, రక్తధారలకు కారణమవడంతో ఈ వైరస్‌ను 'బ్లీడింగ్ ఐ'వైరస్‌గానూ పిలుస్తారు. మార్బర్గ్ వైరస్ సోకితే 88 శాతం వరకు మరణం సంభవించే అవకాశం ఉంది. ఫలాలను తినే గబ్బిలాల్లో మార్బర్గ్ వైరస్ సహజంగా ఉంటుంది. ఇది ఎబోలా జాతికి చెందిన వైరస్. ఓరోపైచ్ జ్వరం, ఎంపాక్స్‌కు కారణమయ్యే వైరస్‌ల వ్యాప్తితో బాధపడుతున్న 17 ఆఫ్రికా దేశాల్లో తాజాగా ప్రయాణికుల రాకపోకలపై ప్రభుత్వాలు అడ్వైజరీని విడుదలచేశాయి. బ్లీడింగ్ ఐ వైరస్‌కూ దాదాపు ఎబోలా వైరస్ లక్షణాలే ఉంటాయి. బ్లీడింగ్ ఐ వైరస్ సోకితే గొంతు నొప్పి, జ్వరం, చలి, తలనొప్పి, దగ్గు, కండరాల నొప్పి, దద్దుర్లు వస్తాయి. కొన్నిసార్లు ఛాతి నొప్పి, వాంతులు, విరేచనాలు, తల తిరగడం, బరువు తగ్గడం, రక్తవిరేచనాలు ఉంటాయని క్లెవ్‌ల్యాండ్ క్లినిక్ పరిశోధనలో తేలింది. మార్బర్గ్ వైరస్‌కు స్పష్టంగా ఎలాంటి యాంటీవైరల్ చికిత్స లేదు. ముందస్తు వ్యాక్సిన్లు లేవు. వైరల్ జ్వరం మాదిరిగా చికిత్సావిధానాలనే ప్రస్తుతం అవలంబిస్తున్నారు.



చదరంగం ఆట ప్రారంభానికి ముందు ఈ చిన్నారులు షేక్ హ్యాండ్ ఇచ్చుకుంటున్నారు. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలోని కన్యరుచిన్యా ప్రాంతంలోని సాగా చెస్ క్లబ్‌లో తీసిన చిత్రమిది. కల్లోలిత ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారి పిల్లల కోసం ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశారు.

4 వేల కోట్ల విలువైన కొకైన్ పట్టుకున్న ఆస్ట్రేలియా పోలీసులు

క్వీన్స్‌ల్యాండ్: ఆస్ట్రేలియా పోలీసులు దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా పెద్ద మొత్తంలో కొకైన్‌ను పట్టుకున్నారు. క్వీన్స్‌ల్యాండ్ తీరంలో మత్స్యకారుల పడవలో తరలిస్తున్న సుమారు 4 వేల కోట్లకు పైగా విలువైన 2.3 టన్నుల ఈ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు బాలురు సహా 13 మందిని ఈ సందర్భంగా అదుపులోకి తీసుకున్నారు. వీరంతా కొకైన్ బండిళ్లను మరో పెద్ద షిప్పులోకి మార్చేందుకు వెళ్తుండగా తీరానికి 10 నాటికల్ మైళ్ల దూరంలో పడవ ముక్కలైందని పోలీసులు సోమవారం తెలిపారు. దేశంలోకి మోటారుసైకిళ్ల గ్యాంగొకటి దేశంలోకి డ్రగ్స్‌ను దొంగచాటుగా తెచ్చేందుకు ప్రయత్నిస్తోందంటూ అందిన నిఘా వర్గాల సమాచారంపై తాము కొన్ని నెలలుగా వేట సాగిస్తున్నామని, చివరికి స్మగ్లర్ల పన్నాగం ఇలా భగ్నమైందని పేర్కొన్నారు. ఈ ముఠా సభ్యులు ఎంతకైనా తెగిస్తారని చెప్పారు. నేరం రుజువైతే వీరందరికీ జీవిత కాల జైలు శిక్ష పడే అవకాశముందన్నారు.

ఆయుధ పరిశ్రమ ఆదాయం రూ.53 లక్షల కోట్లు

యుద్ధాల నేపథ్యంలో 4 శాతం పెరుగుదల

- ఆయుధ మార్కెట్‌పై అమెరికాదే ఆధిపత్యం
- 2023లో 317 బిలియన్ డాలర్ల ఆర్జన

స్టాక్‌హోం: యుద్ధాలు, ప్రాంతీయ ఘర్షణల నేపథ్యంలో ప్రపంచ ఆయుధ పరిశ్రమ ఆదాయం 2023లో 632 బిలియన్ డాలర్లకు (రూ.53 లక్షల కోట్లు) పెరిగింది. 2022తో పోలిస్తే ఇది 4.2 శాతం అధికం. ఆయుధ రంగంలో అమెరికా ఆధిపత్యం కొనసాగుతోంది. లాక్‌హీడ్ మార్టిన్, రేథియోన్ వంటి యూఎస్ ఆయుధ కంపెనీలే అధికాదాయం పొందాయి. స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిప్రి) నివేదిక ప్రకారం టాప్ 100 కంపెనీల్లో 41 కంపెనీలు 317 బిలియన్ డాలర్ల ఆదాయం పొందాయి. ఇది గతేడాది కంటే 2.5 శాతం ఎక్కువ. ఆయుధ పరిశ్రమలో రెండో అతి పెద్ద దేశమైన చైనా టాప్ 100 జాబితాలోని తొమ్మిది కంపెనీల నుంచి 103 బిలియన్ డాలర్లను ఆర్జించింది. అయితే ఆర్థిక పరిమితులు, ఇతర సవాళ్లతో దాని వృద్ధి 0.7 శాతం తగ్గింది.

స్వావలంబన దిశగా భారత్

భారత ఆయుధ పరిశ్రమకు 2023లో 6.7 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చింది. 2022తో పోలిస్తే ఇది 5.8 శాతం ఎక్కువ. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రయోజనం పొందాయి. చైనాతో సరిహద్దు ప్రతిష్టంభన, విదేశీ ఆయుధ సరఫరాదారులపై ఆధారపడటాన్ని తగ్గించాల్సిన అవసరం స్వయం సమృద్ధికి ఆజ్యం పోశాయి. భారత్, తుర్కియే దేశీయ ఆయుధోత్పత్తిని విస్తరించి స్వావలంబనపై దృష్టి సారించాయి.

ఘర్షణల నేపథ్యంలో పెరిగిన ఉత్పత్తి

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచ ఆయుధ ఉత్పత్తిని పెంచడంలో ముఖ్య పాత్ర పోషించింది. డిమాండ్‌కు అనుగుణంగా యూరప్, అమెరికా, తుర్కియేలోని రక్షణ సంస్థలు ఆయుధ తయారీని పెంచాయి. పలు దేశాల రక్షణ సంస్థల్లో ఆయుధాల అమ్మకాలు పెరిగాయి. తుర్కియే రక్షణ సంస్థ బేకర్ ఆదాయం 25 శాతం పెరిగి 1.9 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది ఎక్కువగా డ్రోన్లను ఎగుమతి చేసింది. చైనాతో ఉద్రిక్తతల మధ్య తైవాన్ రక్షణ వ్యయాన్ని పెంచడంతో ఆ దేశ ఎన్సీఎస్ఐఎస్టీ ఆదాయం 27 శాతం పెరిగి 3.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. యూకే సంస్థ అయిన అటామిక్ వెపన్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆదాయం 16 శాతం పెరిగి 2.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా ఆయుధ ఆదాయాన్ని ఎలా నడిపిస్తున్నాయో సిప్రి నివేదిక ఎత్తిచూపింది.

మస్క్ చెప్పింది నిజమే

- రక్షణపై అమెరికా దుబారా
- డెమొక్రాట్ నేత శాండర్స్

వాషింగ్టన్: అపర కుబేరుడు ఎలాన్ మస్క్‌పై స్వతంత్ర సెనేటర్ బెర్నీ శాండర్స్ ప్రశంసలు కురిపించారు. రక్షణపై అమెరికా చేసిన 886 బిలియన్ డాలర్ల వ్యయాన్ని తప్పుబడుతూ మస్క్ చేసిన విమర్శలు సరైనవేనని డెమొక్రటిక్ పార్టీ మద్దతుదారైన శాండర్స్ అన్నారు. జో బైడెన్ ప్రభుత్వం రక్షణపై అనవసరంగా అధిక వ్యయం చేస్తోందంటూ ఎక్స్‌లో విమర్శలు గుప్పించారు. ''మస్క్ చెప్పింది నిజమే. 886 బిలియన్ డాలర్ల రక్షణబడ్జెటా? దాని ఆడిట్లో ప్రభుత్వం వరుసగా ఏడోసారీ విఫలమైంది. బిలియన్ల డాలర్లు లెక్క తెలియకుండా పోయాయి''అంటూ దుమ్మెత్తిపోశారు. ప్రభుత్వ విభాగాల పునర్ వ్యవస్థీకరణకు, వృథా ఖర్చులను తగ్గింపుకు మస్క్, వివేక్ రామస్వామి సారథ్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ(డీఓజీఈ)ని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేయడం తెలిసిందే. రక్షణ వ్యయాన్ని తగ్గించడానికి డీఓజీఈతో కలిసి పని చేస్తామని అధికార డెమొక్రటిక్ పార్టీ ప్రతినిధి రో ఖన్నా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. రక్షణ శాఖ గత ఆరేడు ఆడిట్లలో విఫలమైందని ఆయన కూడా విమర్శించడం విశేషం. ఖన్నా వాదనతో ఏకీభవిస్తూ మస్క్ పోస్ట్ పెట్టారు. అనంతరం శాండర్స్ కూడా ఖన్నాతో గొంతు కలిపారు.

ప్రాణాలు తీసిన ఫుట్‌బాల్ మ్యాచ్

- తొక్కిసలాటలో 56 మంది దుర్మరణం
- ఆఫ్రికా దేశం గినియాలో విషాదం

కొనాక్రీ: ఆఫ్రికా దేశం గినియాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రెండు స్థానిక జట్ల మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌లో అభిమానుల కొట్లాట తొక్కిసలాటకు దారి తీసింది. ఈ అనూహ్య ఘటనలో పలువురు చిన్నారులు సహా 56 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో జనం గాయాలతో ఆస్పత్రుల పాలయ్యారు. దక్షిణ ప్రాంత ఎన్‌జెరెకొరె నగరంలోని స్టేడియంలో ఆదివారం దేశ మిలటరీ నేత మమడి గౌరవార్థం స్థానిక జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. రిఫరీ పెనాల్టీ షూటౌట్ నిర్ణయం వివాదానికి దారి తీసింది. రెండు జట్ల అభిమానులు గ్రౌండ్‌లోకి దూసుకొచ్చారు. వీరిని అదుపు చేసేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. దీంతో, స్టేడియంలోని జనం ఒక్కసారిగా బయటకు వెళ్లేందుకు ప్రయత్నించడం తొక్కిసలాటకు దారితీసింది. ఘటనలో 56 మంది చనిపోగా పెద్ద సంఖ్యలో జనం గాయపడ్డారని స్థానిక మీడియా తెలిపింది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చిన అనంతరం పెద్ద సంఖ్యలో జనం నేలపై పడిపోయిన దృశ్యాలు, కొందరు వారికి సాయం చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి. సైనిక నేత మమడి రాజకీయ లబ్ధి కోసమే అక్రమంగా ఈ మ్యాచ్ ఏర్పాటు చేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

ఫెంగల్‌తో అపారనష్టం

తిరువణ్ణామలైలో భారీ నష్టం


- కొండ చరియలు విరిగిపడిన ఘటనలో ఏడుగురు మృతి

సాక్షి, చెన్నై: ఫెంగల్ తుపాన్ తమిళనాడులో అపార నష్టాన్ని సృష్టించింది. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి, తమిళనాడులోని విల్లుపురం, కడలూరు, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై జిల్లాలో పెను విలయాన్ని మిగిల్చింది. ఇక్కడ 1,29,000 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. విల్లుపురం, కడలూరులలో ఆస్తి నష్టం అపారమే. అనేక గ్రామాలు నీట మునిగి ఉన్నాయి. సాయం కోసం గ్రామీణ జనం ఎదురుచూస్తున్నారు. సీఎం స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయ నిధి స్టాలిన్‌తో పాటుగా మంత్రులు బాధిత ప్రాంతాలలో తిష్ట వేశారు. ఈ పరిస్థితులలో సోమవారం తిరువణ్ణామలైలలో మరింతగా వర్షం పడింది. కృష్ణగిరి, ధర్మపురి జిల్లాలో అతి భారీ వర్షం బలహీన పడ్డ ఫెంగల్ కదలిక రూపంలో ఎదురైంది. కృష్ణగిరి ఊత్తంకరైలో పార్కింగ్‌లో ఉన్న రెండు టిప్పర్ లారీలు, 20 కార్లు సహా పలు వాహనాలు వరద ఉధృతికి కొట్టుకెళ్లాయి. సేలం జిల్లాలోనూ భారీ వర్షం కురిసింది.

ఏడు మృతదేహాలు వెలికితీత

తిరువణ్ణామలై మహ దీపం కొండపై నుంచి మట్టి చరియలు , బండరాళ్లు కొట్టుకు వచ్చి ఆదివారం రాత్రి ఇళ్లపై పడ్డ విషయం తెలిసిందే. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ఈ శిథిలాల కింద చిక్కుకున్నారు.వీరిని ప్రాణాలతో రక్షించేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అయితే, సోమవారం రాత్రి మృత దేహాలుగా వారంతా బయట పడ్డారు.మృతులలో రాజ్ కుమార్(32), ఆయన భార్య మీనా (26), కుమారుడు గౌతమ్ (9), కుమార్తె ఇనియ (7) ఉన్నారు. బంధువుల పిల్లలు మహా(12), రమ్య (12), వినోదిని (14) ఉన్నారు. పిల్లలందరూ ఇంట్లో ఆదివారం రాత్రి ఆడుకుంటుండగా ఈ ప్రమాదం జరిగింది.

ఇక్కడి ఏర్పాడు మార్గంలో 20 చోట్ల కొండ చరియలు, మట్టి చరియలు విరిగి పడటమే కాకుండా వరద ఉధృతికి రోడ్లు కొట్టుకుపోయాయి. నీలగిరి, కోయంబత్తూరు ,దిండుగల్, తేని జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి.



2010లో నాసా ప్రయోగించిన ఆర్బిటార్ పంపిన చిత్రం ఆధారంగా యూకే కళాకారుడు లూక్ జెర్రమ్ రూపొందించిన ఏడు మీటర్ల వైశాల్యమున్న చంద్రుని మోడల్ ఇది. అస్సాంలోని గువాహటి ఐఐటీలో ఏర్పాటైన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో ఇది ప్రధాన ఆకర్షణగా మారింది.

జియా కుమారుడు నిర్దోషి

మరో 48 మంది కూడా

- గ్రెనేడ్ దాడి కేసులో బంగ్లా కోర్టు తీర్పు
- 2004లో షేక్ హసీనా ర్యాలీపై దాడి
- 24 మంది మృతి, 300 మందికి గాయాలు
- ప్రస్తుతం లండన్‌లో ప్రవాసంలో రెహ్మాన్
- వచ్చే ఎన్నికల్లో బీఎన్పీ గెలిస్తే ప్రధాని అయ్యే అవకాశం

ఢాకా: 2004 నాటి గ్రెనేడ్ దాడి కేసులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్‌తో పాటు మరో 48 మందిని నిర్దోషులుగా కోర్టు ప్రకటించింది. 2004లో అప్పటి విపక్ష నేత షేక్ హసీనా మద్దతుదారులు నిర్వహించిన ర్యాలీపై జరిగిన ఆ దాడిలో 24 మంది మరణించగా 300 మందికి పైగా గాయపడ్డారు. ఆ సమయంలో ఖలీదా ప్రధానిగా ఉన్నారు. ఈ కేసులో రెహమాన్‌తో పాటు మరో 48 మందిని దోషులుగా 2018లో ట్రయల్ కోర్టు నిర్ధారించింది. వారిలో 19 మందికి కోర్టు మరణశిక్ష విధించింది. రెహ్మాన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఈ తీర్పు రాజకీయ ప్రేరేపితమని జియా పార్టీ ఆరోపించింది. శిక్షను సవాలు చేస్తూ దాఖలైన అప్పీలును ఆదివారం విచారించిన హైకోర్టు మొత్తం 49 మందికీ శిక్షలను రద్దు చేసింది. నాటి విచారణ, తీర్పు చట్టవిరుద్ధమని ప్రకటించింది. తారిఖ్ ప్రస్తుతం లండన్‌లో ప్రవాసంలో ఉన్నారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ)కి తాత్కాలిక చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. ఎన్నికలు జరిగి పార్టీ అధికారంలోకి వస్తే ఆయనే దేశాధినేత అయ్యే అవకాశముంది. కోర్టు తీర్పును బీఎన్పీ స్వాగతించగా హసీనా పార్టీ అవామీ లీగ్ తీవ్రంగా తప్పుబట్టింది. దోషులను బంగ్లా ప్రజలే శిక్షిస్తారని పేర్కొంది. బంగ్లాదేశ్‌లో త్వరలో ఎన్నికలు జరగాలని రెహమాన్, ఆయన పార్టీ అంటున్నాయి. ముహమ్మద్ యూనస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం మాత్రం అందుకు నిర్దిష్ట కాలపరిమితేమీ ప్రకటించలేదు. ప్రధానిగా ఉన్న షేక్ హసీనా గత ఆగస్టులో తిరుగుబాటు, కుట్ర కారణంగా దేశం వీడి భారత్‌లో తలదాచుకుంటుండటం తెలిసిందే. తిరుగుబాటు సమయంలో జరిగిన మరణాలకు సంబంధించిన నేరాభియోగాలపై విచారణ నిమిత్తం హసీనాను అప్పగించాలని బంగ్లా డిమాండ్ చేస్తోంది. ఆమె అరెస్టుకు ఇంటర్‌పోల్ సాయమూ కోరింది.

మొదలైన రైతన్నల 'ఢిల్లీ ఛలో'

పంటలకు కనీస మద్దతు ధర తదితర డిమాండ్ల సాధనకు రైతుల పాదయాత్ర

- నోయిడా–ఢిల్లీ సరిహద్దు వద్ద భారీగా పోగైన కర్షకులు
- అడ్డగిస్తూ బారికేడ్లతో సిద్ధమైన పోలీసులు

న్యూఢిల్లీ/నోయిడా/అలీగఢ్/బులంద్‌షహర్: పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, సేకరించిన రైతుల భూములకు అదనపు నష్టపరిహారం, ఇతరత్రా లబ్ధి వంటి ప్రధాన డిమాండ్లతో రైతన్నలు మళ్లీ ఢిల్లీ ఛలో పాదయాత్ర మొదలెట్టారు. సోమవారం హరియాణాలోని నోయిడాలో మహామాయా ఫ్లైఓవర్ నుంచి రైతుల పాదయాత్ర మొదలైంది. నిరసన చాలా రోజులు కొనసాగించేందుకు వీలుగా ఆహారం, ఇతర సామగ్రితో చాలా మందిరైతులు ట్రాక్టర్లతో బయల్దేరారు. డిమాండ్ల సాధన కోసం పార్లమెంట్ సమావేశాల వేళ 'ఢిల్లీ ఛలో'పాదయాత్ర చేస్తామని గతంలోనే భారతీయ కిసాన్ పరిషత్(బీకేపీ), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం), సంయుక్త్ కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) తదితర రైతు సంఘాలు ప్రకటించడం తెల్సిందే. బీకేపీ నేత సుఖ్బీర్ ఖలీఫా సారథ్యంలో నోయిడా నుంచి రైతులు బయల్దేరారు. ఢిల్లీ–నోయిడా సరిహద్దుల వద్దకు ఇప్పటికే ఉత్తరప్రదేశ్‌లోని పలు జిల్లాల నుంచి వేలాదిగా రైతులు చేరుకున్నారు. రైతన్నలు గుమిగూడటంతో నోయిడాలోని ఛిల్లా, కాళింది కుంజ్ సరిహద్దు వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. నోయిడా లింక్ రోడ్డులో ఛిల్లా సరిహద్దుకు కిలోమీటర్ దూరంలో దళిత్ ప్రేరణ స్థల్ వద్ద రైతులను పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. వేర్వేరు సరిహద్దుల్లోనూ బ్యారికేడ్లను ఏర్పాటుచేశారు. వేల సంఖ్యలో పోలీసులు మొహరించారు. డ్రోన్లతో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. వాటర్ క్యానన్లను తెప్పించారు. పరిస్థితి ప్రస్తుతం అదుపులోనే ఉందని ఢిల్లీ పోలీసులు తెలిపారు.



నోయిడా వద్ద పోలీసు బారికేడ్లను దాటుకుని వస్తున్న అన్నదాతలు

ప్రజలకు ఇబ్బంది కల్గించొద్దు: సుప్రీంకోర్టు

పంజాబ్ రైతుల డిమాండ్ల సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న పంజాబ్ రైతు నేత జగ్జీత్‌సింగ్ దలేవాల్‌నుద్దేశిస్తూ సుప్రీంకోర్టు సోమవారం మౌఖిక ఆదేశాలిచ్చింది. ''ఖనౌరీ బోర్డర్ వద్ద దీక్ష, నిరసన చేపడుతున్న రైతులు.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్గించకూడదు. ఖనౌరీ బోర్డర్ పంజాబ్‌కు కీలకం. ఇక్కడి నుంచి ప్రజల రాకపోకలకు రైతులు అసౌకర్యం కల్గించకూడదు. తోటి రైతుల ఆమరణ నిరాహార దీక్షలను మాన్పించేలా జగ్జీత్ ఒప్పించాలి''అని జగ్జీత్ తరఫున వాదించిన లాయర్ గునీందర్ కౌర్ గిల్‌కు సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం సూచించింది. అయితే రైతు ప్రతినిధులతో ప్రభుత్వ చర్చలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. అయితే డిమాండ్లు నెరవేర్చడానికి ప్రభుత్వానికి వారం గడువిస్తున్నట్లు రైతులు సోమవారం సాయంత్రం ప్రకటించారు. ప్రభుత్వ వైఖరి తెలిసేదాకా దళిత్ ప్రేరణస్థల్ వద్ద వేచి ఉంటామని సంయుక్త్ కిసాన్ మోర్చా తర్వాత ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎందుకీ ఉద్యమం?

చాలా సంవత్సరాలుగా విడతలవారీగా నోయిడా అథారిటీ, గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ, యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీల కోసం యూపీ, హరియాణాల్లో సేకరించిన రైతుల భూములకు తగు నష్టపరిహారం, అభివృద్ధిచేసిన స్థలాల్లో స్వల్ప కేటాయింపులు, మొత్తం భూమి కోల్పోయిన రైతుల కుటుంబాలకు ఉద్యోగాలు, పరిహారంలో పాత బకాయిలు తదితర డిమాండ్ల సాధన కోసం రైతులు ఉద్యమబాట పట్టారు. భూమికి నష్టపరిహారం 64.7 శాతం పెంచాలని, అభివృద్ధి చేసి ప్లాట్లలో 10 శాతం రైతులకు కేటాయించాలని డిమాండ్‌చేశారు. ఈ అంశం తర్వాత అలహాబాద్ హైకోర్టుకు చేరింది. 2011లో రైతులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీనిపై అథారిటీలు సుప్రీంకోర్టుకు వెళ్లగా 2015 మేలో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. అయితే తీర్పు అమలుకావట్లేదని రైతులు ఉద్యమిస్తున్నారు.

బంగ్లాదేశ్‌కు ఐరాస బలగాలను పంపాలి

- ప్రధాని మోదీ పార్లమెంట్‌లో ప్రకటన చేయాలి
- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ డిమాండ్

కోల్‌కతా: పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి పరిస్థితులను చక్కదిద్దే క్రమంలో తాత్కాలిక ప్రభుత్వంతో సహకరించేందుకు ఐరాస శాంతి పరిరక్షక దళాలను మోహరించాలన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఐరాసలో ప్రయత్నాలు ప్రారంభించాలని సూచించారు. ప్రధాని మోదీ జోక్యం చేసుకుని విదేశీ గడ్డపై ఇబ్బందులు ఎదుర్కొంటున్న భారతీయులను స్వదేశానికి తీసుకు రావాలన్నారు. బంగ్లాదేశ్‌లో పరిస్థితులపై మన వైఖరిని ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోదీ వివరించాలని, లేకుంటే విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేయాలని కోరారు. మమతా బెనర్జీ సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో మాట్లాడుతూ..ద్వైపాక్షిక అంశాలపై తాను మాట్లాడలేనని చెప్పారు. అయితే, అక్కడ చోటుచేసుకుంటున్న పరిణామాలు, అక్కడి నుంచి వచ్చిన బాధితులు, ఇస్కాన్ ప్రతినిధులు తెలిపిన వివరాల మేరకు అసెంబ్లీలో స్పందించాల్సి వచ్చిందన్నారు. బంగ్లాదేశ్‌లో దాడులకు గురైన భారతీయులకు అవసరమైతే పునరావాసం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఆహార పదార్థాలకు ఎటువంటి కొరతా లేదన్నారు.

వక్ఫ్ పేరుతో ముస్లింలను లక్ష్యంగా చేసుకుంది

బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుపై మమత అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ బిల్లు పేరుతో ముస్లింలను లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. ముస్లింలను విభజించి ఏకాకులుగా మార్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ విషయంలో రాష్ట్రాల ఆందోళనలను కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. హిందూ ఆలయ ట్రస్టులు, చర్చిల విషయంలోనూ బీజేపీ ప్రభుత్వం ఇలాగే జోక్యం చేసుకోగలదా అని ఆమె ప్రశ్నించారు. మూడింట రెండొంతుల మెజారిటీ లేని బీజేపీ పార్లమెంట్‌లో ఈ బిల్లును ఆమోదింపజేసుకోగలదా అని ఆమె ప్రశ్నించారు. వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు. బిల్లుపై జేపీసీలో జరిగే చర్చల్లో ప్రతిపక్ష సభ్యులను బీజేపీ మాట్లాడనివ్వడం లేదని, అందుకే టీఎంసీ ఆ కమిటీ నుంచి వైదొలగిందని వివరించారు.

ఇస్కాన్ సభ్యులను అడ్డుకున్న బంగ్లా

ఢాకా: హిందూ ఆధ్యాత్మిక సంస్థ ఇస్కాన్‌కు చెందిన 54 మంది సభ్యులు భారత్ రావడానికి బంగ్లాదేశ్ సరిహద్దు అధికారులు అనుమతి నిరాకరించారు. భారత్‌లో మతపరమైన కార్యక్రమంలో పాల్గొనేందుకు బంగ్లాలోని వివిధ జిల్లాల నుంచి వారు శనివారం రాత్రి, ఆదివారం ఉదయం బెనపోల్ సరిహద్దు క్రాసింగ్ చేరుకున్నారు. గంటల తరబడి నిరీక్షించాక వారికి అనుమతి లేదని అధికారులు చెప్పారు. వారి వద్ద పాస్‌పోర్టులు, వీసాలున్నా భారత్ వెళ్లేందుకు ప్రభుత్వ అనుమతి లేదని పేర్కొన్నారు. ఇస్కాన్‌ను బంగ్లా లక్ష్యంగా చేసుకోవడం, దానితో సంబంధమున్న ప్రముఖులను అరెస్టు చేస్తుండటం, బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తుండటం తెలిసిందే.

బంగ్లా హై కమిషన్ కార్యాలయం వద్ద ఉల్లంఘన..

విదేశాంగ శాఖ ఖండన

అగర్తలా: త్రిపుర రాజధాని అగర్తలాలోని బంగ్లాదేశ్ సహాయ హై కమిషన్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఉల్లంఘనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, పూజారి చిన్మయ్ కృష్ణ దాస్ అరెస్ట్‌లపై సోమవారం ఉదయం హై కమిషన్ కార్యాలయం వద్ద వీహెచ్‌పీ అనుబంధ హిందూ సంఘర్ష్ సమితికి చెందిన కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ హై కమిషన్‌కు వినతి పత్రం అందజేసేందుకు వారు అనుమతి తీసుకున్నారు. అయితే, అనుమతించిన సంఖ్యకు మించి ప్రవేశించిన కొందరు కార్యాలయం ఆవరణలో జై శ్రీరాం అంటూ నినదించారు. ఘటనపై విదేశాంగ శాఖ స్పందించింది. ఈ చర్య శాంతికి విఘాతం కలిగించడమేనని పేర్కొంది. దౌత్య, కాన్సులేట్ కార్యాలయాలు, ఆస్తులను లక్ష్యంగా చేసుకోరాదని స్పష్టం చేసింది.

సర్కారియా కమిషన్ ముఖ్య సిఫార్సులు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

వివాదాలు - సమీక్షా కమిషన్లు

కేంద్ర , రాష్ట్ర సంబంధాల్లో తలెత్తిన వివాదాలను పరిశీలించి, పరిష్కరించడానికి అనేక కమిటీలను, కమిషన్లను నియమించారు. ఈ కమిటీలు వాటికి నిర్దేశించిన పరిధిలో కొన్ని సిఫార్సులు చేశాయి.

వాటిలో ముఖ్యమైనవి...

పరిపాలనా సంస్కరణల సంఘం (1966)

కేంద్ర ప్రభుత్వం 1966లో ఆరుగురు సభ్యులతో మొరార్జీ దేశాయ్ అధ్యక్షతన పరిపాలనా సంస్కరణల కమిషన్‌ను నియమించింది. (మొరార్జీ దేశాయ్ రాజీనామా చేయడం వల్ల కె.హనుమంతయ్య ఈ కమిషన్‌కు చైర్మన్‌గా వ్యవహరించారు). ఈ కమిటీ కేంద్ర రాష్ట్ర సంబంధాలను సమగ్రంగా పరిశీలించింది.

కేంద్ర, రాష్ట్ర సంబంధాల కోసం ఎం.సి. సెతల్వాడ్ అధ్యక్షతన ఒక అధ్యయన బృందాన్ని కూడా నియమించారు. పరిపాలనా సంస్కరణ సంఘం తుది నివేదికను 1969లో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో 22 సిఫార్సులు చేసింది.

- ప్రకరణ 263 ప్రకారం, అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- ప్రజా జీవితంలో, పరిపాలనలో అనుభవం ఉన్న వ్యక్తినే గవర్నర్‌గా నియమించాలి.
- రాష్ట్రాల కోరిక మేరకే కేంద్ర బలగాలను పంపాలి.
- రాష్ట్రాలకు మరిన్ని ఆర్థిక వనరులను బదిలీ చేయాలి.

అయితే ఈ సిఫార్సులపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

రాజమన్నార్ కమిటీ (1969)

1969లో తమిళనాడు ప్రభుత్వం జస్టిస్ పి.వి. రాజమన్నార్ అధ్యక్షతన, ఇద్దరు సభ్యులతో కేంద్ర, రాష్ట్ర సంబంధాల పరిశీలనకు ఒక కమిటీని నియమించింది. ఇది 1971లో నివేదికను సమర్పించింది. దీనిలోని ఇతర సభ్యులు లక్ష్మణస్వామి మొదలియార్, పి. చంద్రారెడ్డి.

ఇది దేశంలో ఉన్న ఏక కేంద్ర ధోరణులకు కారణాలను గుర్తించింది. అవి

- రాజ్యాంగం కేంద్రానికి ఇచ్చిన ప్రత్యేక అధికారాలు
- కేంద్రం, రాష్ట్రంలోనూ ఏక రాజకీయ పార్టీ పాలన
- రాష్ట్రాలకు ఆర్థిక వనరులు తగినన్ని లేకపోవడం, కేంద్రం మీద ఆధారపడటం
- కేంద్ర ప్రణాళిక రచన, ప్రణాళికా సంఘం పాలన

సిఫార్సులు

- రాష్ట్ర మంత్రివర్గంతో లేదా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక ఉన్నతాధికార సంఘంతో సంప్రదించి రాష్ట్రపతి, గవర్నర్‌ను నియమించాలి.
- రాష్ట్ర ప్రభుత్వాన్ని తొలగించి, రాష్ట్రపతి పాలన ప్రకటించే ప్రకరణ 356ను రద్దు చేయాలి.
- గవర్నర్ సంతృప్తి ఉన్నంత వరకే మంత్రివర్గ పదవుల్లో ఉండాలన్న ప్రకరణను తీసివేయాలి.
- కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ అవలంబించే ఏకపక్ష నియంతృత్వ చర్యలను నిరోధించడానికి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి రాష్ట్రాలకు తగినన్ని రక్షణలను కల్పించాలి.
- ప్రధాని అధ్యక్షతన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- రాజ్య సభలో రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి.
- కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రాల వారీగా ప్రాతినిధ్యం ఉండాలి.
- ప్రణాళికా సంఘం ఒక శాశ్వత సంస్థగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వ నియంత్రణ తగ్గాలి.
- అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లను రద్దు చేయాలి.
- అవశిష్ట అధికారాలను రాష్ట్రాలకు బదిలీ చేయాలి.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను ప్రముఖ న్యాయ శాస్త్రవేత్తలు తీవ్రంగా విమర్శించారు.

దేశంలో ఎన్నో వేర్పాటువాద శక్తులు తలెత్తుతుండగా జాతి నిర్మాణం, జాతి సమైక్యతా క్రమంలో విద్య, వ్యవసాయ, ఉత్పత్తి రంగాలను విస్తృతం చేసి సామాన్య మానవుని సమస్యలను తీర్చడంలో ప్రయత్నం చేయాల్సి ఉండగా ప్రాంతీయతత్వాన్ని బలోపేతం చేసే విధంగా సిఫార్సులు చేయడం అవాంఛనీయం అని పేర్కొన్నారు.

ఆనంద్‌పూర్ సాహెబ్ తీర్మానం (1973)

1973లో పంజాబ్‌లో అకాలీదళ్ పార్టీ ఆనందపూర్ అనే ప్రాంతంలో ఒక తీర్మానాన్ని చేసింది. రక్షణ,అంతర్జాతీయ సంబంధాలు, కమ్యూనికేషన్లు, కరెన్సీ మొదలైన విషయాలకే కేంద్ర ప్రభుత్వ పరిధి పరిమితం కావాలని, దేశంలో నిజమైన సమాఖ్య స్ఫూర్తి తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

పశ్చిమబెంగాల్ ప్రభుత్వ మెమొరెండం (1977)

1977లో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై ఒక విజ్ఞాపన సమర్పించింది. అందులోని కొన్ని ముఖ్యాంశాలు.

- రాజ్యాంగంలో యూనియన్ అనే పదాన్ని తొలగించి సమాఖ్య అనే పదాన్ని చేర్చాలి.
- కొత్త రాష్ట్రాల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోనికి తీసుకోవాలి.
- అఖిల భారత సర్వీసులను రద్దు చేయాలి.
- రాష్ట్రపతి పాలన, అలాగే ఆర్థిక అత్యవసర పరిస్థితి అధికారాలను తొలగించాలి.
- కేంద్ర ప్రభుత్వ అధికార పరిధిని కుదించాలి.
- రాజ్యసభకు లోక్‌సభతో సమానంగా అధికారాలు ఇవ్వాలి.
- జోనల్ కౌన్సిల్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలి.
- శాశ్వత ప్రాతిపదికపై అంతర్రాష్ట్ర ప్రభుత్వ మండలిని ఏర్పాటు చేయాలి.
- జాతీయాభివృద్ధి మండలి పేరును జాతీయ ఆర్థికాభివృద్ధి మండలిగా మార్చి అస్తిత్వాన్ని పరిరక్షించాలి.
- ఆర్థిక నిపుణులనే ఆర్థిక సంఘ సభ్యులుగా నియమించాలి.
- భారతదేశ సమష్టి సంస్కృతిని సంరక్షించడానికి జాతీయ కార్యక్రమాలను ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేయాలి.



- అవశిష్ట అంశాలపై పన్నులు విధించే శాసన నిర్మాణ అధికారాన్ని పార్లమెంటుకు అప్పగించాలి.
- కార్పొరేషన్ పన్నుల్లో కొంత భాగాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలి.
- రాష్ట్రాలతో సంప్రదించి ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసు, ఇండియన్ హెల్త్ సర్వీస్, ఇండియన్ ఎడ్యుకేషన్ సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రాల అనుమతి లేకుండా కేంద్ర బలగాలను పంపొద్దు.
- ఉమ్మడి జాబితాలో చట్టాలను రూపొందించే సమయంలో కేంద్రం రాష్ట్రాలను సంప్రదించాలి.
- గవర్నర్ నియామక సమయంలో ముఖ్యమంత్రిని విధిగా సంప్రదించే విధంగా రాజ్యంగ సవరణ చేయాలి.
- త్రిభాషా సూత్రాన్ని అమలుపరిచేందుకు గట్టి ప్రయత్నం చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీసు చార్జీలను ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే విధించాలి.
- భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రత్యేక కమిషన్‌ను నియమించి క్రియాత్మకం చేయాలి.
- రేడియో, టెలివిజన్‌లకు స్వయం ప్రతిపత్తి అవసరం లేదు. అయితే వాటి పని తీరును వికేంద్రీకరణ చేయాలి.
- ఆర్థిక సంఘం, ప్రణాళికా సంఘం మధ్య ప్రస్తుత విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది. దాన్ని కొనసాగించాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ వేసే సందర్భంలో పార్లమెంటు అనుమతి తీసుకోవాలి.
- రాష్ట్ర ఎగువసభ రద్దు లేదా ఏర్పాటు విషయంలో పార్లమెంట్ నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయాన్ని తెలపాలి.

గాడ్గిల్ ఫార్ములా

సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ సక్రమంగా జరగాల్సిన ఆవశ్యకత ఉంది. కేంద్ర ప్రణాళికా సహాయాన్ని రాష్ట్రాలకు అందించే ప్రాతిపదికను ప్రణాళిక సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ డి.ఆర్.గాడ్గిల్ పేరుతో 1971లో ఓ ఫార్ములాను రూపొందించారు. దీన్ని 1981లో ఒకసారి, తిరిగి 1992లో మరోసారి సమీక్షించారు. డి.ఆర్.గాడ్గిల్ ఫార్ములా అనుసరించి జనాభా ఆధారంగా 60 శాతం, తలసరి ఆదాయం ఆధారంగా 25 శాతం, ఆదాయ, వ్యయాలను సరిచూసుకుని విత్తలోటు తగ్గించినందుకు 7.5 శాతం, ఇతర సమస్యల (ఎడారి ప్రాంతాలు, కొండ ప్రాంతాలు, శిశు మరణాలు, ఆరోగ్యం మొదలైనవి) ఆధారంగా 7.5 శాతం కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు సహాయాన్ని అందిస్తుంది. అయితే వెనకబడ్డ, పేద రాష్ట్రాలకు ఈ ఫార్ములా అంత ఉపయోగకరంగా లేదు. విత్త రంగంలో చూపిన క్రమశిక్షణను ఈ ఫార్ములా ప్రోత్సాహపరుస్తున్నట్లుగా లేదని కొందరు విమర్శిస్తున్నారు.

సర్కారియా కమిషన్ సిఫార్సులు (1987)

1983లో కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఆర్.ఎస్. సర్కారియా అధ్యక్షతన బి.శివరామన్, ఎస్.ఆర్.సేన్ సభ్యులుగా, కార్యదర్శిగా ఆర్.ఎం. సుబ్రహ్మణ్యం, రాజ్యాంగ సలహాదారుడుగా ఎల్.ఎన్.సిన్హాతో ఒక కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ 1987 అక్టోబర్ 27న 247 సిఫార్సులతో కూడిన 1600 పేజీల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. 1988 జనవరిలో ప్రభుత్వం సర్కారియా కమిషన్ నివేదికను విడుదల చేసింది. అందులో 230 సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం తగిన నిర్ణయాలను తీసుకుంది. మొత్తం సిఫారసుల్లో 170 సిఫార్సులను అమలు చేసింది.

ముఖ్య సిఫార్సులు

- గవర్నర్‌ల నియామకంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రులను సంప్రదించాలి.
- రాజకీయేతర రంగాలను చెందిన, వివాదాస్పదం కాని వ్యక్తులను, ప్రముఖులను మాత్రమే గవర్నర్‌లుగా నియమించాలి. రాష్ట్రేతర వ్యక్తినే గవర్నర్‌గా నియమించాలి.
- ముఖ్యమంత్రి నియామకం, రాష్ట్రమంత్రి మండలి కొనసాగింపు విషయంలో విధాన సభ మెజారిటీ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకోవాలి. అరుదైన సందర్భాల్లో రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టాలి.
- అఖిల భారత సర్వీసులను మరింత బలోపేతం చేసి, మరిన్ని కొత్త సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీసు చార్జీలను ప్రత్యేక సందర్భాల్లోనే విధించాలి.
- భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రత్యేక కమిషన్‌ను నియమించి క్రియాత్మకం చేయాలి.
- రేడియో, టెలివిజన్‌లకు స్వయంప్రతిపత్తి అవసరంలేదు. అయితే వాటి పనితీరును వికేంద్రీకరణ చేయాలి.
- ఆర్థికసంఘం, ప్రణాళికా సంఘం మధ్య ప్రస్తుత విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది. దీనిని కొనసాగించాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ వేసే సందర్భంలో పార్లమెంటు అనుమతి తీసుకోవాలి.
- రాష్ట్ర ఎగువసభ రద్దు లేదా ఏర్పాటు విషయంలో పార్లమెంటు నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయాన్ని తెలపాలి.

విద్య, ఉద్యోగ సమాచారం

బామర్ లారీ-కో లిమిటెడ్‌లో వివిధ ఉద్యోగాలు

కోల్‌కతాలోని పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వశాఖకు చెందిన బామర్ లారీ అండ్ కో లిమిటెడ్‌లో వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్ (ఐటీ సైబర్ సెక్యూరిటీ)-01, జూనియర్ ఆఫీసర్ (అకౌంట్స్ అండ్ ఫైనాన్స్)-04, జూనియర్ ఆఫీసర్ (ఆపరేషన్స్)-01, జూనియర్ ఆఫీసర్ (వేర్‌హౌస్ ఆపరేషన్స్)-01, జూనియర్ ఆఫీసర్ (హెచ్ఆర్ -అడ్మినిస్ట్రేషన్)-01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు రూ.70,541, జూనియర్ ఆఫీసర్ (వేర్‌హౌస్ ఆపరేషన్స్) పోస్టుకు రూ.33,095, ఇతర పోస్టులకు రూ.36,785.
» **వయసు:** అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 32 ఏళ్లు, ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.12.2024
» **పనిచేయాల్సిన ప్రదేశాలు:** చెన్నై, కోల్‌కతా, రాయ్, ముంబై.
» **వెబ్‌సైట్:** www.balmerlawrie.com

బెల్ ఆప్ట్రానిక్ డివైజెస్ లిమిటెడ్, పుణెలో ఇంజనీర్ పోస్టులు

పుణెలోని బెల్ ఆప్ట్రానిక్ డివైజెస్ లిమిటెడ్(బీఈఎల్ఓపీ) ఒప్పంద ప్రాతిపదికన ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **పోస్టుల వివరాలు:** ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్-05, మెకానికల్ ఇంజనీర్-03.
» **అర్హత:** బీఈ(ఎలక్ట్రానిక్స్/ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్/ఈ-టీసీ/మెకానికల్) ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.11.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు మొదటి ఏడాది రూ.23,500, రెండో ఏడాది రూ.25,500, మూడో ఏడాది రూ.27,500 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** పోస్టు/కొరియర్ ద్వారా డిప్యూటీ మేనేజర్-హెచ్ఆర్ బెల్ ఆప్ట్రానిక్ డివైజెస్ లిమిటెడ్, ఈఎల్-30, జె-బ్లాక్, భోసారీ ఇండస్ట్రియల్ ఏరియా, పుణె చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.12.2024.
» **వెబ్‌సైట్:** https://belopindia.in

'సైన్స్ న్యూస్ అండ్ పేపర్' అనే గోడపత్రికను ముద్రిస్తున్న సంస్థ ఏది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ (ఎస్ఏ, ఎస్జీటీ)

మెథడాలజీ (మాదిరి ప్రశ్నలు)

1. జీవశాస్త్ర శాఖలకు సంబంధించి కిందివాటిలో సరైన జత ఏది?
ఎ. ఏరోబయాలజీ - ప్రాథమిక శాఖ
బి. జీవ ఖగోళ శాస్త్రం - అనువర్తిత శాఖ
సి. వ్యవసాయ శాస్త్రం - సంబంధిత శాఖ
డి. జీవసాంకేతిక శాస్త్రం- సంబంధిత శాఖ
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
2. విజ్ఞానశాస్త్రం చదివిన రాగిణి రోజూ గడపకు పసుపు పూస్తోంది. విజ్ఞానశాస్త్ర ప్రయోగాలు చేయడం వల్ల రాకేష్ నిజాయతీ అనే లక్షణాన్ని అలవరచుకున్నాడు. వీరిలో పెంపొందిన విలువలు?
1) రాగిణి - నైతిక విలువ, రాకేష్ - సృజనాత్మక విలువ
2) రాగిణి - సాంస్కృతిక విలువ, రాగిణి - బౌద్ధిక విలువ
3) రాగిణి-ఉపయోగాత్మక విలువ, రాకేష్ - సాంస్కృతిక విలువ
4) రాగిణి - సాంస్కృతిక విలువ రాకేష్ - నైతిక విలువ
3. వైద్యపరమైన ఎన్‌సైక్లోపీడియాలను ఎవరి కాలంలో తయారుచేశారు?
1) అరబ్బులు 2) గ్రీకులు
3) రోమన్లు 4) హిబ్రూలు
4. రోహన్ పుస్తకాలు చదవడం ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం భవిష్యత్తులో జరిగే సంఘటనను ఊహించాడు. అతనిలో నెరవేరిన లక్ష్యం ఏది?
1) ప్రాగుక్తీకరణ 2) బహిర్గీకరణం
3) వినియోగం 4) విశ్లేషణ
5. జానీ వాతావరణ శాఖ ఆఫీసులో ఉన్న గ్రాపులను చూసి ప్రస్తుత సంవత్సరకాలం వర్షపాతాన్ని వివరించాడు. అతడిలో ఏ లక్ష్యం సాధించినట్లుగా చెప్పవచ్చు?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) అభినందన
6. నిశితంగా పరిశీలించడం అనే లక్షణం విజ్ఞానశాస్త్ర అధ్యయనాల వల్ల వస్తుంది. ఇందు లో పరిశీలన దేనికి సంబంధించింది?
1) అవగాహన 2) జ్ఞానం
3) నైపుణ్యం 4) అభిరుచి
7. వివేక్ అనే విద్యార్థికి విజ్ఞానశాస్త్ర ప్రదర్శన లో పాల్గొనడం,శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు చదవడం, శాస్త్ర ప్రసంగాలు వినడం అలవాట్లు ఉన్నాయి. అతడిలో సాధించిన లక్ష్యం, దానికి చెందిన రంగానికి సంబంధించి సరైన జత ఏది?
1) జ్ఞానాత్మక రంగం - అభినందన
2) భావావేశ రంగం - అవగాహన
3) మానసిక చలనాత్మక రంగం- అభిరుచి
4) భావావేశ రంగం- అభిరుచి
8. 'విద్యార్థులు ప్రయోగం చేస్తే ప్రమాదాలు జరుగుతాయి' అనే భ్రమ, భయం కల్గిన అనిల్ అనే జీవశాస్త్ర ఉపాధ్యాయుడికి అనుకూలమైన బోధనా పద్ధతి ఏది?
1) ప్రయోగ పద్ధతి 2) ప్రదర్శనా పద్ధతి
3) అన్వేషణ పద్ధతి 4) శాస్త్రీయ పద్ధతి
9. కృత్రిమ బోధనోపకరణాలను ఉపయోగించడం ద్వారా కాకుండా, సహజ పరిస్థితుల పరిశీలన ద్వారా జీవశాస్త్రం నేర్చుకోవాలనుకునే ఉపాధ్యాయునికి అత్యంత అనుసరణీయమైన పద్ధతి ఏది?
1) ప్రదర్శనా పద్ధతి 2) అన్వేషణ పద్ధతి
3) ప్రకల్పన పద్ధతి 4) ప్రయోగ పద్ధతి
10. కిందివాటిలో దేంట్లో నిగమన ఉపగమాన్ని అనుసరించినట్లుగా చెప్పవచ్చు?
1) ముందుగా ఉదాహరణ ఇచ్చి తర్వాత సూత్రాన్ని రాబట్టడం
2) సాధారణీకరణాలు ప్రతిపాదించడం
3) ముందుగా సూత్రం చెప్పి తర్వాత ఉదాహరణలు చెప్పడం
4) విద్యార్థులకు ఉదాహరణలను మాత్రమే తెలియజేయడం
11. హెర్బర్ట్ విధానంలోని దశ కానిది?
1) హాజరు పరచడం 2) సన్నాహం
3) సాధారణీకరణం 4) పునర్బలనం
12. యూనిట్ పథక దశల్లో ఉపసంహారక సోపానానికి సంబంధించింది ఏది?
1) బోధనా పద్ధతి ఎంపిక
2) ప్రేరణ కల్గించడం
3) బోధనోపకరణాల వినియోగం
4) మూల్యాంకన పద్ధతులు
13. ప్రతి విషయానికి ఆధారాలను చూపించమని, ఆధారాలుంటేనే నమ్ముతాను అని జీవశాస్త్ర ఉపాధ్యాయుని అడుగుతున్న 'ప్రజ్ఞ' అనే 9వ తరగతి విద్యార్థినిలో ఏ లక్ష్యం సాధించినట్లు?
1) మొండితనం 2) అభిరుచి
3) శాస్త్రీయ దృక్పథం 4) నైతిక విలువ
14. పాఠ్యపథక రచనలో హెర్బర్ట్ విధానం పరిమితి కానిది?
1) ఉపాధ్యాయుని పాత్ర ఎక్కువ
2) అన్ని సబ్జెక్టుల బోధనకు అనుకూలం
3) జ్ఞాపకశక్తికే ప్రాధాన్యం
4) సగటు విద్యార్థులకు మాత్రమే పనిచేస్తుంది
15. ప్రయోగశాలలో 10'×4' కొలతలతో ఉండే ది ఏది?
1) ఉపాధ్యాయుడి ప్రదర్శనాబల్ల
2) ప్రయోగశాల కిటికీ
3) అక్వేరియం 4) నల్లబల్ల
16. 'సైన్స్ న్యూస్ అండ్ పేపర్' అనే గోడపత్రికను ముద్రిస్తున్న సంస్థ ఏది?
1) మోక్షగుండం విశ్వేశ్వరయ్య మ్యూజియం
2) NCERT
3) విక్రం సారాభాయ్ సమాజ విజ్ఞాన కేంద్రం
4) NCSTC
17. కిందివాటిలో ఏది ప్రత్యేక అభిరుచి సంఘం?
1) భౌతిక శాస్త్ర సంఘం
2) వృక్ష శాస్త్ర సంఘం
3) వ్యవసాయ సంఘం
4) జంతు శాస్త్ర సంఘం
18. కిందివాటిలో సరైన జత ఏది?
ఎ. విజ్ఞానశాస్త్ర దినోత్సవం - జూన్ 5
బి. ధరిత్రీ దినోత్సవం - ఏప్రిల్ 22
సి. పర్యావరణ దినోత్సవం - జూన్ 5
డి. ధరిత్రీ దినోత్సవం - ఫిబ్రవరి 28
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
19. విద్యార్థులకు ర్యాంకులను ఇవ్వడం దేన్ని సూచిస్తుంది?
1) ప్రత్యక్ష మాపనం 2) సాపేక్ష మాపనం
3) మూల్యాంకనం 4) పరోక్ష మాపనం
20. మంచి పరీక్షకు విశ్వసనీయత ఉండాలి. విశ్వసనీయత అంటే?
1) ఒక సమాధాన పత్రాన్ని ఏ ఇద్దరు ఉపాధ్యాయులు దిద్దినా ఒకే మార్కులు రావాలి
2) ఉపాధ్యాయుడు వ్యక్తినిష్ఠతకు ప్రాధా న్యం ఇవ్వాలి, వస్తునిష్ఠతకు కాదు
3) పూర్తి లక్ష్యాలను పరిగణనలోకి తీసుకొని పరీక్ష నిర్వహించాలి
4) విద్యార్థికి వేర్వేరు సమయాల్లో ఒకే పరీ క్ష నిర్వహిస్తే ఒకే మార్కులు రావాలి
21. బ్లూ ప్రింట్ తయారు చేసేటప్పుడు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాల్లో ఉపాధ్యాయుడు కిందివాటిలో దేన్ని సరిగా అంచనా వేయలేడు?
1) లక్ష్యాలు 2) పాఠ్యాంశ విషయం
3) కాఠిన్యత స్థాయి 4) ప్రశ్నల రకాలు
22. జీఎంసీ బాలయోగి మ్యూజియం ఎక్కడ ఉంది?
1) రాజమండ్రి 2) విజయవాడ
3) ఏలూరు 4) విశాఖపట్నం
23. ఎడ్గర్‌డేల్ అనుభవ శంకువులో కదలని చిత్రాల స్థానం?
1) పై నుంచి మూడో స్థానం
2) కింది నుంచి 5వ స్థానం
3) టెలివిజన్ కింద 4)చలనచిత్రాల కింద
24. ప్రత్యేక పరిస్థితుల్లో జీవించే జంతువుల గురించి అధ్యయనం చేయడానికి దోహదపడే ఉపకరణం ఏది?
1) టెర్రేరియం 2) వివేరియం
3) హెర్బేరియం 4) అక్వేరియం
25. కిందివాటిలో కృత్యరూప బోధనోపకరణాలేవి?
ఎ. డయారమా బి. ఎపిడయాస్కోపు
సి. కంప్యూటర్ డి. ఫీల్డ్ ట్రిప్
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
26. కన్నింగ్ హామ్ పాఠ్య ప్రణాళికకు ఇచ్చిన నిర్వచనంలో పోలికలకు సంబంధించి సరైన జత ఏది?
ఎ. స్టూడియో - తరగతి గది
బి. కళాకారుడు - విద్యార్థి
సి. అభిరుచికి అనుగుణంగా - లక్ష్యాలు నెరవేరేటట్లు
డి. ఉపయోగించే సాధనం-పాఠ్యప్రణాళిక
1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
27. బ్రూబేకర్ అభిప్రాయం ప్రకారం పాఠ్య ప్రణాళిక ఎలా ఉండాలి?
1) పాఠ్యప్రణాళిక ముందుగా చేసి అందు లో విద్యార్థిని జాగ్రత్తగా ఇమడ్చాలి
2) పాఠ్యప్రణాళిక చేసి అందులో సిలబస్ పొందుపరచాలి
3) ఉపాధ్యాయుడు చేయడానికి వీలుగా పాఠ్యప్రణాళిక రూపొందించాలి
4) విద్యార్థికి అనుగుణంగా పాఠ్యప్రణాళిక తయారుచేయాలి
28. పాఠ్యపుస్తకం తయారుచేసే రచయితకు ఉండాల్సిన కనీస అర్హత?
1) ఏ తరగతి పాఠ్యపుస్తకం తయారు చేస్తున్నాడో ఆ తరగతికి కనీసం అయిదేళ్లు బోధించిన అనుభవం ఉండాలి
2) ఉపాధ్యాయ వృత్తిలో కనీసం 10 సంవత్సరాల అనుభవం ఉండాలి
3) SCERTలో కనీసం 5 సంవత్సరాలు పని చేసిన అనుభవం అవసరం
4) సర్వశిక్ష అభియాన్‌లో పనిచేసిన అనుభవంతో పాటు ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలో రెండేళ్ల పని అనుభవం
29. కిందివాటిలో ఏది ప్రత్యక్ష అనుభవానికి దగ్గరగా ఉండే ఉపకరణం?
1) రేఖీయ చిత్రం 2) రేడియో
3) డయారమా 4) శబ్దిక చిహ్నం
30. 1959లో మొట్టమొదటి బిర్లా పారిశ్రామిక సాంకేతిక ప్రదర్శనశాలను ఎక్కడ స్థాపించారు?
1) కోల్‌కతా 2) ముంబై
3) అహ్మదాబాద్ 4) ఢిల్లీ
31. జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఒకరు హెర్బేరియం ఉపయోగించి, మరొకరు మాతృక స్పెసిమన్‌ను ఉపయోగించి బోధించారు. వారు అందించిన అనుభవాలు వరుసగా..
1) ప్రత్యక్ష, ప్రతినిధిత్వం
2) ప్రతినిధిత్వం, ప్రతినిధిత్వం
3) ప్రత్యక్ష, పరోక్ష 4) ప్రత్యక్ష, ప్రత్యక్ష
32. భావన ఏర్పడటానికి కనీసం రెండు కిందివాటిలో ఏవి కావాలి?
1) నియమాలు 2) సిద్ధాంతాలు
3) సత్యాలు 4) సాధారణీకరణలు
33. 'విజ్ఞానశాస్త్ర అంధయుగం'గా పేర్కొన్న శతాబ్ద కాలాలు ఏవి?
1) క్రీ.శ. 18-19 2) క్రీ.శ. 15-17
3) క్రీ.శ. 16-18 4) క్రీ.శ. 12-14
34. ఇకో క్లబ్‌లు కిందివాటిలో దేనికి సంబంధించినవి?
1) ఎయిడ్స్ 2) జలచరాల పరిరక్షణ
3) పర్యావరణం
4) అంతరించిపోతున్న జీవులు
35. కార్యాకారణ సంబంధం గుర్తించడం అనేది ఏ లక్ష్యానికి సంబంధించింది?
1) జ్ఞానం 2) అవగాహన
3) వినియోగం 4) నైపుణ్యం
36. అక్షయ తృతీయ రోజు బంగారం కొంటే శుభం కలుగుతుంది అని నమ్మే వ్యక్తిలో నెరవేరని లక్ష్యం ఏది?
1) అవగాహన 2) అభిరుచి
3) శాస్త్రీయ దృక్పథం 4) వినియోగం
37. ప్రయోగ పరికరాలు శుభ్రం చేయడం, భద్రపరచడం అనేవి మానసిక చలనాత్మక రంగ సోపానాల్లో దేనికి సంబంధించినవి?
1) అనుకరణ 2) హస్తలాఘవం
3) సమన్వయం 4) సహజీకరణ
38. అవగాహనలోని వివేచనం చేయడం అనే స్పష్టీకరణకు సంబంధించింది ఏది?
1) రెండు అంశాల మధ్య భేదాలను గుర్తించడం
2) పెద్ద అంశాన్ని చిన్న చిన్న అంశాలుగా విడగొట్టడం
3) దశలవారీగా ఒక అంశం గురించి తెలుసుకోవడం
4) లక్షణాల ఆధారంగా సమూహాలుగా చేయడం
39. విద్యార్థులు నమూనాలు తయారు చేయుడానికి సంబంధించి ఏ రకమైన పరీక్షలు నిర్వహించాలి?
1) నిష్పాదన పరీక్ష 2) ప్రజ్ఞా పరీక్షలు
3) సహజ సామర్థ్య పరీక్షలు
4) అంచనా మాపని
40. ఉపాధ్యాయుడు ప్రొజెక్టర్‌ను ఉపయోగించి విద్యార్థులకు బోధించాడు. ఆయన ఉపయోగించిన బోధనా పద్ధతి?
1) అన్వేషణ పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
3) ప్రదర్శనా పద్ధతి 4) ప్రకల్పన పద్ధతి

సమాధానాలు

1) 2	2) 4	3) 1	4) 2	5) 2
6) 3	7) 4	8) 2	9) 3	10) 3
11) 4	12) 4	13) 3	14) 2	15) 4
16) 3	17) 3	18) 2	19) 2	20) 4
21) 3	22) 3	23) 1	24) 2	25) 3
26) 3	27) 4	28) 1	29) 3	30) 1
31) 2	32) 3	33) 4	34) 3	35) 2
36) 3	37) 2	38) 3	39) 1	40) 3

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

భారతదేశం - పేదరికం



ఏ దేశంలోనైతే అధిక జనాభా, పేదరికంతో బాధప డుతుంటారో ఆయా దేశాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగలేవని అర్థశాస్త్ర పితామహుడు ఆడమ్ స్మిత్ **1776**లో **Wealth of Nations** గ్రంథంలో పేర్కొన్నాడు. ప్రపంచంలో రోజుకు ఒక డాలర్ కూడా ఆదాయం లభించని ప్రజానీకం సుమారు **1.2** బిలియన్లని అంచనా.

- **ఎవరైతే కనీస జీవన ప్రమాణాన్ని పొందలేక పోతున్నారో వారిని పేదవారుగా పరిగణించవచ్చు.**
  – ప్రపంచ బ్యాంకు.
- **'పేదరికం అనుభవించేవారి బాధను గుడ్డివారు కూడా చూడగలరు"**
  – ఆర్థికవేత్త, నోబెల్ అవార్డు గ్రహీత అమర్త్యసేన్
- **'పేదరికమనే సముద్రపు దీవుల్లో మనం ఎంతమాత్రం సంతోషంగా జీవించలేం'**
  – ఎం.ఎస్. స్వామినాథన్
- **పేదరికం అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన**
  -జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి

పోషకాహార లోపం, అనారోగ్యం, నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి మౌలిక సమస్యలతో అభివృద్ధి చెందుతున్న దేశాలు సతమతమవుతున్నాయి. ఆయా దేశాల్లో ఎంతో కొంత అభివృద్ధి జరిగినా, దాని ప్రతిఫలం మాత్రం అతి కొద్ది మందికే దక్కడం వల్ల ఆదాయ అసమానతలు అధికమవుతున్నాయి. దేశంలో భూమి, మూలధనం వంటి ఆస్తులు, ఆదాయ పంపిణీలో తీవ్రమైన అసమానతల వల్ల అధిక సంఖ్యాక ప్రజలు పేదరికానికి గురవుతున్నారు.

పేదరికాన్ని కేవలం ఆర్థికపరమైన సమస్యగానే కాకుండా సాంఘిక సమస్యగా కూడా పరిగణించాల్సి ఉంటుంది. మానవాభివృద్ధి నివేదిక ప్రకారం.. 'దీర్ఘకాలం ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు కావాల్సిన సౌకర్యాలు, స్వేచ్ఛ, స్వాభిమానం, ఇతరుల నుంచి గౌరవం కొరవడటమే పేదరికం'. 'అధిక పేదరికం, అధిక సంపదలు సమాజంలో వ్యక్తిత్వ వికాసానికి అడ్డంకి అవుతాయి, ప్రపంచంలో గొప్ప వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులంతా మధ్య తరగతి నుంచి వచ్చినవారే. అందుకే ఆర్థిక శక్తులు సమానంగా, సంతులితంగా సమాజంలో సర్దుబాటు కావాలి' అని స్వామి వివేకానంద పేర్కొన్నారు.

పేదరికాన్ని రెండు రకాలుగా పేర్కొనొచ్చు. అవి..

1. నిరపేక్ష పేదరికం 2. సాపేక్ష పేదరికం.

1. **నిరపేక్ష పేదరికం:** దేశంలోని ప్రజలు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని, జీవనాధార వ్యయాన్ని కూడా చేయలేని పరిస్థితిని నిరపేక్ష పేదరికం అంటారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ రకమైన పేదరికం ఉంటుంది.
2. **సాపేక్ష పేదరికం:** వివిధ వ్యక్తులకు లేదా గ్రూపులకు అందుబాటులో ఉన్న వనరులు, వేతనం, సంపద తదితర అంశాల ఆధారంగా దీన్ని లెక్కిస్తారు. సమాజంలో 5%. నుంచి 10% మంది సంపన్న వర్గాల ప్రజల జీవన ప్రమాణంతో పోల్చితే కింది స్థాయిలోని 5% నుంచి 10% ప్రజల జీవన ప్రమాణం తక్కువగా ఉంటుంది. సంపన్న వర్గంలోని ప్రజల ఆదాయాలతో పోల్చితే దిగువ వర్గంలోని వారి ఆదాయాలు తక్కువగా ఉన్నప్పటికీ వారు దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నవారు కాదు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ రకమైన పేదరికం ఉంటుంది. దీన్ని లారెంజ్ వ్యతిరేక లేదా గిని గుణకం ద్వారా లెక్కిస్తారు.

భారతదేశం పేదరికం - అంచనాలు

స్వాతంత్ర్యానికి పూర్వం దాదాబాయ్ నౌరోజీ తన గ్రంథమైన "Poverty and Unbritish Rule in India" లో జైళ్లలోని ఖైదీల కనీస పౌష్టికాహారం ఆధారంగా పేదరికాన్ని అంచనా వేశారు. స్వాతంత్ర్యానంతరం అనేక మంది ఆర్థికవేత్తలు పేదరికాన్ని అంచనా వేశారు. వారిలో పి.డి. ఓఝా, దండేకర్, నీలకంఠ రాథ్, మిన్హాస్, పీకే బర్దన్, మాంటెక్‌సింగ్ ఆహ్లూవాలియా, గౌరవదత్, రావెల్లిస్, లక్డవాలా (D.T. Lakdawala- Expert Group Chairman 1989) తదితరులు ముఖ్యులు.

1960 పూర్వం పేదరికానికి సంబంధించిన అంచనాల్లో వ్యత్యాసాలున్నాయి. ఆయా అంచనాలు వరుసగా.. మిన్హాస్ 37.1% , ఆహ్లూవాలియా 56.5%, పీకే బర్దన్ 54% , దండేకర్, నీలకంఠ రాథ్ 40% (1968-69). ఈ వ్యత్యాసాలకు ప్రధాన కారణం వారు తీసుకున్న గణాంకాల్లో తేడా లేనప్పటికీ వారు గణించే పద్ధతుల్లో తేడా ఉండడమే.

- **పేదరిక రేఖ (Poverty Line):** ఒక వ్యక్తి జీవించడానికి కావాల్సిన కనీస జీవన వ్యయం ఆధారంగా పేదరిక రేఖను నిర్ణయిస్తారు. దీని కోసం ప్రణాళికా సంఘం 1989, సెప్టెంబర్‌లో డి.టి. లక్డవాలా అధ్యక్షతన నిపుణుల సంఘాన్ని నియమించింది. ఆ కమిటీ 1993 జూలైలో తమ నివేదికను సమర్పించింది. పౌష్టికాహార నిపుణుల సలహా మేరకు లభ్యమయ్యే కేలరీల శక్తిని బట్టి కనీస పోషకాహార స్థాయిని, గ్రామీణ ప్రాంతాల్లో 2400 కేలరీలు, పట్టణ ప్రాంతాల్లో 2100 కేలరీలను ప్రాతిపదికగా తీసుకొన్నారు. 1973-74ను ఆధార సంవత్సరంగా తీసుకొని నెలసరి తలసరి వినియోగ వ్యయాన్ని (Monthly Per Capita Consumption Expenditure - MPCE) గ్రామీణ ప్రాంతానికి రూ. 49, పట్టణ ప్రాంతానికి రూ. 56 నిర్ణయించారు. 2004-05కు గానూ గ్రామీణ ప్రాంతానికి రూ. 356.30, పట్టణ ప్రాంతానికి రూ.538.60, 2009-10 నాటికి గ్రామీణ ప్రాంతానికి (రోజుకు–రూ. 22.42) రూ. 672.80, పట్టణ ప్రాంతానికి (రోజుకు– రూ.28.65) రూ.859.60 నెలసరి తలసరి వినియోగ వ్యయాలుగా ఉన్నాయి. దీన్ని గమనిస్తే కాలానుగుణంగా నెలసరి తలసరి వినియోగ వ్యయం పెరుగుతూ వస్తున్నట్లు తెలుస్తోంది. మన దేశంలో ప్రతి ఐదేళ్లకోసారి నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్ Large Sample Survey ద్వారా కుటుంబం వ్యయాన్ని అంచనా వేస్తున్నారు.నిపుణుల సంఘం 1973-74 నుంచి 1987-88 వరకు14 ఏళ్ల కాల వ్యవధిలో రూపొందించిన పేదరిక అంచనాలు కింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

కింద టేబుల్‌ను పరిశీలిస్తే గ్రామీణ పేదరికం 56.4% నుంచి 39.1% నికి తగ్గగా, పట్టణ పేదరికం 49.2% నుంచి 40.1% నికి మాత్రమే తగ్గింది. 1987-88 నాటికి గ్రామీణ పేదరికం కంటే పట్టణ పేదరికమే ఎక్కువగా ఉంది. ఈ 14 ఏళ్ల కాలంలో మొత్తం పేదరికం 54.9% నుంచి 39.3% నికి తగ్గింది. అంటే పేదరికం 15.6% తగ్గగా సాలీనా ఇది 1.2% తగ్గింది.

1993లో లక్డవాలా అధ్యక్షతన పేదరికంపై నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటీ రాష్ట్రాల మధ్య ఉండే ధరల వ్యత్యాసాన్ని బట్టి ఆయా రాష్ట్రాల ప్రత్యేక వినియోగ ధరల సూచీ ఆధారంగా పేదరికాన్ని లెక్కించాలని సూచించింది.

నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్.. వివిధ రౌండ్‌ల్లో ఇచ్చిన జనాభా శాతం, పేదరిక జనాభా వివరాలు..

- 50వ రౌండ్ (1993-94) పేదరికం 36% , పేదల జనాభా 32 కోట్లు
- 55వ రౌండ్ (1999-2000) పేదరికం 26%, పేదల జనాభా 26 కోట్లు
- 61వ రౌండ్ (2004-05) పేదరికం 27.5%, పేదల జనాభా 30 కోట్లు
- 66వ రౌండ్ (2009-10) పేదరికం 29.8%, పేదల జనాభా 35 కోట్లు

సంవత్సరం	గ్రామీణ పేదరికం మిలియన్లలో	పట్టణ పేదరికం మిలియన్లలో	మొత్తం పేదరికం మిలియన్లలో	గ్రామీణ పేదరిక శాతం	పట్టణ పేదరిక శాతం	మొత్తం పేదరిక శాతం
1973-74	261.3	60.3	321.6	56.4	49.2	54.9
1977-78	264.3	67.7	332.0	53.1	47.4	51.8
1983	251.7	75.3	327.0	45.6	42.2	44.8
1987-88	229.4	83.3	312.7	39.1	40.1	39.3

సురేశ్ టెండూల్కర్ కమిటీ

పేదరిక అంచనా పద్ధతిని సమీక్షించేందుకు నియమించిన సురేశ్ టెండూల్కర్ కమిటీ తన నివేదికను 2009లో ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో కమిటీ పేదరిక రేఖను నిర్ణయించడానికి మన్నిక గల వస్తువులతో పాటు విద్య, ఆరోగ్యంపై చేసే వ్యయాన్ని కూడా పరిగణనలోనికి తీసుకోవాలని, పేదరిక రేఖను నిర్ణయించడానికి కేలరీల బదులు జీవన వ్యయ సూచీని ఉపయోగించాలని సిఫార్సు చేసింది. వాటితోపాటు ప్రస్తుతమున్న Uniform Recall Period బదులు Mixed Recall Period పద్ధతిని అనుసరించాలని పేర్కొంది. 2004-05గాను నెలసరి తలసరి వినియోగ వ్యయం గ్రామాల్లో రూ.446.68 కాగా, పట్టణాల్లో రూ. 578.-80. దీని ప్రకారం గ్రామీణ పేదరికం 41.8%గా, పట్టణ పేదరికం 25.7%గా నమోదైంది. భారతదేశ పేదరికాన్ని 37.2%గా లెక్కించారు.

- ప్రస్తుతం ప్రణాళిక సంఘం అనుసరిస్తున్న సురేశ్ టెండూల్కర్ కమిటీ సూచించిన పేదరిక అధ్యయన పద్ధతిని సమీక్షించేందుకు 2012లో రంగరాజన్ అధ్యక్షతన కమిటీని నియమించారు. ఈ కమిటీ తన రిపోర్టులో ప్రతి పది మందిలో ముగ్గురు పేదరికంలో ఉన్నట్లు అంచనా వేసింది. దాంతోపాటు సురేశ్ టెండూల్కర్ కమిటీ నిర్ణయించిన పట్టణ రోజువారీ వినియోగ వ్యయాన్ని రూ. 33 నుంచి రూ. 47లకు, గ్రామీణ రోజువారీ వినియోగ వ్యయాన్ని రూ.27 నుంచి రూ.32 లకు పెంచింది.
- సురేశ్ టెండూల్కర్ కమిటీ ప్రకారం 2011-12 లో పేదరిక జనాభా 21.9% కాగా, రంగరాజన్ కమిటీ ప్రకారం 29.5%. రెండు కమిటీలు తీసుకున్న రోజువారీ, నెలవారీ, తలసరి వినియోగ వ్యయ వ్యత్యాసాలను ఈ కింది పట్టికలో గమనించవచ్చు.

కమిటీ	సంవత్సరం	రోజువారీ తలసరి వినియోగ వ్యయం		నెలవారీ తలసరీ వినియోగ వ్యయం		సగటు కుటుంబ నెలవారీ వినియోగ వ్యయం	
		గ్రామీణ	పట్టణ	గ్రామీణ	పట్టణ	గ్రామీణ	పట్టణ
రంగరాజన్	2011-12	32.4	46.9	972	1407	4760	7035
	2009-10	26.7	39.9	801	1198	4005	5990
టెండూల్కర్	2011-12	27.2	33.3	816	1000	4080	5000
	2009-10	22.4	28.7	673	860	3365	4300

2004-05లో NSSO 61వ రౌండ్‌లో పేదరికాన్ని రెండు రకాలుగా లెక్కించారు. అవి..

1. **URP (Uniform Recall Period):** దీనిలో అన్ని వస్తువులపై చేసే వ్యయాన్ని 30 రోజుల రీకాల్ పద్ధతిలో తీసుకుంటారు. అంటే మొదటి నెలలో చేసిన వ్యయాన్ని ప్రతి నెలా చేస్తారని భావించి లెక్కిస్తారు.
2. **MRP (Mixed Recall Period):** ఇందులో తరచుగా కొనుగోలు చేయని వస్తువులైన వస్త్రాలు, పాదరక్షలు, మన్నిక గల వస్తువులు, విద్య, ఆరోగ్యం తదితర 5 రకాలవాటిపై చేసే వ్యయాన్ని 365 రోజుల ప్రాతిపదికపైన, మిగిలినవాటిని 30 రోజుల ప్రాతిపదికపైన పరిగణనలోకి తీసుకొని పేదరికాన్ని అంచనా వేశారు. 2004–05లో URP పద్ధతి ప్రకారం పేదరికం 27.5% కాగా, MRP పద్ధతి ప్రకారం 21.8% .

2012, మార్చి 19న ప్రణాళికా సంఘం NSSO 66వ రౌండ్ గణాంకాలను విడుదల చేసింది. పేదరిక రేఖ నిర్ధారణకు గ్రామీణ ప్రాంతంలో రూ. 672.80 నెలసరి వినియోగ వ్యయం (రోజుకు రూ. 22.40) కాగా, పట్టణ ప్రాంతంలో నెలసరి వినియోగ వ్యయం రూ. 859.60 (రోజుకు రూ.28.60)గా నిర్ణయించారు. దీని ప్రకారం 2009-10లో మన దేశంలో 29.8% జనాభా పేదరికంలో ఉంది. ఇందులో గ్రామీణ పేదరికం 33.8% కాగా, పట్టణ పేదరికం 20.9%గా నమోదైంది.

Towards which direction is A from R?



MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): In each question below are given two statements followed by two conclusions numbered I and II. You have to take the given statements to be true even if they seem to be at variance with commonly known facts and then decide which of the given conclusions logically follows from the given statements, disregarding commonly known facts.

Give answer:
1) If only conclusion I follows
2) If only conclusion II follows
3) If either conclusion I or II follows
4) If neither conclusion I nor II follows
5) If both conclusions I and II follow

1. **Statements:**
All doctors are graduates.
All professors are graduates.
All engineers are graduates.
Conclusions:
I) Some professors can be doctors.
II) Some engineers may be doctors.
2. **Statements:**
Some cats are pens.
Some pens are big.
Some big are costly.
Conclusions:
I) No cat is costly.
II) Some big are definitely not cats.
3. **Statements:**
Some Benches are magazines.
All magazines are novels.
Some novels are papers.
Conclusions:
I) All benches being magazines is a possibility.
II) All papers being novels is a possibility.
4. **Statements:**
All cats are fans.
All fans are guns.
Some guns are hats.
Conclusions:
I) No fan is hat.
II) Some fans are hats.
5. **Statements:**
All tables are rats.
Some rats are chairs.
Some chairs are desks.
Conclusions:
I) Some desks are not tables.
II) All desks are tables.

Directions (Q. No. 6 - 10): Each of the questions below consists of a question and two statements marked I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and

Give answer:
1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statements I alone are not sufficient to answer the question, while the data in statement II alone are sufficient to answer the question.
3) If the data either in statement I or in statement II alone are sufficient to answer the question.
4) If the data even in both the statements I and II together are not sufficient to answer the question.
5) If the data in both statements I and II together are needed to answer the question.

6. Towards which direction is A from R?
I) A is exactly to the south east of M.
II) R is exactly to the south of M.
7. How many daughters does A have?
I) P and Q are the only daughters of B.
II) D is brother of P and son of A.
8. Among P, Q, R, S and T sitting in a straight line facing north, who sits exactly in the middle of the line?
I) P sits third to the left of S. T is second to the left of R and an immediate neighbour of S.
II) P is second to the left of T who is second to the left of R.
9. Who amongst P, Q, R, S, T and U is the tallest?
I) P is taller that S and T but shorter than R. Q is taller than R.
II) T is taller than S. P is not the tallest.
10. Is C the grandmother of M?
I) C is the mother of D. D is the brother of M's father.
II) M is son of N, who is daughter of C.

Directions (Q. No. 11-15): Read each statement carefully and answer the following questions:

11. Which of the following expressions will be true if the expression D ≥ E > F, R ≥ B >T = D is definitely true?
1) R ≥ D 2) B ≥ D
3) F > R 4) T > F
5) R ≥ E
12. which of the symbols should be placed in the blank space from left to right respectively to complete the expression in such a manner that T > B, C >T and D > F are definitely true?
D ≤ T _ X, D _ B, C = X, F _ B
1) <, >, < 2) >, >, <
3) =, <, > 4) =, <, <
5) >, =, <
13. Which of the following symbols should replace the question mark (?) in the given expression to make the expression A > N and K ≥ N definitely true?
A ? K ≥ L ? M ? N < O
1) <, >, = 2) >, ≥, =
3) >, ≤, ≥ 4) >, =, ≤
5) None of these
14. which of the following symbols should be placed in the blank spaces respectively from left to right to complete the given expression in such a manner that the expression B > W is definitely false and the expressions Z ≥ B and Y ≥ V are definitely true?
Z _ Y _ X ≥ W = V _ B
1) ≥, ≥, ≥ 2) ≤, ≤, ≥
3) >, ≥, > 4) ≥, =, <
5) None of these
15. In which of the following expressions is 'P > Q' not definitely true?
1) Q > C ≤ R < P
2) Q ≤ R < S ≤ P
3) P > S = T ≥ Q
4) P > S = T ≥ Q
5) None of these

Directions (Q. No. 16–20): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement:

Input: desk caring 32 18 today for 58 78
Step I: 18 desk caring 32 today for 58 78
Step II: 18 today desk caring 32 for 58 78
Step III: 18 today 32 desk caring for 58 78
Step IV: 18 today 32 for desk caring 58 78
Step V: 18 today 32 for 58 desk caring 78
Step VI: 18 today 32 for 58 desk 78 caring

And Step VI is the last step.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate Step for the given input.

16. **Input:** year 24 far 32 17 12 wide goal
Which of the following will be Step V of the above input?
1) 12 year 17 wide 24 goal 32 far
2) 12 year 24 wide far 32 17 goal
3) 12 year 24 far 32 17 wide goal
4) There will be no such step
5) None of these
17. **Step III of an input:** 13 honk 29 father 83 76 door eye. Which of the following will be Step VI?
1) 13 honk 29 father 76 door 83 age
2) 13 honk 29 father 76 age 83 door
3) 13 honk 29 father 76 83 door age
4) 13 honk 29 father 76 eye 83 door
5) None of these
18. **Step III of an input:** 17 water 32 85 73 tax break home. How many more steps will be required to complete the rearrangement?
1) Five 2) Four
3) Six 4) Two 5) Three
19. **Step III of an input:** 37 xmas 42 61 53 violet green red. How many more steps will be required to complete the rearrangement?
1) 3 2) 4 3) 5 4) 6
5) None of these
20. **Step II of an input:** 28 sure 72 63 height over 42 lamp. Which of the following is definitely the input?
1) height 28 sure 72 63 over 42 lamp
2) 72 63 28 sure height over 42 lamp
3) 63 28 sure 72 height over 42 lamp
4) Cannot be determined
5) None of these

Solutions

1. As the given statements are affirmative both the positive possibilities follow. **Ans: 5**
2. As the given statements are affirmative both the negative definite conclusions don't follow. **Ans: 4**
3. As the given statements are affirmative both the positive possibilities follow. **Ans: 5**
4. Both the conclusions form a complementary pair. So, either I or II follows. **Ans: 3**
5. Both the conclusions form a complementary pair. So, either I or II follows. **Ans: 3**
6. The distance between A and M as well as between R and M is not given. Hence, we cannot find out the direction. **Ans: 4**
7. By combining both the statements, it can be concluded that A and B are married couple, and P and Q are the only daughters of A and B. **Ans: 5**
8. Either statement I or statement II is sufficient to answer the question.
Ans: 3
<u>P Q T S R</u>
9. Only statement I is sufficient.
Q > R > P > S & T **Ans: 1**
10. Only statement I is sufficient. C's gender is not known in the second statement. **Ans: 1**

(11-15) Answers: 11) 4; 12) 1; 13) 2; 14) 1; 15) 1.

(16-20): The illustration clearly shows that numbers and words are arranged alternatively in such a way that numbers in ascending order and words in reverse order.

16. **Input:** year 24 far 32 17 12 wide goal
Step I: 12 year 24 far 32 17 wide goal
Step II: 12 year 17 24 far 32 wide goal
Step III: 12 year 17 wide 24 far 32 goal
Step IV: 12 year 17 wide 24 goal far 32
Step V: 12 year 17 wide 24 goal 32 far
Ans: 1
17. **Step IV:** 13 honk 29 father 83 76 door eye
Step V: 13 honk 29 father 76 83 door eye
Step VI: 13 honk 29 father 76 eye 83 door
Ans: 4
18. **Step III:** 17 water 32 85 73 tax break home
Step IV: 17 water 32 tax 85 73 break home
Step V: 17 water 32 tax 73 85 break home
Step VI: 17 water 32 tax 73 home 85 break
To complete the rearrangement there will be 3 more steps. **Ans: 5**
19. **Step III:** 37 xmas 42 61 53 violet green red
Step IV: 37 xmas 42 violet 61 53 green red
Step V: 37 xmas 42 violet 53 61 green red
Step VI: 37 xmas 42 violet 53 red 61 green
Hence to complete the rearrangement 3 more steps will be required.
Ans: 1
20. Previous steps cannot be determined. **Ans: 4**